

చెన్నపట్టణము, అక్టోబరు ౧౯౨౮

సంపుటము ౫ | విభవ సంవత్సరము ఆశ్వయుజమాసము | సంఖ్య ౧౦

ప్రతాపరుద్రచక్రవర్తి

శ్రీ శేషాద్రిరమణకవులు

సలలిత విక్రమక్రమ విశాల మహీవలయైకరత్నమో
జ్వలులగు కాకతీయులకు సామ్యముగా మహితాంధ్రధారుణీ
తలము భరించి నవ్యకవితావిభవంబులచేత వాఙ్మయం
బలరిచినాఁడ వెంత సుకృతాత్ముఁడవో ధరణీపురందరా!

ప్రత్యర్థి నరపాలపటలివక్షములలో వాసం బొనర్చె నీ వాఁడికత్తి
ఆంధ్రవీరులరక్తమందు విక్రమవహ్ని వెలుఁగొందఁ జేసె నీ తెలుఁగుమాట
సారస్వతమునకు సర్వస్వము నొసంగ నను వయ్యె నీదు భాషానురక్తి
నిజరాజ్య కుశల మన్వేషింప యవనబంధిత మయ్యె నీ భవ్యదేహయష్టి
అస్వతంత్ర పరాధీన మైన యాంధ్ర-సోదర మనోంబుజములలో క్షుణ్ణ మైన
తావకీనయశోమూర్తి ధ్యానదృష్టి-నరయుచుంటిఁ బ్రతాపరుద్రావనీశ!

బలిపెట్టించితి వాంధ్రమాతృచరణప్రాంతప్రదేశంబునన్
దెలుఁగుం గత్తులచేతఁ గూలిన విరోధివ్రాతకాయంబు లాం
ధ్రుల విక్రాంతికి యావనద్రవిడరాట్ స్తోమంబుచే దాస్య క
ర్మలఁ గావించితి వెంతధన్యుఁడవు రుద్రా, రాజబృందారకా!

అడఁకువ దాల్చి దేవగిరి యాదవరాజులు గాన్కలంపఁ దుం
దుడుకుఁదనంబు మ్లేచ్ఛనృపతుల్ విడనాడి విధేయవర్తులై
కడుఁ బరిచర్య సల్ప, నధికారమహత్తర మాంధ్రరాజ్య మ
ట్లడరె నొకప్డు డవ్వి కథ లైనవి మాకుఁ గలిప్రచండతన్.

ప్రాఁతవారిన పూర్వప్రభావ మెల్ల-మరల నాంధ్రులఁ జేరె నీకరుణమందుఁ
జివికిపోయిన యాంధ్రుల జీవనంబు-లుద్ధరించితి వీవె యోగ్యుఁడవు భూప!

కమనీయతరమైన కవితాసతికి నాంధ్రదేశంబుఁ బెండ్లిపందిరియొనర్చి
లలితవిక్రాంతిసంకులమైన తెలుఁగుపౌజులకు సామ్రాజ్యంబు నెలవుఁ జేసి
మహిత త్రిలింగసామ్రాజ్యలక్ష్మికి నన్యరాజ్యలక్ష్ములఁ ద్రిప్పి రక్షఁ బెట్టి
కళల నన్నింటిని దెలుఁగువీరుల కరాంచలములఁ జక్కఁగా నిలువరించి
మాసిపోయిన మగధసామ్రాజ్యలక్ష్మి-యతులితవిభూతిఁ గాకతీయాంధ్రవీర
మండలాగ్రంబులందుఁ గ్రమ్మర ఘటించి-తాంధ్రరత్న, ప్రతాపరుద్రావనీశ!

ఏలినయంత కాలమును నేకముఖంబున నాంధ్రవైభవ
శ్రీ లలరించి, ప్రాక్తనవిశేషసముజ్జ్వలభోగభాగ్య ని
ర్వేలమహావిభూతి నలరించి, మహామహితాంధ్రరాజ్యల
క్ష్మి లలితాత్మఁ డన్న ప్రథఁ జెందితి వయ్యది చాలదే నృపా!

రాజహంసాభిరామముల్ రమ్యశాత-కుంభ కుంభప్రతానైక గుంభితములు
తావకమహాగృహస్థితిద్వారములను-నరయుకన్నులె కన్ను లోయాంధ్రభూప!

అరిరాజన్యభయంకరంబుగ విశాలాంధ్రప్రపంచంబు ని
ర్భరవిక్రాంతి వృతాభిమానమతితోఁ బాలింప సాహసమ్మహా

శ్వర తేజంబునఁ బుట్టినాఁడవఁట భూపా, నీవు, మ్లేచ్ఛావనీ
శ్వరబంధిగ్రహణప్రతప్తునిఁ బొనర్పన్ ధాత యె ట్లోర్చెనో.

పరుగుపరుగునఁ బయిఁ బడు తురకభటులు-క్రుమ్ము బల్లెమ్ములకుఁ బేరుర మ్మొసంగి
సంతరించిరి పరిఘకు జలసమృద్ధి-నాంధ్రు లానాఁటిశ్రమ మెల్ల నడుగుఁబట్టె.

రావచ్చున్ దరుణం బిదే యని మహారాష్ట్రిల్ స్వరాజ్యంబునన్
ద్రోవల్ చూపక యున్న, నాంధ్రబలముల్ దుర్వ్యాధిపూర్ణంబులై
చావన్ సిద్ధము గాక యున్న వశమే సర్వంసహామండలీ
శ్రీవిభ్రాజితమైన యాంధ్రదళముల్ చెండాడ నెవ్వానికిన్?

శ్రీస్వయంభూనాథ సేవాసమారబ్ధ విఖ్యాతవరములు వీటిఁబోయె
రుద్రమదేవీ నిరూఢపరాక్రమసముపార్జితబలంబు సన్నగిల్లె
శివదేవదైవజ్ఞ సిద్ధాంతనిర్ణయఫలసముదాయంబు పాడువారె
నవలక్షధానుష్కనాథమహత్తరోదారవిక్రమదీప మారిపోయె.
జలధివలయితధారుణీచక్రభరణ-దక్షదక్షిణభుజుఁడు ప్రతాపరుద్ర
వసుమతీనాథుఁ డరులచేఁ బట్టువడిన-యంతన యదృశ్యమయ్యె మహాంధ్రలక్ష్మి.

కళ లౌన్నత్యము నొందుచుండె, నరిసంఘాతంబు క్షీణించె, ని
శ్చల వీరవ్రతులైన యాంధ్రతనయుల్ సామ్రాజ్యసేవావ్రతో
జ్జ్వలులై యుండిరి ప్రాక్తనప్రతిభ సంపాదింపఁగా వచ్చునన్
తెలుఁగుం బౌజు ప్రతాపరుద్రనృపు బంధింపంగ నెట్లోర్చెనో.

సంస్కృతాంధ్రకవిత్వ సర్వస్వనిలయముల్ గ్రంథభాండారముల్ కాల్చునపుడు
శ్రీ స్వయంభూదేవు చిత్రాలయంబును దుండగంబునఁ గూలఁద్రోయునపుడు
రాజగేహముఁ జొచ్చి రాణివాసమ్మున సాహసకృత్యముల్ సలుపునపుడు
స్వాతంత్ర్యసంరక్షణార్థమై యాంధ్రుల వీరరక్తము వీటఁ బాఱునపుడు
అమలచారిత్ర కాకతీయాంధ్రరాజ్య-లక్ష్మి యన్యుల వలచి మెలంగునపుడు
నీదు నయనాంతరాళముల్ నిండి రాలు-నశ్రులకు వందనంబు రుద్రావనీశ!

పాప మెఱుంగ, వేరి కపకారము సేయవు, వెన్ను వైరికిన్
జూపవు, శౌర్యధైర్యముల శూలికి బోలికవత్తు, వాంధ్ర ల

క్ష్మాపరిచర్య కర్హ మగుచేవయు లావుఁగలాఁడ వంచుఁ జూ
పోపక నిన్ను దైవ మయయో కసిపట్టె నృపాలభూషణా!

కవులయాశీర్వచనములుగాని, నేల-వేలుపు లొసంగుచున్న దీవెనలుగాని
చిరపరాధీనదౌర్భాగ్యజీవు లైన-యాంధ్రులకుఁ దోడుపడ వయ్యెనా నృపాల?

కాల్చిరి కొంప లంగనలఁ గారియపెట్టిరి దేవళంబులన్
గూల్చిరి కోటలం బగులఁగొట్టిరి మండెడి మంటలోపలన్
పేల్చిరి తెల్గుపౌజులను వీలడిపోయె మహాంధ్రతేజమే
నిల్చిన లాభ మేమి యని నీ వరికీ వనమైతివే నృపా!

పరదాస్యంబున కోర్వ కాంధ్రతరుణుల్ వాపోవఁ బ్రత్యర్థిరా
ట్కరఘాతంబుల కాంధ్రరాజ్యరమ యాకంపింప వీక్షించి హృ
త్పరితాపంబున నున్న నీమొగము దీవ్యద్భావనాదృష్టితో
నరయన్ వ్రయ్యఁదొడంగె గుండె యిపు, డస్మాంధ్రాళి యెట్లోర్చునో.

అనితరవీరవిక్రమవిహారమహారథికాగ్రగణ్యులౌ
తెనుఁగువజీరు లెల్లఁ గడతేరుచునుండ, మహాంధ్రరాజ్యల
క్ష్మిని కెలఁబట్టఁగాఁ దలఁచి మ్లేచ్ఛనృపుల్ చెలరేఁగుచుండఁగాఁ
గని యెటులన్ సహించితివొ కాకతిరాజ్యరమాధురంధరా!

గౌతమీ కృష్ణవేణీ తరంగిణుల నీ రేకముఖంబుగా నేర్పడంగ
బ్రకృతిదుస్సహ మైన భయద నిర్ఘాతంబు లంబుదంబులనుండి యవతరింప
ధారుణీగర్భస్థ దహనకీలామాల లాంధ్రభూమండల మాక్రమింప
చటులఝంఝూవాతసంఘట్టనంబున దివి భువి యేకమై నివురుగప్ప
బ్రథన మొందిన దుస్తరప్రళయకాల-మాంధ్రనగరంబుతో సమస్తాంధ్రజాతి
నడఁచివేసిన యెడల భగ్నావశిష్ట-ములకుఁ బరితాప మొందుట తొలఁగకున్న.

ఆత్మరక్తంబుచేఁ బ్రవాహములు గూర్చి-తురకరాజుల నడ్డగించిరఁట తొల్లి
తెలుఁగుపౌజులు; నాఁడు నీతలఁపునడవ-యొచటి సుడిగుండములఁ బడియెను నృపాల!

రాజిత సర్వభాగ్యనికరప్రచురం బని వాసి నొందు రా
జపురంబొ లేక యమరావతియో యన నన్నుగాంచి వి

ప్రోలను మండలాకృతినిఁ బ్రొద్దుట సాయముఁ జల్లపాటునన్
స్త్రీలును బూరుషుల్ వెఱఁగుఁ జెంద నొనర్చు లఘుప్రచారముల్.

ఉప్పరవీథికిం జనుచు నుజ్జని పిల్చు విమానముం గనం,
గప్పురగంధు లాత్రమునఁ గాళ్లు తడంబడ, వ్యస్తభూష లౌ
చుప్పరిగల్ మెఱుంగుగమి నొప్పు మొగుళ్లను బోల నెక్కి, గన్
తెప్పల నెత్తి వాలుపక నింగికిఁ దాపెద రింద్రనీలముల్.

కంటికి తెప్ప, మింటికిని గావిరి, యక్కట! కాలదేశముల్
రెంటికి నడ్డు; వాని కవి లేనియెడన్ ద్రుటిమైన బీఱువో
కుంటయు, దూరదృష్టి చెడకుంటయుఁ గల్గుఁగదా యటంచు, మి
న్నంటు విమానముం గనెడునప్పుడు లో ననుకొంద్రు చూపఱుల్.

కాకియొ కేకియొ గ్రద్దయొ-నాకసమున నెగురుచుండ నదిగో విమానం
బాకడ! నని భ్రమపడుచుఁ ద-దేకధ్యానమునఁ బరువు లిడుదురు బుడుతల్.

ఆలును గేదె లెద్దుఁ, బసు లన్నియు, మున్నెటు రైలు మోటరుల్
నే లదరం బెఱాన గమనింపఁగ, నూడనిఁ బాడు బీతునం;
బైలున నేడు బోరని విమానము పీటఁ జరింప, నట్లు గ
గ్గోలున నుల్కి పాఱుఁ బులుఁగుంబలఁగంబు లెలుంగు లిచ్చుచున్.

వలపై మిక్కిలి చియ్యపట్టిన బలీవర్దంబు పెక్కేండ్లక్రిం
ద లయం బొందెను గ్రోధచోదితము క్రొత్తన్ రైలుతోఁ దాఁకి; నేఁ
డల వృత్తంబు దలంపు వచ్చెడి విహాయంబుల్ మహారోషసం
కులముల్ కొన్ని విమానముం దొడర ముక్కుం బోటులన్ అక్కలన్.

మాలల నగ్రవర్ణుల సమానులఁగాఁ జలుపం దలంచు నీ
కాలపు భారతోత్తములఁ గన్గొని, యూరపువారలందు ధీ
శాలులు, నేలవారి దివిషత్తతి నేకము సేయఁ దెచ్చిరో
గాలివిమానమున్, గురియఁ గాంచన మీ విభవన్ నభంబులన్.


చుట్టునకుం దలొక్కటికి సుంకము గొంచుఁ బదేసిరూప్యముల్,
పట్టణముం గనంబఱచుచుఁ బైఁ ద్రుటిఁ ద్రిప్పి విమాన; మందులోఁ
బట్టుదురంట ముప్వ; రొకపారికి ముప్పది; యెన్ని ముప్పదుల్
గట్టునొ మూఁట గంట? కిది కాంచనవర్షము దాని కీనెలఁ

నీళుల నావ లేఁగుటకు, నేలను సాగుట కట్లు బండ్లు, భూ
పాలక శాసనంబునను బన్నుల నిచ్చుచు నుండ్రుగా ప్రజల్;
పాలకు లింక గాలికిని బైలికి సుంకము గట్టకుందురా,
హేల విమాన మెప్పు డీటు లెక్కి ప్రయాణము సేయ మానవుల్?

అఱచుచు రివ్వనన్ నెగయు నంబరవీథికి వ్యోమయాన, మ
త్తఱి వెలవేఁకి, గుండెదడ, దత్తరమై తన కట్టుఁబుట్టమున్
బెఱుచుకొనెన్ విసుం డొకఁ డిసీ యని రోయుఁగ లోని మానుసుల్;
పిఱికిమనంబువాఁడు దలపెట్టఁగరాదు విమానయానమున్.

దినము సహస్రపూజ, వెలితిన్ గనకుండఁగ రాణ్మహేంద్ర ప
త్తన మొనరింప, నేత్రకుముదంబులకున్ బ్రమదంబు శ్రావణం
బునఁ దొలితక్క నక్కజము వొంద ఘటించి విమానరాజ, మా
వెను కెటకేనియున్ జనియె, వెన్నెలఁ జీఁకటిఁ బ్రోల్ దలంచుకొన్.

గరళజ్వాలల పాఁపజేఁడులకు తెక్కల్ సువ్వై, చివ్వం బర
స్పర వైరావ నొక ల్లకల్లఁ బరిమార్చన్ విక్కి నిక్కాలవుం
ధరణీభర్తల కీ విమానము; లగడ్తల్, దుర్గముల్ వ్యర్థముల్;
పురసైన్యాదులఁ బ్రోచుకో దివికిఁ దల్పుల్ దాపఁగా శక్యమే?




శ్రీ మహాత్మా గాంధి

౬౦-వ జన్మదినము (౨-౧౦-౧౯౨౯)



శ్రీ రాజా రామమోహనరాయిగారు

౯౫-వ వర్ధంతి (౨౭-౯-౧౯౨౮)



డాక్టరు అనిబిసెంటుగారు

౮౧-వ జన్మోత్సవము (౧-౧౦-౧౯౨౮)

నందిమల్లయ్య—ఘంటసింగయ్య

చేకుమళ్ల అచ్యుతరావుగారు,
యం.ఏ., యల్.టి.

(వెనుకటి సంచిక తరువాయి)

ప్రబోధచంద్రోదయము-భాషాంతరీకరణము

ప్రాచీనాంధ్ర వాఙ్మయమం దిది చాల నరుదైన గ్రంథము. ఆంధ్రకవులు ప్రథమమున సంస్కృత పురాణేతిహాసములనుండి గ్రంథముల నాంధ్రీకరించుచు వచ్చిరి గాని సంస్కృత మహాకవులు రచించిన మహాకావ్యనాటకములను దెనిఁగింపరైరి. కాళిదాసు, భవభూతి, భారవి, మాఘుఁడు, విశాఖదత్తుఁడు మున్నగు మహాకవులు రచించిన గ్రంథములను విడిచిపెట్టి పురాతనకథలుగల విక్రమార్క చరిత్రము; భోజరాజీయము, పంచతంత్రము మున్నగు గ్రంథములను బరివర్తించిరి. రఘువంశము, మేఘసందేశము, ఉత్తరరామచరిత్రము, కిరాతార్జునీయము మొదలగు గ్రంథములు ప్రాచీనకవుల యుపన్యాసమును మృదుమధురధోరణిని రచింపఁబడినయెడల నాంధ్రసరస్వతి నిరుపమానమగు సౌందర్యాతిశయమును బొందియుండెడిదని యిదివఱలోఁ జిన వీరభద్రుని విషయమున వ్రాసియుంటిని. శ్రీనాథుఁడు శ్రీహర్షుని నైషధమును దెనిఁగించిన ట్లోతను పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు కాళిదాసుని శాకుంతలమును దెనిఁగించెను గాని ప్రత్యేకముగా నాగ్రంథము పరివర్తింపక యందలి పద్యములను గొన్నిటినిమాత్ర మాంధ్రీకరించి తన గ్రంథమం దిడికొనెనని యిదివఱకే చెప్పితిని. గీర్వాణనాటకములలో నుత్తమమైనదాని నీవిధముగనైన నొక ప్రాచీనాంధ్రకవి చే దెనిఁగింపఁబడిన భాగ్య మాంధ్రులకుఁ గలిగినందులకు సంతోషింపఁదగిన విషయమని యీసందర్భమున వ్రాయఁగలిగితిని. ఈప్రబోధచంద్రోదయ మను ప్రబంధ మట్లుగాక గీర్వాణనాటకరాజములలోఁ జేరొందినదై యుండి ప్రాచీనాంధ్రకవులలో వాసికొందిన యీకవిద్వయముచే సంపూర్ణముగా నాంధ్రీకరింపఁబడినదిగాన నీయాంధ్రగ్రంథమునకు మనము ప్రత్యేకస్థాన మీయఁదగినదని నాయభిప్రాయము.

ఈకవులు తత్కాలాచారమునుబట్టి గీర్వాణనాటకమునైనను ప్రబంధరూపముగాఁ దెనిఁగించిరి. తెనుఁగున నాటకములు వ్రాయుపద్ధతి యాకాలమున నున్నయెడల వారు దానిని నాటకరూపముగానే తెనిఁగించియుందురు. ప్రబంధముగా మార్చినను, వారు మాతృకలోని కథాప్రణాళికనుగాని, పద్యక్రమమునుగాని, భావస్థితినిగాని సర్వసామాన్యముగా మార్పు లేకుండ స్వీకరించిరి. వీరు రచించిన ప్రబంధమును మాతృకయైన నాటకముతో సరిచూచిన నెవ్వరికో కించిద్భేదములు తప్ప రెండు నొకేవిధముగ నున్నవి. ఈవిధముగ సంస్కృతనాటకరాజము నాంధ్రప్రబంధముగ రచించుటయందీకవిద్వితయమే ప్రథమమార్గదర్శకము.

కృష్ణమిశ్రుఁడు దృశ్యప్రబంధమగు నాటకమును వ్రాసియుండెనుగాన దానికి ననువగు మార్గమునఁ దన గ్రంథమును బ్రారంభించెను. నటీసూత్రధారుల ప్రస్తావన పూర్తియయినవెంటనే తెరమాటు తొలఁగి కాముఁడు, రతియు రంగస్థలముఁ బ్రవేశించి, నాటకమందలి కథావిషయమును సంభాషణక్రమమున విశదపఱుతురు. ఈజంటకవులు శ్రవ్యప్రబంధమును వ్రాసియుండిరిగాన నాపద్ధతిని విడనాడి తమప్రబంధమున కనుకూలమగు విధమున గ్రంథమును బ్రారంభించిరి. అనఁగా: నొకచిదానందనగరి యను పట్టణముండెను. అందీశ్వరుఁడను రాజు పరిపాలించుచుండెను. ఆయన కిద్దఱు భార్యలుండిరి. వారిద్దఱకుఁ బుత్రులు గలిగిరి. ఆకొడుకులు రాజ్యముకొఱకుఁ బోట్లాడుకొనుచుండెడివారు. అందుఁ బెద్దభార్యకొడుకు తండ్రిపేరను రాజ్యముఁ జేయుచు రెం

మనభార్యపిల్లలను దలువుఁగొట్టుటకుఁ జైత్రయాలోచన సభ గావించెను. ఆసభయందుఁ గాముఁడును, రతియును దమతమ సామర్థ్యములను బ్రకటించిరి. ఇట్లు గీర్వాణ నాటకమునందుఁ బ్రారంభమున నున్న రతీకాముల ప్రసంగ మీయాంధ్రప్రబంధమునఁ గథ కొంతవఱకుఁ జెప్పఁబడిన తరువాత వచ్చినది. అనఁగా, గీర్వాణనాటకమున గథను జెప్పెడువా రాయాపాత్రములే; మన ప్రబంధమున గథను జెప్పెడివాఁడొకానొక కథకుఁడు. ఈవ్యత్యాసము చే గ్రంథప్రారంభభేదమును గలిగినది. *

ఇట్టి స్వల్పభేదము లింకను మఱికొన్ని గాన్పించుచున్నవి. వానికి ముఖ్యకారణ మీరెండు గ్రంథముల నిర్మాణభేదమే యని చెప్పఁదగును.

ప్రబంధమునందుఁ గొన్నివర్ణన లుండవలయునని యొకశాస్త్రనియమ మున్నదికదా! ఆనియమముకొఱకు నాటకమునందు లేకపోయినను కొన్ని వర్ణనల నీకవులు కల్పింపవలసివచ్చెను.

ప్రథమమునఁ జిదానందనగరవర్ణనము. ఈచిదానందనగరి నాటకమున లేనేలేదు. ఆనగరి నీరు కల్పించి ప్రబంధనియమములకొఱ కీకవులు వర్ణించిరి.

ప్రబంధమునందు మహామోహాదులకును, వివేకాదులకును జరిగిన యుద్ధము ప్రారంభింపక పూర్వము సాయంకాలవర్ణనము చేయఁబడినది. నాటకమం దీవర్ణనము లేదు. ఈవిధముగా నచ్చటచ్చట మాతృకలో లేని క్రొత్తవర్ణనలు కల్పింపఁబడినవి.

కాశీనగరమందు మహామోహమహారాజు ప్రవేశించినప్పుడు కొంత పరివార మున్నదనిమాత్రము నాటకమందు సూచింపఁబడినది. కాని కాముఁడును, లోభుఁడు; క్రోధుఁడు మొదలగువారు రాజునొద్ద నుండినట్లు చెప్పఁబడలేదు. వీరికిఁ బనులు వినియోగింపవలసివచ్చినపుడు రాజు ప్రత్యేకముగాఁ బ్రతీహారులను బంపి యొకరివొకరిని రప్పించి వానివాని కనుసరకార్యములను నిర్ణయించెను. ఈప్రబంధమం దట్లుగాక మహామోహుఁడు కాశీనగరమందుఁ బ్రవేశించునప్పుడే కామక్రోధాదిబంధువులు, మున్నుగవా రాతనితో నుండినట్లు వర్ణింపఁబడినది. కాఁబట్టి శత్రువర్గమువారిని గుఱించి తాను జేయవలసిన నిర్బంధశాసనములను దెలియఁజెప్పుటకుఁ గామక్రోధాదులను వేఱె పిలిపింప నక్కఱలేక వారి సమక్షముననే యాయా యాజ్ఞలను వారివారికి జారీ చేయించెను.

మఱియొక చిన్నభేదము. శివేశ్వరునికడకు వివేకమహారాజు, నుపనిషద్దేవిని దీసికొనిరమ్మని శ్రద్ధాశాంతులను విష్ణుభక్తిమహాదేవి పంపినట్లు గ్రంథమం దున్నది. అయినపుడును శివేశ్వరుని దర్శించుటలోఁ జిన్నభేద ముభయగ్రంథములయందును గాన్పించుచున్నది. నాటకమం దుపనిషద్దేవి శాంతిసహితయై ప్రథమమున శివేశ్వరునికడకుఁ బోయినట్లుగ నున్నది. ప్రబంధమున నట్లుగాక యీక్రమము మారినది. బహుశః భర్తయగు వివేకమహారాజున కీశ్వరుని ప్రథమదర్శనము కల్పించుట యుచితమగు మర్యాద యని కాఁబోలు నీకవులు దలంచి, వివేకమహారాజునకు మొదటప్రవేశము చేయించి, పదంపడి యుపనిషద్దేవిని రావించిరి.

ఇట్టి కించిద్భేదము లచ్చటచ్చట కథాక్రమమునందుఁ గాన్పించుచున్నవి. అయిన నీయత్యల్పమైన మార్పులు దప్ప, మొత్తముమీఁద నుభయగ్రంథములను బరస్పరము పరిశీలించినచో, నీగ్రంథము సంస్కృతమాతృకకు చక్కని యాంధ్రీకరణమని నిస్సందేహముగాఁ జెప్పవచ్చును.

కథాప్రణాళికవిషయ మింతటితో ముగించి భాషాంతరీకరణవిధానమును గుఱించి స్థాలీపులాకముగాఁ గొన్నివిశేషములను జూపించెదము.

---

* శ్రవ్యప్రబంధమునుగూడ దృశ్యప్రబంధమువలెనే తెరచాటుఁ దప్పించి కథాపాత్రలచేఁ బ్రారంభింపఁజేసెడు పద్ధతి పింగళిసూరనార్యుని యపారమేధాశక్తివలనఁ గల్పింపఁబడినది. ఆమహామహుని ప్రతిభ మనకట వారికిఁగాని, తరువాతివారికిఁగాని లభ్యము కాలేదు. కావున నాంధ్రవాఙ్మయమున నాయన నిక్కముగ నద్వితీయుఁడు.

నాటకమందు

౧. అహల్యాయై జారః సురపతి రభూ దాత్మతనయాం
ప్రజానాథోఽయాసీ దభజత గురో రిందు రబలామ్
ఇతి ప్రాయః కోవా న పద మపథేఽకార్యత మయా
శ్రమో మద్బాణానాం క ఇవ భువనోన్మాథ విధిషు.

ప్రబంధమందు

సీ. తన కన్నకూఁతును దాన పెండ్లాడఁడే
వారిజగర్భుండు వావి తప్పి
బలభేది గౌతము భార్య నహల్యఁ గా
మించి చేయఁడే వల్లమేఁకతప్పు
కడ లేనిరట్టడి కోడి గట్టుకొని రాజై
గవలారి గురుతల్పగతుఁడు గాఁడె
తపనసూనుఁడు తారఁ దా నాక్రమింపఁడే
యన్న ప్రాణములకు నజ్జు దలఁచి
మఱియు నిట్లు జగంబుల మరులుకొల్పి
యిట్టె నియతాత్మకులనైన నట్టు చెఱిచి
కాని త్రోవల నడిపించు కడిమి నాదు
వాలుఁదూపులగమి కవలీల గాదె.

నాటకమందలి శ్లోకమున మూఁడు దృష్టాంతములతో స్త్రీమోహానత్వము నిరూపింపఁబడినది. ఆశ్లోకము నీకవులు సీసపద్యరూపముగాఁ దెనిఁగించిరి. సీసపద్యమందు నాలుగు పాదములును, పైఁగా నొకయెత్తుగీతమును ఉండునుగదా. నాలుగు పాదములు సమనిర్మితముగా నుండుటకు నాలుగు గాథలు కావలసియున్నవి. మాతృకయందు మూఁడు మాత్రమే యున్నవి. తత్కారణమున నీకవు లొక నూతనగాథను, అనఁగా, తపనసూనుఁడు (సుగ్రీవుఁడు) తారను గుఱించినదానిని జేర్చి యీపద్యమును బూర్తిచేసిరి.

నాటకమందు

౨. శ్రీదేవీజనకాత్మజా దశముఖ స్యాసీ ద్ధి హిరణ్యాక్షసో
నీతా సైవ రసాతలం భగవతీ వేదత్రయీ దానవైః;
గంధర్వవ్యసనాదాలసాంబ తనయాం పాతాళకేతుశ్ఛలా
ద్దైత్యేంద్రోఽపజహార హంత విషమా వామా విధే
[ర్వృత్తయః.

ప్రబంధమందు

సీ. చాఁప చుట్టఁగఁ జుట్టి చంకఁ బెట్టుక పోఁడె
ధరణి హిరణ్యాక్ష దానవుండు
వేదత్రయీకాంత వెస ముచ్చిలింపఁడే
మాటి పట్టినయట్లు సోమకుండు
సాక్షాన్మహాలక్ష్మి జనక భూపాలనం
దనఁ జెఱ పట్టఁడే దశముఖుండు
కోపరక యమ్మదాలసఁ గొనిపోఁడె పా
తాళకేతుఁడను నక్తంచరుండు.
గాన నింకేపివారముగా యనంగ
రాదు పో యెట్టి పుణ్యవర్తనుని కైన
సహజవక్రంబుగాన సజ్జనులమేలు
చూడఁజాలక విధి తప్పఁ జూచు నేని,

పై నుదాహరించిన నిదర్శనము మాదిరిగా నే యీ పద్యమందును సీసపద్యమందలి నాలుగు పాదములను సమానముగాఁ బూరించుటకుఁగాను హిరణ్యాక్షుఁడును ధాత్రీ దేవిని గుఱించినగాథను నూతనముగాఁ జేర్చి కవు లీశ్లోకము ననువదించిరి.

నాటకమందు

౩. నిత్యం స్మరజ్జలదనీల ముదారహార
కేయూరకుండల కిరీటధరం హరిం వా;
గ్రీష్మే సుశీతమివ వా హ్రద మస్తశోకం
బ్రహ్మ ప్రవిశ్య భజ నిర్వృతి మాత్మనీనాం.

ప్రబంధమందు

లయగ్రాహి. నంధకధరున్ ఘనపురందరమణీ ప్రతిము
నిందిరమనోహరు ముకుందు హరిఁ గానీ
చందనము రాశిబిసకుందధవళాంగు గిరి
మందిరు సుమారమణు నిందుధరుఁ గానీ

పొందుగ సదా మనసునం దలఁచిరొయెనఁ జిర
మందమగు తత్పరమునిం దలఁచిరైనం
డెందముల పాపము వడిం దలఁగుచుర్మ మునఁ
గుందిమదుగుందటియడిందుపదులీలన్.

నాటకకర్తయగు కృష్ణమిశ్రుఁడు వైష్ణవమతస్థుఁ డగుటచే నందకధరుఁడగు శ్రీమహావిష్ణువును మాత్రమే తన గ్రంథమందుఁ జేర్కొనియెను. ఈకవులు శైవమతాచార్యులగుటచే మాతృకానుసారముగా శ్రీమహావిష్ణు ప్రశంస చేయుచుఁ బద్యాంతరమున నందివాహనుఁడగు శివునిగుఱించికూడఁ జేర్చిరి.

కాఁబట్టి కృష్ణమిశ్రుని మహానాటకము నాంధ్రమున ననువదించుచున్న నీజంటకవులు కొన్ని స్వకపోల కల్పనల నచ్చటచ్చటఁ బొందుపఱచి కొంత స్వాతంత్ర్యమును గనుపఱచిరి. కాఁబట్టి వీరును దమ సమకాలికు లగు శ్రీనాథాదులవలెను, దమకుఁ బ్రాచీనులగు తిక్కనాదులవలెను స్వేచ్ఛగా భాషాంతరీకరణ మొనర్చినట్లు నిశ్చయింపవచ్చును.

భాషాంతరీకరణరీతిని గుఱించి మఱిరెండు నిదర్శనములను జూపి యీభాగమును ముగించెద.

నాటకమందు

శ. సమ్మోహయంతి మదయంతి విడంబయంతి
నిర్భర్త్సయంతి రమయంతి విషాదయంతి;
ఏతాః ప్రవిశ్య సదయం హృదయం నరాణాం
కిం నామ వామనయనా న సమాచరంతి.

ప్రబంధమందు

సీ. వన్నెలు పచరించి కన్ను సన్నలు చేసి
తేనెమాటలను బ్రేమ గడలుకొలిపి
తరితీపు నటనలఁ దమకంబుఁ బుట్టించి
వట్టి ప్రియంబుల గుట్టు తెలిసి
కలికితనంబునఁ గాఁకలు గావించి
తోడినీడలువోలెఁ గూడిమాడి
యలుకల నలయించి కలయిక వలపించి
బాసల నడియాసఁ బాదుకొల్పి

మనసు కరఁగించి భ్రమయించి మత్తరించి
మిగులఁ జొక్కించి యెంతయుఁ దగులు పఱిచి
పాసి యెడఁబాసి తమబంటుఁ జేసికొనరె
వామలోచన లెంతటివారికైన.

నాటకమందు

మ. "క్షేత్రగ్రామవనాద్రిపత్తనపుర ద్వీపక్షమామండల
ప్రత్యాశాయతమాత్రబద్ధమనసాంలబ్ధాధికంధ్యాయతాం;
తృష్ణే దేవి యది ప్రసీదసి తనో ష్యంగాని తుంగాని చే
త్తద్భోః ప్రాగ్భృతాంకుశైకమకథా బ్రహ్మాండలక్షైగకి.

సీ. పుడమిలో మాన్యంపు మడి కొంత గలవాఁడు
గ్రామమెల్లను నేలగాఁ దలంచు
గ్రామ మేలెడువాఁడు కాంక్షించు గిరివన
స్థలబలదుర్గవద్రాజ్య మేల
రాజ్య మేలెడువాఁడు రాజ్యవైభవమున
హెచ్చి తా నొక ద్వీప మేలఁ గోరు
ద్వీప మేలెడువాఁడు తేజస్వియై మహీ
వలయ మెల్లను నేల వాంఛచేయు
నిట్లు కడలేని యాసాస లీనుచుండ
జనులు బ్రహ్మాండకోటులఁ దనివినొంద
రనిన కాంతికిఁ గాలాఁదగ్నైనఁ గలద
యెడము మదిఁ దృష్ణ నీ వింత వెడలిలేని.

వరాహపురాణము

ఈకవులిద్దఱు ప్రబోధచంద్రోదయము రచించిన తర్వాత వరాహపురాణమును రచించిరి. ఈరెండు గ్రంథముల పౌర్వాపర్యము నిర్ణయించుట కాగ్రంథములం దెక్కుడైన యాధారములు లేవు. కాని యాగ్రంథముల కృతిసమర్పణము స్వీకరించిన నాయకుల జీవితకాలము లఁబట్టి కొంతవఱకు నేతద్విషయము లూహింపఁ గలుగుదుము. ప్రబోధచంద్రోదయము నంకితమునొందిన చెందలూరి గంగయమంత్రి సాళువనృసింహరాయలకు సమకాలికుఁడై యానృసింహరాయలు దండనాయకుఁడుగానున్న కాలమునాటివాఁడు. వరాహపురాణమును గృతి

నొందిన తుళువ నరసరాయలు సాళువ నృసింహరాయల యొద్ద దండనాయకుఁడుగా నుండుటయేకాక, యాతని ప్రశంసావాక్యములనుబట్టి చూడఁగా నా నృసింహరాయలు విద్యానగరరాజ్యము నేలుచున్న నాఁటివాఁడని కాన్పించుచున్నది. కాఁబట్టి వరాహపురాణము రచనకాలమునకు సాళువనృసింహరాయలు సింహాసనస్థుఁడై యుండెను. ఈచారిత్రక విషయములఁబట్టి ప్రబోధచంద్రోదయము వారి మొదటిగ్రంథమనియు, వరాహపురాణము రెండవగ్రంథమనియు చెప్పవలసియున్నది. ఇంతియకాక యాగ్రంథముల శైలీ భేదము లీయూహను మఱింత బలపఱచుచున్నవి. ప్రబోధచంద్రోదయము సులభమైనట్టియు, మృదులమైనట్టియు శయ్యారీతుల వ్రాయఁబడినది. వరాహపురాణ మట్లుకాక, ప్రౌఢతరమై, జటిలమైన శైలిని వ్రాయఁబడినది. కావునఁ బ్రబోధచంద్రోదయమును బ్రథమమున విమర్శించి తర్వాత వరాహపురాణమును బరిశీలింప నుద్యమించితిని.

వరాహపురాణ మీకవివరుల లలితములైన వాగ్విలాసములచేన్ను వహించియున్నను కథాసంభృతినిబట్టి చూడ నాంధ్రవాఙ్మయచరిత్రమునం దెక్కువగా నుగ్గడించుటకుఁ దగినదని నాకుఁ దోఁపదు. ఈగ్రంథము యొక్క ప్రాముఖ్యము దీనియందలి కథాస్వారస్యము కంటె నిందుఁ బొందుపఱుపఁబడిన విజయనగరరాజ్య చరిత్ర వృత్తాంతములపై నాధారపడి యున్నదని నాయభిప్రాయము. ఈకవులు తమయధిపతియైన తుళువ నరసరాయలయొక్కయు, నతని ప్రభువైన సాళువనృసింహరాయలయొక్కయు వంశచరిత్రములను సావధానముగ వ్రాసియుఁ, బెక్కు లపూర్వవిషయములు చేర్చియు నాంధ్రచరిత్ర పరిశోధకులకు నిక్కమైన సాయ మొనరించినవారైరి.

తుళువ నరసరాయలు

విజయనగరరాజ్య చరిత్రమున నరసరాయలనియు, నరసనాయకుఁడనియుఁ బేరొందిన యీమహనీయుఁడు తుళువవంశమువాఁడు. ఈతనివంశమున కీపేరు తా మేలుచుండిన దేశమునుబట్టి వచ్చిన ట్లీక్రిందిపద్యములఁ దెలియవచ్చుచున్నది:

ఉ. మిన్నుల మోచి భాగ్యమున
మీఱినకోటల రమ్యహర్మ్య సం
పన్నత సస్యవాటగరి
మంబులఁ దోఁటల వాహవారణా
భ్యున్నతిఁ గేళిదీర్ఘికల
నుగ్రఘటావలి నన్నెకెక్కు నా
రాన్నిధి కాంచి పైఁ దుళువ
రాజ్యము సంతతవీరభోజ్య మై.

క. ఆతుళువరాజ్యమున వి
ఖ్యాతి వహించిరి దిగంత కరికటతట సం
ఘాతమదక్షాళన వి
ద్యాతత్పరకీర్తిఁ బెండ్లియాడిన రాజుల్.

ఈవంశస్థులు తుళువదేశపరిపాలనచేత తుళువవంశస్థులని పేరు గణించిరి. ఆతుళువదేశ మేదో నిర్ణయింపవలసియున్నది. తుళువనాడు అని మైసూరుసంస్థానములోనిదైన యొకభాగమునకుఁ బేరు. కాఁబట్టి నరసరాయలపూర్వులు ప్రాచీనకాలమున నాదేశపువారై యుండిరేమోయని మన మూహింపఁదగినది. నరసరాయల కాలమునను, అతనితండ్రి యీశ్వరరాయల కాలమునను వీరును, వీరికుటుంబమువారును చిత్తూరుజిల్లాలో నున్న చంద్రగిరిలో రాజ్యముచేయుచున్న సాళువ నృసింహరాయలయొద్ద దండనాయకులుగా నుండిన కారణమునఁ గొన్ని తరములనుండియు నీవంశజులు చిత్తూరుజిల్లాయొక్కయు, ఉత్తరార్కాడు జిల్లాయొక్కయు ప్రాంతముల వలస లేర్పరచుకొని రాజ్యములు చేయుచున్నట్లు నిశ్చయింపవచ్చును. ఈయభిప్రాయమునకుఁ బ్రబలమైన యాధార మింకొకటి యీగ్రంథమందు కాన్పించుచున్నది. నరసరాయలగుఱించి వ్రాయుచు నీకవివరులు వరాహపురాణమందలి యేకాదశాశ్వాసాంత పద్యములలో నిట్లు వ్రాసిరి:—

క. ధరణీనుత దేవకీపుర
వరనిలయ శ్రీగిరీశ వరసంపన్నే
శ్వర విభుతనయా సాళువ
నరసింహనృపాల దండనాయక తిలకా!

అనఁగా, భూలోకమందుఁ బ్రసిద్ధినొందిన దేవకీపురము నివాసస్థలముగాఁ గలిగినవాఁడా! శ్రీశైలమల్లేశ్వరస్వామివలన నీశ్వరనాయకునకుఁ బుట్టిన వాఁడా, సాళువనృసింహరాయ సార్వభౌమునకు ముఖ్యమైన దండనాయకుఁడా, యని నరసరాయలను సంబోధించిరి. కావున తుళువనరసరాయల రాజ్యస్థానము దేవకీపురము.

ఈదేవకీపుర మెచ్చట నున్నదో? ప్రస్తుత ముత్తరార్కాడుజిల్లాలో ఆరణితాలూకాలో నొక దేవకాపుర మను ప్రాచీనస్థల మున్నది. అది గవర్నమెంటువారి రివిన్యూగ్రామముల జాబితాలో దేవికాపురమనియు, ప్రాచీనశాసనములలో దేవకాపురమనియు నున్నది. అది నిక్కముగ దేవకీపురమనియే నమ్మవచ్చును. ఆపురమందలి బృహదంబదేవాలయములో ననేకమైన శిలాశాసనము లున్నవి.

ఆశాసనములఁ జాలవఱకు తుళువఈశ్వరరాయల కుటుంబములోనివారు లిఖించినవే. ఈశ్వరరాయలు, నరసరాయలు, వీరనృసింహరాయలు, కృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయలు, సదాశివదేవరాయలు, వెంకటపతిరాయలు, శ్రీరంగరాయలు మున్నగువా రనేకదానములీబృహదంబకు చేసి శాసనములు లిఖించిరి. సాళువనృసింహరాయలయు, ఆయనకుమారుఁడు నృసింహరాయలయుశాసనములు నీదేవళమందుఁ గాన్పించుచున్నవి. కాఁబట్టి తుళువనరసరాయలతండ్రియైన యీశ్వరరాయలముఖ్యపట్టణ మిదేదేవకీపురమని నిశ్చయింపవచ్చును. ఈతఁడు తనచిన్నరాజ్యమును బరిపాలనచేయుచుఁ దనదేశమునకు సరిహద్దున నున్న చంద్రగిరిలో రాజ్యముచేయుచుండి, క్రమముగా విజయనగరరాజ్య సింహాసనమెక్కి, సాళువనృసింహరాయలకు సేనానాయకుఁడై యాతనికొలువులో నుండెను. ఆయాశ్రమముఁబట్టి తనకుమారుఁడైన నరసరాయలకును నృసింహరాయలయొద్ద సైన్యాధిపత్యము సంపాదింపఁగలిగెను. నరసరాయలు బాహుబలముచేతను, బుద్ధిబలముచేతను, అన్నిటికంటె నెక్కుడైన నీతిబలముచేతను దినదినాభివృద్ధినొంది విజయనగరసింహాసనము సాళువవంశ మంతముగాఁగఁ దనకుమారుల కొప్పగింపఁ గలిగెను.

కావున సాళువ నృసింహరాయలును, తుళువనరసరాయలును ఆంధ్రులని నిస్సందేహముగాఁ జెప్పవచ్చును. కర్ణాటకులగు సంగమవంశముతోఁ బ్రారంభించిన విజయనగరరాజ్యము పదునేనవశతాబ్ద్యంతమునఁ గేవలము తెలుఁగువారైన సాళువనృసింహరాయలవశమై, యాతనితరువాతఁగూడఁ దెలుఁగువారైన తుళువవంశస్థులయాధిపత్యములోనికిఁ జేరినది.

పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని జైమినిభారత కృతిభర్తయగు సాళువనృసింహరాయలు క్రీ. శ. 1487 సం. విజయనగర రాజ్య సింహాసనాసీనుఁ డయ్యెనని యిదివరలోఁ జెప్పితిని. ఆతఁడు సుమారు ఆరుసంవత్సరములు రాజ్యముచేసి క్రీ. శ. 1493 లోఁ బరలోకగతుఁ డయ్యెను. ఆతని మరణకాలమునాఁటికి నాతని యిద్దఱుకుమారులు చిన్నవారై యుండుటచేత, వారిపోషణమును, సామ్రాజ్యసంరక్షణమును నిర్వహించుటకుఁ దనయొద్ద ముఖ్యదండనాయకుఁడుగాను, బహువిశ్వాసపాత్రుఁడుగాను నున్న తుళువ నరసరాయలఁ నాతఁడు నియోగించెను. నరసరాయలు స్వామికార్యమును కడుభక్తితో నిర్వహించి, రాజ్యభారము నంతయుఁ దానే వహించుచున్నను, దన ప్రభువు నియోగమును మాత్రము మరచి యుండలేదు. సాళువనృసింహరాయల పెద్దకొడుకు సింహాసనారూఢుఁడై కొలఁదికాలము లోనే, అనఁగా క్రీ. శ. 1493 లో, తురుష్కులతోఁ బోరి సమరాంగణమున వీరస్వర్గముఁ జూఱఁగొనెను. ఆకారణమున నరసరాయలు నృసింహరాయల రెండవకుమారుఁడగు ఇమ్మడి నృసింహరాయలను సింహాసనమునం దునిచి తాను సంరక్షకుఁడుగా మెలఁగుచుండెను.


సాళువ నృసింహరాయ లింకను బ్రతికియుండఁగానే, తా నామహీవల్లభుని సైన్యముల సర్వాధిపత్యము

వహించియుండఁగానే యీవరాహపురాణమును కృతి నొందినట్లు తెలియవచ్చుచున్నది.

తుళువవంశమును సాళువవంశమువలెనే చంద్ర వంశము. సాళువవంశజులు మొదట ఓరుగల్లుప్రాంతముల రాజ్యముచేయుచుండినట్లుగానే యీవంశజులును మొట్ట మొదట మైసూరుప్రాంతములలో రాజ్యముచేయుచుఁ, దురుష్కుల యొత్తిడి కారణముననో, మఱేకారణము ననో తూర్పుదేశమునకుఁ బోయి, తెనుఁగుదేశములోఁ జిన్నచిన్న సంస్థానము లేర్పరచుకొని రాజ్యములు చేయుచుండినవారు. బహుశః సరిహద్దుసంస్థానములలో రాజ్యములు చేయుచుండినవారగుటచే సాళువవంశ మునకు తుళువవంశమునకు సంబంధబాంధవ్యము లేర్పడి యుండెడివి. చంద్రగిరిరాజులగు సాళువవంశపువారియొద్ద నీ తుళువ నరసరాయలును, అతనితండ్రి ఈశ్వరనాయ కుఁడును సైన్యాధిపత్యమును వహించినవారై యుండిరి. ఇన్నితరములనుంచి రాజ్యకార్యవిషయములలో నగ్గల మైన స్నేహసాహచర్యములు గలిగియున్న రాజవుం డ్రలకు రాజకీయసంబంధమే కాక రక్తసంబంధము కూడను ఉండకపోదు. అది యింకను గ్రంథస్థితిస్తుత్తు ముల నిర్ధారింపఁబడవలసిన విషయము. *

తుళువవంశములోఁ దిమ్మరాజు పుట్టెను. అతనికి భార్య దేవకీదేవి. వారికుపుత్రకు నీశ్వరరాజు, తిమ్మరాజు అని యిద్దఱు కొడుకులు గలిగిరి. వారిలో నీశ్వరరాజు సాళువనృసింహరాయలయొద్ద దండనాయకుఁడై యనేక దుర్గములను దన ప్రభువు కొఱకు జయించెను. §

సీ. ఉదయాద్రి భేదించె హుత్తరి నిర్జించె
గండికోటపురంబుఁ గదలఁ ద్రవ్వె
పెనుకొండ సాధించె బెంగుళూరు హరించెఁ
గోవెల నెల్లూరు గుటుపుఁజేఁ
గుంపాణి విదళించె గోడుగుచింత జయించె
బాగూరుపంచము పాడుచేసె
నరుగొండ వెకలించె నాగూరు మర్దించె
శ్రీరంగపట్నము చేరిసమర
రాయసాహత్తి మల్లధరావరాహ
మోహనమురారి బర్బరబాహుసాళ్వ
నారసింహప్రతాప సన్నాహమునఁ దనుచు
విశ్వహితకారి తిమ్మయయీశ్వరుండు.



* కీర్తిశేషులైన కొమర్రాజు వెంకటలక్ష్మణరావుగారు తమ 'మహమ్మదీయ మహాయుగము' అను గ్రంథమునందు, (పుట 848) సాళువ నరసింహరాజునకును, తుళువనరసరాయలకును గల సంబంధబాంధవ్యము నీక్రిందివిధముగఁ దెల్పిరి:—

"ఈతుళువవంశము సాళువవంశాంతర్గతము. సాళువ నరసింగరాజుతండ్రి గుండరాజు. అతని కిద్దఱు కుమా రులు: మొదటివాఁడు తిమ్మరాజు; రెండవవాఁడు సాళువ నరసరాజు. తిమ్మరాజునకు నీశ్వరరాజును, వాయీశ్వర రాజునకు నీతుళువనరసరాజును బుట్టిరి. కావున తుళువ నరసరాజు సాళువనరసరాజునకు అన్నమనుమఁడు." ఇట్లే రెండువంశములకుఁ బరస్పరబాంధవ్యము నిర్ణయించుటకు వీరికి దొరకినయాధార మెద్దియో నాకుఁ దెలియలేదు.

§ "అట్టి సాళువ నరసింగరాజరత్నముచేత మన్నన వడసి, సైన్యనాయకపట్టభద్రత్వంబున, నిర్నిద్ర విజయలక్ష్మీ మహత్వంబున, మదవదభియాతి భయదసత్త్వంబున, దీక్షాయుతైశ్వర్యానుస్యూతంబైన ఈశ్వరనా యకునకుం బ్రియతనూభవుండు నరసవసుధాధ్యక్షుండు." (వరాహపురాణము.)

నెల్లూరిజిల్లాలోని ఉదయగిరి, చిత్తూరుజిల్లాలోని పుత్తూరు, కడపజిల్లాలోని గండికోట, అనంతపురం జిల్లాలోని పెనుగొండ, మైసూరురాజ్యములోని బెంగుళూరు ఇత్యాది కడింది దుర్గములను జయించి సాళువ నృసింహరాయలకుఁ గుడిభుజముగా నుండెను.

ఇంతియకాక బెడండకోట (బీదరు) యవనసైన్యములతో ఘోరసమరము గావించి నెల్లూరుజిల్లాలో నున్న కందుకూరుకడ వారిని విధ్వంసముచేసి గొప్పవిజయముఁ బొందెను.

మ. నరసింగక్షితిపాలుపంపునను గా
నాఁ జేసి దండెత్తి యీ
శ్వరభూభర్త బెడండకోట యవనా
శ్వవ్రాతముల్ భీమ సం
గరరంగంబునఁ గొల్లగొట్టుకొని పేఁ
కం గందుకూరీపురాం
తరసీమంబునఁ జక్కఁగా నఱకె దు
ర్దాంతారి సంతానముల్. *

ఉ. రాజులమెత్తుటం బరఁగు
రాముఁడు వింతలు సేసె రెండుమూఁ
డీజగతిన్ గణింప నది
యెంతటివిస్మయ మబ్జనీసహ
స్త్రేజుఁడు కందుకూరికడఁ
దిమ్మయయీశ్వరుచే జనించె ఘో
రాజిబెడండకోట యవ
నాశ్వకరక్తనదీసహస్రముల్.

ఈ యీశ్వరరాజునకు నిద్దఱుభార్యలు: గౌరాంబయు, †బుక్కాంబయు. రెండవభార్యయగు బుక్కాంబకు నరసరాయలు, తిమ్మరాజు అను నిద్దఱుపుత్రులు కలిగిరి. ఈనరసరాయలే యేతద్గ్రంథమునకుఁ గృతిపతి.

నరసరాయలు కాలక్రమమున తండ్రిస్థానమలంకరించి, సాళువనృసింహరాయలయొద్ద దండనాయకపట్టభద్రుఁడై, యాతనికి ముఖ్యసచివుఁడై ప్రాణమిత్రుఁడై యుండెను. § సాళువనృసింహరాయలు విద్యానగరరాజ్యసింహాసనాసీనుఁడుగా నుండినకాలమున నాన్నపాలునికడ బహువిశ్వాసపాత్రుఁడుగా నుండి యామహీవల్లభుని యభ్యుదయమే తనకర్తవ్యముగా నాలోచించుకొని నిర్వ్యాజరాజభక్తిలో మెలంగుచుండెను. ఒకవంక భామినీసుల్తానులతోను, మఱియొకదిక్కునఁ గళింగభూపతులతోను నిరంతరము సమరములు సలుపుచు వారి నరికట్టి విజయనగరసామ్రాజ్యము చెక్కుచెదరకుండఁ గాపాడుచువచ్చెను.

నరస దండనాయకుని విజయమునుగురించి వరాహపురాణమున నిట్లభివర్ణితమైనది:—

ఉత్సాహ. మండువా బెడండకోట మాహురాదిమేదినీ
మండలేశ్వరస్తుతా సమానమానసోదయా
ఖండనాజితప్రచండపటహనిస్వనార్భటీ
హిండితాష్టదిక్కరంగ యీశ్వరాత్మసంభవా.

అనఁగా, మండువా, బెడండకోట, మాహూర్(నిజాంరాజ్యములో నున్నది) మొదలగు కోటలను జయించినట్లు చెప్పఁబడినది.

ఇంక పారిజాతాపహరణములో నరసరాయలను గుఱించి వ్రాయుచు నీకవులకు బంధు వయిన ముక్కుతిమ్మన యిట్లు వ్రాసెను:—

సీ. కుంతలేశ్వరుఁడు పిక్కనమింగ విద్యాపు
రంబుఁ గైకొని విజ్రమ్భించి వెలసెఁ
బారసీకునకు దుర్వార మానవత్త్వంబుఁ
దొలఁగించె మానవదుర్గసీమఁ
జేశవల్లభునకు సురవధూమధురాధ
రము లిచ్చి మధురాపురంబుఁ గొనియె

---

* ఈవిషయమునే ముక్కుతిమ్మన్న తనపారిజాతాపహరణములోఁగూడ నుదాహరించెను.

† బుక్కాంబకు లక్కాంబ యని ముక్కుతిమ్మన పారిజాతాపహరణములో నున్నది.

§ నరసింగనృప సామ్రాజ్యరమాభరణా నరసింగస్వామి నిర్ణీతసంకల్పాభిజ్ఞ (వరాహపురాణము)

శ్రీరంగపట్టణసీమ ఖడ్గనటీ వి
    నోదంబు హైసణేంద్రునకుఁ జూపె
నతఁడు మతి కెక్క- హైమసేక్యంతరాశి
కలిత షోడశదాన విఖ్యాతియశుఁడు
మండలీకర వేంఘ మార్తాండబిరుగుఁ
డీశ్వరాధిపు నరసపృథ్వీశ్వరుండు.

విద్యాపురము (బిజాపురము), మానవదుర్గము (మన్నవ), మధుర, శ్రీరంగపట్నము మున్నగు ముఖ్య పట్టణములను పట్టుకొని ఈనరసరాయలు తన విపులప్రతాపమును నెఱపుకొనెను. ఇట్లనేకములైన దుర్గములను ముట్టడించుచు యుద్ధములను జేయుచుఁ దన జీవితమంతయుఁ దనప్రభువైన సాళువనృసింహరాయలకు ధారపోసెను. సాళువ నృసింహరాయలు మరణించునప్పుడు తనకుమారు లిద్దఱు బాలవయస్కులుగా నుండుటచే వారిసంరక్షణము, రాజ్యభారము నీమహాపురుషున కొప్పగించినిర్విచారముగాఁ బ్రాణములు విడిచెనని పైఁ జెప్పితిని. తనప్రభువు నియోగమే పరమపవిత్రమగు ధర్మముగా దలంచుకొని శిరసావహించి, నృసింహరాయల పుత్రులకు సంరక్షకుఁడుగా నుండి, తాను మృతి నొందువఱకును, అనఁగా క్రీ. శ. 1505 వఱకును, సమస్తరాజ్యమును నిర్వహించుచువచ్చెను. రాజ్యము తనయొక్కచేతిలో నున్నను స్వీకరింప నొల్లకుండెను. ఈమహామహుఁడు నిక్కముగా భీష్మునియవతారమని చెప్పక తప్పదు. *

సీ. ఎవ్వానివిజయంబు లెఱిఁగించు శాసన
    స్తంభంబు లాశాంతశైలవితతు
లెవ్వానియరిగాఁపు లేపారు కాళింగ
    యవనాదివివిధదేశాధినాథు
లెవ్వానివిత్యదానైకవిలాసంబు
    లారూఢతిరతులాపూరుషంబు
లెవ్వానిచిరకీర్తి యింద్రలోకాంగనా
    భోగినీగీతికాభోగపదము

వాఁడు వొగడొందు సర్వసర్వంసహాధి
దేవతాముఖదర్పణ ద్విజయనగర
భద్రసింహాసనస్థుఁడున్నిద్రతేజుఁ
డీశ్వరాధిపు నరసభూమీశ్వరుండు.

ఈశ్వరరాజు శివభక్తుఁడు. శ్రీశైలమల్లికార్జునుని ప్రసాదమున తనకొమరుని నరసరాయలను బొందఁగలిగెను. నరసరాయలు వైష్ణవమతావలంబకుఁడు. శేషగిరి పర్యంకశయనుఁడగు వెంకటేశ్వరభక్తుఁడు. "శ్రీవెంకటాద్రిపతి సంసేవాహేవాకనిపుణా" యనియు, "వైష్ణవకథాపూతాత్మా" యనియు నీకవు లీరాయల నభివర్ణించినను, వారె వేరొకచోట "మధురిపుత్రిపురహరాభేదసపర్యాదర్యా" యని నుడివినారు. కావున నీమహనీయుఁడు వైష్ణవమతమును స్వీకరించినను శివమతమును జెంచి భేదబుద్ధి గలవాఁడు కాఁడు. కావుననే శైవమతస్థులగు నీకవులు వైష్ణవగ్రంథము నాంధ్రీకరించి తన కంకితముచేయుట తటస్థించెను.

విద్యానగరరాజ్య ధురంధరులగు నితరరాజన్యులవలెనే యీమహామహుఁడును "వాణీకరవీణానిక్వాణరతి" నభిలషించి, యనేక కవులను, బండితులను బోషించి, వారికృతులను స్వీకరించి సరస్వతీసేవ యొనర్చెను. "వరలక్ష్మీకల్యాణము", "నరసింహవిజయ పురాణము" అను రెండుగ్రంథములకుఁ దాను కృతిభర్త యయ్యెను. ఈగ్రంథము లిప్పుడు లభ్యములు కావని నాకుఁ దోఁచుచున్నది.

ఇట్టి సకల సామ్రాజ్య భారధారె యుండును, సరససారస్వత సేవాపరుండు నగు నరసరాయల కీవరాహపురాణ ప్రబంధకృతి నీకవులు సమర్పితముఁజేసిరి.

వరాహపురాణము

వ్యాసభట్టారకవిరచితములగు నష్టాదశపురాణములలో నొకటియైన యీవరాహపురాణము నిక్కముగ నేతిబీరకాయవంటిది. నేతిబీరకాయయందు నేయి

* ముక్కుతిమ్మన్న పారిజాతాపహరణములో ఈనరసరాయలు విద్యానగరసింహాసన మెక్కినట్లుగా వర్ణించినాఁడు. కాని చరిత్రకారు లీవిషయమును నమ్ముటలేదు.

లేదు; వరాహపురాణమునందు వరాహావతారవిషయము లేదు. ఆదివరాహమూర్తి ధరణీవరారోహకు సృష్ట్యాదివిషయములను గూర్చి చెప్పినపుణ్యకథలు మున్నగునవి యెన్నియేని దీనియం దున్నవి. కాని

"చాపచుట్టగఁ జుట్టి చంక పెట్టుక పోఁడె
ధరణి హిరణ్యాక్షుదానవుండు."

అని యీకవులు తమప్రబోధచంద్రోదయమునఁ జెప్పినట్లు ధరణీరమణిని హిరణ్యాక్షుఁ డెట్లు గాసిపెట్టెనో, యేలాగున శ్రీమహావిష్ణువు వరాహరూపమున భూదేవి నుద్ధరించెనో యాకథ యేమాత్రము నీతిద్వరాహపురాణమునఁ గాన్పింపదు. ఇది బహు విచిత్రముగదా!

బహుళప్రఖ్యాతి గాంచిన గాథ లెవ్వియు దీనియందు లేకపోయినను ననేకములగు చిన్నచిన్న పుణ్యకథలు, ముఖ్యముగా వైష్ణవులలోను, స్మార్తులలోను సామాన్యముగా నాచరింపఁబడు వ్రతదానముల పుణ్యకథలు దీనియందుఁ జెక్కులు కాన్పించుచున్నవి. ప్రతికథయందును వ్రతవిధానము, ఆవ్రతము నాచరించిన యొకానొక మహాపురుషుని ప్రశంసయు, అతఁ డనుభవించిన వ్రతఫలమును నిత్యాదులు లెక్కకు మిక్కిలి వక్కాణింపఁబడినవి. పాడ్యమి మొదలు పూర్ణిమామావాస్యలవఱకు ప్రతిదినము నాచరింపఁదగు వ్రతములును, దానములును, చైత్రమాసము ప్రభృతి ఫాల్గుణమాసాంతమువఱకును ననుష్ఠింపఁదగు వ్రతములును, దానములును సక్రమముగా సచరిత్రముగా నిరూపింపఁబడినవి. ధరణీవ్రతము, రుద్రవ్రతము, ధన్యవ్రతము, పద్మనాభవ్రతము, కాంతివ్రతము, శుభవ్రతము, కామవ్రతము, సార్వభౌమవ్రతము ఇత్యాదులును, తిలాద్రిత్రయోదశదానములు, గోదానము, హేమకుంభదానము ఇత్యాదులును నీగ్రంథమందు సగము భాగము పైగా నావరించియున్నవి. మిగిలినభాగములో స్థలమాహాత్మ్యములు అనఁగా సానందూరమాహాత్మ్యము, లోహార్గళమాహాత్మ్యము, మథురామాహాత్మ్యము, గోకర్ణమాహాత్మ్యము మున్నగునవి చెక్కులు గలవు. ప్రాచీనభూగోళవర్ణనము సప్తద్వీపములు, సప్తమహోదధులు, సప్తకులపర్వతములు, మహానదీనదములు, పశుసృష్ట్యాదివిశేషములు, ఇత్యాదివివరణములతో సువిశేషముగఁ జేయఁబడినది.

* నాచికేతోపాఖ్యాన మనుగాథ యిందు ప్రాసంగికముగాఁ జేర్పఁబడినది. ఉద్దాలకుని పరిణయము, నాచికేతుని జననమువఱకుఁ గలకథాభాగ మిందు లేదు కాని మిగిలినకథ యంతయు—అనఁగా నాచికేతుని శాపము, యమపురీగమనము, తత్ప్రతిగమనము, నరకాదివర్ణనము—మొదలగు సంగతులు గలకథ యంతయు సవిస్తరముగ వర్ణింపఁబడినది.

వాఙ్మయదృష్టితో నీమూలగ్రంథమును గాని, తద్భాషాంతరీకరణమును గాని పరికించెడు విమర్శకున కీవిషయము లెవ్వియు నంతగా రుచింపవు. రసాత్మకమై పాత్రపోషణాన్వితమైన కథాభాగమున కవిపుంగవుల కవితాపుష్టి కానంబడును గాని వ్రతవిధానవర్ణనములు, స్థలమహిమావర్ణనములు, భూవిభాగవర్ణనములు ఇత్యాదులయందు కవిత్వప్రభావ మంతగా ద్యోతకపడదు. ఈయుభయకవుల కవనపటిమను తెలిసికొనుటకనువగు కథాభాగము లీగ్రంథమున క్వాచిత్కముగఁ జూడనగుచున్నవి. వీనినిబట్టి ముఖ్యముగా నీకవుల సారస్వతచాతుర్యవిశేషమును నిర్ణయించుట కవకాశము కొంత గలుగుచున్నది. అట్టికథాభాగములలో మొదటిదగు దుర్జయోపాఖ్యానము గ్రంథాదిని విపులముగ వర్ణింపఁబడినది. దుర్జయుఁ డనురాక్షసరాజు దేవేంద్రుని జయించి ముల్లోకముల నేలుటయు, గౌరముఖుఁడను మహామునియొద్ద నాతిథ్యము నొందుటయు, ఆతపోధనునియొద్ద నున్న చింతామణిని బలాత్కారముగఁ బుచ్చుకొనఁ బ్రయత్నించుటయు, మహావిష్ణువు బాసటయై గౌరముఖునికి విజయ మొసంగుటయు, నిత్యాదివిషయములు గల యీయుపాఖ్యానమే తద్గ్రంథమునకుఁ గొంత వన్నె దెచ్చుచున్నది. ఇదిగాక, మఱియొక యుపాఖ్యానముగూడ నింపుమిగులఁ దాని

* దుగ్గుబల్లి దుగ్గయ్య నాచికేతోపాఖ్యానమును జూడుఁడు.

వలెనే యింపుసొంపులు గులుకు కథాప్రణాళికతో నొప్పారుచున్నది. అది గౌతమ్యుపాఖ్యానము. దానియందు గౌతమి లేక గోదావరి యనుపేరు గల మనయాంధ్రదేశమందలి పుణ్యనదియొక్క యుత్పత్తికథ విపులముగ వర్ణింపఁబడినది. ఈకథాభాగ మతిమనోహరముగను, శ్రవణోత్సుకముగను నున్నది. ద్వాదశవర్షక్షామకాలమున గౌతముని తనసస్యసహాయమున భూసురసంఘంబులఁ బోషించుట, వారీసడించుకొని మాయాధేనువును గల్పించి గౌతముని సస్యకేదారమును మేపించుట, గౌతముఁడు తపోజలముతో దానిని బోఁదోలుట, ఆకితవగో వుసురులు విడుచుట, తత్పాపపరిహారార్థము గౌతముఁడు శివునిజటాజూటమునుండి గంగను దెచ్చి గోవుపైఁ బ్రవహింపఁజేయుట, తత్కారణమున గోదావరి యనునామము వచ్చుట ఇత్యాదివిషయములు గల యీయుపాఖ్యానము చాల రసవంతముగ విరచితమైనది.

ధర్మవ్యాధ దుహితృ చరిత్రము చాల రసవంతముగను, నీతియుక్తముగను, సర్వవిధముల శ్లాఘాపాత్రముగ నున్నది. ధర్మవ్యాధుని పుత్రికయగు సాధ్వీమణి అర్జునిక శ్వశురగృహమున పడినబాధలు సహింపలేక, తండ్రియొద్దకు వచ్చి తనచరిత్రమును దెల్పి విలపింప, ధర్మవ్యాధుఁడు కోపించి జామాతృగృహమున కేఁగి యత్తమామలను దూఱి ధర్మోపదేశము చేసెను. ఈయుపాఖ్యానమున హిందూకుటుంబములందలి జీవితవ్యవస్థ లసదృశముగా నిరూపింపఁబడియున్నవి. హిందూసంఘమందుఁ గుటుంబజీవితము నాఁటికిని, నేఁటికిని కీటురాయివలె నచలితమై యున్నదని యిట్టిగ్రంథాధారములఁ బట్టి యూహింపవచ్చును.

భాషాంతరీకరణము

సంస్కృత వరాహపురాణమునఁ గొంతభాగమును మాత్రమె యీకవులు తెనిఁగించిరి. వ్రతదానభాగము పూర్తి యయినవెంటనే గ్రంథపఠనశ్రవణఫలముఁ దెల్పి గ్రంథమును బరిసమాప్తి చేసిరి. స్థలమాహాత్మ్యములుగల భాగమంతయు విడిచిపెట్టఁబడినది. కావున వ్రతదానముల జ్ఞానము నాంధ్రులకుఁ దెలుపు నుద్దేశముతో నీగ్రంథమును తెనిఁగింపఁ బ్రారంభించిరేమో యని యూహింపవలసియున్నది. ఈవిపులమగు పురాణము నాంధ్రీకరించు ప్రయత్నములో నీకవు లున్నారని కర్ణాకర్ణికగా విని నరసరాయ లీకవులను రప్పించి తన కాగ్రంథమును గృతియిమ్మని కోరిన ట్లీగ్రంథమున వీరు చెప్పికొనిరి.

తాము వ్రాసిన పండ్రెండాశ్వాసముల గ్రంథములో మాతృకయందలి సగముభాగముమాత్రమే తెనిఁగింపఁగలిగి యుండుటకు కారణము వీరి భాషాంతరీకరణపద్ధతియందలి విపులీకరణ విధానమే యని చెప్పవలసియున్నది. మాతృకలో నున్న కథాంశములను మాత్రము తీసికొని, వాని ననేకవిధముల రసపుష్టిచేసి, పాత్రోచిత స్థలోచితవర్ణనముల నకుంఠితముగఁ జేర్చి పెంచి సుమనోమనోజ్ఞముగ రచించిరి. సామాన్యముగఁ బ్రతికథయందు నిట్టిప్రత్యేకరసపోషణ సంధానము కానఁబడుచున్నను, ముఖ్యముగా దుర్జయోపాఖ్యానమునఁ గడుంగడు రమణీయముగ నీప్రక్రమము మెఱయుచున్నది. దుర్జయోపాఖ్యానము సంస్కృతగ్రంథమున సుమారు నాలుగైదు పుటలుమాత్రముగ నుండును. వీరు దానిని ప్రత్యేకప్రబంధమని చెప్ప నొప్పుదానినిఁ జేసి, యనేకవిధములఁ బోషించి విస్తరించి, తమకవితాప్రాగల్భ్యమును సర్వవిధముల వెల్లడించిరి.

ఆంధ్రప్రబంధములఁ జరిత్రమును వ్రాయువిమర్శకుల కీదుర్జయోపాఖ్యాన మొకదృష్టాంతముగా నుపకరించును. ఒకచిన్నకథను దీసికొని వర్ణనసంభృతితోఁ బ్రత్యేకగ్రంథముగా రచించుపద్ధతి పెద్దనాదులతోఁ బ్రారంభించుట లేదనియు, తత్పూర్వమే యాంధ్రవాఙ్మయమున సువ్యక్తముగా నున్నదనియు స్పష్టమగుచున్నది. దుర్జయనృపాలుని జననము, పదోద్యౌవనము, దిగ్విజయము, వనవిహారము, సుకేశీమిశ్రకేశీసమావేశము, దుర్జయవిరహము, నర్మసఖదౌత్యము, సుకేశీమిశ్రకేశీవిరహము, దుర్జయవివాహము, పుత్రజననము అనునీవిషయక్రమమున నీయుపాఖ్యానము వ్రాయఁబడినది. ఇదియే కదా సామాన్యముగఁ బ్రత్యాంధ్రప్రబంధమందలి కథానిర్మాణక్రమము. ఈనిర్మాణక్రమము పెద్దనాదులకు పూర్వమే వాఙ్మయమునం దున్నదని యీకథ

యం దీజంటకవులు చూపిన కల్పనాచాతుర్యమున విశదముగ నున్నది. ఈకథానిర్మాణమంతయు మాతృకయందుఁ గానఁబడదు. నర్మసఖదౌత్యము, విరహాదివర్ణనలు మున్నగునవి యీకవులు స్వయముగాఁ గల్పించిన విషయములే. కావున నాంధ్రప్రబంధనిష్పత్తి పెద్దనాదులకు పూర్వమే మనవాఙ్మయమం దున్నదని దృఢముగాఁ జెప్పవచ్చును.

వర్ణనాదికపోషణముచేసి కథాప్రణాళిక నెట్లుగా విస్తరించి రచించిరో యావిషయమును రెండుదృష్టాంతములఁ జూపి యీభాగమును విరమించెదను.

గ్రంథవిస్తరభీతిచే వెనుదీయవలసివచ్చినది కాని (౧) ధర్మవ్యాధోపాఖ్యానమును, (౨) గౌతమ్యుపాఖ్యానమును సంపూర్ణముగా మాతృకయందును, ఏతదాంధ్రీకరణమందును పరిశీలించినయెడల నీకవుల స్వభావసిద్ధమగు వర్ణనప్రాగల్భ్యమును, రసపోషణవిధానమును ప్రత్యక్షముగఁ గోచరమగును. సవిమర్శదృష్టితో స్వయముగాఁ బరిశీలింపఁ గుతూహలము గలపాఠకమహాశయులెల్ల రీభాగములను రెండుగ్రంథములఁ జదువఁ బ్రార్థితులు. (సశేషము)

భారతవీరుఁడు

జి. జాషువకవి

"ఈ కవచంబుఁ గుండలము లీయకు మల్లదె దొంగబాపఁడై
నాకవిభుండు వచ్చెడిని నా యనుఁగుంగొడుకా" యటంచు మ
ర్త్యాకృతి నుండి పల్కెడు సహస్కరునిం గని నవ్వి యివ్వి యే
పోకడఁ బెట్టు నీ సుగుణము న్నుతియింపఁ దరంబె భానుజా!

నరుఁడు బృహన్నలాఖ్య నలనాఁడు విరాటునిఁ గొల్చుచుండి, యు
త్తరునకు సాయమై, కురుశతంబును మూర్ఛిలఁ గొట్టినాఁడు, భా
స్కరసుతుఁ డోడె నందు రని కన్నుల నీ రిడకయ్య, శక్తులై
గురుఁడు, నదీసుతుం డెదురుకొన్నది లేదుగదోయి, భానుజా!

గంగాపుత్రుఁడు రాజనాసతి శతాంగశ్రేణి యర్పించు నాఁ
డంగీకారము గాక నీ కొక రథం బర్పించెనే కాని, యో
యంగాధీశ్వర, యుగ్రవత్కదనపంచాస్యుండ వౌ నీకు నీ
యంగత్రాణములున్ రథంబులును సాహాయ్యంబు లేమాత్రముల్.

సంగరసీమ నీకుఁ దొలిసాయకమైన భుజంగభర్త, పా
ర్థుం గుఱిచూచుచో నది విరుద్ధగతిం జని టెక్కెముం గిరీ
టాంగదము ల్దహించి, యినజా, ననుఁ గ్రమ్మర నేయుమన్న, ఛీ
యెంగిలిబాణ మేయ ననవే! రణవీరుఁడ వీవ యర్కజా!

నిక్కపుఁ బేడబుజ్జివలె నీ తొడ నింద్రుఁడు బొక్కసేయు నాఁ
డక్కట నెత్తురు ల్వరద లై ప్రవహించుచునున్న ధైర్యముఁ

దక్కెక నిద్రఁ జెందు జమదగ్నికుమారుఁ గదల్పలేదు హా!
యెక్కడి చిత్తదార్ఢ్య; మిది యెక్కడి దీగురుభక్తి భానుజా!

కురురా జొక్కఁడుగాక నీ దగు మహా త్కోదండపాండిత్యము
స్వరదాన ప్రతిభానిసర్గగుణ మెవ్వారేని గుర్తించిరే
యరవిందాప్తకుమార, చింతపడకయ్యా! నేఁటి కింకన్ దిగం
తర దేశంబులఁ బాఱుచున్నవి భవ ద్దానాంబుధారానదుల్.

నీ నేర్పు న్సహజప్రతాపవదనోన్మేషంబు నీక్షించి, యీ
ర్ష్యానైశిత్యముఁ దోఁపనీక, కులగోత్రప్రశ్నలన్ దెచ్చి ల
జ్జానిర్జీవునిఁగా నొనర్చెడు కృపాశ్వత్థామలే లేక, క
ర్ణా, నీ నేరికి తీసిపోయెదవు, మార్తాండాత్తతేజస్వివై?

అంబుజనాభు సంతటి మహాత్ముఁడు పార్థుని తేరిమీఁద గు
ఱ్ఱంబులు దోలుచుండ సమరం బొనరింపఁ దెగించునే లలా
టాంబకుఁడైన? నీ తెగువ యుబ్బరముం గలిగించు! వీరలో
కంబున నీకుఁ జాలిన మగండు జనింపఁడు సూర్యనందనా?

"నా యరదంబు క్రుంగిన దనంత, కిరీటి, తుణంబు తాళుఁ డో
యీ! యిది యుద్ధ ధర్మ" మని యీవు వచించుచునున్న నిన్ను న
న్యాయముగా వధించిన ధనంజయుఁడా విజయుండు నీవు కా
వా, అకటా! యి దెక్కడి నిరర్థకధర్మము సూర్యనందనా!

"భారతయుద్ధరంగమున పాండుతనూభవమధ్యముండొ, కా
దో, రవిజుండొ! తీరవలె తథ్యము నా కటు గాక కంటికిం
గూరుకు రాదు, రా" దనుచు ఘోరముగా శపథంబు చేసి నీ
కూరిమితేనికై తనువుఁ గోల్పడి తెంతటి సాహసుండవో!

"కుడిభుజమైన కర్ణుఁ డనిఁ గూలె, సమస్తముఁ దీఱె" నంచు డీ
ల్పడి, ధృతరాష్ట్రనందనుఁడు పాండుకుమారుల కోహటించి యు
మ్మడువునఁ జొచ్చె, శూరజనమండన, నీవు గతింపకున్న, భీ
ముఁడు తొడఁ గొట్టి నీ నృపునిముందర నిల్చి గదం ధరించునే.

ఫల్గునుఁడు దక్కఁ దక్కిన పాండుసుతులు-భండనంబున నీచేతఁ బడిసయపుడు
తల్లి కిచ్చినవరము చిత్తమున మెఱసి-యడిద మెత్తని సత్యసంధుఁడవు కర్ణ!

రా మా య ణ ము*

[రవీంద్రుని మాతృకనుండి]

బెజవాడ గోపాలరెడ్డి గారు, బి. లిట్.

(విశ్వభారతి)

సరాసరిని కావ్యములను రెండుభాగములుగ భాగింపవచ్చును. కొన్ని కావ్యములు కేవలము వానిని రచించు కవుల యభిప్రాయములతో ప్రపూర్ణములై యుండును; కొన్ని అటులుగాక యేదో యొక బృహత్ సంప్రదాయమునకు చెందినవై యుండును.

ఒకకవి అభిప్రాయములు ఒక కావ్యమునం దుండుననిన ఆయభిప్రాయములు మరెవ్వరికిని ఉండవని అర్థము కాదు. ఒకవేళ అట్లుండిన అవి పిచ్చి అభిప్రాయములు. తలంపులకన్న వేరుగా నుండజాలవు. నిజసుఖదుఃఖములు, నిజకల్పన: నిజజీవనాభిజ్ఞానముగుండా విశ్వమానవుల చిరంతనహృదయావేగము, జీవనమర్మకథ, తనంతట తానే వెలువడుచుండునట్టి సామర్థ్యము కవియందు కలదని అర్థము చేసికొనవలయును.

వీరు వీరిదముగ ఒకశ్రేణికి చెందిన కవు లయిరో, అవిధమునే రెండవశ్రేణికి చెందిన కవులు గలరు. వారి రచనల ద్వారా ఒకసమగ్రదేశము, ఒక సమగ్రయుగము, తమ హృదయమును, తమ అభిజ్ఞానమును వ్యక్తపరచి వాటిని మానవుల చిరంతన సామగ్రిగా చేయుచుండును.

ఈద్వితీయ శ్రేణికవినే మహాకవియని చెప్పవొప్పును. సమగ్రదేశముయొక్క, సమగ్రజాతియొక్క విజ్ఞానము వీరిని ఆశ్రయించును. వీరు రచించునది యేదో వ్యక్తి విశేషముయొక్క రచనగా తోచదు. అది బృహద్వనస్పతివలె దేశముయొక్క భూతల జఠరమునుండి ఉద్భూతమయి, ఆదేశమునకే ఆశ్రయచ్ఛాయాదానము చేయుచున్నదా యనునట్లుండును. కాళిదాసు శకుంతల, కుమారసంభవము విశేషముగ కాళిదాసు నిపుణహస్త పరిచయమును పొందుచున్నవి. కాని రామాయణమహాభారతములు జాహ్నవీ, హిమాచలములమాదిరినే భారతవర్ష మునకే చెందినట్లుగా తోచును. వ్యాసవాల్మీకులు ఉపలక్ష్యమున్మాత్రమే.

అసలు వ్యాసవాల్మీకులు ఎవరి పేరులు కావు. అవి భావమున నామకరణములుమాత్రమే. సమస్త భారతవర్షమునకు సంబంధించిన యీ గ్రంథములు రెండును, తమ్ము రచించిన కవులనామములు పోగొట్టుకొని యున్నవి. కవులును తమ కావ్యముల యంతరాళముననే మునిగిపోయియున్నారు.

మన దేశమున రామాయణమహాభారతములవలె ప్రాచీనగ్రీసుదేశమునందు 'ఇలియడ్' ఉండినది. అది సమస్త గ్రీసుదేశముయొక్క హృత్పద్మసంభవముగను; హృత్పద్మవాసిగను ఉండెనది. కవిహోమరు తన దేశకాలములయొక్క కంఠమునకు భాషను దానముచేసియుండెను. ఆసాహిత్యము తనదేశ నిగూఢాంతఃస్థలము నుండి బయల్వెడలుచు, చిరకాలముగ తన దేశమును దీప్తిమంతముగ నుంచగలుగుచున్నది.

ఏయాధునిక కావ్యమునకుగూడ నింత వ్యాపకత్వ మున్నటులు కనబడదు. మిల్టన్ పారడైజ్ లాస్టునందు భాషాగాంభీర్యము, ఛందోమాహాత్మ్యము, రసగభీరత యెంత విశేషముగ నున్నను, అది దేశధనము కాదు. అది లైబ్రరీయొక్క ఆదరమగు వస్తువు.

అయినను, కొన్ని ప్రాచీనకావ్యములను ఒకరాశిగా చేర్చి వాటి కన్నిటికిని ఒకేనామ మివ్వవలయునని మహాకావ్యమని తప్ప మరేనామ మివ్వగలము? ఇవి ప్రాచీనకాలపు దేవదైత్యులవలె మహాకాయులుగా నుండినవి. వీటిజాతి యిప్పుడు లుప్తమైపోయినది.

ప్రాచీనార్యసభ్యతయొక్క ఒకధార యూరోపునందును, ఒకధార భారతవర్షమునందును ప్రవహించినవి. యూరోపుధార రెండుకావ్యములయందును, భారత

---

* శ్రీయుత దీనేశచంద్రసేన్ గారి 'రామాయణీకథా' అను గ్రంథమునకు భూమికా స్వరూపముగ ౧౯౦౩ సం. డిసెంబరులో రచింపబడినది.

వర్షపుధార రెండుకావ్యములయందును తన సాహిత్యమును సంగీతమును రక్షించి నిలిపియున్నది.

మనము విదేశీయులము. గ్రీసు తనసమస్త ప్రకృతిని తన రెండుకావ్యములలో ప్రకాశింపగలిగెనా లేదా యని మనము దృఢముగ చెప్పజాలము. కాని, భారతవర్షముమాత్రము రామాయణ మహాభారతములలో నింకేమియు శేషము లేకుండగ ప్రకాశింపగలిగె ననుట నిశ్చయము.

అందువల్లనే, శతాబ్దములతర్వాత శతాబ్దములు దొర్లిపోవుచున్నను, రామాయణమహాభారతములస్రోతము భారతవర్షమున లేశమాత్రమైనను శుష్కించిపోవుట లేదు. అనుదినము గ్రామగ్రామమున, గృహగృహమున అవిపఠింపబడు చున్నవి. కల్లుదుకాణమునుండి రాజప్రాసాదమువరకు వాటికి సమానమైన ఆదరము గలదు. ఆకవియుగళము ధన్యము. కాలమహాప్రాంతరమధ్యమున వారి నామములు పోగొట్టుకొనబడినను, వారివాణి బహుకోటినరనారీ ద్వారద్వారమునకు అజస్రధారగా శక్తిని శాంతిని గైకొనిపోవుచున్నది. శతశతప్రాచీనశతాబ్దముల ఒండుమట్టిని తెచ్చి, భారతవర్షముయొక్క చిత్తభూమిని నేడును సత్తువచేయుచున్నది.

అట్టిదరి, రామాయణమహాభారతములను కేవలము మహాకావ్యము లనిన చాలదు. అవి యితిహాసములు గూడను, ఘటనావళియొక్క యితిహాసము కాదు. ఎందుకన, అట్టియితిహాసము సమయావిశేషమునై ఆధారపడియుండును.—రామాయణ మహాభారతములు భారతవర్షముయొక్క చిరకాలపు ఇతిహాసములు. అన్యేతిహాసములు కాలకాలమునకు ఎంతపరివర్తనలైనను, ఈ యితిహాసము పరివర్తనయే కాలేదు, భారతవర్షపుసాధన, ఆరాధన, సంకల్పములయితిహాసము ఈ రెండువిపుల కావ్యహర్మ్యములమధ్య చిరకాలపు సింహాసనమున విరాజమానమగుచున్నది.

ఈహేతువుననే, రామాయణ మహాభారతముల సమాలోచన, యితరకావ్యసమాలోచన ఒకటి కాదు. రామునిచరిత్ర ఉచ్చమో, నీచమో, లక్ష్మణునిచరిత్ర మనకు రుచించునా, లేదా యనెడివిచారణ చాలదు. మౌనము దాల్చి, నిఖిలభారతవర్షము అనేకసహస్రవత్సరములనుండి, వీటిని ఏభావముతో గ్రహించియుండెనదో యని శ్రద్ధాసహితముగ విచారణ చేయవలసియున్నది.

రామాయణమున భారతవర్ష మేల పలుకుచున్నదో, రామాయణమున భారతవర్ష మేయాదర్శమును గొప్పదని ఒప్పుకొనినదో, అదియే ప్రస్తుతము మనము శ్రద్ధగ విచారించవలసిన విషయము.

వీరరసప్రధానమగు కావ్యమునే 'ఎపిక్' అనెదరని సామాన్యప్రజలతలంపు. ఏకాలమున, ఏదేశమున వీరరసముయొక్క గౌరవము ప్రాధాన్యమును పొందినదో, ఆదేశమున, ఆకాలమున స్వాభావికముగ ఎపిక్ వీరరసప్రధానమగుట తటస్థించును. ఇదియే అందులకు కారణము. రామాయణమునందు యుద్ధవ్యాపారము కావలసినంత యున్నది. రాముని బాహుబలము గూడ విరివిగ వర్ణింపబడియున్నది. కాని రామాయణమునందు ప్రధానరసము వీరరసము కాదు. అందువల్ల బాహుబలగౌరవము ప్రాప్యముగుట లేదు. యుద్ధఘటనమే వారిముఖ్యవర్ణనవిషయము కాదు.

దేవుని అవతారలీలనే గైకొని రచింపబడినకావ్యమును కాదు ఇది. కవి వాల్మీకియొద్ద రాముడు అవతారపురుషుడుగా నుండలేదు, సామాన్యమనుష్యుడుగనే యుండెను. కవి రామాయణమున నరచరిత్రనుగాక దేవచరిత్రనే వర్ణించియుండిన, రామాయణముయొక్క గౌరవము తగ్గియుండెడిది; దానికి కావ్యాంశమున లోటు ఆపాదిల్లెడిది: మనుష్యుడనియే రామచరిత్రము మహిమాన్వితమైనది.

ఆదికాండప్రథమసర్గయందు వాల్మీకి తనకావ్యోపయుక్తనాయకుని ఉద్దేశించి బహుగుణముల నుల్లేఖించి నారదు నిట్లడిగెను:—

"సమగ్రా రూపిణీ లక్ష్మీః క మేకం సంశ్రితా నరమ్,"

(ఏదో ఒకనరుని ఆశ్రయించి సమస్తశోభలు రూపగ్రహణము గైకొనినవా?)

అప్పుడు నారదు డిట్లనియెను:—

"దేశేష్వపి నపశ్యామి కశ్చి దేభి ర్గుణైర్యుతమ్;
ప్రాయశాంఙు ఋష్టైరేభి ర్యోయుక్తో నరచంద్రమాః"

(ఇట్టి గుణయుక్తపురుషుని దేవతలలో గూడ చూడలేదు. కాని యీనరచంద్రునియందు ఈసకలగుణములు కలవో వానివిషయము వినుము.)

రామాయణము ఆనరశ్రేష్ఠునివిషయము; దేవతా విషయము కాదు. రామాయణమునందు దేవత తన్నుతాను తక్కువపరచుకొని మనుష్యుడగుట లేదు. మానవుడే నిజగుణములద్వారా దేవతయై విరాజిల్లుచున్నాడు.

మానవుని చరమాదర్శమును స్థాపించుటకొరకే భారతవర్ష పుకవి యీ మహాకావ్యమును రచించెను. ఆ దినమునుండి నేటివరకు మానవుల యీ యాదర్శచరితవర్ణనను మనదేశపు పాఠకమండలి పరమశ్రద్ధా విశ్వాసములతోడ పఠించుచు వచ్చుచున్నారు.

రామాయణ ప్రధానవిశేషత్వ మేమన, అది యీ ద్రమును గృహవిషయమునుగూడ మిగుల పెద్దదానినిగా చేసి చూపుచున్నది. పితాపుత్రుల, భ్రాతా భ్రాతల, భార్యాభర్తల ధర్మబంధనములను, ప్రీతిభక్తి సంబంధములను ఎంతయు మహత్తరములైనవానినిగా చేయుటచే, అవి సహజముగనే మహాకావ్యములకు ఉపయుక్తములగు విషయము లగుచున్నవి. దేశజయము, శత్రువినాశము, రెండు ప్రబలవిరోధిపక్షముల ప్రచండాఘాత సంఘాతములు మున్నగు సమస్తవ్యాపారములే సహజముగా మహాకావ్యమునందు ఆందోళనోద్దీపన కారకములుగ నుండును. కాని రామాయణముయొక్క ఔన్నత్యము రామాయణములోని యుద్ధముపై ఆశ్రితమై యుండలేదు. ఆ యుద్ధఘటన సీతారాముల దాంపత్యప్రేమను ఉజ్జ్వలముగ నొనర్చి చూపుటకు ఉపలక్ష్యము మాత్రమే. తండ్రియెడల కుమారునిభక్తి, సోదరునికై సోదరుని ఆత్మత్యాగము, పతిపత్నులమధ్య పరస్పరప్రీతినిష్ఠ, ప్రజలపతి ప్రభునికర్తవ్యము ఎటులుండవలయునో దానినే రామాయణము చూపుచున్నది. ఈరీతిగ వ్యక్తివిశేష ప్రధానత, గృహసంపర్కములు మరి యేదేశముయొక్క మహాకావ్యమునందును ఈతీరుగ వర్ణనీయ విషయమైనదని చెప్ప వలనుపడదు.

రామాయణము కవి పరిచయమాత్రమే యగుటలేదు. సమస్త భారతవర్షముయొక్క పరిచయమును ప్రాప్తమగుచున్నది. దీనివలన గృహమనిన, గృహధర్మములనిన, భారతవర్షమునకు ఎంత గౌరవార్హములుగ విషయములో తెలియుచున్నది. మనదేశమున గార్హస్థ్య ఆశ్రమమునకు ఎట్టి అత్యంత ఉచ్చస్థాన మొసంగబడినదో, దానిని ఈకావ్యము సప్రమాణముగ నిరూపించుచున్నది. గృహస్థాశ్రమము మన నిజసుఖములకు భోగములకు ఏర్పాటు చేయబడి యుండలేదు: అది సమస్తసమాజమునుగూర్చి ఆలోచించెడిది; మనుష్యుని యథార్థభావముగ మనుష్యుని చేసెడిది. గృహస్థాశ్రమము భారతవర్షపు ఆర్యసమాజమునకు ప్రాకారమువంటిది. రామాయణము అట్టి గృహస్థాశ్రమముయొక్క కావ్యము. ఈ గృహస్థాశ్రమధర్మమునే రామాయణము ఒక విషమ అవస్థయందు గొంటి దానినే వనవాసదుఃఖములతో విశేషగౌరవాన్వితముగ నొనరించినది. కైకేయీ మంథరల కుచక్రకల్పిత వాఘాతములచే అయోధ్య రాజగృహమును చిందరవందర చేసినట్టి స్థితియందును, గృహధర్మపు దుశ్ఛేద్యదృఢత్వమును రామాయణము చాటుచున్నది బాహుబలవిషయము కాదు; జయించవలెననెడి ఆశయు కాదు; రాష్ట్రగౌరవము కాదు. శాంతరసాస్పదమగు గృహధర్మమును రామాయణము కరుణాశ్రుజలమున అభిషిక్తముచేసి ఆ మహావీరునిపై స్థాపనచేసెను.

శ్రద్ధాహీనులగు పాఠకులు ఈసుట్టమున చరిత్రవర్ణన అతిశయోక్తిగ పరిణమించినదని అనగలరు యథార్థస్థితిని కల్పనల పరిహద్దులను ఉల్లంఘించిన కావ్యకళ అతిశయోక్తిగ మారును. ఒకటి రెండు మాటలలో దాని మీమాంస కానేరదు. రామాయణ చరిత్రవర్ణన స్వాభావికముకాదని చెప్పువిదేశీయ విమర్శకులకు ప్రకృతిభేదముచే నేది ఒకనికి అస్వాభావికముగ తోచునో, అదే మరొకనికి స్వాభావికముగ కన్పట్టునని చెప్పవలసియున్నది. భారతవర్షము రామాయణమున అస్వాభావికమును గాని, అతిశయోక్తిని గాని కాంచుటలేదు.



“విషయునివిషము”

ఎప్పుట ఏ ఆదర్శము ప్రచలితమో దానిని అసలే వదలివేసిన, అప్పటిప్రజలకది గ్రాహ్యమే కానేరదు. మనశ్రుతి యంత్రమున మనము ఎన్నిశబ్దతరంగముల యాఘాతముల గైకొనగలమో దానికి కొంత పరిమితి గలదు. ఆ సంఖ్యను మించిన మనచెవులు ఆశబ్దతరంగములను గ్రహింపజాలవు. కావ్యమునందు చరిత్రభావ, ఉద్భావన సంబంధములయందును అదేరీతిగ ఉండునని చెప్పవచ్చును.

ఇదే యథార్థమైన రామాయణకథ, భారతవర్షముకడ ఏయంశమునందును అస్వాభావికము కాలేదను మాట సహస్రవత్సరములనుండి రుజువై వచ్చుచున్నది. ఈరామాయణకథనుండి భారతవర్షపుబాలురు, వృద్ధులు, వనితలు, పామరులు, పండితులు శిక్షణమాత్రమే పొందుట కాదు; ఆనందమును పొందిరి. కేవలము దానిని శిరోధార్యముగ చేసికొనుటయేకాక, హృదయాంతరాళములయందును ఉంచుకొనిరి. అది వారికి ధర్మశాస్త్రముమాత్రమే కాదు; వారిమహాకావ్యమై యొప్పుచున్నది.

ఈమహాగ్రంథపు కవిత్వము భారతవర్షమునకు కేవలము సుదూరకల్పనాలోకసంసృష్టమైయుండిన, మనసంసారసీమకు దూరస్థముగు విషయమే యైయుండిన, రాముడు ఒకేకాలమున మనకు దేవుడుగను, మనుష్యుడుగను, రామాయణము పయి మనకు ఒకేకాలమున భక్తిప్రేమలు కల్గుటయు, నెప్పుడుగాని సంభవమయ్యెడిది కాదు.

ఇట్టిగ్రంథమును అన్యదేశవిమర్శకులు వారి కావ్యవిచారాదర్శానుసారముగ అస్వాభావికమని యనిన, వారిదేశముతో పరిపోల్చుటలో భారతవర్షపు ఒకవిశేషత్వము ఇంకను అధికముగ పరిస్ఫుటమగుచున్నది. రామాయణమున భారతవర్షము దేనిని అభిలషించినదో దానినే పొందగల్గినది.

రామాయణమహాభారతములను నేను ఈదృష్టితోనే పరికించుచున్నాను. దీని సరళానుష్టుప్‌ఛందమున భారతవర్షపు సహస్రవత్సరముల హృత్పిండము స్పందితమగుచున్నది.

సుహృద్వరుడు శ్రీయుత దీనేశ్చంద్రసేన్ గారు తాను రచించిన ఈరామాయణచరిత్రసమాలోచనమునకు ఉపోద్ఘాతమును వ్రాసి యిమ్మని నన్ను అనురోధించినపుడు, నాకు అస్వస్థతగ నుండినను, సమయము లేకుండినను, అతనిమాట త్రోసివేయజాలకపోతిని. కవిమాటలను భక్తునిభావమందు కూర్చి అతడు తనభక్తి చరితార్థ మగునటులు సాధనయొనర్చెను. ఇటులు భక్తిపూజావేగమిశ్రితమైన వ్యాఖ్యయే స్వాభావికసమాలోచనయని నాతలంపు. ఈయుపాయమువలననే ఒకహృదయము యొక్క భక్తి మరియొక హృదయములోనికి పోగలుగుచున్నది. ప్రస్తుతకాలమున మనసమాలోచనలు బజారులోని 'దలారుల'మాదిరి నగుచున్నవి. సాహిత్యమే యిప్పుడు బజారువస్తువగుట యిందులకు కారణము. తర్వాత మోసపోకుండుటకై, సమర్థులైన దలారుల సహాయము పొందుటకు అందరును ఆతురత జూపుచున్నారు. ఇటులాశ్రయించుట వ్యాపారవిషయములలో ఉపయోగకమే కాని యథార్థసమాలోచన పూజయని చెప్పుచున్నాను. సమాలోచకుడను పూజారి పురోహితునితో సమానము. అతడు తనయొక్కయు, సర్వసాధారణులయొక్కయు భక్తితో మిశ్రితమైన విస్మయమును వ్యక్తపరచుటమాత్రమే.

భక్తుడు దీనేశ్చంద్రుడు ఆపూజామందిరప్రాంగణమున నిలుచబడి ఆరతియిచ్చుటకు ఆరంభించెను. హఠాత్తుగా ఘంటమ్రోగించుభారము నాపై నుంచెను. ఒకపార్శ్వమున నిలుచబడి నేనును ఆకార్యమునందు ప్రవృత్తుడనైతిని. అధికాడంబరములతో ఆతని పూజను మరుగుపరచుట నాకు ఇష్టము లేదు. వాల్మీకి రామచరితకథను పాఠకులు కేవలము కవియొక్క కావ్యమని చూడక, దానిని భారతవర్షపు రామాయణముగ తెలిసికొనవలయునని మాత్రము తెలుప ఉద్దేశించుచున్నాను. అలాగైన రామాయణముద్వారా భారతవర్షమును, భారతవర్షముద్వారా రామాయణమును సరియగురీతిగ అర్థము చేసికొనగలరు. ఇది యేదో ఐతిహాసిక గౌరవవాహిని కాదనియు, పరిపూర్ణముగు మానవుని ఆదర్శచరిత్రమును భారతవర్షము వినగోరననియు నేటివఱకును అశ్రాన్తా

నంత పరిహాసముగ వినుచున్నదియుగూడ పాఠకులు స్మరణాయం దుంచుకొనవలయును. ఇందు గోరంతలు కొండంతలు చేయబడెననికాని, యిది కావ్యకథయే యనికాని మనకేళ చెప్పుదు నవలేదు. సీతారామలక్ష్మణులు దైవంతనిజము, భారతీయులకు తమతమ కుటుంబములలోని వారును కారు.

పరిపూర్ణతను తెలిసికొనవలయునని భారతవర్షమునకు ఒకే ప్రాణాకాంక్ష గలదు. ఇది సత్యాతీతమైనదని అపాదనము చూపుట లేదు; అవిశ్వాసపడుటయు లేదు. దానినిగూడ యథార్థసత్యమని విశ్వసించినది. దీని మూలముననే ఆనందమును పొందుచున్నది. అపరిపూర్ణతాకాంక్షను వేల్ప్యాలిపి, తృప్తియనునటులు చేసి, రామాయణపు కవి భారతవర్షపు భక్తహృదయములను చిరకాలము ఋణగ్రస్తములుగ చేసికొనెను.

ఏజాతి ఖండసత్యమునకు ప్రాధాన్యమొసంగుచున్నదో, ఎవ్వారు యథార్థసత్యానుసరణమున అలసటను చెందరో, కావ్యమును ప్రకృతిదర్పణము మాత్రమే యని యనుచున్నారో, వారిచే లోకములో అనేక కార్యములు చేయబడినవి. వారు అధికముగ ధన్యులైరి. మానవజాతి వారికడ ఋణగ్రస్తమే. మరియొకవైపున ఎవరు "భూమైవసుఖం, భూమా త్వేవ విజిజ్ఞాసితవ్యః" (పూర్ణతయే సుఖము, అదే తెలిసికొనదగినది.) అని చెప్పిరో, ఎవరు పరిపూర్ణపరిణామము మధ్య సమస్తభాగములకు సౌందర్యము, సకలవిరోధములకు శాంతినొసగ గూర్చుటకు సాధనపల్పిరో, వారి ఋణముగూడ ఎన్నటికిని తీర్పబడదు. వారిపరిచయము విలుప్తమై, వారి ఉపదేశములు మరువబడిన, మానవనాగరిక ధూళిధూమ సమాకీర్ణ కారాగారములోని జనులకుంపులమధ్య, నిశ్వాసములచే కలుషితమై, కుదిలేనికష్టములలో తగుల్కొని, కృశించి, కుదప మరణించియుండెడిది. రామాయణము ఆయఖండామృత పిపాసార్తుల చిరపరిచయము తెలికొని తెచ్చుచున్నది. దీనిలో ఏభ్రాతృప్రేమ, ఏసత్యనిష్ఠ, ఏపాతివ్రత్యము, ఏప్రభుభక్తి వర్ణింపబడినదో, దానిపై సరళశ్రద్ధను, హృదయభక్తిని నిలుపగలిగినచో మనకారాగారపు వాతాయనములగుండ మహాసముద్రపు నిర్మల వాయువు ప్రవేశించుటకు మార్గమును పొందగలరు.

గోవిలాపము

మంగిపూడి వేంకటశర్మ గారు

స్మరియింపరో 'అహింసాపరమో ధర్మ' యనెడు నార్యోక్తి పుణ్యాత్ములార,
భావింపరో 'ఆత్మవత్సర్వభూతాని' యన్న ధర్మోక్తి ధన్యాత్ములార,
తరచరో 'పాపాయ పరపీడన' మటన్న సత్యార్థమును దయాశాలులార,
అనరో 'పరోపకారార్థం శరీర' మన్ దివ్యసూక్తిని బుధధ్యేయులార,
జీవుల నకారణముగ హింసింతు రేల-తోడిజీవుల మీవలె జూడ రేల
జంతుసంతతి బట్టి బాధింతు రేల-దేహముల బెంప మమ్ము వధింతు రేల?

నోరెరుంగని మమ్ము నొవ్వజేయుట మీకు ధర్మ మేమో మదిన్ దలపరయ్య,
సాధుజీవుల మమ్ము చలపట్టి హింసింప న్యాయమేమో చింత చేయరయ్య,

మీకు మేల్చేయు మమ్మే కోసి భక్షించు టిది కృతజ్ఞతయే మొ యెంచరయ్యా,
శాకభక్షణ మాని జంతుభక్షకు లౌట క్షేమమేమో పరీక్షించరయ్యా,
ఈశ్వరకుటుంబ మగుగదా యెల్ల జగము-మీకు మే మన్నదమ్ములమే కదయ్యా,
సర్వ ధర్మము లెరిగి మాంసమును మరగ-మన జగత్ప్రిత మెచ్చునే మనుజులార!

చీమ కుట్టిన నెంత చిమచిమలాడునో చిత్తంబులందు యోచింపరయ్యా,
అరకాలిలో ముల్లు విరిగినచో గల్గు వేదనన్ మదిని భావింపరయ్యా,
కంటిలో నలుసుచే గలిగెడు బాధను తలపునం దొక్కింత తలపరయ్యా,
చెప్పులోపల రాయి చేరి యొత్తినమాత్ర బాడముకష్టము నాత్మ దడవరయ్యా,
నల్లి కరచిన మన సెంత తల్లడిలునో-దోమ కాటున కెద యెట్లు త్రొట్రుపడునో
నెరసు సోకిన మే నెంత చురుకుమనునో-మనసునం దెంచి హింసను మానరయ్యా!

గడ్డి గాదము మేసి కడుపు నింతుము గాని మీనోటి కడ్డమై మెలగబోము
సాధుమార్గములందు సంచరింతుము గాని పరకంటకంబుగా బ్రతుకబోము
పాలు చేపుచు మీకు మేలు చేతుము గాని యపకార మెపుడు చేయంగబోము
మామగసంతతిన్ మీ మేలు గోరి శ్రమించు మంచును సమర్పించినాము
తామె మా తల్లిదండ్రులు దైవ మనుచు-నమ్మియున్నాము మాయమర్మమ్ము లేక
యిట్టి మము బట్టి పగబట్టి హింసచేయ-మనసు లెటు లొప్పె నయ్యయో మనుజులార!

మా పాలు పెరుగులు మజ్జిగల్ లేకున్న గడియైనగాని వేగంగ లేరు
మా వెన్న మీగడల్ మా నెయ్యి చవిచూడ కున్నచో నొక్కనా డుండలేరు
వ్యవసాయమునకు మావారి సాయము లేక యొక క్షణికంబైన నోపలేరు
పయనంబులందు మావారు తోడ్పడకున్న నడు గావలి వల కిడగలేరు
అదియిది యనంగ నేల మాయవసరంబు-లేనిసమయంబు గలదె గాలించి చూచి
మమ్ము లాలించి పాలించి మాకు మీకు - మైత్రి పొసగంగ జూడరే మనుజులార!

ధేను సమృద్ధియే దివ్యంబులైన సంసారసౌఖ్యముల కాధార మనుచు
ఆముష్మి కానంద మందింప సులభ సాధనము గోబృంద సేవన మటంచు
గో దేవత లటంచు గో మాత లనుచును సొమ్ములు జీవ ధనమ్ములనుచు
తమ నందనులతోడ సమముగా మ మ్మాదరించి ప్రేమించి పోషించినారు

రోగమును రొచ్చు రాకుండ రోజురోజు - నేమరక సర్వవిధముల నోమినారు
ఉభయ తారక సరణిచే నొప్పినారు - తొల్లి మీపెద్ద లట్లు వ_ర్తిల్లరయ్య!

మాపాలు పెరుగులు మజ్జిగల్ త్రాగిన తనివి తీరగలేదె తండ్రులార,
మావెన్న మీగడల్ మాజున్నులను దిన్న నాశ తీరగలేదె యన్నలార,
మాపాల పాసిముల్ మానెయ్యి జుర్రిన మనసు తీరగలేదె మాన్యులార,
మామలమూత్రముల్ మమత మీరగ గొన్న తుష్టి తీరగలేదె శిష్టులార,
కాచి పెంచిన మమకార కరుణ లెల్ల - గంగపాల్చేసి మా యుపకారములను
మరచి మా మాంసమును మెక్కమరగినారు-ధర్మమగునయ్య మీకు మా తాతలార!

ఫలజాతు లెన్నెన్నొ వెలయించి యున్నాడు దేవుండు మీయాకలి దీర్చుకొరకు
కాయజాతుల నెన్నొ కల్పించి యున్నాడు దేవుండు మీతృప్తి దీర్చుకొరకు
పుష్పజాతుల నెన్నొ పుట్టించియున్నాడు దేవుండు మీతన్వి దీర్చుకొరకు
ఆకుజాతుల నెన్నొ చేకూర్చి యున్నాడు దేవుండు మీయాశ దీర్చుకొరకు
తరువులును ధాన్యములు సదా తరుగకుండ - నీశ్వరుడు మీతనువు బెంప నిచ్చినాడు
చిత్రభక్ష్యాలు మీరు సృష్టింపగలరు - మాంసమును మానరాదె యో మనుజులార!

మాయరణ్యము లక్రమవిచారులై చొచ్చి మించునుద్ధతి నాక్రమించినారు
మాయమర్మము లేని మమ్ము మచ్చికచేసి బంధనంబుల పాలు పరచినారు
తమ దయా ధర్మభిక్షము మీద నాధార పడియుండు గతికి లో బరచినారు
మాలేగ లుస్సురు మని యేడ్చుచుండంగ మాపాలు గొని త్రాగ మరగినారు
ఉన్న గో భూములన్నియు దున్నినారు - ముసలితనమున గడ్డికై మొగమువాచి
కాటిమొగమైన మము బట్టి కటికివారి - కప్పగింతురె కటకటా యార్యులార!

బ్రతికియున్నప్పుడు పాలు మున్నగునట్టి యాహారముల నిచ్చు టంతెకాక
చచ్చియు జాల బాసట చేయుచున్నాము కొమ్ములు గొరిజలు నెమ్ములిచ్చి
గోరోజనం బిచ్చి కొవ్వును నిచ్చియు చర్మంబు నిచ్చి మాంసంబు నిచ్చి
చచ్చియు బ్రతికియు సాయంబు చేసెడు సాదుల మము బట్టి చంప దగునె
దయయు ధర్మంబు మేలును దలప వలదె - హింసచేసిన మిమ్మింక నీశ్వరుండు
మెచ్చునే మీకు శ్రేయస్సు నిచ్చునయ్య - కినిసి శపియింపడయ్య యో మనుజులార!

కుచేల

సీ. కామేశ్వరరావు గారు

(వెనుకటి సంచిక తరువాయి)

తృతీయాంకము

దృశ్యము ౧

రాజసభ

[ప్రవేశము: కృష్ణుఁడు సింహాసనాసీనుఁడై; సమీపమున నుచితాసనాసీనులై నారదుఁడు, సాత్యకి, సామంత రాజవర్గము]

నారదుఁడు

మహాప్రభూ, అపూర్వవస్తుప్రదర్శనముఁ గావింతునని సెలవిచ్చియుంటిరి. నేఁటిదనుక నా యద్భుతమును జూడఁజాలనైతిని.

కృష్ణుఁడు

నారదా, తొందర యేల? నామాటకుఁ దిరుగు లేదు. తప్పక చూపెదను. నానాదేశాధీశులు వచ్చియున్నవారు. రాజకార్యము ముగిసిన తరువాత నీయభీష్టము నెఱవేర్చెదను.

నారదుఁడు

శ్రీనివాసా, విస్మృత మయ్యెనేమో యని భ్రమపడితిని!

కృష్ణుఁడు

ఋషితిలకా, నేను మఱవలేదు; అది యెన్నఁటికిని విస్మృతగాథలలోఁ గలియ నేరదుసుమా!

[కుచేలుఁడు ప్రవేశించును.]

కుచేలుఁడు

ఆహా! భువనాలంకారమగు నీభవనము సుదర్శనసభ ననుకరించుచున్నది. శ్రీకృష్ణదేవుఁడు కార్యాలోచనాధీనుఁడై యున్నవాఁడు. ఈ శృంగారమూర్తిని విలోకించిన మాత్రమున నయనేంద్రియములు ధన్యత్వ మొందె. వనమాలికావాసనల ఘ్రాణేంద్రియము కడుం గడు తృప్తిఁ గాంచె. ఒక్కింత యాఁగి యాతని మధురవాక్యంబు లాలించి శ్రోత్రేంద్రియములను బవిత్రముఁ గావించుకొనియెద.

కృష్ణుఁడు

మగధరాజా, మీరాజ్యము సుభిక్షమే కదా?

కుచేలుఁడు

(స్వ) సముద్రమున వడగండ్లుపడిన కైవడి, శ్రీనివాసునియందు నామనంబు లీనమైపోవుచున్నయది.

మగధరాజు

మహారాజా, మీయనుకంపాతిశయమున సమయోచితముగా నెలకు మూఁడువానలు కురియుచున్నయవి; వసుంధర సస్యశ్యామలయై, సమృద్ధిశాలినియై యొప్పారుచున్నయది; బ్రాహ్మణులు వేదాధ్యయనతత్పరులై, ధర్మనిష్ఠాగరిష్ఠులై, పూజ్యులైయున్నవారలు; ప్రజలు దుర్భిక్షపీడ లెఱుంగక సుఖమున నున్నవారలు. రాజ్యమున నెట్టియులజడియును లేదు.

కుచేలుఁడు

(స్వ) నా కింకేమి కావలయును? పరమనిష్ఠాగరిష్ఠులు, మును లెవ్వానిదర్శన మపేక్షించి

వడయనేరరో, ఆ మహామహునిఁ గన్నులారఁ గాంచితిని; కన్నులున్న ఫలముఁ గాంచితిని. ఇంక నాకుటీరమున కరిగెదను.

కృష్ణుఁడు

కాంచీపతీ, (అర్ధోక్తిలో) ఆహా! నేఁ డెట్టి సుదినము! అన్నా, కుచేలా! ప్రాణసఖా, కుచేలా! రమ్ము, రమ్ము! నేఁ డెట్టి స్వర్ణముహూర్తమునఁ దెల్లవాఱినది!

(ఆననము డిగ్గి) కుచేలా! ఎన్నిదినములకు నాకన్నులపండువుగా మరల దర్శన మిచ్చితివి! (కౌఁగిలించుకొని) అన్నా, దారితప్పి వచ్చితివా, యేమి?

కుచేలుఁడు

(హర్షోత్కంపమున) (స్వ) ఆహా! ఎంతదయ! ఆదర మెంత! ఇట్టివాఁడు కాకున్న లోకబాంధవుఁడని, దయాసాగరుఁడని త్రిజగములఁ బేరు కలుగునా?

(ప్రకాశముగా) కృష్ణా! కాదు; కాదు. మహారాజా, చాలదినములనుండి నిన్ను—కాదు, కాదు, శ్రీవారిని—

కృష్ణుఁడు

ఏ మనుచుంటివి? మహారాజా, శ్రీవారిని, అనియా? కుచేలా, న న్నింత త్వరలో మఱచిపోయితి వెట్లు? చిన్ననాఁటి ముచ్చటలు నీ కెంతలో విస్మృతమాయెను! సాందీపఋష్యాశ్రమమున మనము చదువుకొనిన పుణ్యదినములు మఱచిపోవుదమన్నను మఱపునకు రావు. ఆదినములందు నీవు నన్ను మహారాజా యని యెన్నఁడైనఁ బిలిచితివా? ఆ పిలుపులోఁ దీపి లేదు; సుఖము లేదు; ప్రాణము లేదు. అన్నా, నన్నుఁ బెఱవానిఁ జూచిన యటులు చూడవలదు. నీరాకఁ జేసి నా దేహము పులకరించెను; నాగేహము పవిత్రమయ్యెను. (చేయి పట్టుకొని సింహాసనమునఁ గూర్చుండఁ బెట్టును.)

కుచేలుఁడు

వలదు, వలదు. ఈ సింహాసనమును నావంటి దరిద్రబ్రాహ్మణుఁడు స్పృశింపరాదు. క్రిందనే కూర్చుండెదను.

కృష్ణుఁడు

కుచేలా, నీమాటలు నాహృదయమును వేధించుచున్నవి. నేను నీసఖుఁడను; నీతమ్ముఁడను. ఈ యాసనము నీది కాదా? నీకు దీనిపై సంపూర్ణాధికారము లేదా?

(కుచేలునిశరీరమును స్పృశించి) ఓహో! దూరాగమనప్రయాసమునఁ గాఁబోలు దేహమంతయుఁ జెమటలు గ్రమ్మినది. ఈ పూలవీవనతో విసరుదునా? (విసరును.)

కుచేలుఁడు

వలదు, వలదు. ఆవీవన నా కొసంగుఁడు. నేనే విసరుకొనెదను.

కృష్ణుఁడు

అన్నా, ఎట్టి విపరీతపుమాటలు వినుచుంటిని! సాందీప గురుదేవుని పూజాసమయమునకు వలయు పూవులు, పండ్లు, సమిధలు మున్నగు పదార్థములు సంగ్రహింప మన మెన్నిసారులు

సాంద్రారణ్యభూములఁ గ్రమ్మఱలేదు. అప్పు
డప్పుడు నీ వాయాసఖిన్నుఁడవై చెట్లనీడ విశ్ర
మించునపుడు చిగురాకువీవనలతో నే విసర
లేదా? అప్పు డేమైన నా కడ్డుచెప్పితివా? అప్పటి
యాహృదయ మిది కాదా? ఆనాఁటి నెచ్చెలి
కాఁడను గానా నేను? కుచేలా, ఇంట నంద
ఱును సుఖమున్నవారలా?

(రాజులు తమలోఁ దాము గుసగుసలాడుదురు.)

కుచేలుఁడు

(స్వ) వామా! నన్నెట్టిభయంకరరూపమునఁ
గూలఁద్రోసితివి! ఏవ్వాఁడు త్రిజగత్పూజ
నీయుఁడో, యాతఁడా నన్నుఁ బూజించుట!
నాపాపము దుస్సహము! దుర్భరము!

కృష్ణుఁడు

సఖా, నీవు నన్ను మఱచినటులు సాధ్వీమతల్లి,
పరమపూజనీయచరిత, మద్భక్తురాలు, మా
వామాక్షి, నన్ను మఱవలేదు కదా?

కుచేలుఁడు

లేదు, ఆమె మిమ్ము మఱవలేను. లోక
కళ్యాణమూర్తి నెవ్వరు మఱవఁగలరు?
(స్వ) నే నిప్పు డెందున్నవాఁడను! రాజసభా
మధ్యముననా? సాందీపఋష్యాశ్రమముననా?

కృష్ణుఁడు

సాత్యకీ, సత్వరము లోనికరిగి పట్టమహిషి
రుక్మిణీదేవికి వర్తమాన మంపుము; సువర్ణకలశ
మున జలముఁ గొని యామె నిందురమ్మనుము.

[సాత్యకి నిష్క్రమించును]

నారదుఁడు

ప్రభూ, నే నిప్పు డెందున్నవాఁడను?

కృష్ణుఁడు

దేవఋషీ, నీవు రాజసభలో నున్నవాఁడవు.

[బంగారుగిండియలో జలముఁ గొని రుక్మిణి ప్రవేశము]

కృష్ణుఁడు

దేవీ, నీ వీతనిని బోల్చితివా? మున్ను జూచి
నఁగదా పోల్చఁగలవు. ఈతఁడే నాచిన్న
నాఁటి నెచ్చెలి; నాసహాధ్యాయి; నాగౌరవ
కేతనము! చూచితివా, యీతనిచరణములు
ధూళిధూసరితములై యున్నవి. ఇప్పటికే
చాలనాలస్యమైనది. ఈతనిపాదములు కడిగి
నీగౌరవవర్ధనముఁ గావించుకొనుము.

[రాజులు తమలోఁ దాము గుసగుసలు.]

కుచేలుఁడు

(కాళ్లు ముడుచుకొని) (స్వ) ఓహో! ఎట్టిపాప
మార్జింప వచ్చితిని! శ్రీకృష్ణభగవానుని పట్ట
మహిషి లోకమాత, ఇందిరాదేవి, నాకాళ్లు
కడుగుటయా? విన లేను; చూడ లేను; సహిం
పలేను!

రుక్మిణి

మిత్రుఁడా, కాళ్లు ముడుచుకొనెద వేమి? నీ
కాళ్లు కడిగి, యా పవిత్రజలమును శిరమునఁ
జల్లుకొని చరితార్థురాల నయ్యెదను.

కుచేలుఁడు

(స్వ) ధనలోభమున నాపిశాచి నన్నిటకుఁ
బంపినది! తెలిసినది, లోభమునఁ బాపము;

పాపమున మృత్యువు—వామా, నీకన్నీళ్ల కోడి, నేను మహాపాపపారావారమునఁ బడి మునిఁగిపోవుచుంటిని.

కృష్ణుఁడు

సఖా, సిగ్గుపడెద వేల? ఉత్కృష్టకార్యతత్పరులను వంచింపఁ దగునా?

నారదుఁడు

జగత్పితా, నానివేదన మొండు గలదు. అవధరింపుము.

కృష్ణుఁడు

ఆనివేదన మెట్టిది?

నారదుఁడు

రుక్మిణీదేవి లోకమాత; నేను మీపుత్రుఁడను. బ్రాహ్మణునిపాదములు కడుగుటకు నా కానతిండు.

రుక్మిణి

ఈకార్యభారము నిర్వహించు పుణ్యము నా యది. నారదా, చూడలేదా, బ్రాహ్మణుని పవిత్రపాదచిహ్నమున భూషితమై ప్రాణేశ్వరుని వెడఁదయుర మెట్లొప్పారుచున్నదో!

(పాదములు కడిగి, నీరు శిరమునఁ జల్లుకొని, చేలాంచలమునఁ దుడుచును.)

కుచేలుఁడు

పాపినీ, నీవలనఁ గదా నా కీకష్టము!

కృష్ణుఁడు

మిత్రమా, ఏమంటివి? ఎవరివలన? ఎట్టి కష్టము నీకుఁ గలిగెను?

కుచేలుఁడు

ఎవరా? నీభక్తురాలు వామ!

కృష్ణుఁడు

ఆహా! ఆమెను జూచి యెన్నిదినములైనది! ఆమెచేతియన్నము దిని యెన్నాళ్లయినది! మహానందభరితయై యాసాధ్వి నా కెన్నిసారు లెన్నిపదార్థములు దినుట కొసంగుచుండెడిది! ఆమెచేతి యడుకు లెన్నిమాఱులు దినినను, తినవలయుననియే యుండును.

కుచేలుఁడు

(స్వ) ఏమి చేయుదును! జీర్ణచేలమున ముడిచి దాఁచిన యీయడుకులమూట బైటవేయుఁడు కదా? ఇందుఁ గూడిన పృథ్వీపతులు నన్నుఁ జూచి నవ్వకుందురే?

కృష్ణుఁడు

సఖా, నిజము చెప్పుము. నీవు వచ్చినప్పుడు వామాక్షికిఁ జెప్పివచ్చితివా? ఆమెచేతి యడుకులకు నే నాసపడుచుందునని యామె యెఱుంగదా? దూరమైనంతమాత్రమున నన్నామె మఱచిపోయినదా?

కుచేలుఁడు

(స్వ) హతభాగ్యుఁడను. నా కిం కేమి దారి?

కృష్ణుఁడు

కుచేలా, క్రొత్తవానివలెఁ జూచెద వేల? చంక క్రింద దాఁచితి వదేమి? ఆ సద్భక్తతిలక, వామాక్షి పంపిన యుపహారామృతమును దాఁచెద వేల? తెమ్ము! ఈనిండుసభలో,

సమస్తజనుల సమక్షమున, నాయలౌకికపదార్థ మును దిని ధన్యుఁడ నయ్యెదను.

(అడుకులమూట దీసికొనును.)

కుచేలుఁడు

దేవదుర్లభపదార్థ మర్పించియైన నెవ్వనిఁ దృప్తి పఱుపఁజాలమో, యాతని కిట్టి తుచ్ఛపదార్థ మెట్లర్పింపఁగలను? ఎట్టి యకార్య మొనరించి తిని? నాపాపమునకుఁ బ్రాయశ్చిత్తమున్నదా?

కృష్ణుఁడు

(మూట విప్పి పిడికెఁ డడుకులు దిని) ఆహా! అమృతముకంటెను శతకోటిగుణముల మధుర మై నా కవ్యక్తానందము గలిగించుచున్నది! ఇట్టిపదార్థమును వైకుంఠమున, గోలోకమున, దేవలోకమున, మర్త్యలోకమున, నే నెన్నఁ డును దినియుండలేదు. నారీశిరోమణి వా మాక్షి యెంతశ్రద్ధాధీనయై, యెట్టి భక్త్యావేశ మునఁ బంపెనో యీయడుకులు! ఆహా! ఎంతమధురము! ఎంతమధురము!!

(మఱల పిడికెఁడడుకులు దినుట కుద్యమించు ను. రుక్మిణి యాతని చేయిపట్టి వారించి)

రుక్మిణి

నాథా, ఇది యేమి? భక్తురాలి ప్రేమోపహార మారగించి సర్వమును మఱచితిరా? ఆప్రేమ మయికి వైకుంఠముకూడ ప్రదానముఁ గావిం చితిరి; త్రిభువనములు దానముచేసితిరి. ఈ యీవికి మేర లేదా? మఱియొకపిడికెఁ డడు కుల కింకేమి యొసంగ నెంచితిరి? చివరకు నన్నుఁ బరాయిదాన నొనరింతురా?

కృష్ణుఁడు

దేవి, నిజము; ఆయబలాస్నేహదత్త నైవేద్య మారగించి నేను సర్వమును మఱచిపోయితిని.

కుచేలుఁడు

కృష్ణా, విన్నది కన్నులారఁ గాంచితిని; నీవు నిజముగా దీనబంధుఁడవు; అనాథనాథుఁడవు! పేదవాని నెచ్చెలికాఁడవు! నికృష్టపదార్థమని యాయుపహారమును బహిరంగముగా నీకు సమర్పింప లజ్జించితిని. నీవు సమాదరపూర్వక ముగా దానిం గైకొని, యమృతముకంటె మధురతరమని యారగించి, నామానవృద్ధి గావించితివి. గోకులచూడామణీ, నీదయా మహిమకు ధన్యవాదము! నీకారుణ్యమునకు నమస్కారము! దుఃఖదరిద్రుఁడనని నేఁడు నేను గర్వించుచున్నాను.

నారదుఁడు

బ్రాహ్మణోత్తమా, సార్థకము నీజీవనము! శ్రీకృష్ణా, సార్థకము నీయనురాగము! త్రిలో కముల వీరలే పూజ్యులు!

రాజవర్గము

ధన్యోస్మి! ధన్యోస్మి!!

నారదుఁడు

బ్రాహ్మణప్రవరా, నీపూజ పూచి ఫలించినది.

రుక్మిణి

ప్రాణేశ్వరా, పథక్లేశమునఁ బూజ్యుఁ డగు నార్యబ్రాహ్మణుఁడు చాల కృశించిపోయెను.

ఆతని విశ్రామసదుపాయ మొనరింపవలయును. లోనికిఁ బోవుదము.

కృష్ణుఁడు

అవును, దేవీ!—కుచేలా, పదలోనికి—రాజశేఖరులారా, నేటికి మనము కొలువు చాలింతము. ఎన్నాళ్లకో మరల చిరమిత్రలాభము. నేటి నా యీ యానందమునకు మేర లేదు.

రాజులు

జయము! ద్వారకాధీశ్వరా, జయము! జయము!!

[నారదుఁడు తప్పఁ దక్కిన యందఱు నిష్క్రమింతురు.]

నారదుఁడు

శ్రీకృష్ణభగవానుని లీలాతత్త్వము దురవగాహము! ఎవ్వని నేముహూర్తమున నెట్లాడించునో, యెవరు గ్రహింపఁగలరు? ఆ లీలానాటకసూత్రధారునకే యెఱుక!

(యదుకులకాంభోజిరాగము - ఆదితాళము)

ఏహి ముదం దేహి శ్రీకృష్ణ! కృష్ణ!
పాహి గోపాలబాల కృష్ణ! కృష్ణ!
నందగోపనందన శ్రీ కృష్ణ! కృష్ణ!
యదునందన భక్తచందన కృష్ణ! కృష్ణ!

[నిష్క్రమించును.]

దృశ్యము ౨

అంతఃపురము

[ప్రవేశము రుక్మిణీ శ్రీకృష్ణులు]

కృష్ణుఁడు

దేవీ! కుచేలుని యాగమన కారణ మెఱుంగుదువా?

రుక్మిణి

ప్రాఁత నెచ్చెలిఁ గాఁడు గదా, చూచిపోవుదమని వచ్చియుండును.

కృష్ణుఁడు

కాదు, సఖి, ఆతఁడు నిజబుద్ధిబలమున రాలేదు.

రుక్మిణి

అట్లైన నెవరి ప్రబోధమున వచ్చియున్నాఁడు?

కృష్ణుఁడు

ఆతని యర్ధాంగి వామాక్షి ప్రోద్బలమున.

రుక్మిణి

ఆమె యాతని నిటకుఁ బంపుటకు హేతువేమి?

కృష్ణుఁడు

కుచేలుఁడు నితాంత దరిద్రుఁడు. కట్ట గుడ్డ లేక, తినఁబెట్టెడన్నము లేక, ఆతని పేదకుటుంబ మెడతెగని కష్టముల పాలై పోయినది. ఆ కారణమున ధనభిక్షకై వామాక్షి స్వీయనాథు నిటకుఁ బుత్తెంచినది. కుచేలునకు బొత్తిగా ధనకాంక్ష లేదు. ఆతఁడు నన్నేమియు నర్థింపఁడు. నిరంతరము నా ధ్యానమున నిమగ్నుఁడై యుండును!

రుక్మిణి

నాథా, ఈ పరిస్థితులలో మీ యుద్దేశ మేమి?

కృష్ణుఁడు

దేవీ, స్త్రీవినా పురుషుని సంపూర్ణత దురూహము. నీవు నా యభీష్టమును బూర్ణ మొనరింపవలయును.

రుక్మిణి

మీ యాదేశమును సమగ్రముగఁ బాలించుట కంటె నాకొండు పుణ్యవ్రతము గలదా? నాథా, నేను మీపాదదాసిని; నే నిప్పు డేమి చేయవలయును?

కృష్ణుఁడు

నీవు తలంచిన నాచెలికాఁడు దారిద్ర్యదుఃఖ విముక్తుఁ డగును. నీవు అన్నపూర్ణవు; జగ త్పాలయిత్రివి. కుచేలుని దరిద్రకుటీరమున నీవు పదార్పణముఁ గావింపవలయును. అచిర కాల మాతనియింట నీవు నివాస ముందువేని నే నెంతయో సంతసించెదను.

రుక్మిణి

వామాక్షి పతివ్రతాశిరోమణి. ఆపుణ్యాంగ నాసందర్శనము సామాన్యభాగ్యము కాదు. నాథా, అవశ్యము పోయివచ్చెదను.

కృష్ణుఁడు

దేవీ, అనుకూల దాంపత్యముకంటె సుఖ తరవస్తు వేది కలదు? నీ యనుకూలభావ మున నేను త్రిలోకపూజ్యుఁడ నైతిని. అదిగో, కుచేలుఁ డిం దరుదెంచుచున్నవాఁడు. ఆతని ముఖశ్రీ విలోకనము నా హృదయ మున కమృతవృష్టి యగుచుండును.

[కుచేలుని ప్రవేశము]

కుచేలుఁడు

(ప్రవేశించి—స్వ.) ద్వారకాధీశ్వరుని స్నేహము స్వచ్ఛందము; దయ యపారము; ఆదరము మనోజ్ఞము; నావంటి దీనహీనబ్రాహ్మణున కా యింతపూజ! ఈ యానందమయస్వర్గరాజ్య మునఁ బ్రవేశించి యింటిమాట మఱచితిని. శ్రీకృష్ణుని సహవాస మెంత శాంతిదాయకము! జగజ్జనని రుక్మిణీదేవి శుశ్రూషాపూర్వకముగా నాహృదయమును గొనివేసినది. ఆదిదంప తులు రుక్మిణీ శ్రీకృష్ణుల దర్శించితిని; సకల భాగ్యములు జేకూఱె.—వామాక్షి దుఃఖా శ్రుకలిత నేత్రములతో నాయాగమనము నిరీ క్షించుచుండును. నే నిం దరుదెంచి యెన్ని యో దినము లైనట్లు లున్నది. భగవానుని సెలవు గైకొని యింటికిఁ బోయెదను.

(ప్రకాశముగా) యదుకులమణీ! నే నిం దరు దెంచి చాలదినము లైనది. వామాక్షి బిడ్డల యాగడ మోర్వలేక యలజడిపడుచుండును. నేఁ బోయి వచ్చెదను.

కృష్ణుఁడు

కుచేలా, మఱి రెండుమూఁడుదినము లాలసిం చిన సంతోషించి యుందును. చాలదినములకు మఱల మనము కలిసికొంటిమి. నీవు మారాజ సౌధమునఁ బ్రవేశించినదాది నాయానందమున కు మేరలేదు; గాని గృహస్థులకే యెక్కడలేని యలజడి; నిన్ను నిరోధించుటవలన లాభము లేదని యెఱుంగుదును. సరియె, సఖా, పోయి రమ్ము. వామాక్షికిఁ జెప్పుము ఆమె పంపిన యమూల్యోపహారమునఁ గృతార్థీభూతుఁడ నైతినని.

కుచేలుఁడు

తప్పక చెప్పెదను. సఖా, పోయివచ్చెదను.

కృష్ణుఁడు

బయలుదేఱినతరువాత నే నాటంకము సేయఁ గలనా?

రుక్మిణి

ఆర్యా, వామాక్షికి నామాటగా నిట్లు వచింపుఁడు: "పురాణపురుషుఁడగు భగవానుని నిమిత్తము నైవేద్య మర్పించి, నన్ను మఱచి పోయితివి. నేను పరాయిదాననా? నన్ను నీవు మఱచినను, నేను ని న్నెల్లవేళల స్మరించుచునే యుందును."

కుచేలుఁడు

అమ్మా! అటులే చెప్పెదను.

(స్వ) శూన్యహస్తములతోఁ దిరిగిపోవుటయే మంచిది. నోరెత్తి యడుగలేను. మనసులో మాట తెలిసికొని, సర్వవ్యాపి భగవంతుఁడు తృణమో పణమో యొసంగిన మంచిది; లేకున్న వామాక్షి నెట్లో బుజ్జగించెదను. ఇంతకు సిరులతో నాకేమి పని యున్నది?

కృష్ణుఁడు

సఖా, ఆలోచించుచుంటి వేమి? మమ్ము విడుచుటకు మన స్సొప్పకున్నదా? అవును, ఇప్పటిదా యీబాంధవ్యము? కాని, వామాక్షి నీకై యెదురుచూచు చుండును! పోవకున్న సంసారయాత్ర జరుగు టెట్లు?

కుచేలుఁడు

కృష్ణా, పోయివచ్చెదను.

కృష్ణుఁడు

సరియె, సావధానముగాఁ బోయిరమ్ము.

కుచేలుఁడు

(స్వ) అడుగకయే యిచ్చువాఁ డడిగిన నిచ్చునా? నాయదృష్టమున నేమియున్నదో యదియే ఫలించును. దేహియని స్వర్గీయసంబంధమును గళంకిత మొనరింపఁజాలను.

(ప్రకాశముగా) సరియె, పోయివచ్చెదను

కృష్ణుఁడు

మిత్రమా! ఎన్నిమాఱులు చెప్పెదవు?

కుచేలుఁడు

(స్వ) వామా, నీయాశ నిరాశఁ గావించితిని. నీనైరాశ్యవదనముఁ దిలకించు దౌర్భాగ్యము నాలలాటమున విస్పష్టముగా లిఖింపఁబడి యున్నది.

(ప్రకాశముగా రుక్మిణి నుద్దేశించి)లోకమాతా, పోయివచ్చెదను.

రుక్మిణి

పోయిరండు; వామాక్షి యడుగుఁదమ్ముల స్మరించుచుందునని చెప్పుఁడు.

కుచేలుఁడు

(స్వ) దంపతు లిరువురు నేకగ్రీవముగాఁ బోయి రమ్మని సెలవిచ్చిరి.

(ప్రకాశముగా) ఇప్పటికే చాల యాలస్యమైనది. లోకనాథా, లోకమాతా, పోయి వచ్చెదను.

కృష్ణుఁడు

కుచేలా, పోయిరమ్ము.—కాని, నీవిం దగుదెంచినటులు నిదర్శనముఁ జూపకున్న వామాక్షి

విశ్వసించునా? ఈరత్నహారమును గైకొనుము

(రత్నహారము కుచేలుని మెడలో వేయును.)

కుచేలుఁడు

మహాభాగ్యము! పోయివచ్చెదను.

రుక్మిణి

ఆర్యా, ఈ రత్నహారము దుర్లభపదార్థము. దీనిని గేలఁ దాల్చి యేది యర్థింతు రది సిద్ధించును; గాని యట్టిసిద్ధి యొక్కమారె కలుగును. దీనిగుణ మిట్టిది.

కుచేలుఁడు

(స్వ) దరిద్రుఁడ నగుట శ్రీకృష్ణుని యనురాగమునకుఁ బాత్రుఁడ నైతిని. దారిద్ర్య మొక వరప్రసాదమని వామాక్షి కెఱింగించెదను.

(ప్రకాశముగా) సఖా, పోయివచ్చెదను; తల్లీ, పోయివచ్చెదను.

[నిష్క్రమించును.]

నారదుఁడు

(ప్రవేశించి) మహాప్రభూ, నీ లీలారహస్యము నే నెఱుంగఁజాలకున్నాను. సాంద్రారణ్య భూముల మహామునులు పర్ణాశనులై కొందఱు, వాయుసేవనమునఁ గొందఱు, పంచాగ్నిమధ్యమునఁ గొందఱు, సహస్రసహస్రవర్షములు కఠోరతపం బాచరించి నీయనురాగలేశము నడయనేర కున్నవారలు. ఈసామాన్యదరిద్ర బ్రాహ్మణుఁడు, సంసారతాపత్రయమున జర్జరీభూతమైన హృదయముతో, నీయాదరమునకు యోగ్యుఁ డయ్యె నెట్లు? నీగళము నలంకరించు నమూల్యరత్నహారము నాతనికిఁ బ్రదానముఁ గావించితివి; రుక్మిణీమాత యాతని కాళ్లు కడిగినది. ఇంతకంటె నాశ్చర్య మేమి కలదు?

కృష్ణుఁడు

నారదా, కుచేలునకును నాకును నెట్టిభేదమును లేదు. ఆతనికారణముననే యీమర్త్య భువనమున నాగౌరవము చిరస్థాయి యగును.

నారదుఁడు

దేవా, ఇంతప్రియపాత్రుఁ డగుట కాతని గుణాధిక్య మేమి?

కృష్ణుఁడు

దేవర్షీ, నీ వాతని ననుగమింపుము. ఆతనిమెడ నాకుఁగల స్నేహగౌరవముల ప్రమాణము నడయఁగలవు.

నారదుఁడు

సరియె, ప్రభూ, పోయివచ్చెదను.

(స్వ) పరీక్షించి చూచెదనుగాక!

సాధుసాధు కృత మిహా కృష్ణ కృష్ణ—లోక
సాధక హితాయ శ్రీ కృష్ణ కృష్ణ!

[నిష్క్రమించును.]

కృష్ణుఁడు

దేవీ, నీ వింక వామాక్షిపజ్జ కరుగుము. నేను కుచేలుని వెనువెంట నడచెదను.

[నిష్క్రమింతురు.]

చతుర్థాంకము

దృశ్యము ౧

కుచేలుని కుటీరము

[ప్రవేశము - వామాక్షి]

వామాక్షి

ఉ. ద్వారక యెంతదవ్వొ? కడు
దారుణమైన వనప్రదేశ మే
తీరున దాఁటెనో విభుఁడు?
తీరనిదుఃఖముఁ దెచ్చుకొంటి ని
ష్కారధనంబుఁ గోరి;— నను
జల్లనిచూపులఁ జూచువాని, ని
ష్కారణప్రేమమూర్తి నిఁకఁ
గాంచెడు భాగ్యము లేద దైవమా!

నే నెంతపని చేసితిని! ద్వారకాయాత్ర కేల నే నాతనిఁ బురికొల్పితిని? పాపపుణ్యము లెఱుంగని నే నేల తొందరపడి యింత కొడిగట్టుకొంటిని? ముప్పిగింజలతో సంతృప్తి నొందక సిరుల కేల పేరాసపడితిని? హా! కృష్ణా, నా విభుఁడు సురక్షితముగా గృహోన్ముఖుఁ డగునట్లు వరముఁ బ్రసాదింపుము. నాప్రాణ మున్నంతవఱకు మఱి నే నాతని నెచ్చటకును బంపను. నాతప్పు సైరింపుము. తండ్రీ, దయామయా, పిట్టలకడుపులో గుట్టు నెఱుంగువాఁడవు; అంతర్యామివి; నా హృదయమును బోల్చుకొనలేవా? ఆతనిపరోక్షమున నాకంతయు నంధకారమయముగాఁ జూపట్టుచున్నది.

[సన్న్యాసిని ప్రవేశించును]

గీ. భువనమోహనకరమైన ముద్దుమోముఁ
జూపి చూపవు, నాయెడఁ గోపమేమొ!
చల్లనికనుల సంజకెంజాయ విరియ,
ప్రణయబాంధవా, పాతాళప్రాప్తి నాకు.

గీ. కురిసెదవు గా లిడినచోట విరులవాన
భావనములఁ దొలఁకెదవు పీయూషధార
అమృతహాసము నిత్యకల్యాణమయము!
ప్రణయబాంధవా, నిన్నెడఁబాయఁగలనె?

వామాక్షి

ఆహా! ఈ నిశీథమునఁ గనికరపు గీతమును బాడుచున్న దీమె యెవరు చెపుమా?

సన్న్యాసిని

అమ్మా, తల దాఁచుకొనుటకు మీయింట నాకుఁ దా వొసంగుదువా?

వామాక్షి

నీ వెవరు? నీ దేయూరు?

సన్న్యాసిని

అమ్మా, మాది చాల దూరదేశము. చేరెడు నేలకై వాడవాడలఁ దిరిగితిని తల్లీ! ఈమేఘాంధకార నిశీథమున నామొ రాలింపు రెవరు? ఈయూరికిఁ గ్రొత్తదానను; న న్నెవరు విశ్వసింతురు?

వామాక్షి

అయ్యో! ఎట్టివిపరీతకాలము! ధనధాన్యములఁ దులఁదూఁగు నీయవంతీనగరమున నీ కాశ్రయము లభింపలేదా?

సన్న్యాసిని

అమ్మా, నీవు దయామయివి; పరులదుఃఖము గ్రహింపఁగలవు. నేను నిరాశ్రయురాలను.

వామాక్షి

బాలికా, నీవు చాల చక్కని దానవు. నీ కీ దేశాటనము విధించిన విధికాఠిన్య మేమందును! నీభర్త లేఁడా? ని న్నాతఁ డాదరింపఁడా?

సన్న్యాసిని

అమ్మా, ఆతనిమాట నే నేమని చెప్పుదును. ఆతఁడే యిల్లు వాకిలి కనిపెట్టుకొనియుండిన నా కీ యనంత భ్రమణయోగ మేటికి కలుగును?

వామాక్షి

బాలికా, నీమాటలు నాహృదయమును జీల్చి వేయుచున్నవి. అయ్యో! నీ కెంతకష్టము కల్గె నే తల్లీ!

సన్న్యాసిని

అమ్మా, నాభర్త కాలు నిలకడలేని దేశద్రిమ్మరి. ఆతనికి జాతిమతభేదములు లేవు. 'తన, పర' యను విభేదము లేదు. బ్రాహ్మణుల నారాధించును; గొల్లలఁ బూజించును; సుందరుల, వికలాంగుల నొకేమాపునఁ జూచును; పిలిచినను, బిలువకయున్నను, నేదియో పని యున్నటు లందఱి నాశ్రయించును. ఇట్టి రీతి, గతి లేనివానితో నేవంపు బ్రతుకు బ్రతుకలేక నే నిల్లు విడిచి వచ్చితిని. అమ్మా, మీయింట నింకెవ రున్నారు?

వామాక్షి

అదిగో, కటికినేల నిద్రించువా రిరువురు నా పుత్రులు. నాభర్త యింట లేరు. నేను హత భాగ్యను. ఆతనిరాక వార్చి నిద్రాహారములు లేక యలజడిపడుచున్నాను.

సన్న్యాసిని

వా రెం దేఁగిరి?

వామాక్షి

ద్వారకానగరమునకు.

సన్న్యాసిని

ఏల?

వామాక్షి

శ్రీకృష్ణభగవానుఁ డాతని చిన్ననాఁటి నెచ్చెలికాఁడు. నే నాఁడుదానను; బిడ్డలగోడు చూడలేక, ధనభిక్షకై నావిభుని ద్వారకాధీశ్వరుని సమక్షమునకుఁ బుత్తెంచితిని. ఎన్నియో యుగములనుండి నే నాతనిని విడనాడినటులు నా హృదయము బరువుగా నున్నది.

సన్న్యాసిని

అమ్మా, నే వినుచుందును శ్రీకృష్ణుఁడు దీనుల పాలిటి కల్పవృక్షమని; ఆతనిసమక్షమున కరిగినవారికి సకలశుభంబు లగును.

వామాక్షి

నిజమే; కాని, కూఁతురా! నాయంధహృదయ మేటికో భయభ్రాంతిపూర్ణమై పోయినది.

సన్న్యాసిని

అమ్మా, తెల్లవాఱినంతనే నాదారి నే నడచి పోయెదను. అంతదనుక నే నిందుఁ దల దాఁచు కొనుట కనుమతింతువా?

వామాక్షి

తల్లీ, నీవంటి దీనహీనప్రాణులకుఁ దావొసంగ లేకున్న నిల్లు కట్టిన ప్రయోజన మేమి? గృహ

స్థాశ్రమధర్మము లోపింపదా? బాళికా! వలసినన్నాళ్లు నీ పేదకుటీరమున నుండవచ్చును.

సన్న్యాసిని

అమ్మా, నీయౌదార్యమునకు నమస్కారము. నీహృదయము నిష్కళంకము; నీవంటి నారీమణులయునికి కారణముననే సూర్యచంద్రులు దారి తప్పక వర్తించుచున్నవారు.—తల్లీ, నేఁ డాలస్యముగా భోజన మొనరించితిని. పిడికెఁ డటుకు లున్నఁ దిని, గుక్కెఁడు నీళ్లు త్రాగి నిద్రింతును.

వామాక్షి

(స్వ) హా! కృష్ణా, నన్నెట్టి తీవ్రపరీక్షకు లోను గావించితివి! గంజి కాఁచి పోయుదమన్నఁ బిడికెఁడునూకలైన నింట లేవు. నామాట కేమి? పిల్లలుకూడ నేఁడు కూడు లేకయే పండుకొనిరి. పూర్వజన్మమున నే నెట్టి ఘోరపాప మొనరించితినో! యింటి కరుదెంచిన యతిథుల, నభ్యాగతుల సత్కరింపలేని నిష్ఠురజీవనము నిష్ప్రయోజనము. అట్టిబ్రతుకు బ్రతుకుటకంటె బలవన్మరణమే మేలు! ఇప్పుడు నే నీమె కేమని బదులుచెప్పుదును?

సన్న్యాసిని

అమ్మా, ఆలోచింనుచుంటివేమి? నాకుఁ దావానంగ నీ కిష్టములేకున్నఁ జెప్పుము. నే నింకొకచోటికిఁ బోయెదను.

వామాక్షి

తల్లీ, నీచేతులు పట్టుకొని ప్రార్థించెదను. నీయిష్టము వచ్చినన్నాళ్లు నీవు మాయింట నివసింపుము. నీవు తిరిగిపోయిన నాకు ఘోరనరక ప్రాప్తియగును.—నీ వించుక యాఁగుము, నే నిప్పుడే వచ్చెదను.

సన్న్యాసిని

ఈచిట్టచీఁకటిలో నీ వెం దరిగదవు?

వామాక్షి

అమ్మా, ఇంట నీళ్లు లేవు; బిందెఁడునీళ్లు తీసికొనివచ్చెదను.

(నిష్క్రమించును.)

సన్న్యాసిని

సతీమణీ, వామాక్షీ, నీవే ధన్యురాలవు! నీవంటియిల్లాలు ముల్లోకముల వెదకినను గానరాదు. ఇంట నేమియును లేదు; మానవతి వగుట, లేదని చెప్పలేక ప్రాణత్యాగ మొనరింపఁబోవుచున్నావు. నానాథుని యనురాగమునఁ బోషితవగు నీకుఁ గొఱంత యేమి కలదు? పేదదాన వైనను, కుబేరసంపద ననుభవించు శ్రీమంతులయందు లేని మహోదార స్వర్గీయగుణము నీయందుఁ గలదు. నీవు తిరిగి వచ్చునంతలో నీ యీ దుఃఖస్మృతి లేశమైన లేకుండఁ జేసెదను.

[లోని కరుగును.]

[సశేషము]

ప్రాక్టికల్ కవిత్వం

(చాకిరేవునుండి)

కొల్లూరు ధర్మారాయ కవిగారు, బి. ఏ.

(ప్రవేశం గిరీశం - పీఠంటవోస్తూ)

గిరీశం.— అవతల social reform లో practical side of the question solve చేసి,ఇట్టే field of letters లో కొచ్చేసరికి, మనకీ త్రివంద్రిక లెవడో కవిగాడు చెప్పినట్టు దిక్కుల్లో ఢీ కొంటున్నాయి ...... రమారమీ ఏడాదైంది మా బావకి romantic poetry లో instructions ఇచ్చి: ఇప్పటి కక్కడా తైలు పక్లేదు. Ruminate చేసి చేసి ఆఖరికి Grey లా గేవో సాలుగులైన్లు రాస్తాడు కాబోలు జన్మకల్లా.

(గుమ్మం ఎక్కి పీఠికలుపు కొడుతూ) Dearest!-

బుచ్చమ్మ— (లోపల్నించి) వొచ్చా, వొచ్చా.

గి.— Dearest! తలుపు తియ్.

బు.— (తలుపు తీస్తూ) అబ్బా! వస్తావుంటే ఒక టే పిలుపా? (అని గిఱ్ఱున వెళ్లును.)

గి.— My goodness! ఏవిటివాళ ప్రణయ మూర్తి కాళీమూర్తికింద తయారైంది?

బు.— (వంటింట్లోంచి కేకలేస్తూ) అభిమానాలుప్పితే అన్నీ మార్పుల్లాగే బొపడతాయి.

గి.— (స్వగతం) Socrates పెళ్లాం కోపంతో ఉరిమి ఉరిమి చెంబుడ్నీళ్లు వర్షం కురిపించిందట వాడి నెత్తిమీద. మా అంవుధాన్లు మావగారిమోస్తరు తత్వాందాంది. Mrs. గిరీశం tears వర్షం కాబోలారంభించింది. (దగ్గిరికెళ్లి) ఏవిటిప్పుడొచ్చిన కొత్తవిశేషం? క్రిష్ణాగ కాళ్ల మీద పడాలేమిటి?

బు.— (కోపంగా) చాల్లెండి. ఈ దిక్కుమాలి నకవిత్వాలేవో మొదలెట్టి, ఇల్లూ సంసారం, ఇదుండీ, ఇది లేదూ, అన్న ధ్యాసే తలపెట్టడం మానీసేరు. ఈమధ్యని మాతమ్ముడు కనిపించేట్ట, వాణ్ణి ఒమాటు తీసుకొచ్చి నా కళ్ల యెదుట పెడితే తప్పా, చెప్పండి? వాడేలా వున్నాడో అనిపిస్తాంది.

గి.— (స్వగతం) అబ్బా! Wordsworthian reflection! (పైకి) ఎందుకా వగవడం? అంవుధాన్లు మావగారి సంతానంలో unhealthy fellows, అంటే అనారోగ్యపు అభాజను లున్నారా? వెంకటేశానికేం, దుక్కలాగున్నాడు. బావ బస్తాలాగున్నా బుద్ధి మనపటిదేన్లే!

వెంకటేశం— (వీథిలోంచి) బావగారూ!

గి.— Coming. (బుచ్చమ్మతో) అడుగో మాటలోనే వొచ్చాడు; నూరేళ్లాయుష్షు. (వెళ్లి తలుపు తీసి) ఏమోయ్ బావా, welcome. మీ sister నీగురించిప్పుడే curtain lecture ఆరంభిస్తాంది.

బు.— (వంటింట్లో స్వగతం) ఔను, వే మాట్లాడితే చాలు, లెప్చరు. ఆయన మాటాడిందంతా పాఠం చెప్పడం.

వెం.— అక్కయ్య కులాసాగా ఉందా? ఎన్నాళ్లయింది దాన్ని చూసి!

బు.— (సన్నని కంఠంతో ఏడుపు ప్రారంభించును.)

వెం.— ఊరుకో అక్కయ్యా, మనకు ప్రాప్తం లేందీ నాన్న ఎలా బతికుంటాడు?

బు.— (మరో స్థాయి హెచ్చించింది.)

గి.— Keep quiet; foolishness! ముసలాళ్ల కోసం ఏడుపేమిటి? and for such an old hag? చాల్లే; వేగంలేచి కాఫీపెట్టు, బావ కాఫీ తాగేడో లేదో.

బా.—(కళ్లొత్తుకుంటూ) అక్కర్లేదు: వాడు దబ్బి తన్నుం తింటాడు. మీరు కావలిస్తే వకోమాటు తొంగండి, పెడతాను. తమ్ముడూ, కాళ్లు కడుక్కో రా.

వెం.—వొద్దే. ఇప్పుడిప్పుడే కాఫీ తాగేను, దాన్లో అరవక్కల్సుంది.

గి.—సరా. మీ తమ్ముడింకా చిన్నవాడని అనుకున్నావేమిటి? వాడిప్పుడు రమ్యాకరించేసినవాడైనా ఉట్టికే పోలేదు.

బా.—(కూరలబుట్ట తెచ్చి పెట్టుకొని) ఏరా, ఒరే తమ్ముడూ, మనపుల్లీ పెళ్లికి నాన్న శుభలేఖ రాయక పోతే నువ్వేనా రాయమన్నావా?

గి.—ఏది, మీ పుల్లి రెండో పెళ్లి కాదా?

బా.—చాల్లెద్దురూ, మీరూ మీమాటలూనూ! మొదట పెళ్లయిందాటి పదినాలు; అంతా మీరు చేసిందే.

గి.—చేసేంచేసిన, మనకేమి?

బా.—మీతో మీలాంటి పుస్తకాలే. అంతా వాకకటే కద.

గి.—Nonsense, మీ మాచ play చేసినదగా, నాకె తినివేస్తావేం? కొంత్తాన్ని అమూహార్తాన్ని పెళ్లించంటావా, లేదంటావా?

బా.—పెళ్లేక్కడైంది?

గి.—ఏకో వోపెళ్లి! (అని కోరచూపు చూసి నవ్వును.)

బా.—(జాన్సాయిగా నవ్వును.)

వెం.—(బోధపడక) మా నాన్న అప్పుడు నాకు చేసిన శుభలపెళ్లి మీకెలా తెలిసింది?

గి.—Poets eye అంటే సామాన్యం అనుకున్నావేమిటి? ఐతే బావా! నీ పెళ్లిమాటలేం అవుతున్నాయా?

వెం.—లేదండి, మా అమ్మ చెప్పుకోకుండా వుంది. మా నాన్న సంవత్సరీకాలు దాటాలంటుంది.

గి.—పోనీ, నీ అభిప్రాయం చెప్పు. Grown up girl కావాలా, కన్నెని పెళ్లాడతావా?

వెం.—కన్నె పెళ్లి సరదా మా నాన్న తీర్చేసేరు, పెయ్యి కన్నెతోటి.

గి.—(నవ్వుతూ) అదికాదోయ్... మీ sister పేకోపన్లలో పడ్డాది. At length మాటాడుదాం; కదిలోకి రా.

(కదిలో Easy chair లో గిరీశం, ఎదటి కుర్చీ మీద వెంకటేశం.)

గి.—Well! బావా, నువ్వింకా marriage చేసుకోకుండా వుండడం నాకు disgrace లాగుంది.

వెం.—లోగడ మీతో చెప్పలేదూ, నా కేదేనా ప్రణయమూర్తిని బతికి పెట్టించాలని! అప్పటి మీమీదే వేసేను.

గి.—Alright, I am glad for that. ఐతే నువ్వు కొంచెం romantic trend లోకి దిగితేగాని లాభం లేదు. ఇది by proxy నడిపించడానికి వీల్లేని సంగతి.

వెం.—నిజమేకాని, మీరు చెప్పిన romantic వాసన నాకు పట్టు బడ్డాదికాదు. ఏం సాధనం?

గి.—yes. దీనికి మీ అగ్రహారం విడిచిపెట్టి కొంత touring చెయ్యాలి. Regular study of ournajls వల్లనూ అది కుదురుతుంది.

వెం.—పత్రికలు చదువుతున్నానండీ; దేన్లో చూసినా మీరు లోగడ చదివిన గీతాల్లాటివే కనిపిస్తున్నాయిగాని, ఒకదానికీ సంపర్కం, అన్వయశుద్ధి లేవు.

గి.—Foolishness! నీ orthodoxy విడిస్తే గాని వాటిస్పిరిట్ catch చెయ్యలేవు. పోనీగాని, ఇప్పుడు Journals లో అవిరప్పు పండితులు రాసే దిక్కుమాలిన chronological research discussions ఎవడేనా చదువుతున్నాడూ? ఎవడో నాగమ్మ tenth century లో పుట్టిందని ఒకడూ; కాదు, ninth century మధ్యస్థానై వుంటుందని మరొకడూ. ఎందు కీతవులాటలు? అలాటివాళ్లకి రసవిచారణలో—అంటే soul of poetry గ్రహించడంలో head వెళ్లదు. Real poet అన్నవాడు, ఒకకొక్క-

అక్షరం రాస్తే, చెక్కో రాయిపడ్డట్టు reader గుండెల్లో stirring కలుగుతుంది.

వెం.—చదివేసరికి అర్థానికేం దారి అని గుండెల్లో రాయిపడా లంటారు?

గి.—Foolish jokes మానుమీ! ఈ subject మాత్రం serious గా think చెయ్యవలిసుంది.

వెం.—నిజంవే, నేను ఖర్మంజాలక మీమాటలు విని ఓగీతం అల్లితే, చాలా serious గా తిరిగింది. ఆకథ తాపీగా చెబుతాలెండి.

గి.—Alright, చెబుదూగాని. Hear me, ఇప్పుడీ భావకవిత్వాలవల్ల ఎన్ని వుపయోగాలున్నాయో మానేవా?

వెం.—నాకేం తోచలేదు.

గి.—మొదట, press వాళ్లు బతుకుతున్నారు. Articles కోసం హావురావురుమనే journals కి ఆకలి తీరుతూంది. ఇది material benifits. ఇహ literary విషయం ఆలోచిస్తే: ఇదివరకు, Telugu literature అంతా ఒకటీరువాళ్లకి వచ్చేదికాదు. ఇప్పుడో, కావ్యాలు అపరిమితంగా శైల్ దేరేయి.

వెం.—బాగుంది; కాని ఈ modern పుస్తకాలు తూనికనికూడా కైలుస్టేషన్లలో అమ్ముతున్నారు. ఒకాకవితాలూకు సంపుటం వెయ్యికాపీలైనా ఒక సేరు తూగకుండా వున్నాయి.

గి.—జౌనోయ్. Iron తూగినంత లావుగా gold తూగుతుందా? Quality చూడొద్దూ?

వెం.—ఆగొప్పతనంచే నాకుబోధపళ్లేదు.

మా చందాదారులకు

మా కార్యాలయమునకు వ్రాయు ఉత్తరములు మొదలయినవానియందు తమ చందాదారుసంఖ్య వ్రాయవలెను. లేకున్న ప్రత్యుత్తరములు మొదలయిన పనులను జరుపజాలము. చందాదారులసంఖ్య భారతి కవరుకాగితముపై తమ విలాసమునకు ముందున్నది.

—భారతి.

గి.—Yes. ఆగొప్పతనం నీకు logical గా prove చేస్తాను విను. భావకవిత్వం ఇప్పుడు బాగా చలామణీ అవుతూందికదా?

వెం.—ఔను.

గి.—పెద్దపెద్దవాళ్లంతా దానిమీద criticisms రాస్తున్నారా లేదా?

వెం.—రాస్తున్నారుకాబోలు.

గి.—కాబోలుకాదు. నిజంగానే రాస్తున్నారు. అంచేత, literary big-wigs తాలూకు attention, draw చేసిన poetry లో ఏదో unique excellence వుందని ఒప్పుకోవాలా?

వెం.—ఏమో! మీ logic కూడా భావకవిత్వంలాగే అయోమయంగా ఉంది.

గి.—Nonsense పోనీగాని నువ్వేదో గీతం రాస్తే కొంప మునిగిందన్నావే, అదేదో చదూ. దానిలో నీ shortcomings, explain చేస్తాను.

వెం.—(ముహమాటిస్తూ) చదూతానుగాని అర్థం నవ్వదక్కండి.

గి.—What a man you are? అసంగతి చెప్పాలిటోయ్ నాకూ?

వెం—సరే. (చదువును.)

“నాటిసాయాహ్న మందున పూటకూటి
ఇంటిలోపల ప్రేయసీ, కంటినిన్ను”

గి.—Beautiful! ఆ abrupt opening ఈరోజుల్లో రక్తికట్టిస్తుంది. కాని నా old story,

versify చేసేవేమిటి కొంపతీసి? లేక similar incidents నీకూ తటస్థపడ్డాయా?

వెం.—నా సంగతే ఇదంతా ఆటో—ఏదో—ఆటో దిల్ బహార్ గా వుండాలన్నారు poetry మీకేమ?

గి.—ఓయ్, నీతస్సాగొయ్యా! Auto-biographical కి వచ్చిన పాట్లేవిటవి?

వెం.—అదిగో మరిచిపోరేమ. ఏఁవిటది?... ఏదో...అలాగుండాలన్నారు కారూ మీరూ?

గి.—అచ్చా! నీకూ స్వీయచరిత్ర కొందకొందం form లోతూందన్నమాట? 'Great wits jump' అన్నాడు. నా story, repeat చేసేవే. Go on; interesting గానే ఉంది చదూ.

వేం.—(చదువును.)

"ప్రళయజంఝూప్రభంజనోచ్చలితమౌను
కీవహృదయపత్రంబు తోడ్తోన వచ్చి
భవ్యభవదీయమృదుపదద్వయిని వ్రాలె,
నాప్రణయజీవ సంజీవనప్రదాత్రి!"

గి.—Good. Keats లాంటి idea పాకీనేవ కృష్ణ; Sound echoing senseకూడా romantic type లో లాక్కొచ్చేవు. అయితే ఆ first line లో ప్రళయంవా ప్రణయంవా?

వెం.—అది మీ యిష్టం. యతికోసాన్ని చూస్తే ప్రళయఁవే, లేకుంటే ప్రెస్ వాళ్ల యిచ్ఛాధీనం.

గి.—బాగుంది. Continue.

వెం.—మరిహా continue ఏఁవిటి? ఆశుకవిత్వంకింద personal గా address చేసి చెప్పడం నించే కొంపమీది కొచ్చింది.

గి.—Devilish! ప్రణయమూర్తిని oral గా ముఖాముఖీ address చేసేవేఁవిటి?

వెం.—మరేం చెయ్యను? అచ్చుపడితే మరీప్రమాదఁవేఁవోనని దేనికీ పంపలేదు. ఇదిగో తర్వాత ముత్యాలసరం చెప్పేను వినండి:

నేను రాత్రి గం. 8-30 లకు.

"భుక్తశేషోచ్ఛిష్ట పాత్రా
లంకృతార్ద్రకరంబుతో, ద్వా
రమున, సఖి, నీమూర్తి మెరయగ
నిలువు నీర్లైతిన్."

గి.—Capital. True to nature. ఇంతచక్కని కవిత్వం నువ్వెప్పుడూ చెబుతా వనుకోలేదు.

వెం.—Nature ఏఁవిటి. Fact జరిగినట్టూ రాసేను.

గి.—yes. Continue.

వెం.—అంతేను. మరి సరేమం కాదు, అర్థంతెలిసిన నాగమ్మ.. వరసకి మాబావ...ఆకీడలో ఉన్నాడు. దాంతో మాయింటి కల్లీ దాకా నాకు ఒంటిమీద తెలివి లేదు.

గి.—(నవ్వుతూ) ఏం, ఆకర్ణాంతంగా measure చేసేడేఁవిటి వాడు?

వెం.—(కోపముతో) ఆ rascal ని చూడం డీమాటు......

గి.—శాంతించవోయి బావా; ఏదో హాస్యానికి తగిల్చేదు. కాబోయే బావకదా మరి!

వెం.—హాస్యఁవేఁవిటి? జిగ్గుమంది మొహఁవంతానూ.

గి.—Practical కావకవిత్వంలో strata-gems నీకు తెలిసేయికావు. నేనైతే అలాంటి situation లో ఊరుకుంటానా?

వెం.—ఏంచేస్తా రూరుకోక. దొంగలతల్లి కేడవ భయం.

గి.—అచ్చే, దాని methods వేరు. కవిత్వంలో అడ్డుతగిలినవాణ్ణి కథలో పట్టుకుని ఏకేస్తాను.

వెం.—ఎలాగేఁవిటి? దానివల్ల లాభ వేఁవిటి?

గి.—"నేను" కథ లెరగవోయ్. కథలో hero "నేను" heroine "ప్రణయమూర్తి". Happy ending

కి అడ్డుతగిలే character ఎవడో వాణ్ణి fool లాగు depict చేసి, in spite of that fellow "ప్రణయ మూర్తి" "నేను"ని చేపట్టింపని రాయాలి. దానివల్ల two birds at one shot అన్నట్టు ఒకవంక reprimand, ఒకవంక ప్రణయలేఖా, telegrams లాగ పడతాయి.

వెం.—మీరు వెయ్యి చెప్పండి, వాళుమరిహ భావ కవిత్వం ఒద్దు; ప్రణయమూర్తి దొరక్కపోతే మాని పోదును.

(ప్రక్కసావిట్లోంచి బుచ్చమ్మ) ఒరేతమ్ముడూ. ఆగొడనేదో కట్టిపెడుదురూ. ఎందాకి? పొయ్యిమీద ఎసరెక్కించినేను. ఓమాటు చెయ్యిచేసుకుంటేగాని ఎలాగ?

గి.—అన్నా! చచ్చాం. ఏంసాధనం బావా! I. C. S. తగిలింది.

వెం.—మీకేం ఫర్వాలేదు. నేను నడుం కడతాను.

గి.—పోనిద్దూ. ఈ troub e ఎవడు పడతాడు? హోటల్లో మనిద్దరం mess చేసేసి carrier తో మీ sister కి తెద్దాం రావోయి.

వెం.—నేనయి ఇహ హోటేలుగుమ్మం ఎక్కను.

గి.—ఓయస్, నీతస్సాగోయ్యా! ప్రణయందెబ్బ నీకు బాగా experience అయిపోయిందే.

వెం.—ప్రణయందెబ్బకాదు. ప్రణయకవిత్వంనే యిలా ఛడిపికొట్టింది.

(అని దూలికి పోవుదు.)

(తెర)

కుమారుఁడు

పండిత పురాణం సూర్యనారాయణ తీర్థులు గారు

[వెనకటి సంచిక తరువాయి]

ఈ రత్నగర్భయే చే
కూరునుగా కన్పృత మాడకుమ విను వినలే
చే రోగికిఁ బథ్యము సం
సారికిఁ దథ్యమ్ము సనువచనము కుమారా.

పథ్యము చేయనిరోగియుఁ
దథ్యము పలుకనినరుండుఁ దగ నతిథుల కా
తిథ్యము చేయనిగృహి సా
రథ్యవిరహి రథియుఁ జెడుదుర చుమ కు.

ఏగుణములు లేకున్నను
బాగుగ ధైర్యమును వృద్ధిపఱుచుకొనుమ యు
ద్యోగికి ధైర్యగుణమ్మే
వేగుణములపెట్టు సుమ్మ వినుము కుమారా.

శ్రేష్ఠులు చేసినయదియ క
నిష్ఠులు చేయుదురు గాన నీ వెల్లపుడున్
శ్రేష్ఠముల చేయుచుండి వ
రిష్ఠుఁడ వనిపించుకో ధరిత్రిఁ గుమారా!

లంచములు గొనుట యితరుల
వంచించి ధనమ్ము గొనుట వల దటు సంపా
దించినసంపద లామయ
సంచయమునఁ గలుగుబలుపు సమము కు.

కాంతాకనకమ్ములపైఁ
జింతన లేనట్టినరుఁడ శివుఁ డనుకొనుమా
కాంతాకనకము లనఁ బర
కాంతాకనకమ్ము లనియె కనుమ కుమారా.

క్షమవంటితపసు సంతో
షముతో సరి యయినచిత్తసౌఖ్య మ్మాశా
సమ మగురోగము దయతో
సమ మగుధర్మమ్ము లేదు జగతిఁ గుమారా.

ఒకవేళ నయినఁ బరులకుఁ
బ్రకటింపకు మింటిగుట్టు పాడగుఁ జూ! ఊ
రక యింటిగుట్టు చెడి లం
కకుఁ జేటు తటస్థ మయ్యెఁ గాదె కుమారా.

ప్రాచీనుల యాచారము
లాచరణకుఁ దెమ్ము విడువు మన్యమ్మును శి
ష్టాచారహీను వేదము
లే చక్కఁగ శుద్ధుఁ జేయలేవు కుమారా.

విను వంట మొదలుగాఁగల
పను లన్నియు నేర్చి యుండవలె నెప్పటి కే
పని చేసికొనవలెనో యె
వ్వని కెఱుక? అదపుడు పనికివచ్చుఁ గుమారా.

ధన మొసఁగినచో సిద్ధిం
పనికార్యము లేద యెట్టిమానిసి కయినన్
కనుకను మతిమంతుఁడవై
ధన మార్జించుటకె పూనఁ దగుదు కుమారా.

అశనముచే నింద్రియములు
వశపడుచందమున నెల్లపనులు ధనముచే
వశపడును గాన దానిన
విశేషముగఁ గూర్పఁ గొనుమ వేడ్కఁ గు.

నీకంటెఁ జిన్నవాఁడను
లోకువ యని యెంచి వంచి లోలత నెపుడున్
చీకాకుపఱుపఁ బోకుము
నీకే కష్ట మగు దాన నిజము కుమారా.

అవమానపూర్వకముగాఁ
దెవిపోయినప్రేమ మరలఁ దిన్నపఱుప నా
శివునకును జెల్లదఁట! అవుఁ
బవిలినము త్తెమ్ము నదుక వశమె కుమారా.

అడిగిన పదానము కాలము [మల్
గడపుట పయనమ్ము భూమిఁ గనుట కనుబొ
ముడివైచుటయును మెడమొగ
మిడుటయు నివి నాస్తి యనుటయేర కుమారా.

అకులీనుఁడు రా జయినను
అకోవిదునికొడుకు ప్రాజ్ఞుఁ డైనను నీఱుపే
దకు ధన మబ్బినను ప్రపం
చక మగపడు గడ్డిపరకసరణిఁ గుమారా.

వినయ మ్మన నెట్టిదో యెఱుఁ
గనివాఁ డగువిద్వదగ్రగణ్యునికంటెన్
వినయము గలమూర్ఖుఁడె మ
న్ననఁ గాంచుచు నుండు ననుచు నమ్ము కు.

రా జనంగ ముఖ్యసుమన
స్తేజస్సంభవుఁడు భువిని దేవుఁ డతఁడ త
ద్భూజాని నెపుడు భక్తిగఁ
బూజింపనివాఁడు దున్నపోతు కుమారా.

రాజులకంటెను హెచ్చుగ
రాజామాత్యాదులను నిరంతరమును దా
నేజనుఁడు కొల్వఁడో ఆ
వాజమ్మకు నెట్లు పేరు వచ్చుఁ గుమారా.

ధనికుఁడు శ్రోత్రియుఁడును నది [యూ
యును రాజును వైద్యుఁ డెంచ నుండరో ఆ
రను ప్రాజ్ఞుఁ డయినవాఁ డొక
దిన మయినను మనలఁ దగఁడు తెలియు కు.

గుణవంతునిసంగతి ని
ర్గుణుఁ డెఱుఁగఁడు;మత్సరించుగుణవంతుఁడు స
ద్గుణములు గలవానిని గని
గుణియు గుణగ్రాహి యగుట గొప్ప కు.

విను మెచటినుండియొ తమం
తన వచ్చును; ఉండియుండి తమయంతన పో
వును మరల నెచటికో; ఔ
ధనఘనములవిధము తెలియఁ దరమె కు.

ఇల నెవఁడు బ్రదికియుండఁగఁ
బలువురు బ్రదుకుదురో వాన్నిబ్రదుక బ్రదుకు ప
శువులు బ్రదుకుచుండవే మ
క్కులతోఁ దమపొట్ట నింపుకొనుచుఁ గు.

ఎది యోగ్యుల కిచ్చెద వె
య్యది తృప్తిగ ననుభవింతు వదిమాత్రమ నీ
యది యని తక్కినయది యొరు
లది యనియును చిత్తమునఁ దలంచు కు.

'యుగ రాజశాసనముల క
నుగుణముగా నడువ' మనుజనుల కిహసంప
త్తి గలుగ దందురు కావున
యుగము ననుసరించి నడుచు టొప్పుఁ గు.


దేశక్షేమార్థులు పలు
క్లేశమ్ములు వచ్చినను చలింపరు తమ యా
వేశము విడువరు స్వార్థము
లేశముఁ గన రూరకుండ లేరు కుమారా.

ప్రతిదినము కొలువఁజాలిన
చతురుల కలతాతిబామ్మనయితము కోర్కుల్
జతపఱుచుచుండ నీకె భూ
పతిసంగతి వేఱ చెప్పవలెనె కుమారా.

పాలిచ్చునవుడు చేసెడి
లాలన పాలనలు పశువులకుఁ జేయము గా
పా లొట్టిపోయినపు డిది
చాలదె మనస్వార్థపరతఁ జాటఁ గుమారా.

శ్రీకాళయుక్తివర్షము
నాకరునెలలోని మొదటి యర్ధమ్మున యం
దేకాదశదినమున నిది
ప్రాకటముగఁ బూర్తి నేయఁబడియెఁ గుమారా.

పలునీతులు చెప్పిన కవి
పలినభవుం డయిన సూర్యనారాయణశా
స్త్రులకేరు నీమన స్సను
పలకపయిని వ్రాసి యుంచవలయుఁ గుమారా.



నా తలిదండ్రులు నేటి యాచారము చొప్పున నా కింగ్లీషు చెప్పించిరి. నేను బి. ఏ. ప్యాసయితిని.

నాప్రకృతి పూర్వాచారములందే ప్రతిష్ఠితమయి యున్నది. నేను మున్ముందట పూర్వాచారపరాయణాలలో అచ్ఛాడీని.


నాకథను నేనే చెప్పికొనుచుండుటచే ప్రాచీనాచారముల నతిక్రమింపవలసి వచ్చుచున్నది. నేను క్రమక్రమముగా ప్రాచీనాచారముల నతిక్రమింపనే అతిక్రమించితిని గాన ప్రకృతము నాభర్త నామధేయమును విన్నవింప లజ్జింపను. ఇపు డానామమే నాకు మంత్రము.

నరోత్తమరెడ్డి బి. ఏ. సర్టిఫికేట్ పుచ్చికొని నాలుగేండ్లయినది. నాకు బి. ఏ. సర్టిఫికేట్ పుట్టినతోడనే వన్నతని కిచ్చి పెండ్లి చేయుటకును సర్టిఫికేట్ పుట్టినది. పరీక్షాఫలము తెలిసపిదపనే ఏయానయు లేని యానంద మనుభవింప నర్హా మని నాతలంపు. నరోత్తమరెడ్డి సంకల్పముకూడ నదియే.


నవీనాచారప్రకారము పెండిలి జరుగవలయునని వరుని యిచ్ఛ. ప్రాచీనాచారప్రకారమే జరుగవలయునని నాయిచ్ఛ. తుదకు నాపట్టుదలయే నెఱవేఱెను. కాని కొన్ని ప్రాచీనాచారముల నే నతిక్రమింప కుండ లేక పోతిని. అసలు నాది ప్రౌఢావివాహముకదా! నేను బంతులాడ లేదు. అతనికంచమున కూడు కుడువ లేదు. నామగనిపేరు—పాప మతడు చాల కుతూహలపడియుండు ననుకొందును—అపుడు చెప్ప లేదు. కాని నాపేరు చెప్పింపవలసినదని నేను చేసిన ప్రేరణ మింతింత కాదు. అతడు విధిలేక నాపేరు చెప్పుచుండగా పురుషలోకమును దాసలోకముగా జేసినంత యానందించితిని.

పెండ్లి కెక్కువవ్యయము కాగూడదని అతని తలంపు. కాని నాపట్టుచే మాజమీందారు కుటుంబములలోనగు వ్యయము, ఆడంబరము, లాంఛనములు వృథాయును అయి పోయినవి.

పెండ్లియగు పిదప నేను మగనితో అత్తింటి కేగితిని. నేను లోగడ వలచియెఱు



౧. షాహానజాఫ్-పంజాబు



౨. ఛత్తర్ మంజల్ సౌధము-లక్నో

గను. సర్వోత్తమరెడ్డికి నాపై ప్రేమ కలదని యెఱుఁగుదును గాని నన్నంతగా అతఁడు వలపించిన నమ్మకము లేదు. చాలకాలము దాఁటినతరువాత తన యనుగ్రహమున నేను సాత్వికమగు ప్రేమగ్రంథమున ఓనమాలు చదువ మొదలిడితిని. నే నంతఃపురముననే యుండఁగోరితిని గాని అది నామగని కిష్టము కాదు. నా కపుడపుడు పురుషులకు వలె స్వేచ్ఛాచారముపై మనసు పుట్టెడిది కాని దాని నడఁచి తెరచాటున బొమ్మవలె తిరుగుదానను. 'పిఱికివారును, అనదలును తెర చాటున దాఁగియుందు'రని నాథర్త యనెను. 'నీవు నామనఃకవాటముపై ఆఘాతము కలుగఁజేసితి' వంటిని. 'మనఃకవాటమునకు బీగము తీయుటమాత్రమే నాపని కాదు. కవాటోత్పాటనమే నాపని' అని అతఁ డనెను.

నాథర్త నాయుడుపువలెను, నామూర్పువలెను నన్నంటుకొని, నాలో లీనుఁడై యుండవలయునని నాకోరిక. నే నుండఁగా నతనికి శయ్య యేల? అతఁడు నన్నొకచెలివలె చూచుచుండువాఁడు గాని భార్యవలె చూడఁడని నాయపవాదము. రేయుంబవల్లు నన్నంటుకొనియుండుమని అతనితోఁ జెప్ప సంశయించుచుండుదానను గాని యాతఁడు వెళ్లినపుడతనివస్త్రాంచలము నెఱుఁగనటులు గ్రహించుటయో, ఏదోపని యున్నట్లు వెనుకకుఁ బిలిచి యేమి లేదు లెండని యనుటయో చేసెడిదానను. అతఁడు వెనుదిరిగి చూడక, మాఱు మాటాడక వెళ్లిపోయినపిదప నే నుస్సురని చిబుకముక్రింద చేయూఁది కూర్చుండుదానను. ప్రేమయనిన నట్టి శాకపాకలా? నే నపుడు చేసిన మంచిపని యేదనఁగా, ఏదాసిచేతను నాథర్తకు ప్రేమబోధ చేయింపలేదు.

నే ననేకగ్రంథములు చదివితిని. ఏకవియు ప్రేమను సంపూర్ణముగా నిరూపించినటులు నాకు తుష్టి కలుగలేదు. ప్రేమయన్న కేవల నాయికానాయకవర్ణనమా? దాని ననుభవింపవలయు, వ్రాయవలయు. నేనే కవయిత్రి నయితినేని శృంగారకవిత్వమునకు జగతిలో లోపముండకుండెడిది. ఈశ్వరుఁడు దాతను ధనికుని కావింపనటులే చేయవలసినవానిని కవులుగాఁ జేయఁడు.

నాథర్తలో మఱియొక మనుష్యుఁడు లేఁడు. ఇది చెప్పవచ్చును, ఇది చెప్పరాదు అనున దతఁ డెఱుఁగఁడు. ఏదాసియేని తనపై భావము చూపించుచో వెంటనే నాకు తెలిపి దానిని పవిత్రపఱుపు మని నొడివెడువాఁడు. నేను దానిని తన్ని తగిలివేయ నెంచుదానను. అతఁ డది ఖండితల పనియనియు, వారి నచటనే యుంచి వస్త్రగాళితము చేయుట సీతిలక్షణమనియు చెప్పి, వారిని తాను 'అమ్మా' యని సంబోధించువాఁడు. ఇటు లగుటఁజేసి నే నొక మనశ్శుద్ధిసంఘమున కాధిపత్యము వహింపవలసి వచ్చినది.

అతఁడు తెర తీసివేయవలసినదని నాకు మఱొకసారి బోధించెను. ప్రకృతము దానిఁ దొలఁగింపవలసినంత యక్కఱ లేదని నే

నంటిని. నాసమాధానమున రెండుప్రయోజనము లున్నవి: నే నంతఃపురమున నే యుండుచో అతఁడు ప్రేమోపాసకుఁ డగు ననున దొకటి; నేను చెప్పనిది రెండవది.

అతఁడు స్త్రీస్వాతంత్త్ర్యమును గూర్చిన గ్రంథములు బోలెఁ డిచ్చెను. పాప మిపు డెవరిస్వాతంత్త్ర్యము పెచ్చో అతఁ డెఱుఁగఁడు. ఆతఁ డాపుస్తకముల నెచట నుంచెనో అవి యచటనే యుండెను. అవి జడములు కావా? ఆసరస్వతి యెచట నలిగిపోవునో యని నేను కడుశ్రద్ధతో ముట్టక మూచూడక శరన్నవరాత్రపూజ చేసితిని.

నా యుదాసీనతకు నాభర్త కోపింపను లేదు, సంతసింపను లేదు; ఆగ్రంథముల నట నుండి కదిలింపను లేదు. చదివితివా యని యడుగను లేదు.

మాదివాణమున తంబళి యొకఁడు దైనందినమును రుద్రపాదములు శిరమున నుంచు నాచారము కలదు. నేను వానిభార్యను అందుల కేర్పాటు గావింపుమని నాభర్తకు తెలియఁ బఱచితిని. నాఁటినుండియు రాణివాసమున మగవానిదర్శనము మటుమాయమైనది. ఆ రేయి నాభర్త ఒక చిఱునవ్వు నవ్వెను. ఆ చిఱునగవున అన్ని యర్థము లున్నవని అపుడు నాకు గోచరము కాలేదు. నా మనఃపరిణామ మతనికిఁ దెలిసినటులు నాకును దెలియలేదు.

నాకడ కాతఁ డెంత రావలయునని—కాదు: ఒడళ్లు సాగిపోవునటులు కౌఁగిలిఁగొన నాశరీరమున నతని శరీర మెంత కలిసిపోవలయునని నేను తలంచుచుంటినో, అతఁ డంతవిడివిడిగ నే యున్నాఁడని నాభావన. నే నెంత ప్రేమగుహాలోఁ దూఁగుచుంటినో ఆతఁ డంత ప్రేమశృంగ మెక్కుచున్నాఁడు.

నా కిపు డొక గర్వ ముదయించినది. నేనును అతనితోపాటు బి. ఏ. కడతేఱితిని. సంపత్సమృద్ధులలో తక్కువ లేదు. సౌందర్యమున నేనే పెచ్చు. నాయెడ నీతని కీ యుదాసీనత యేల? అని. నే నిటులు తలపోసికొనుచు ఆవసంత చంద్రికలో ఉద్యానమున తిరుగుచుంటిని. నా శిరోఽలంకృతములగు పూవులు పరివేషమువలె నుండెను. మావిపొదలో కోయిల కుహూకుహూకుహూ మనెను. ఆకుహూ ధ్వనికి నా చెవులు గింగురుమని పోయెను. నా శరీరమును నే మఱచితిని.

నే నతిప్రయత్నముచే మల్లెతీవల చాళ్లు దాఁటి అశోకముక్రిందికి వచ్చుచుంటిని. దాపున నున్న శిలావేదికపైఁ గూరుచుండి నాభర్త యెవరినో ధ్యానించుచున్నాఁడు. 'ఆహా, నన్నే ధ్యానించుచున్నాఁడు. ఎంత యదృష్టవతిని' అని యనుకొంటిని. పరమేశ్వరునికై పరితపించు పార్వతివలె నే నతని యెదుట తల వంచుకొని పుష్పాంజలి తోఁగుకులాడ నిలిచితిని. నేను వసంతుని కుమారివలె వలచుచుంటిని. మలయమారుతహృదయమువలె నిట్టూర్చుచుంటిని. అతఁడు కాసంత కన్ను తెఱవకయే మనసిజు ననంగుని గావించెను. ఇస్సీ నా బ్రతుకు కనిపించి

నది. అతఁడు నాప్రేమను వెక్కిరించినటులు లేదా?



“పరమేశ్వరునికై పరితపించు పార్వతివలె.........
......పుష్పాంజలి తోఁ బులకలాడ నిలిచితిని.”

నేను పులుకుపులుకున నతని జూచుచు పరిశ్రమించితిని. నిక్కముగా నాకు తలనొవ్వి లేదు కాని—న న్నతఁడు పలుకరింపనైన పలుకరింపఁగూడదా?—పలుకరింప నందులకు తల నొవ్వి కలిగినమాట నిక్కము. నాకు జ్వరమే వచ్చినది. పట్టిద పట్టి దని విలపించితిని. ఉన్న మాట చెప్పుట కేమి? ఈ దిక్కుమాలిన మగని నాకేల కూర్చితి రని నాతలిదండ్రుల దూఱితిని.

కొంతవడికి నాభర్త వచ్చి మంచముపైఁ గూర్చుండెను. కొంత నా తలనొప్పి జ్వరము శాంతించెను. ఇఁకఁ గొంచెము సేపు కూర్చుండినచో నాబాధ అపుడు తీసివేసినటులు పోయెడిదే! ఆవైద్య మతని కెవరు చెప్పుదురు? అతఁడు నా తలయుంపిపై చేయి వైచి ‘యేమి యిది?’ ‘చల్లగను వేఁడిగను ఉన్న దే’యనెను. నేను ‘ఇది వ్యామిశ్రమగు జబ్బు’ అని యంటిని. అతఁడు తల నూఁచి వైద్యురాలిని బిలిచి మెల్లగా నిష్క్రమించెను.

రెణ్ణాళ్ల కొకతూరి యీ రోగము నాకు రాఁ దొడఁగెను. క్రమముగా దైనం దినమును రాఁ దొడఁగెను. దానితో నాశరీరము కాంతి దొఱఁగుటకు బదులు కాంతి యినుమడింపఁ జొచ్చెను.

౨

నాభర్తకు దూరజ్ఞాతియు, అదూరమిత్రుఁడు నగు ధర్మారెడ్డి రెడ్లలో బ్రాహ్మణుఁడు. అతఁడు నాభర్తకు సహాధ్యాయుఁడు. ధర్మారెడ్డి విద్యకొఱకే విద్య నభ్యసించెను. అతఁడు నాభర్తను జూడవచ్చెను.

ఒకనాఁడు పదిగంటల సుమారున నా భర్తయు, నతఁడును బ్రసంగించుచుండఁగా తెర చాటున నుండి వింటిని. నాభర్తకు అన్ని శాస్త్రములు వచ్చియుండు నని నే ననుకొన లేదు. చదువులో నే నతనికి తీసిపోను అను నాగర్వము చదికిలఁబడిపోయినది. అతని సంభాషణమున తర్కము, వైశేషికము, పూర్వ

మీమాంస, ఉత్తరమీమాంస, తంత్రశాస్త్రము, వైద్యశాస్త్రము, ఆస్ట్రాలజీ, ఫైలాలజీ, జియాలజీ, బయాలజీ, థియాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్సు, ఖొరాను, బైబిలు, జెందవెస్తా, బుక్కు, ఉపనిషత్తులు లోనగునవి సులువుగా ఉపబృంహితము లగుచుండెను. ధర్మారెడ్డియు అతనికి తీసిపోవలేదు.

ధర్మారెడ్డి సంభాషణము మారుత శీతలమయిన కార్తిక చంద్రికాసారమువలె నుండెను. నా కాతని యాకారము చూడవలయునని కోరిక యుదికినది. వెంటనే కొంచెము తెర యెత్తితిని. మఱల తెర వాల్పవలయునని నాకు తోఁపలేదు. కొంతవడికి వెదురుపొదల గాలి కా తెర కదలఁగా తెర పైచి లోనికేఁగితిని. కాని నే నెంతయో నే పంతిపురిలో నుండఁజాలక పోయితిని. మఱల తెరవద్దనే యిల్లుకట్టుకొని కూరుచుండి యపాంగశుక్తిచే నతనిని గ్రోలితిని.

ఆ తెర నాకొక యినుపగోడవలె నుండెను. నాసితనిరీక్షణములు కుశాగ్రములవలె సన్నగు చీలలను ఛేదించుకొని యావలికి దాఁటుచున్నవి. అపరీక్షేపముగా నే నారంగమును బ్రవేశింపఁ దలఁచితిఁగాని నిర్వహింపలేకపోయితిని. నరోత్తమరెడ్డి 'తెర'తొలఁగింపవలసివచ్చి చేసిన యుపకారమును వినియోగించుకొనలేకపోయితిని గదా యని నన్ను నిలువెల్ల నిందించుకొంటిని.

మాటలాడుచు మాటలాడుచు ధర్మారెడ్డి ఎక్కడ అలసిపోవునో యని అనుకొంటిని. అతని చేతులు నా చేతులకంటె మృదువుగా నున్నవి. అతనిశరీరములో ఆముఖము రాజు! ఆకన్ను లెవరి నాకర్షింపవు? ఆహాహా! ధర్మారెడ్డి అందుది. అందుదానికిఁగూడ అంత సౌందర్య మెక్కడిది? ఆ సౌందర్య దేవతకు నే నారతి పట్టితిని. వెనుకతలుపు లన్నియు మూసి ఆ తెరచాటునఁ గూరుచుండి అతని సౌందర్య



మును పూర్ణిమాద్యోగముచే ప్రత్యక్షము చేసికొంటిని.

కొంతసేపటి కంతఃప్రవేశసూచకమగు నొకగంటను నాభర్త మొరయించెను. నా యోగము ఆశబ్దముచే భగ్న మయినది. నేను

వెంటనే లోని కేఁగి మఱల గంటను మొరయించితిని. ధర్మారెడ్డి హస్తమును గ్రహించి నరోత్తమరెడ్డి నాకడ కరుదెంచెను. నా సంఘాతమంతయు నొక ప్రేమకుసుమముగా మాఱిపోవ నేను ధర్మారెడ్డి హస్తమును కదిలించుట యను మిషచే ఆకుసుమము నతనికి సమర్పించితిని. నాభర్త యతనిని నివేదించి నా కప్పగించెను. నేను నతనితో పరిచితి కలిగించుకొంటిని. తరువాత నేను నేనేనా అని యనుకొంటిని.

మా పరిచయాధిక్యమే తెరను చించివైచినది. అందులకు ధర్మారెడ్డిని నాభర్త మిగుల నుతించుకొని యుండును. అపుడపుడు నేనును, ధర్మారెడ్డియు స్త్రీ స్వాతంత్ర్యమును గుఱించియు, ప్రేమను గుఱించియు, సోక్రటీస్ సౌందర్యమును గుఱించియు మాటలాడుకొనుచుండువారము. అపుడు నేను నాభర్త యొసఁగిన స్త్రీ స్వాతంత్ర్యమును దెలుపు గ్రంథములనన్నిటిని జదివితిని. అపుడు నరోత్తమరెడ్డి ఆగ్రంథములఁ దన కిమ్మని నాయాసక్తిని వృద్ధిపొందించెను తన్మూలమున నా హృదయమునుగూడ కనిపట్టి యుండును.

ధర్మారెడ్డి నాతోఁ బ్రసంగింప నెంచి నపుడే నే నతనితోఁ బ్రసంగింప దొరకొను దానను. అతఁడే నాకడ కిపుడు తఱచుగా వచ్చుచుండువాఁడు. అతఁ డేకాగ్రతతో తిలకించుచు నాతో సంభాషించుచుండునపు డెపుడును నా కిసుమంతయు నర్థము కాలేదు. అతఁడు నాపరతంత్రతను కనిపట్టి యుండునని సిగ్గును, ఆనందమును గూడ పొందుచుండు దానను. నే నతని నెటులు చూచుచుంటినో అతఁడును నన్నటులే చూచుచున్నాఁ డని నాతలఁపు. స్త్రీ స్వభావము పురుషునకును, పురుషస్వభావము స్త్రీకిని దెలియును.

నాభర్త ప్రాచీనాచారము నుండి నవీనాచారమునకు ఇన్నియేండ్లకు తొలఁగింప లేని నన్ను ధర్మారెడ్డి ఒక్క-నాఁటితోఁ తొలఁగించెను. ఇపుడు డాబామీఁద వరుసగా వైచిన శయ్యలపై మొదట నేనును, నడుమ నాభర్తయు, చివర ధర్మారెడ్డియు నిదురించుట. కొన్నాళ్లరిగిన పిదప నేను నాశయ్యను నడుమకు మార్చికొంటిని.

నాభర్తకు తలఁచుకొనినంత నే నిదురవచ్చును. అతఁడు నిద్రించెనా, మఱి తురీయయామమునకే మేలుకనుట. నా కపుడు ధర్మారెడ్డితో మాటలాడుట కెక్కడలేనిమాటలు పుట్టుకొని వచ్చెడివి. తుదకు నే నతని శయ్యపై మల్లికు

మా వ్యాసకర్తలకు

వ్యాసములు చిన్న పెజాకాగితములపై ఒక వైపున మాత్రమే విడిఅక్షరములతో పంక్తులు దూర దూరముగా, దిద్దుబాట్లు లేకుండా తిన్నగా వ్రాసి పంప వేడికోలు. లేకున్న ముద్రణాకార్యములయందు మిగుల కష్టము కలుగుటయే కాక తప్పులుగూడ నిలిచి పోవునని మనవి.

—భారతి.

సుమములో, గులాబిపూవులో, జాదులో వెదఁజల్లుదానను. అటులు చల్లునపు డతనితాఁకుచే నాశరీర మెంతపులకితమయినదో అతనిశరీరము కూడ అటు లాయెనా లేదా యని నేను కనుఁగొనఁ బ్రయత్నించుదానను.

అపుడపుడు ధర్మారెడ్డియే నాకడకు వచ్చి బ్రౌనింగ్, గీతలు ఉన్నవా యనియు, మల్లియలుకాని, గులాబులుకాని ఉన్నవా? యనియు, మీఁగడగాని, ఐస్‌క్రీముగాని ఉన్నదా యనియు అడుగుచుండువాఁడు. అతనికోర్కెల నన్నిటిని నేను నా హస్తగతము కావించుకొని అతనిచే అడిగించుకొనుచుండుదానను. పాప మాతనికి మొగమోటమి లేదు. పిల్లవానివలె కావలసిన ప్రతివిషయమును నన్నే అడుగుచుండెను.

మాగోష్ఠిలో ఒకనాఁడు దివ్యజీవితమును గుఱించి ప్రశ్న వచ్చెను. నరోత్తమరెడ్డి సర్వసంగపరిత్యాగమునకు వోటుచేసెను. ధర్మారెడ్డి కర్మయోగమునకు వోటిచ్చెను. నావంతు వచ్చెను. నా కావిషయమున ఇంకను రూఢియగు నభిప్రాయ ముదయింపలే దంటిని. కాని నాయంతరాత్మకు తెలియకపోదు. నేను తెలుపకున్నను నావోటు దేనికి పడునో మీరు సులభముగ నే గ్రహింపఁగలరు.

కొన్నాళ్లు కడఁచిన పిదప నొకనాఁడు ధర్మారెడ్డి నాకడకు వచ్చి, 'మీ కొరక ఆతంకమును, నాకొరక మంగళమును ఒక సారియే తొలఁగిపోవుచున్న' వనెను. 'కాదు కాదు, నా జీవరసము పోవుచున్న' దని నే నంటిని. నే నపుడు తెల్లపోయితినో, పాలియే పోయితినో! నాశరీర గృహమునుండి బయటికి వచ్చి నేను ధర్మారెడ్డిని నిరీక్షించితిని. ఆహా! ఎడఁబాటులో ఎంత మనశ్శోషణము కలదు! బదులునకు బదులుగాక కేవలముగా మీరు మాగృహమలంకరింప వలయునని ధర్మారెడ్డి యనెను. నేను 'తప్పక' అంటిని.

ధర్మారెడ్డి మోటారు ఎక్కెను. అతఁడు నామనస్సుతోపాటు కానిపింపకుండఁబోయెను. అపుడు నా మన స్సంతయు నాటకము చూచి వచ్చిన తరువాత ఉన్నటు లుండెను. మా మేడ యంతయు చిన్నఁబోయినది. పోవుచు ధర్మారెడ్డి నన్నుఁ జూచిన చూపే నాకు పాథేయమైనది.

3

నా బయటితెర ఊడ్చి పోయినది కాని నామనస్సుపై దట్టముగా పడినది. వెన్నెల, సెలయేళ్లు, ఉద్యానములు, తీవలు, పూవులు, మలయవాయువులు, ఋతువులు, హంసలు, నెమళ్లు, కోయిలలు, తుమ్మెదలు, జలయంత్రశాలలు, అంగరాగములు, శయ్యలు పుటము పెట్టఁగా, శరీరపు మూసలో నామానసము తుకతుక ఉడికిపోయెను. అపూర్వమైన కాంతి మండలము నా ప్రత్యయనమును గుడికట్టెను. కపోల

విన్యస్త హాస్యనైన సన్నపుడు ధర్మారెడ్డి చూచినఁ జాలును. నరోత్తమరెడ్డి చూడకున్నఁ జాలును.

అంచుమట్టముగా తేన వ్రాసి రేకులు కుట్టివైచిన పూవువలె నేనపు డుంటిని. ఈశ్వరుఁడు నన్నొక సుఖపిపాస కాలవాలము కావించెను. నాలో నేనే దహించుకొని పోయితిని. నా కీజగతి యంతయు నిస్సారముగా తోఁచెను. ధర్మారెడ్డి చిత్తరువేని లేనియెడల నామేడ చవుటి దిబ్బగా నుండెడిది. ఒకరేయి యంతయు నే నాచిత్తరువు నెదుట నుంచుకొని కూరుచుంటిని. కొంతసేపు దానితో వినోదించితిని. క్రమక్రమముగా నా కనులవెంట బాష్పములు స్రవించినవి. తెలవారు లటులే కూరుచుంటిని. అపుడు మయూరము లొకకొకటియే లేచి స్తంభ మెక్కి కూయఁ దొడఁగెను.

నే నొకమోసము చేసితిని. ధర్మారెడ్డి శయ్యలోని యుపధానము నాశయ్యలోనికిని, నాశయ్యలోని యుపధానమును ధర్మారెడ్డి శయ్యలోనికిని మార్చితిని. ప్రకృతము నే నా యుపధానమునే ధర్మారెడ్డి భుజముగా భావించి కనులు మూసికొంటిని. తల్లివలె వచ్చి నిదుర నన్నెత్తుకొని పోయెను.

నేను స్వప్నమున ధర్మారెడ్డి కొక ఉత్తరమును వ్రాసితిని. వ్రాఁత కుపకరణము కలము కాదు; వ్రాఁత కుపయోగించినది కాకితమును కాదు. ఇచ్చ నా మానసముమీఁద నన్ను కరఁగించి కరఁగించి కరకకాయ సిరాచేసి అక్షరములుగా పోసినది. అపుడు ధర్మారెడ్డి నాలో ఒకభాగముగా ఉండెనుగాన దానిని పఠించెను. నే నతనిలో ఒకభాగముగా నుంటిని. నాలో నున్నవాఁ డెవఁడో నన్ను పట్టుకొని యీసుఖధామమున కెక్కించుచు హఠాత్తు జాఱవిడువ నేను జాగ్రదవస్థలో పడిపోయితిని.

ఇఁక నీజన్మము సార్థకమని నాకు హజము కలిగినది. నావలెనే అతఁడును నాదిండుపైఁ బరుండి వినోదించుచుండునని నిశ్చయించితిని. అపుడు నీ వెవరికిని నివేదింపరాని ఒకానొక తన్మయతలో మ్రగ్గుచుండలేదా? అని నేను ధర్మారెడ్డికి లేఖ వ్రాయకుండుట చాలవిచిత్రమే.

ఎవనిపాదయునిన నాకుఁ గిట్ట కున్నదో ఆనరోత్తమరెడ్డి ఆ రేయి నాకడకు వచ్చెను. అతఁడు నన్ను నాపేరుపెట్టి పిలిచెను. అతఁడే పేరున నన్నుఁ బిలిచెనో ఆనాపేరు స్త్రీలలో చాలమంది కుండవచ్చును. నాపేరు తెలుపుచో మీపేరులన్నియు కలుషితమై పోవును. మీరెవరును ఇఁక ఆపేరు పెట్టుకొనఁజాలరు. కావున 'పేరులో ఏమున్నది?' అని అనకుఁడు.

అతఁ డటులు పిలువఁగా నేను పలుకనైనఁ బలుకలేదు. పిదప నతఁడు—'కొన్ని జంతు

వులు తమజీర్ణకోశమును విప్పి నీటిలో కడిగి కొనును. నీవును నీమనస్సు నటులచేసికొనుము' అనెను.



" కొన్ని జంతువులు తమ జీర్ణకోశమును......
నీవును నీ మనస్సు నటుల చేసికొనుము "

నాగుండియలు జలదరించెను. పట్టుపడిన దొంగవలె నేను మాటలాడలేక పోయితిని. అతఁడు నా వాలకక మాఁచిమాచుచు కూరుచుం డెను. నామానస మంతయు అతని నేత్రదర్ప ణమున ప్రతిబింబించినటులు నాకు భయము పుట్టెను. ఏకవియు ఆయవస్థను వ్రాయవలదు. నవతులేని ఆయవస్థను భరింపవలదు. దానిని భరించినదానను నేనే.

అతఁడు క్రమ్మఱ నిటు లనియెను :— "పాపఁబోవుముందు చేసికొను జీవప్రాయశ్చిత్త మొక జీవప్రాయశ్చిత్తము కాదు. మానసము మీరినపుడు చేసికొన్న ప్రాయశ్చిత్తియే ప్రా యశ్చిత్తి. మృతి కాలమునఁ జేసి కొన్నది జీవునితోపాటు మరణించును. సజీవుఁడై చేసి కొన్నది సజీవమై యుండును.

నామనస్సుపై శరీరాచ్ఛాదనము లేదా యని ఒకసారి కనులతోఁ జూచి కొంటిని. నా మానసములోని ఒక్కొక్క పెట్టెయు పైకి లాఁగి తెరచుచున్నటు లుండెను. ఇంక నితఁ డెంతద్రష్టయో యని తెలిసికొనఁ గోరినటులు తల వంచుకొని కూరుచుంటిని.

అతఁడు క్రమ్మఱ "మనస్సు కన్న మంచి గురు వెచటను లేఁడు; మానసమున అజయ్య మైన వృత్తి కలుగుట అనఁగా ఈశ్వరుని దాపు నకుఁ జనుట, లేక తనను తాను ప్రేమించుట. ఆపు డెవఁడును దానిని ఇతరులకుఁ దెలుపఁ జాలఁడు. ఇఁక నిన్ను నేను పరిత్యజించుచు న్నాను. ఈపరిత్యాగము నీ మేలుకొరకే కా వున ఇది పవిత్ర పరిత్యాగము; ప్రేమ గర్భిత పరిత్యాగము. నీవు నిన్నతిగా ప్రేమించుకొని వత్తువేని యీ నీ మిత్రుఁ డెపుడేని నీ పార్శ్వ వర్తియే" అని గంభీరముగాఁ బలికి నన్నుఁ జూచుచు నిలువఁబడెను.

నాకనులవెంట నీరు క్రమ్మ నారంభించెను. నా కంఠము స్తంభింపకముందే 'రాతికి చెవులు లేకుండుట యెంత పుణ్యము? మోడునకు

అంటువ్యాధులు
వ్యాపించుటకు సూచన,
గొంతునొప్పి.



గొంతు నొప్పి?

గొంతునొప్పిగా నుండిన, దానియందు శ్రద్ధవహించి, ఫార్మమింటు తీసుకొనుడు. రుచ్యమైనట్టి యీ బిళ్లలను గంటకొకటి చొప్పున సేవించిన సేద తీర్చును. గొంతునొప్పి నయమొనర్చి ఇన్‌ఫ్లూయంజా, అంగుడువాపు, జ్వరము మొదలైనవి రాకుండ నాటంకపరచును.

నేడే
ఒకసీసాను కొనుడు

FORMAMINT

కెమిస్టు లందరివద్దను దొరకును.
స్టోరు లన్నిటియందును అమ్మబడును.
క్రిములనుసంహరించుగొంతునొప్పిబిళ్ల.

డ్వార్కిన్ హార్మోనియములు

ప్రపంచమునం దన్నిటిలో శ్రేష్ఠమైనవని
ఖ్యాతి గాంచుచున్నవి.



డ్వార్కిన్ హార్మోనియములను ఎవ్వరు వినియుండరు! అది ఒకటి గలిగియుండిన ఎందుకు గర్వపడరు! సరసమైన ధరలో క్రొత్తమాదిరీలుగలవు.

కేటలాగుకు వ్రాయుడు.

ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయవలెను.

DWARKIN & SON,
Original Inventors of the Hand
Harmonium and the oldest
Music Firm in India.
8, Dalhousie Square, CALCUTTA.

ఆంధ్రగ్రంథమాల ౮-వ కుసుమము

ధమ్మపదము (వచనము)

వెల రు. ౦-౧౦-౦.

అనువాదకులు:
శ్రీకిళాంబిరంగాచార్యులుగారు, ఎమ్.ఏ.బి.ఎల్

అహింసయే జీవితపరమార్థముగ వెలసిన బుద్ధదేవుని ఉత్తమధర్మోపదేశము లిందు పాళీ మూలమునుండి అనువదింపబడినవి. మానవ జీవితము చరితార్థ మగుటకీ మహనీయుని ధర్మోపదేశము లందఱును సర్వదా పఠించి యాచరింపదగినవి.

ఆంధ్ర గ్రంథమాల,
నెం. 7, తంబుశెట్టివీథి, మద్రాసు.

వీటియొక్క సుగుణములను గుఱించి యిదివరకే అందరికిని బాగుగా

ఎల్లచోట్లయందును తెలిసియున్నది

అట్లు తెలియనివారు ఆలసింపక తక్షణమే

మా లోకామయహర కస్తూరి మాత్రలను



Regd
Trade Mark

తెప్పించి, ఒకదఫా వాడిన మీరు మిక్కిలి తృప్తిచెందెదరని మా నిశ్చితాభిప్రాయము. ప్రతిదినము మాకు వచ్చుచున్న ప్రశంసాపత్రములే ఇందుకు ప్రబల నిదర్శనము.

ఇవి మేలైన కస్తూరి, కుంకుమపువ్వు, అపూర్వమైన ఓషధులు మొదలగునవి చేర్చి, శాస్త్రోక్తముగా తయారుచేయబడినవి. తాంబూలముతోగాని, విడిగాగాని ఉపయోగించవచ్చును. పలువిధ జ్వరములు, దగ్గులు, శీతలము, అజీర్ణము, ప్లేగు, అజీర్ణభేది, కడుపుజ్వరము, కడుపునొప్పి, పిల్లల పడిశము, ప్రక్కలకుట్టు, అగ్నిమాంద్యము, మలబద్ధము, బలహీనత మొదలగువాటికి వజ్రాయుధమువలె పనిచేయును. స్త్రీలు, పసిపిల్లలు, ముసలివారు మొదలగువారికి అమృతసమానము. 250-300 మాత్రలుగల బుడ్డి 1-కి ధర రుప్య 0-4-0 పోస్టుకర్చు 0-4-0 6 బు. పోస్టుఖర్చుతో సహా రు 1-8-0 12-కి రుప్య 2-13-0 25-కి రుప్య 5-3-0.

భిషగ్రత్న పాళ్యపు వెంకటాచల పండితులు, ప్రొప్రైటరు.

శ్రీ సీతారాఘవ వైద్యశాల, మైసూరు.

మద్రాసులో నెం. 6, బందరువీధిలోనున్న ప్యాంకంపెనీవారివద్ద దొరకును.

ఆశ్చర్యము! జయవశీకరణి లేక **అద్భుతమైన తాయెత్తు** అత్యాశ్చర్యము!!

ఈ తాయెత్తు అద్భుతమైన క్రియతో తయారుచేయబడినది. ఇది ధరించిన ప్రతిమనుజునకును, వారికోరికలు తప్పక యీడేరుచుండును. ఇది ధరించినవెంటనే మనసునకు నుత్సాహమును, అధికారుల యాదరణయును, వాణిజ్యమునందు లాభమును, ఉద్యోగలాభము, పరీక్షలయందు గెలుపొందుటయు, మొదలగు శుభములు జరుగుచుండును. ఇవియేగాక మనల నావహించియుండు పిశాచములను పోగొట్టి యితరకష్టములనుండి తొలగించి పరమేశ్వర కృపాపాత్రులజేయును. పసిపిల్లలనావహించిన బాలగ్రహాది ప్రతిబంధకములుగూడ తప్పించి, వారికి సంతోషమొనగూర్చును. గ్రహచారమువలన కలిగినసర్వరోగములను ఉపశాంతింపజేసి న్యాయధర్మబద్ధములందు జయముకలుగుటకై కావలసినచో ప్రత్యేకపు తాయెత్తులు పంపబడును.

ఒక్కొక్క తాయెత్తు రు. 2-0-0; 10 తాయెత్తులు రు. 15-0-0 }
ప్రత్యేక కార్యలాభములకొరకు ప్రత్యేకపు తాయెత్తులు ఒక్కొక్కటి రు. 50-0-0 } పోస్టేజి ప్రత్యేకము.

గాంధిమహాత్ముని కారాగృహ విముక్తి తెల్పిన దైవజ్ఞశిరోమణియొక్క యపూర్వజ్యోతిషము.

హనుమాన్ ఆరూఢము! మీరు మీభవిష్యత్తును తెలియగోరెదరా?

అయినచో తిరుగు టపాలో కావలసిన ప్రశ్నలను పంపుడు. ప్రతిప్రశ్నకును నెంబరు వేయవలెను. మావిలాసము పూర్తిగా తెలియజేయవలెను. జాబువ్రాయు సరియైన కాలముగూడ తెలియజేయవలెను. వెంటనే సరియైన జవాబులను పొందగలరు. 5 ప్రశ్నలకు రు. 1-0-0 వి. పి. చేసినచో రు. 1-4-0. పై ప్రశ్నలకు ఒక్కొక్కదానికి రు. 0-4-0 చొప్పున చార్జి చేయబడును.

వి. కె. శఠగోపాచార్యులు,

నానువదుపాస్కి జ్యోతిష్కుడు, తిరుత్తణి, చిత్తూరుజిల్లా, మద్రాసు రాజధాని.

చేతన లేకుండుట యెంతభాగ్యము?' అని నేను కనులు మూసికొని పఱుపుపై నొఱగితిని. అతఁడచటినుండి మెల్లగా వెళ్లుట కనులవలె నాచెవులు చూచెను.

అటు లాతఁడు నిష్క్రమించిన కొంతసేపటికి లేచి కూర్చుంటిని. లతికాపర్ణవిచాలనముచే పుట్టి, పర్వతవృక్షశాఖాఘాతముచే పెరిఁగి, ఒకమహావాతము వీవఁదొడఁగెను. ఉపవనమున రాలిన కుసుమములు ఆకాశపతితము లగు తారకాగణములవలె నుండెను. ఆ వాత్యాచంక్రమణములందు ఎగిరిపోయిన జీర్ణలతాజాలములు క్రిందికిని మీఁదికిని దిగు గాలిపడగలవలె చూపట్టెను. అవి మీఁదికేఁగినవో, క్రిందనే పడినవో ఎవరెఱుఁగుదురు? చాలసేపటి కాయాకాశరంగమున మబ్బుతెరలు విరిసినవి. ఈనాటక మెవ రాడించిరో యెవరు కనుఁగొనినారు? కాని అందఱును కనులు పెట్టుకొని చూచినారు.

నా కపుడు నరోత్తమరెడ్డియం దొకగౌరవము, ఒకనైచ్యము, ఒక ఆస్తిక్యము-ఒకనాస్తిక్యము, ఒకప్రేమ, ఒకత్యాగమును కలిగెను. కడపటి నిమిషమున నే నతనిని సంపూర్ణముగా సన్న్యసించితిని.

'నీపరిత్యాగము నా కొక అర్హత నిచ్చినది. అనర్హతతోడనే నేను నీనుండి కత్తితో నఱుకఁబడిన తుండెమువలె వేఱైపోవుచున్నాను. నీమాటలు నీహృదయమునుండియే ప్రసరించెనేని నన్ను ద్వేషింపఁజాలవు.' అని యొక యుత్తరము నరోత్తమరెడ్డికి వ్రాసి యెవ్వరికిఁ దెలియకుండ నే నటనుండి యెగిరిపోయితిని.

ఆహా! ఆ ప్రథమస్వాతంత్ర్యము నేమని చెప్పుదును? అది కాఫీహోటలు విందు; ఆఱవయింద్రియసుఖము; ఉన్మత్తతాండవము; మూఁడవనాఁడు; గర్భనరకము; విదేహముక్తి.

నాకు ప్రతిపదార్థము భయమయముగాను, ప్రేమమయముగాను కానిపించెను. నాకొఱకే ఋతువులు, కుసుమములు, చంద్రుఁడు, దక్షిణ వాయువులు సృజింపఁబడినవి.

నా కొక క్రొత్తవన్నె వచ్చినది. స్వేచ్ఛ నాసౌందర్యమును పల్లవింపఁజేసినది. నే నాస్వేచ్ఛలో ముక్తునివలె బంధ మనుభవించితిని; బద్ధునివలె ముక్తత చవిచూచితిని. అప్పటి నాకర్మయంతయు ఒకతపస్సు. నే నాతపస్సంతయు ధర్మారెడ్డికడనే యుండి అతనికొఱకో, నాకొఱకో చేసితిని.

అతఁడును, నేనును ఏకాంత చంద్రికలలో సంచరించితిమి. పర్వతసానువులపై దీర్ఘాలోచనములతోఁ గూరుచుంటిమి. నదీతీరములందలి కురుమాపులేని పచ్చిక పట్టుతివాచీలపై విశ్రమించితిమి. ప్రాసాదోపరిభాగములందు శరచ్చంద్రికాతూలశయ్యలపై మాటలాడి మాటలాడి నిదురఁగూరితిమి; ఏకపఙ్క్తి నారగించితిమి.

నే నతనికి షెల్లీ–ఎపిసైకిడియన్ వినిపించితిని. విజయవిలాసము తల కెక్కించితిని. అభిజ్ఞాన శాకుంతలమును వర్మసచివుని చేసి

తిని. ఓమర్ ఖాయమును పార్శ్వచరుని కావించితిని.

ధర్మారెడ్డి దాసికలలో నొకతెయేనియు మఱియొక దాసిచెవిలో ఏరహస్యమేని చెప్ప లేదు. కాని మే మిరువుర మరణ్యమునకు అని వారు వెళ్లునపుడుమాత్ర మెదురుబడిన పౌరులు మాగుజ్జములు కొంతదూర మరిగిన పిదప అచట నిలిచి మమ్ము వేలితో చూపించుచు ఏవియో కొన్ని మాటలు చెప్పకొనువారు. ఆమాటలు వినుటకు నాకు మూఁడవ చెవి లేకపోయె నే యని నే ననుకొను దానను.

ధర్మారెడ్డి కనుచాటు చేసి సర్వోత్తమరెడ్డి యతనికి వ్రాసిన యుత్తరములు చూచుటకు నాకు తత్తరమయ్యెడిది. వానిలో నామాటయే యుండునది కాదు. సర్వోత్తమరెడ్డికి చేతన లేదా? లేక దాని నతఁడు జయించెనా? అని నేను సంకోచపడితిని. అది దైవమున కెఱుక!

ఒకటి రెండు మూఁడు నాలుగు నెలలు కడఁచెను. 'నీ వెందులకు వచ్చితి' వని కాని, 'ఇంక నెన్నాళ్లుందు' వని కాని ధర్మారెడ్డి న న్నడుగ లేదు.

అతని పలుకులో దిండు మాఱిన సంగతి అతని కింతవట్టు తెలియ లేదు. నేను తడవతడవకు ఆతలయంపి పై కెత్తి క్రింద వైచి ఆకాశమున బంతియాట లాడినను అతఁడు దాని విషయమున ఇసుమంత యేని శ్రద్ధ చూప లేదు. నేనుమాత్ర 'మీదిండు నీది కాదా?' అని అడుగ లేదు.

అతఁడు లేనపుడు నే నతని శయ్యపైఁ బరుండు దానను. అతఁడు వచ్చి నాశయనమునఁ బరుండు వాఁడు. నే నతని వెండి కంచమున నా వ్యంజనమును బడవైచుదానను. అతఁడు స్వీకరించు వాఁడు. అతఁడు నాకు Friendship Mysticఅని పేరిడెను. Love and Beauty Mystic అని పేరు పెట్టినచో సరిగా నుండెడిది.

నా కాతని చేఁతలన్నియు ఒక శక్తిని చేకూర్చెను. ఎట్టిశక్తి? నా చరిత్రము నొక తూరి సింహావలోకనము చేసికొనునట్టిది. చేసికొంటిని సరియు. ఏమి ప్రయోజనము? ఆశక్తి నిశ్శక్త మైపోయినది.

వెతలఁ బొగులువారు శాంతికని ఏకాంతములు చేరి లేనిపోని వెతలన్నియు నెత్తిని వైచికొందురు. అటులే నేనును ఉద్యానమునకుఁ బోయితిని. నా కెచట లేనిదుఃఖమును పుట్టుకొనివచ్చెను. నే నవరినికోరిన వారు నన్నెత్తుకొనిపోవరు? అపుడు నన్నెందఱు హృదయేశ్వరిగా భావించి పూజించిరో! నన్నెదుర్కొనిన ఏపురుషుఁడు ఇంద్రియములు లేని చేతనుఁడు కాలేదు? ధర్మారెడ్డి నాసాహచర్య సహవాస సహభోజన సహశయనములు స్త్రీవలెనే ఆచరించుట యేమివింత? నాసౌందర్యము గుడ్డిగవ్వకంటె ఏమి ఎక్కువ? ఈసౌందర్యముకంటె అంతరసౌందర్య మేమేని కలదా? ఉండుచో అది యెవరిలో లేదు? లోపలినుండి పుట్టుకొని రావలయునుగాని నన్నుఁ బ్రేమింపుమన్న నెవరు ప్రేమింతురు? ప్రేమ పుట్టుచో గుడ్డిదియేని అర్ధాంగి. ప్రేమ లేదేని రంభ

యేని అమ్మ. ప్రేమ గుడ్డిదా, మనుజులు గ్రుడ్డి వారా?

శేఫాలికాకుసుమములు పైఁబడ తలబరు వెక్కెను. యూధికలు నన్నుఁ జూచి నవ్వెను. ఏడాకుల యరఁటిపుష్పాదులు నాతలపై కాలు వెట్టెను. వీనియన్నింటిపై ఆపరిణతిశరచ్చంద్ర చంద్రిక! నే నాయాటకొలంకునొడ్డున కూరుచుంటిని. ఊరక నా గండఫలకముల నుండి బాష్పము స్రవించెను.

నా వెనుకనుండి వచ్చు పాదవిన్యాసధ్వనిని నాచెవులు వినలేదు. నేను వెనుదిరిగి చూచు వఱకు ధర్మారెడ్డి నాపైఁ జేయివైచెను.

ఆహా! ఏమి ఆస్పర్శ! అది నాబాష్ప ధారలకు సేతువు. పులకములకు చక్కిలిగిలి. ప్రీతికి విటుఁడు. 'ఇఁక నేను ధన్యను. ఇఁక మృతికి భీతిల్లను. ఇఁక ఇహలోకమున స్వర్గము కట్టుదను.' అని అనుకొంటిని. ఆతత్క్షణము నాశరీరము నాకుఁ దెలియుచో ఒట్టు.

తనపై నొఱగిన నన్ను సరిగా నిలువ రించుచున్న ధర్మారెడ్డిని కొంతవడికి కనుఁ గొంటిని. అతఁడు న 'న్నమ్మా!' యని సంబోధించెను. నేను పాతాళమున పడిపోయితిని. నే నచటినుండి భూలోకమునకు తిరిగి వచ్చు వఱకు 'అది నీ మంచికేని దుఃఖింపుము. దుఃఖమునందలి సుఖమే సుఖము! అమ్మా! పలవింపుము.' అని యతఁ డనుట వింటిని. అతని ప్రత్యుత్తరమును న న్నొక అసీమమగు వెలుఁగు లోనికి నెట్టెను.

నే నతని నచట నుండుమని యనలేదు; ఆతఁ డచట నుండనులేదు. ఆతఁడు నిష్క్రమించినంతటనే నాకు వచ్చిన చావయిపోయినది. నాకు ప్రాణములం దెంత తీపియో! నే నా కంఠదఘ్నమైన కాసారము విడిచి యివలికి వచ్చితిని. నేను రాకున్నచో ధర్మారెడ్డి తన మృదుల హస్తములతో నెత్తుకొనివచ్చి వ్రేల్చువాఁడుగదా! అని యనుకొంటిని.

మేడమీఁదినుండి యిటులు విస్పష్టముగా వినఁబడియెను:—'న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవ త్యాత్మన స్తు కామాయ పతిః ప్రియో భవతి। న వా అరే జాయాయై కామాయ జాయా ప్రియాభవ త్యాత్మ



"అది నీమంచికేని......అమ్మా! పలవింపుము."

నస్తు కామాయ జాయా ప్రియా భవతి । నవా అరే పుత్రాణాం కామాయ పుత్రాః ప్రియా భవ న్త్యాత్మన స్తు కామాయ పుత్రాః ప్రియా భవన్తి । న వా అరే విత్తస్య కామాయ విత్తం ప్రియం భవ త్యాత్మనస్తు కామాయ విత్తం ప్రియం భవతి............ న వా అరే లోకానాం కామాయ లోకాః ప్రియా భవ న్త్యాత్మనస్తు కామాయ లోకాః ప్రియా భవన్తి.'

నే నిటులు విని కొంతవడికి మేడపై కేఁగితిని. ధర్మారెడ్డి నిదురించెను. అతఁడచట తెఱచియుంచిన బృహదారణ్యకమున 'మగని కొఱకు మగఁడు ప్రియుఁడు కాఁడు, తనకొఱకే మగఁడు ప్రియుఁడు. ఆలికొఱ కాలు ప్రియురాలు కాదు, తన కొఱకే ఆలు ప్రియురాలు. కొమరులకొఱకు కొమరులు ప్రియులు కారు, తనకొఱకే కొమరులు ప్రియులు. రొక్కము కొఱకు రొక్కము ప్రియము కాదు, తనకొఱకే రొక్కము ప్రియము... లోకుల కొఱకు లోకులు ప్రియులు కారు, తనకొఱకే లోకులు ప్రియులు' అను నర్థమును ఇంగ్లీషు వ్యాఖ్యచే గ్రహించితిని.

నాకొరకే నేను వచ్చితినని తెలిసినది. నరోత్తమరెడ్డి యిందులకనియే నన్ను పరిత్యజించెను. నాశరీరమంతయు పిండీకృతవస్త్రమాయెను. తెలవారులు ఆభావ మనుభవముచేసికొంటిని. ఆహా! అది యెంతసత్యము! క్రమక్రమముగా ఆ పిండీకృతవస్త్రముయొక్క ఒక్కొక్క చుట్ట విప్పారినది. నే నెవరు? అని నే ప్రశ్నించుకొంటిని.

తెలవారుకడ ధర్మారెడ్డిని తిలకించితిని. ఆహా! అతఁడు నాజీవితమును పవిత్రపఱచిన పరమగురువు! నే నతని లేపి 'నాయనా! నే నొక పొరపాటు చేసితిని: నా తలాఁపి నీకును,



నీ తలాఁపి నాకయ్యకును మార్చితిని. ఇపు డా మార్పు సవరింపవలయు' నంటిని. ధర్మారెడ్డి చిఱునగవుతో తనతలాఁపి తీసికొని నాతలాఁపి నా కిచ్చెను.

ధర్మారెడ్డికడ సెలవు గైకొని పయనమైతిని. ఆపయన మత్తింటికని, పుట్టినింటికని తెగక, నిశ్చితబుద్ధి కలుగువఱకు ఒక యేకాంతస్థలమున నుండ నెంచితిని.

నే నున్న యేకాంతస్థలమున నూతనమగు పడవ ఋతువు ప్రవేశించెను. పదమూఁడవ

నెల చొచ్చెను. అఱువదొకటవ సంవత్సర మారంభించెను. ఎనిమిదవవారము ఉదయించెను. పదునారవ తిథి వచ్చెను. ఆఱవ మహాభూతముతో అచటి సృష్టి. మానసముతో అచటి భోజనము. శూన్యముతో అచటి క్రీడ. బయట నెన్ని నగారాలు మ్రోఁగించినను అచటికి చొరవు. అచట స్వయముగా శబ్దము మ్రోఁగును. అందు దోషములు మేము మేమని వచ్చి ఆహుతియగును. అందు శాంతి పసిపాపవలె జనించును.

నే నాయేకాంతమున చాలఁగాల ముండుటచే నాతలిదండ్రులు మరణించిరనియు, నన్నుఁ గనుఁగొన మిగులఁ బ్రయత్నించిరనియు నే నెఱిఁగను. నే నమెరికా వెళ్లినటులు వార్తాపత్రికలు ప్రచురించెను. నా తమ్ముఁడింగ్లాండులో చదువు ముగించుకొని నాకొఱకమెరికా వెళ్లి విసిగి వచ్చెనని తెలిసినది.

ఇపుడు నాతమ్ముఁడు నను జూడవచ్చెను. అతఁడు భవిష్యజ్జీవితము ఎటులు కడఁప నెంచి నదివింటెని. మన మెంచినటు లది చనదు దాని కితరులకుఁ గానరాని కన్నొకటి కలదు. దాని చూపులోనే అది చనును. ఎపుడో ఆకన్ను మూఁతవడును.నాఁటఁగోలె అది మనము చెప్పినచొప్పున నడుచును.

అతఁడు గృహాభిముఖుఁ డాయెను. నరోత్తమరెడ్డిని సందర్శించి మఱి యింటికిఁ బొమ్మని అతనికి చెప్పితిని. 'నరోత్తమరెడ్డి నీకు బావయే కాఁడు. అతఁడు నరోత్తముఁడే' యని అంటిని.

నే నిటు లనఁగా అతఁడు రెండు దీర్ఘనిశ్వాసములు విడిచెను. నేనును రెండు దీర్ఘనిశ్వాసములు విడిచితిని.

మనస్సు వాక్కుతోనే కాక ఇతరేంద్రియముతోను మాటలాడఁ గలదు. ఆసంభాషణ మాత్మకడకు పాదములతో పరుగిడును.

నాతమ్ముఁడు వెళ్లిన తరువాత నన్నుఁ బెంచిన దాది వచ్చినది. అది ముగ్గిన పండు. సుఖదుఃఖముల పుటపాకము. వాత్సల్యమునకు పుట్టినిల్లు. నేను ముదియలలోను, కసుఁగందులలోను జగన్నాటకమును చూడఁగలను. దాని శీలవాత్సల్యములచే నేను పసుఁబాపనైతిని. దానికి నానగ లొలిచి యిచ్చి యింటికిఁ బనిచితిని.

నేను నాయింటికిఁ బయన మయితిని. నేనే ప్రదేశము శ్మశానమువలె విసర్జించితినో అదియ నాపడకటిల్లు; అచటికే నాపయనము. నే నిపుడు నాకొఱకే నాయింటికి వెళ్లుచుంటిని. కాని బడికి వెళ్లు పిల్లవలెనే వెళ్లితిని.

అంతిపురిలో నాకు సవతి యుండదనియే నాతలంపు కాని నాయందు నాభర్తకుఁగల విశ్వాసమే యచట సవతిగా నుండెను. నరోత్తమరెడ్డి నాకు 'దేవిడీ మన్నా' చెప్ప ననుకొంటిని. కాని పరిచారిక లందఱు తొంటివలెనే స్వాగతమిచ్చిరి. 'అమెరికానుండి యేమి తెచ్చితి' రని అమల యడిగెను. 'ఆ దేశము మనయడుగున నున్నది కదా! అట వారందఱు తలలు క్రిందై, పాదములు మీఁదనై

పడిపోవరా?'యని కుముదిని శంకించెను. 'అచట పగలు రాత్రి, రాత్రి పగలును గదా! సూర్యుఁడు చంద్రుఁడుగను, చంద్రుఁడు సూర్యుఁడుగను మాఱుదురా?' యని ప్రసన్న పలికెను. 'అచట చెఱువులలోను,నదులలోను, సముద్రములోను నీరు క్రిందఁ బడి పోవక యెటులు నిలిచియుండు?'నని పద్మిని ప్రశ్నించెను. 'ఇచటి నుండి సూటిగా బెజ్జము వైచికొని పోయినచో అచటికి తేలుదుమా?' యని యరుణ యనియెను. సామానంతయు వెనుక బండ్ల మీఁద వచ్చుచున్నదని వాలియూహా. నరోత్తమరెడ్డికి నా వచ్చిన వార్త తెలిసియుండును.

నా యంతఃపురమును నేను స్వాధీన పఱచికొంటిని. అతఁడు నన్నటులు చేయనిచ్చుననుకొనలేదు. నేను తొంటివలెనే నా పాకశాలలో భుజించితిని; అతఁ డతని పాకశాలలో భుజించెను.

ప్రాసాదోపరిభాగమున దాసికలు మాయిరువురికిని రెండు శయ్యలు పఱచిరి. చందన తాంబూలము లునిచిరి. అగరువత్తులు వెలిఁగించిరి. గాజు పళ్లెరములలో పూవు లుంచిరి.

నన్నుఁ జూచుటకుఁబోలె తారాగణము లాకాశసౌధమున నిలువఁ దొడఁగెను. పతివ్రతాతిలక మగునరుంధతి నన్నుఁ గన్నారఁగనుఁగొన నిష్టము లేనిదానివలె చూచినటులు,చూడనటులు, మినుకు మినుకు మనుచుండెను.

నేను మేడమెట్లెక్కఁ దొడఁగితిని. ఒక్కొక్క మెట్టెక్కుట ఒకొక్కలోక మెక్కినటులుండెను. చివరమెట్టు నెక్కి నాయపమానము నెక్కితిని. డాబామీఁద నిలువఁబడి తొల్లిటి నామీఁద నేను నిలువఁబడితిని. నరోత్తమరెడ్డి పాదములు చూచి నాగుండియల చప్పుడు వింటిని. అతని ముఖమును అవలోకించి ప్రేమను పుక్కిలించితిని. క్రమగతియు సరళశైలియు, ఉన్నతభావముకల సద్వృత్తమువలె నేనా నరోత్తమునిదరికి నడచితిని.

దక్షిణాశ శాంతిసందేశమును వలె మలయమారుతము నంపెను. చంద్రుఁడు వెన్నెలచే సత్వాంజనము పూసెను. ఆజ్యోత్స్న పరమేశ్వరుని సగుణస్వరూపమువలె దివ్యవిభూతులతో తేజరిల్లెను.

శయనైకాదశినాఁట పాలవెల్లిలో పురుషోత్తముఁడు పవ్వళించినటులు నరోత్తముఁడు పవ్వళించెను. నేను కాళరాత్రివలె అతనికడ కరిగి యతని రెండుపాదములును గ్రహించితిని. నరోత్తమరెడ్డి లేచి నాపేరున నన్ను సంబోధించి, 'నీకు శాంతి కలుగుఁగాక!' అని ఆశీర్వదించెను.

నేను 'ఓగురూ! పరమగురూ'అని మాటలాడఁబోఁగా, అతఁడు 'కాదుకాదు; నీవే నీకు గురువవు; నీకు బందుగుఁడవు. నీవే నీకు శత్రుఁడవు. నీవే నీ కాత్మవు' అనెను.

నేను 'నిక్కము' అని పిదప నావృత్తాంతమంతయు పూస గ్రుచ్చినటులు చెప్పికొంటిని. అతఁడు శాంతతతో సమగ్రముగా అసంగుఁడై వినియెను.

పిదప నాహస్తములలో నున్న అతని పాదపంకజములు నలిగిపోవు నను భీతి లేక యొత్తుచు 'నన్ను క్షమింపుము' అని ముమ్మారు వేడితిని. వేడి కన్నీరుచే నా చెక్కులు లేత మఱ్ఱాకు లాయెను.



'నిన్ను నీవే క్షమించుకొంటివి. ఇతరుఁడు క్షమించుటలో మెత్తఁదన మున్నది. తన్ను తాను క్షమించుకొనుటలోఁగల కఱకుఁదనము సూర్యునందేని లేదు. నాచే క్షమింపఁజేసికొని క్రింది కొక మెట్టల దిగెద వని అతఁ డనెను.

'కాదు కాదు; నన్ను నేను క్షమించుకొనుటలో శాంతి లేదు. ఎంత క్షమించుకొన్నను దాని కెదురుగనే నేను క్షమింపఁబడ ననునది వలె దోషము నిలువఁబడును. నీక్షమాపణయే దాని కుచ్చాటనము. అథవా నేను క్షమింపఁదగుదానను గాను. నాలోప మెపుడు నా కనులలో కాఁపుర ముండవలయును. నన్ను క్షమింపకుము!' అని యంటిని.

నరోత్తమరెడ్డి బాష్పజల ప్లావితుఁడై. 'నిన్నుఁగాక మఱి యెవరిని నేను క్షమింపఁగలను ? ముమ్మాటికి క్షమించితిని. ముమ్మాటికి క్షమించితి' ననెను.

నే నదివఱకుఁ గాదు, ఆక్షణముననే నరోత్తమరెడ్డిని వివాహమాడినది.

నా ప్రాయశ్చిత్తమున కుపకల్పింపఁబడిన శుద్ధిసభలో సదస్యులవలె నక్షత్రములు, చంద్రుఁడు, సప్తర్షులు అరుంధతి లేచి నన్నాశీర్వదించినటు లుండిరి.

నరోత్తమరెడ్డి నన్ను పుత్త్రివలె, చెలియవలె, భార్యవలె, శిష్యవలె క్షమించెను. అతఁడు వెనుకటి వలెనే సంచరించెను. అహా ! ఏమి యా త్రాసు !

నాచరిత్ర మంతము కాకమునుపు నరోత్తముఁడు నన్ను క్షమించిన ఆపవిత్ర రాత్రిని స్మరించుకొందును.

ఘాతకుని క్షమింపవచ్చును; దొంగను క్షమింపవచ్చును; అందఱను క్షమింపవచ్చును; మతిమాలిన భార్యను క్షమింపవచ్చునా ? ఆమెను క్షమించుటయే క్షమ. నరోత్తమ రెడ్డియే నేనై, నేనే నరోత్తమరెడ్డినై యున్నచో నేను క్షమింపఁజాలకపోయియుందును. న

న్నిటులు క్షమించి పుచ్చిన నరోత్తముఁడు మనుజుఁడా, దేవుఁడా, క్షమాదేవుఁడా ?

నరోత్తముని క్షమాపణమే నాజీవవాణి. ఆవాణితో నాకథను సమగ్రముగా చెప్పుకొనుటకు నేను సిగ్గిల్లను. నాచరిత్ర శరీరమునకు జీవమైన క్షమాపణ తన పూర్వదళములను రాల్చి క్రొత్తాకు తొడిగినది.

ఆ నన్నాతఁ డిటులు క్షమించి తలమునక లయిన ప్రేమతో నన్ను కౌఁగిలించుకొనినటు లుండెను. ఆయాలింగమున నేను నాశరీరమును బాసినచో ఎంత ధన్యవతిని! ఏలయనిన, నూతనశరీరమే ఆయాలింగనమునకుఁ దగినది.

అహర్ముఖము

శ్రీ. శ్రీ [కవితాసమితి.]

ఆహర్ముఖాంచిత హర్షవీచికలు
జాండభాండమున నిండినవి!
రహఃప్రశాంత దినోదయవేళా
రాగఘోషములు మ్రోగినవి!

* * * *

ఆయుదయకాల రమ్యరహస్యగర్భ
సురభిళలతాంత గుచ్ఛమాధురులయందుఁ
దనుప్రపులకించు నూతనోత్సాహకలిత
మోదభరమున నాకనుల్ మూఁతవడియె!

అపుడుపొడమిన గాఢమాంద్యమున రేఁగి
కాలగర్భనిలీనాంధకారమందుఁ
దరలిపోయితి భావసౌదామినీల
తాంచలసురక్షితస్థలి నధివసించి!

ఆదినోదయవేళాప్రయాణశుభము
హూర్తమున భావనాభావితోత్సవమున
నాకుఁ గనవచ్చె విస్మృతానేకచరిత
గతపురాతనసమయభారతధరిత్రి!

అప్పుడనదృశశాంతి మహత్త్వాగతుల
వెనుకదినములఁ బ్రజ్వలించిన-చిరంత
నార్యవైభవవహ్ని సహస్రశిఖలు
కనులుపొడిచిన మెఱుపులై కానుపించె!

అదియె ఋష్యాశ్రమమనోజ్ఞ దివిజసదన
నిభతలమ్ములు వారె మహావిప్రకాండు
లదియె ఘోషిలు దిక్కటాహములు నిండి
మారుమ్రోఁతల ఋగ్వేదమంజురవళి!

ఆసనాతనకాల ప్రభాసమేత
వేదభూసురఘోషా నవీనగతులఁ
బలుకుదెలియని తన్మయత్వమునుగనిన
నాహృదంతరమునకు లీనతఘటిల్లె!

* * * *

ఐంద్రహరిత్సముదంచితదీధితు
లంధకారముల నడచినవి!
సాంద్రవికాసస్ఫీతమధ్వుదయ
సరసిజదళములు విరిసినవి.

పసలేదు. చక్కని తెలుగుపాట పాడుతున్నాడు. నేను వంతెనమీదికి వెళ్లి నిలబడ్డాను. ఆసన్యాసి నాకేసి కన్నెత్తి చూడనేలేదు.



తదేకదీక్షతో కళ్లు మూసుకొని పాడుకొంటున్నాడు.

"ఇల్లువాకిలిగాని, ఇల్లాలుగాని, నీ
కెపుడు తోడౌనటే ఓమనసా!
కల్లబంధాలెల్ల చల్లగా తెంపుకొని
గతి యేదోచూడవే ఓమనసా!

భవ్యతేజోమూర్తి, భవకర్ణధారి ఆ
పరమేశు డొక్కడే ఓమనసా!
ఆపదలు, గీపదలు అణగునే యికనయిన
అతడె శరణనుకోవె ఓమనసా!"

ఆసన్యాసికి గడ్డాలు మీసాలు లేవు. బోడితల. కాషాయవస్త్రాలు కట్టుకొన్నాడు. ఈ బర్మాదేశములో, ఈబౌద్ధసన్యాసినోట చక్కని తెలుగుపాట విని నేను నివ్వెరపోయాను. నానోట మాట రాలేదు. కీర్తన అయిపోయింది. కొంచెము సేపటివరకూ కళ్లు మూసుకొని ఏదో యోగసమాధిలో ఉన్నట్లు ఉన్నాడు సన్యాసి. తర్వాత ఏవోమంత్రాలు కాబోలు, నెమ్మదిగా గొణిగాడు. అవి పాలీభాషలో ఉండడము వల్ల నాకేమీ అర్థముకాలేదు. కాని వినడానికి సొంపుగా మాత్రము ఉన్నవి. ఈ తెలుగుపాటా, ఈపాలీమంత్రాలూ, నన్నా సన్యాసికి మరింతదగ్గరగా లాగినవి. అతడు కళ్లు తెరవగానే నేను మరింతదగ్గిరికి వెళ్లి నిలుచున్నాను. నావాలకము చూచి ఆయన నవ్వాడు. నేను నెమ్మదిగా "మీరెప్పుడైనా తెలుగుదేశము వెళ్లారా యేమిటి?" అని అడిగాను.

"అవును, వెళ్లాను. నీ విక్కడికి వచ్చి ఎన్నాళ్లయింది?"

"నేను వచ్చి యిప్పటికప్పుడే ఏడాది వెళ్లింది. ఇక్కడ ప్లీడరీ చేస్తున్నాను. మీ రెక్కడా ఉండడము?"

"ఫలానిచోట నివాస మని లేదు. నేను బౌద్ధ భిక్షువును. ఊరికే తిరుగు తుంటాను. దగ్గర ఏమఠ ముంటే దానిలో పడుకుంటాను. 'సత్రేభోజనం, మఠేనిద్రా.' నేనూ తెలుగువాడనే."

ఆకాశమంతా దట్టమైన మబ్బు గమ్మి ఉన్నది. హఠాత్తుగా ఒక పెద్ద ఉఱుము ఉఱిమింది. నేను ఉలికిపడి పైకి చూచాను. తప్పకుండా వాన వస్తుందని తోచింది. రంగూననగరములో వానలకు విధీ విరామమూ ఉండదు.

వాన కురవడము మొదలు పెట్టితే ఇక వెలవడ మంటూ లేదు.

"మబ్బు దట్టముగా పట్టింది. వాన రాక తప్పదు. మీరు మాయింటికి దయచేయండి" అన్నాను నేను.

"గృహస్థులయింట్లో కాలుబెట్టి చాలా రోజు లయింది. అయినా నీవు తెలుగువాడవు. పద. వస్తాను." అని లేచాడు సన్యాసి. వంతెన దగ్గరనే గుఱ్ఱపు బండిని విడిచిపెట్టి వచ్చాను నేను. వాన ప్రారంభమయింది. కొంచెము తడుస్తూ తడుస్తూనే వంతెన దిగి మేము బండి దగ్గరికి వచ్చి ఎక్కాము. బండి మా యింటి వైపు మళ్లింది.

మాయింట్లో నా 'డ్రాయింగ్ రూము' చక్కగా సర్ది ఉన్నది. పరదాలూ, పటాలూ, బొమ్మలూ, కుర్చీలూ, టేబిలూ, అన్నీ ఏది ఎలా ఉండాలో అలా అమర్చింది నాభార్య. ఆమె నేర్పే ఆగది అంత శుభ్రముగా, అంత చక్కగా, ఉండడానికి కారణము. తళుక్కున మెరుపు మెరిసింది. ఆవెలుతురులో ఆగదిలోని చిన్నా పెద్దా వస్తువులన్నీ చక్కగా ఉన్నట్లు కనబడినవి. లోపలినుంచి ఆగదిలోకి రావడానికి ఒక గుమ్మ మున్నది. ఆగుమ్మము లోనే ప్రాణము గల చిత్రపటము లాగున కదలక మెదలక నాభార్య నిలుచున్నది. ఆ మెరుపు మెరిసినప్పుడు నాభార్య ఎంత చక్కగా కనబడిందో నేను చెప్పలేను. కానీ ఏమిటిది? ముందుగా బండి దిగి గడపలో కాలుబెట్టాడో లేదో ఆసన్యాసి నాభార్యను చూచి, "ఇదేమిటి? ఎవరు?" అని ఒక్క కేక వేసి కింద కూలబడ్డాడు. క్రమ్మక్రమంగా అతనికి తెలివి తప్పిపోతున్నట్లు తోచింది. నాభార్య భయపడుతూ నాపక్కకు వచ్చి నిలుచున్నది. నేను గబగబా వెళ్లి 'స్మెల్లింగుసాల్టు' సీసా తీసుకొని అతని దగ్గరికి వెళ్లి కూర్చున్నాను. ఆసన్యాసి మెల్లగా "అక్కర లేదు. కొంచె ముండు. ఏమీ ఫరవా లేదులే" అని లేచి కూర్చొని ఏదో ధ్యానము మొదలు పెట్టాడు. ఆగదిలో బౌద్ధ సన్యాసుల బొమ్మలు చాలా ఉన్నవి. ధ్యానిస్తూ ఉన్నప్పుడు ఈ సన్యాసి కూడా ఒక బొమ్మలాగే ఉన్నాడు. నాభార్యమనసు కొంచెము కుదుట బడింది. ఈసన్యాసి తెలుగువాడేనని నేనప్పుడు ఆమెకు చెప్పాను. ఆమె మెల్లగా నా పక్కనే కుర్చీమీద కూర్చున్నది.

బయట వాన పెద్దదయింది. ఒక తుపానులాగు ఉన్నది వాన. ఏనుగుతొండములావు ధార పడుతున్నది. పెద్ద యీదురుగాలి. నడుమ నడుమ ఉఱుములూ మెఱుపులూను. సన్యాసి కళ్లు తెరిచాడు. అతని కాళ్లకు వంగి నమస్కరించి, "ఏమి స్వామీ! నామీద తమకు కోప మెందుకు? నేనేమి అపరాధము చేశాను?" అని సవినయముగా అన్నది నాభార్య.

"లేదమ్మా లేదు. నీమీద కోప మేమిటి?" అన్నాడు సన్యాసి నవ్వుతూ.

"కొంచెము తేనీరు తెచ్చి ఇయ్యమంటారా?"

ఈమాట విని సన్యాసి కొంచెము నవ్వుతూ, "సరే! తీసుకొనిరా!" అన్నాడు. స్వయముగా టీ తయారుచేసి తీసుకొని రావడమునకు నాభార్య వెళ్లింది. సన్యాసి నావైపు చూచి "నీభార్య పేరేమిటి?" అని అడిగాడు.

నాకు కొంచెము సిగ్గూ, ఆశ్చర్యమూ కలిగింది. చెప్పక పోవడమేమి? నాభార్యపేరు నేను చెప్పనా? అయినా ఈకాలములో తప్పులేదని "అనితమ్మ" అని సమాధానము చెప్పాను.

ఆపేరు వినడముతోనే సన్యాసికి పిడుగు పడ్డట్టు అయింది. ఏదో విద్యుత్ప్రవాహము అతని శరీరములో ప్రవహించిన ట్లయింది. గాలి



కి రావిఆకులాగువ అతడు నిలువున చలించి పోయాడు. ఆకంగారూ, ఉద్రేకమూ చూచి నేను బెదరిపోయాను. వెంటనే ఆసన్యాసి కళ్లు మూసుకొని మరల యోగసమాధిలో మునిగి పోయాడు.

కొంచె మేదో చిరుతిండీ, టీనీరూ, తీసుకొని నాభార్య వచ్చింది. సన్యాసి కొంచెము సేపటికి కళ్లుతెరచి చూచాడు. నవ్వుతూ ఒక కుర్చీమీద కూర్చొని అవి పుచ్చుకొన్నాడు. తర్వాత "అబ్బా! ఏమిటీవాన! ఈవేళ ఏదో మూడింది. ఏదో విపరీతానికే భగవంతు డిదంతా కల్పించాడు." అని, కొంచెమాగి, మళ్లా మాకేసి చూచి, "నాసంగతి తెలుసుకోవాలని ఉన్నదా మీకు?" అని అడిగాడు. నేనూ, నాభార్యా ఒకరిమొగము ఒకరు చూచుకొన్నాము. తర్వాత "చిత్తము" అన్నాము.

"అంతా చెప్పడానికి ఇప్పుడు సావకాశము లేదు. టూకీగా చెపుతాను. వినండి. ఇరవయ్యోయేట నేను బి. ఎ. ప్యాసైనాను. ఆయేడే నాభార్య కాపురానికి వచ్చింది. నాభార్య అంటె నాకెంతో ప్రేమ. ఆమెను విడిచిపెట్టి ఒక నిమిషమైనా ఉండలేకపోయేవాణ్ణి. అటువంటప్పుడు పొరుగూళ్లలో చదవడము నాకిష్టము లేకపోయింది. అందుచేత చదువుతున్న 'లా' మానేశాను. ఏదైనా వ్యాపారము చేయాలని బర్మాకు ప్రయాణమైనాను. ఇది చాల రోజుల క్రితముమాట: అయినా ఈవేళ జరుగుతున్నట్లే ఉంది. నేను బయలుదేరి వస్తున్నప్పుడు గుడ్లనీరు గుక్కుకుంటూ చూస్తూ నిలుచున్న నాభార్య యిప్పుడు కళ్లకు గట్టినట్లు

ఉన్నది. అప్పటి సంగతు లన్నీ ఒక్కటొక్కటే మనసుకు తట్టుతున్నవి.

బర్మా వచ్చాను నేను. కొన్నాళ్లు రంగూనులో వ్యాపారము చేసి కొంతడబ్బు సంపాదించాను. తర్వాత టేకుకఱ్ఱ వ్యాపారము చేయాలని బుద్ధి పుట్టింది. అందుకోసము ఈటంగూనగరము వచ్చాను. అప్పుడు నేను ఈయింట్లోనే కాపురమున్నాను. ఈయింటికి పడమటి వైపున గుఱ్ఱాలసాల ఉన్నది కదూ! అందులోనే నాగుఱ్ఱపుబండీ, రెండు బర్మాగుఱ్ఱాలూ ఉండేవి. ప్రతిరోజూ సాయంకాలము గుఱ్ఱపుబండిమీద సిటాంగునదీతీరానికి షికారు వెళ్లడము నాకలవాటు. రోజూ వెళ్లుతుండేవాణ్ణి. నేనెక్కడ గుఱ్ఱపుబండి దిగి నడక సాగించేవాణ్ణో అక్కడనే రోడ్డుపక్కన ఒక ఇల్లున్నది. ఆయింటి వీథివైపు కిటికీలో, నేను బండిదిగే సమయానికి ఏదో అందమైనముఖము నన్ను చూస్తున్నట్లు కనబడేది. నేనుకూడా ఒకరోజు పరకాయించి అటుకేసి చూచాను. ఆముఖము నవ్వుతూ ఉన్నట్లు నాకుతోచింది. సరే రోజూ అలాగే షికారు వచ్చేవాణ్ణి, అలాగే ముఖము కనబడేది, అలాగే పరకాయించి చూచేవాణ్ణి, అలాగే నవ్వుతూ ఉండేది. ఇల్లా కొన్నాళ్లు గడచినవి. రోజుకు రోజుకు ఆనవ్వు ఆదోవిధముగా మారిపోతున్నట్లు నాకు తోచింది. ఏమిబుద్ధి పుట్టిందో ఒకరోజున దిగకుండా బండిమీదే కూర్చొని కొంచెము సేపు ఆవైపు చూస్తున్నాను. నాకేసి చూస్తూ ఆముఖము-ఆ అందమైన ముఖము-నవ్వుతూ ఆ కిటికీలోనే ఉన్నది. తల్లో పూలదండ, చెవులకు వజ్రపుపోళ్ల దుద్దులూ, వంకపాపిడీ, కళ్లలో, ముఖానా చిరునవ్వూ, ఆనవ్వులో ఒక విధమైన శృంగారమూ, ఇవన్నీ చూచేటప్పటికే నా మనసు మనసులో లేదు. ఏమి చేయడానికీ తోచలేదు. అలాగే చూస్తూ కూర్చున్నాను. ఇంతలోనే ఆకిటికీలోనుంచి దోసెడు సంపెంగపూలు వచ్చి నాబండిలో పడ్డవి. నేను ఆశ్చర్యపోయి ఆపూవులు ఏరుకోవడానికి వంగాను. ఏరుతూ ఏరుతూ కిటికీ వైపు చూచాను. అక్కడ ఎవరూ లేరు. పూవులన్నీ ఏరి చేతులో పట్టుకొన్నాను. ఇంతలోనే ఎవరో చల్లగా నన్ను ముట్టుకొన్నారు. నేను తల ఎత్తి చూచాను. ఆశ్చర్యము! ఆకిటికీలోని చందమామే; ఆ అందమైన పడుచుపిల్లే; నవ్వుతూ నా చెయి పట్టుకున్నది.



ఆవేళ శుక్లచతుర్దశి. లేత లేత వెన్నెల అసిటాంగునదీ జలముమీద 'బుకుములు' తెర లాగున పడి ఉన్నది. అది సౌందర్య లక్ష్మి మేలి ముసుగులా గున్నది. చల్లని పిల్లగాలులు జోకొట్టు తున్నట్లు మేనికిసోకుతూ వీస్తున్నవి. నేను ఈవేళ కూర్చున్న వంతెన అప్పటి కింకా కట్టలేదు. రేవులో చిన్నచిన్న పడవ లెన్నో ఉన్నవి. టేకు పలకలను తెప్ప కట్టి ఆనది మీదనే దేశదేశాలకు తీసుకొని వెళ్లుతారు. అటువంటి తెప్పలు రేవుపొడుగున ఉన్నవి. ఆ తెప్పలమీదనే చిన్నిచిన్ని గుడిసెలు వేసుకొని తెప్పలవాళ్లు నివసిస్తుంటారు. వాళ్లు ఎంతో చక్కగా పిల్లనగ్రోవి ఊదుతున్నా రావేళ.

ఆయువతి నాచేయి పట్టుకొని ఆనదివైపు తీసుకొని వెళ్లింది. నేను మాట్లాడలేకపోయాను. మంత్రముగ్ధుడిలాగున ఆమె తీసుకొని వెళ్లినట్లల్లా వెళ్లాను. నదీతీరాన ఒక తెప్పమీద కూర్చున్నాము "నీపేరేమిటి?" అని నే నడిగాను. "సాలోయా! సాలోయానే (సంపెగ) ఇప్పుడు నీపదార్పణ చేశాను."

తర్వాత ఎన్నో మాట్లాడినాము. అవన్నీ యిప్పుడు చెప్పి లాభములేదు. చాలాసేపైన తర్వాత నేను ఇంటికి బయలుదేరాను. నా బండి ఆకిటికీదగ్గరే వున్నది. ఆమే, నేనూ అక్కడికి వచ్చాము. నేను బండి యెక్కాను. అప్పుడు సాలోయా నాచేయి మెల్లిగా నొక్కుతూ, "నీభార్య యెక్కడున్నది?" అని అడిగింది. నేనొక నిట్టూర్పు విడిచి, తటుకు బెటుకు లేకుండా, "నాకింకా పెండ్లి కాలేదు." అన్నాను. నాగుండెలు కొంచెము కొట్టుకోకపోలేదు.

మరునాడు నాబండి సాలోయా ఇంటిదగ్గిరకి వచ్చింది. ఆమె ఆకిటికీలోనే ఉన్నది. నన్ను చూచి పరుగెత్తుకొని వచ్చి నవ్వుతూ బండి ఎక్కి నాపక్కనే కూర్చున్నది. నేను నవ్వుతూ ఆమెకేసి చూచాను.

"సరోవరము దగ్గరికి వెళ్లుదాము" అన్నదామె.

బండి వెనుకకు మళ్లింది. రోడ్డుమలుపు తిరిగి సరోవరానికి వెళ్లాలి. బండి మలుపు తిరిగి రోడ్డెక్కింది. అబ్బా! గుఱ్ఱాలు ఎంత గబగబా నడిచినవి!

ఇంగ్లీషు ప్రభుత్వము రావడానికి చాలా పూర్వము ఆసరోవరము పక్కనే వుండేది రాచనగరు. ఇప్పుడు దానితాలూకు ప్రహారీ గోడమాత్రమే ఉన్నది. ఆగోడమీదా, పక్కనా, మంచి గంధపుచెట్లూ, కర్పూరపుచెట్లూ, ఇంకా ఏవేవో పలురకాలచెట్లూ దట్టముగా ఉన్నవి. ఆసరోవరానికి తూర్పువైపున 'పెగోడా' ఉన్నది. దాని బంగారుశిఖరమూ, ఆశిఖరము చుట్టూ ఉన్న బంగారుగంటలూ, ఆచరమసంధ్యాకాంతిలో తళతళ మెరిసిపోతున్నవి. ఆగంటలు గాలికి మెల్లగా కదలుతూ అతిమనోహరముగా, మధురముగా మోగుతున్నవి. ఆ సరోవరములో ఈదుతూ ఉన్న పెంపుడుహంసలను పట్టుకొని చీనావాళ్లు ఇండ్లకు వెళ్లిపోతున్నారు. సందెచీకటి పడీపడకమునుపే వున్న

మ వెన్నెల వచ్చి స్వచ్ఛమైన ఆసరోవర జలము మీద వాలింది. నవ్వుతూ నీటిమీద తేలి ఆడుతున్న ఆవెన్నెల్లో ఆసరోవరము ప్రశాంతముగా ఉన్నది. పిల్లగాలికి అప్పు డప్పుడు చిన్ని చిన్ని తరంగాలు లేచి కూనిరాగాలు తీస్తూ వెన్నెలను కౌగిలించుకుంటున్నవి.

నేనూ, సాలోయా ఒకచిన్న బోటుమీద ఎక్కి నడిసరోవరానికి వెళ్లాము. తర్వాత బోటును గాలికి వదిలిపెట్టాము. నెత్తిమీద నిండుజాబిల్లి; కింద అద్దములాటి సరోవరము; చుట్టు దడిగట్టినట్లున్న చెట్లూ; సరోవరములో ప్రతిఫలించిన వాటినీడలూ. ఆసౌందర్యము నిజముగా—

ఇక కథ ఏమి చెప్పను? సాలోయా నా యిలవేల్పయింది. నాయింటికి వచ్చి పెత్తనము వహించింది. నాదగ్గర వంట చేయడానికి ఒక తురక ఉన్నాడు. సాలోయా మాటప్రకారము ఆతురకవాడికి సెలవు చెప్పి ఒక బర్మావాడిని వంటకు పెట్టాము. ఈబర్మావాడు సాలోయా చుట్టము.

ఇక ఈవైపునుంచి నాభార్య మాటి మాటికి వస్తున్నా నని జాబులు వ్రాయడము మొదలుపెట్టింది. నాచేత నైనన్నాళ్లు ఏవో లేనిపోని సాకులు చెప్పి ఆమెను రాకుండా ఆపాను. చివరకు నామాట పాటించకుండా ఇక్కడికి రావడానికి ఆమె బయలుదేరింది.

స్టీమరు దిగి రైలుమీద ఆమె టంగూ నగరము వచ్చింది. నేను 'స్టేషను'కు వెళ్లి ఆమెను కలుసుకొన్నాను. బండి ఎక్కిన తర్వాత నే నామెతో నాదురవస్థ అంతా సూచా తప్పకుండా చెప్పాను. ఆమె ఏడ్వ మొదలు పెట్టింది.


"మీరు ఏదోవిధముగా ఇక్కడ సుఖముగా ఉన్నారని తెలిస్తే నే నస లిక్కడికి బయలు దేరక నే పోదును. మీరు దేశముకాని దేశములో ఏమి కష్టపడుతున్నారో అని వెఱ్ఱి దానిలాగు పడిపోయినట్లు పరుగెత్తుకొని వచ్చాను. సరే! ఏమైనా కానీయండి! ఇప్పుడే తిరిగి నన్ను ఇంటికి పంపించినా సరే. లేకపోతే వేరే ఏదైనా ఇల్లు మాట్లాడి నన్నక్కడ ఉంచినా సరే. నేను ఆమనిషి ఉన్న ఇంటికి రాను." అన్నది నాభార్య.

నే నేమీ మాట్లాడలేదు. బండివచ్చి ఇంటివాకిట్లో ఆగింది. నేను ఆమెకళ్లు తుడిచాను. ఆమె బండీ దిగింది.

ఆరునెలలపాటు ఏదో ఒకమాదిరి గడిచింది. తెరవెనక ఏమిగందరగోళము జరుగుతున్నదో నేను ఎరగనే ఎరగను. క్రమముగా సంగతి సందర్భాలన్నీ నాకు తెలియవచ్చినవి. ఇక నాయాట సాగ దనుకొన్నాను. నేను తెచ్చే డబ్బంతా సాలోయాచేతిలోనే ఉండేది. కొత్త వంటవాడు తనయిష్టము వచ్చినట్లు ఖర్చు చేసేవాడు. నాతో చెప్పేవాడే కాడు. ఇది ఇల్లా ఉండగా, వీ ల్లిద్దరూ కలసి నాభార్యమీద ఏమి దౌర్జన్యము చేస్తున్నారో అదికూడా చూచాయగా నాకు తెలిసింది.



3. కైసరిబాగ్ ద్వారము-లక్నో



౮. కైసరిబాగుయొక్క ౧౮౫౦ సంవత్సరమునందలి దృశ్యము-లక్నో

నే నొకరోజున సాలోయాతో "ఒంట్లో ఆరోగ్యము సరిగా లేదు. మా దేశము తిరిగి వెళ్లుతాను." అన్నాను.

"నన్ను కూడా నీవెంట తీసుకొని వెళ్లు."

"ఎల్లా వీ లవుతుం దది ?"

"అయితే నీ పెళ్లాన్ని ఇక్కడ అట్టే పెట్టి వెళ్లు."

"అది వీలు కాదు."

"ఎందుకు వీలుకాదు ? ఆమె ఇక్కడ ఉండటానికే సంబరపడుతుం దనుకుంటాను." అని హేళనగా నాకేసి చూసింది సాలోయా.

"ఏమిటామాట?" అని నేను కొంచెము కోపముతో గద్దించాను.

"నీవేమో గట్టికబుర్లు చెప్పుతున్నావు! నీభార్య ఇప్పుడు కడుపుతో ఉన్నది. నేను గట్టిగా తలుచుకున్నానంటే నీభార్యను కూనీ చేయగలను. కాకపోతే చేయించగలను. ఇది ఆవిషయములో ఆరితేరిన చేయి. తెలిసిందా?"

నాకు మాట్లాడడానికి నోరు రాలేదు. ఇది జరిగి రెండునెల లయింది. ఈ రెణ్ణెల్లు కూడా నేను టంగూనగరము చుట్టుపట్ల గ్రామాదులలోనే తిరుగుతూ ఉన్నాను. నేను టంగూనగరము వచ్చిననాడే నాభార్య నొప్పులుపడి ఒక ఆడపిల్లను కన్నది. ఆవేళ ఒక బౌద్ధసన్యాసి మాయింటికి వచ్చాడు. నేను సంతానము కలిగిందనే సంతోషముతో ఆవచ్చిన సన్యాసిని ఎంతో గౌరవముచేసి ఆతిథ్యమిచ్చాను. ఆబౌద్ధసన్యాసి నాతో "నాయనా, సంతానము గలిగిందని ఆనందము వద్దు. ఈ సంసారము అనిత్యము. ఈ భార్యా పుత్రులు అనిత్యము. మాయ, మోహము-అన్నీ అనిత్యమే" అన్నాడు. అతడు మాట్లాడుతున్నంతసేపూ "అనిత్యము" అనేమాటతప్ప మరొకటి మాట్లాడలేదు. స్ఫుటమైన ఉచ్చారణ లేక ఆమాటనే 'అనితం' అనేవాడు. అతడు వెళ్లిపోయిన తర్వాత నేను నాభార్యతో "మన చిట్టికి 'అనితమ్మ' అని పేరుపెడదాము" అన్నాను. నాభార్యకూడా సరే అన్నది."

సన్యాసి ఈమాట అనగానే నాభార్య అతనికాళ్లమీద పడి, "నాన్నా, నేనే నీ అనితమ్మను" అన్నది.

సన్యాసి "అవును నిజమే నమ్మా! నీవు సరిగా మీ అమ్మపోలికే. కన్నూ ముక్కూ తీరు, మాటా, గొంతూ, సరిగా ఇచ్చి పుచ్చుకొన్నట్లు మీ అమ్మమాదిరే. తర్వాత కథ వినండి. కథంతా సరిగా పూసగుచ్చినట్లు చెప్పలేను. నేను ఒకరోజున టంగూనగరానికి ఇరవైమైళ్ల దూరములో ఉన్న ఒక ఊరి 'ట్రావెలర్సు బంగాళా'లో ఉన్నాను. అప్పటికి సాయంకాలము కావచ్చింది. హఠాత్తుగా సాలోయా అక్కడికి ఊడిపడ్డది. కారణ మేమిటో నాకు తెలియలేదు. నే నడిగాను. ఎన్నిసారులడిగినా "నిన్ను చూడకుండా ఉండలేక పోయాను. అందుకే వచ్చాను." అనేమాటనే రకరకాల భావాలతో, ఎన్నో విధాల చెప్పింది. చివరకు ఆమాటా ఈమాటా అయిన

తర్వాత నాతో “నామాట నీవు నమ్మవు. నేను రోజూ కళ్లారా చూస్తున్నాను నీభార్య సంగతి. నా వెంట నీవు వస్తే ఈవేళ నీకు కూడా ప్రత్యక్షముగా చూపిస్తాను” అన్నది.

నేనామెమాట అణుమాత్రమూ నమ్మలేదు. కాని ఒక సారదేమిటో చూడాలని మాత్రము మనసుపుట్టింది. ఆ మరునాడు రెండుజాముల వేళకు మోటారుమీద టంగూ నగరము వచ్చాము. మాయింటికి వచ్చి చూచేటప్పటికి తలుపు లోపల గొళ్లెము వేసి ఉన్నది. సాలోమీ చిత్రముగా ఎల్లాగో బయటినుంచే లోపలిగొళ్లెము తీసింది. ఏమున్నది లోపల? చంటిబిడ్డతో నాభార్య పడుకున్నది. ఆపక్కమీదనే ఒకవైపు వంటవాడు పడుకున్నాడు. నాభార్య గాఢనిద్రలో ఉన్నది. నాతల తిరిగిపోయింది. ప్రపంచము తలక్రిందులైపోయినట్లు తోచింది. వెంటనే ఈపన్నాగమంతా సాలోమీ పన్నిందని మెరుపు మెరిసినట్లు నామనసున తోచింది. వంటవాడు మేలుకొనే ఉన్నాడు. మేమింట్లోకి రావడము చూసి వాడు మెల్లగా నాభార్యమీద చేయి వేయబోయాడు. నాకు ఒళ్లు మండింది. ‘ఖబడ్దార్’ అని ఒక కేకవేసి నేను అగడిలోనే ఒకమూల వేలాడుతూఉన్న కత్తి తీసుకొన్నాను. నావంటవాడు నాముందే నాభార్యను అవమానపరుస్తున్నాడని నాకెక్కడలేని కోపము వచ్చింది. చేతికొద్దీ కత్తి విసరివేశాను. ఆదెబ్బ భుజమును దూసుకొనిపోయి తలకు తగిలింది. తెలివి దప్పి క్రింద పడిపోయాడు వాడు. ఇంటినిండా నెత్తురు. మహాభయంకరముగా ఉన్నది. సాలోమీ కేకలు వేస్తూ వెళ్లి ఆవంటవాడిని కౌగిలించుకొని ఏడ్వ మొదలు పెట్టింది. ఈగందరగోళముతో, నాభార్య లేచి చూచి, గబగబా వచ్చి నాచేతిలో కత్తి లాగి ఒకపెట్టెలో పెట్టి తాళము వేసింది. జరిగిన సంగతి ఆమెకు తెలియదు. ఇంకొక మోస్తరుగా తోచింది ఆమె నాదగ్గరికి వచ్చి విసనకర్రతో విసరుతూ, “నేను ఇన్నాళ్లదాకా ఈసాలోమీ సంగతి మీకు చెప్పలేదు. ఈవేళ గ్రహచారము చాలక మీకంట బడ్డది. ఏమిటి ఈగందరగోళము? ఈ కోపమునక ఎందుకు వచ్చింది?” అన్నది. అసలుసంగతి ఆమె ఊహించను కూడా ఊహించలేకపోయింది. ఆ అమాయకురాలిని నేనేమనను?



“‘ఖబడ్దార్’ అని ఒక కేకవేసి......కత్తి తీసుకొన్నాను.”

సరే; వంటవాడు ఆసుపత్రికి వెళ్లాడు. నేను జయిలుకు వెళ్లాను. అసలుసంగతి బయటబడ్డది. వంటవాడికి సాలోయా ప్రియురాలు. వాళ్లిద్దరి ఖర్చులూ భరించడానికి నేనొక సాధనాన్ని మాత్రమే. ప్రతిరోజూ నాభార్య ఈ సంగతి కళ్లార చూస్తూ వింటూకూడా, నామనసు బాధపడుతుందని నాతో చెప్పలేదు. ప్రతిక్షణము వేయితేళ్లు కుట్టినట్లు ఆమెమనస్సు బాధపడుతూ ఉన్నప్పటికీ ఈవిషాన్ని ఏలాగున సహించిందో ఎవరు చెప్పగలరు?"

సన్న్యాసి మరి మాటాడలేదు. నేలచూపు చూస్తూ, కిందపడిఉన్న ఏకతార తీగ రెండుసారులు వేలితో మీటాడు. నాభార్య వెక్కివెక్కి ఏడుస్తున్నది. అదిచూచి సన్న్యాసి మళ్లా "చూడు తల్లీ! ఏడవకమ్మా! అనితా! నాకేసు విచారణకు వచ్చింది. నాతరపున పెద్దపెద్ద అడ్వకేటులు పనిచేశారు. చివరకు నాకు ఏడేండ్లు కఠినశిక్ష పడింది. జయిలులో సంగతు లెందుకు చెప్పడము? శిక్షపూర్తికాగానే జయిలులోనుంచి సరాసరి ఈయింటికి వచ్చాను. వంటవాడూ, సాలోయా భార్యాభర్తలులాగున ఇక్కడే కాపురముంటున్నారు. నన్ను చూసి వంటవాడు వెఱ్ఱినవ్వునవ్వుతూ, "మళ్లానన్ను చంపడానికి వచ్చావా? నాతోటలోని ఈసాలోయా సుమాన్ని మళ్లా కొంచెము వాసనచూస్తావా?" అన్నాడు.

'చూడను.' అన్నాను నేను.

సాలోయా నవ్వుతూ "మాకాపరాన్ని గంగలో కలుపుతావా?" అన్నది. నేను అడ్డముగా తలవూపి "నాభార్య ఎక్కడ!" అని అడిగాను.

"ఈ 'బర్మాభర్త' దొరకలేదని ఆత్మహత్య చేసుకొన్నది."

ఆమాట నాకేమీ ఆశ్చర్యము వేయలేదు. "మాఅమ్మాయి యేది?" అని నేను మళ్లా అడిగాను.

"రంగూనులో అమ్మేసి వచ్చాము."

నేను మరిమాటాడ లేదు. అక్కడనుంచి వచ్చేశాను. తర్వాత ఆపిల్లకోసము చాలా వెదికాను. కాని ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయినవి," అని తనకథ ముగించాడు.

అప్పుడు నాభార్య "ఎల్లా కనబడతాము మరి? నన్ను తీసుకొని మాఅమ్మ తాతగారింటికి వెళ్లింది. మామామయ్యను అనంతపురము బదిలీచేశారు. మేము మామయ్యవెంట అక్కడికి వెళ్లిపోయాము" అన్నది.

తర్వాత సన్న్యాసి "అంతా అయిపోయింది. ఈ ప్రపంచమంతా మిథ్య-అనిత్యము. ఈ మాటే నాకు నచ్చింది. దీన్ని అనుభవములో పెట్టడమునకూ, నాకడుపుమంట చల్లారడమునకూ, ముక్తి సంపాదించడమునకూ, బౌద్ధమత మవలంబించాను. కొన్నాళ్లకు సన్న్యాసము పుచ్చుకొన్నాను. తర్వాత ఈనగరములో ఉన్న 'సుఖాతాపెగోడా'లో కొన్నాళ్లు, రంగూనులో ఉన్న 'సాడేలాపెగోడా'లో కొన్నాళ్లు కాలము గడిపాను. తర్వాత అక్కడా, అక్కడా, తిరిగి తిరిగి మళ్లీ ఏడేండ్లకు ఈనగరము వచ్చాను." అన్నాడు.

నాభార్య మళ్లీ, "నాన్నా! మాఅమ్మ తాతగా రింట్లో ఉన్నన్నాళ్లు చేతిగాజులు చిట్లించలేదు. రెండుపూటలూ ముఖాన పసుపు రాచుకొని. కుంకుమబొట్టు పెట్టుకొనేది. అంతే కాని ఒకపండుగనీ, పబ్బమనీ, ఒకసంతోషమనీ, సంబరమనీ ఏమీ ఉండేదికాదు. ఎప్పుడూ ఉవ్వెళ్లా ఉపవాసాలతో ఉండేది. ఎప్పుడూ ఆమె ముఖాన చిరునవ్వు చూడలేదు నేను. పొద్దస్తమానమూ ఏడుస్తూ ఉండేది. ఎవరైనా నీసంగతి తలపెట్టితే 'ఎక్కడున్నారో ఏమీ తెలియదు.' అని చెప్పేది. నామట్టుకు నాకు కూడా ఈసంగతి చెప్పలేదు. అప్పుడప్పుడు మాత్రము 'నీపెళ్లి అయిన తర్వాతనే నొకసారి బర్మా వెళ్లిరావాలి' అనేది. ఇక్కడ వకాల్తీ చేయమని బలవంతపెట్టి ఈయనగారిని ఆమె తీసుకొని వచ్చింది. మీరెప్పటికైనా తప్పక కనబడతారని, మీకాళ్ల దగ్గరే తనప్రాణాలు విడవవచ్చునని, ఆమె అనుకొన్నది కాబోలు. పాపము! ఆమె ఉద్దేశము ఇప్పుడు తెలుస్తున్నది. చివరకు ఆమె కోరిక నెరవేరనే లేదు. ఆమె చనిపోయి ఈ వేళకు పదహారు. ఒక్క పదిహేనురోజులు ముందుగా వచ్చి ఉంటే నీవు, ఆయిల్లాలి ఆత్మ ఎంత సంతోషించేదో!" అన్నది.

ఈమాట విని సన్యాసి ఒకవెఱ్ఱికేక వేశాడు. ఉఱుమైనా అంత భయంకరముగా ఉండదనుకొంటాను. నాకప్పటికి రెండేండ్ల కొడుకు. అంతవరకు వాడు దాదిదగ్గర నిద్రపోతున్నాడు. ఈసన్యాసి కేకతో నిద్రలేచి వాడు కాళ్లూ చేతులూ విదిలిస్తూ, 'అమ్మా అమ్మా' అని ఏడుపు మొదలుపెట్టాడు. నేనుకూడా వాడివైపే చూస్తూ ఉన్నాను. నాభార్య వాడిని ఎత్తుకొని ఓదార్చి సన్యాసివైపు వేలు చూపిస్తూ, "అదుగో తాతయ్య, చూడు." అని అన్నది.


'తాతా తాతా' అంటూ కుఱ్ఱవాడు చప్పట్లు కొట్టుకుంటూ సన్యాసి దగ్గరికి వచ్చాడు. సన్యాసి లేచి నిలుచున్నాడు. నాభార్య ఏడుస్తూ అతని కాళ్లుపట్టుకొని, "లేని అమ్మ లేనేలేదు. ఇన్నాళ్లకు నీవు కనబడ్డావు. నిన్ను నేను పోనియ్యను. నీవు ఇక్కడే ఉండాలి" అన్నది. "నేను సన్యాసిని. మాకు సుఖదుఃఖాలుగాని, బంధాలుగాని లేవు. ఈ ప్రపంచమంతా మిథ్య."

"ఆ మాట లేమీ పనికిరావు."



'హా' అని సన్యాసి మళ్లా కేకవేశాడు. చంటికుఱ్ఱవాడు భయపడి కేరుమన్నాడు. నా

భార్య వాడిని ఎత్తుకొని ముద్దుబెట్టుకొని ఓ దార్చడానికి నాలుగడుగులు వేసింది. ఈలోపల సన్యాసి బయటికి వెళ్లాడు. ఫెళ ఫెళా ఉఱిమింది. 'హాహా' అనే సన్యాసి అఱపుకూడా ఆ ఉఱుములో కలసిపోయింది. ఆచీకట్లో, ఆకుంభ వర్షములో, ఆ ఈదురుగాలిలో 'హాహా' అనే ధ్వనితప్ప మరి సన్యాసి కనబడలేదు. ఎంత పిలిచినా ఈదురుగాలి 'రంయ్యి' తప్ప మరేమీ వినబడలేదు. తర్వాత కూడా అతనికోసము వెదకాను. అయితే లాభ మేమిటి?



తండ్రి—వెధవా! ఎప్పుడురా నీ చేతుల కింత మసి అంటుకుంది.

కుమారుడు—మొఖం కడుక్కుంటున్నాడు—

చిన్ననాఁటిచేష్టలు

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

పల్లెటూరు మాది పసువులు పైరులు
　　చెట్లు చెఱువు కృష్ణగట్లు గఱువు
జెల్లగుళ్లు పెంకుటిళ్లును గల; వంతె
కాని నగర శోభ కానరాదు.

అందు నుప్పుఁ బప్పులంగడి గల దైన
దొరక దేమితాయి నరకు దాన
పట్టణమునుండి చుట్టాలు వచ్చి మా
కట్టి దెప్పుడైనఁ బెట్టుచుండ్రు.
కుడువఁ బెట్టు గుజ్జఁగూళ్లను మాయమ్మ
యాలనేయి పెరుఁగుఁ బాలు పోసి
పండు నెడప దడప పండుగుపబ్బముల్
వచ్చినపుడు పిండివంట లింట.

పూర్వకాలమునను బేర్వెలసినది మా
వీడు వేదశాస్త్రవిద్యలకును
దానిమాఱుపేరు దక్షిణకాశికి
కృష్ణ యచట నుత్తరించి సాగె.
గోపురంబు గుడియు గొప్పవి నాగేశ్వ
రుండనంగ నీశ్వరుండు గలఁడు
చెలఁగుచుండు నచట శివరాత్రికిని బ్రతి
వత్సరంబు గొప్ప యుత్సవంబు.

*　　　*　　　*

అపు నా కప్పటి కించుమించు వయసై
　　దాఁటేండ్లు; పేర్వమ్యో ను
త్సవమంచున్ బరిఁ బోరు లెల్లరుఁ బదా
　　ర్థవ్రాతసంపాదన
వ్యవసాయంబున గేహసంస్కరణ కృ
　　త్యంబందు వర్తిల్లి రా
శివరాత్ర్యుత్సవవాసరంబు లట వ
　　చ్చెన్ హెచ్చె మావేడుకల్.

ఎప్పుడు నిండు నంగళులు
　　నెప్పుడు సాగు ధ్వజాధిరోహణం
బెప్పు డగున్ మహోత్సవము,
　　నెప్పుడు బందుగు లేఁగుదెంతు; రే
నెప్పుడు నేర్క నుండుదు నిఁ
　　కెప్పుడు మాబడి కాటవి డ్పటం
చుప్పతిలం బ్రమోద మెద
　　సూఆటలూఁగిన వెల్లఁ జొప్పడెన్.

ఇపుడు చూచుచున్న యీచెన్నపురిని మా
యూర నపుడె చూచి యుంటి నేను
మేటిమేడ లింక మోటారుకారులు
మాత్ర మిపుడు క్రొత్తచిత్ర మిచట.

ఊరిలోన దూతె నూఱాళ్లు క్రొంగ్రొత్త
వీడువాడ లుద్భవించె మించె
ఆయె నాకు నపుడు మాయూరె తెన్నును
తీరు నెఱుఁగరాని మాయటూరు.

సర్క నరుదెంచె నాటకశాల నెలసె
వచ్చె అంకులరాటంబు హెచ్చెలాట
రీలు మఱి బొమ్మలాటలు చాలఁ గలిగె
రెండె కనులాట చాలక యుండె నాకు.

పండ్లయంగడులును బలుమిఠాయంగళ్లు
నాటవేడ్క బొమ్మలంగడులును
నిండఁగా బజారు పెండ్లయ్యె మావీటి
చెలువుకట్ట యయ్యె నరులపుట్ట.

చుట్టుప్రక్కల నున్నట్టి చుట్టములును
పక్కములు వచ్చి రది యొక్క లెక్క కాదు
దూరదేశమ్మునందుండి దూరబంధు
వారమును వచ్చె నాయుత్సవమ్ముకొఱకు.

వింతవింతలు వెలసిను వేడ్క గొల్పె
స్వామికల్యాణ మెందఱో జాతివారు
వచ్చి రింకేవొ జరగె నావార్త లిపుడు
చిత్తఫలకంబుపై నాకుఁ జెఱిగిపోయె.

* * *

సందడి తగ్గుచుండెను బ్ర
 జల్ తమతావుల కేఁగుచుండి రా
రందము మాఱుచుండె ముగి
 యంగల వంగళు లన్నవార్త విం
టిం దొర యెక్కు వయ్యె జన
 నిం జనకుం గడు గోఁజులాడితిన్
ముందుగ లెక్కవెట్టితిని
 ముచ్చట గొల్పిన వస్తుజాతముల్.

సాయంకాలము కొన్ని రూప్యములు చే
 సంధించి మాతండ్రి యే
మోయీ! నాయన! నీవు గోరినవి యే
 వో కొండు రమ్మంచు నర్థ
మాయం బిచ్చె బజారు కేఁగితిమి
 వేడ్కల్ క్రేళ్లు వాఱంగ నే
నాయావస్తులఁ జూపి బేరమును జే
 యన్ నాయనన్ వేఁడితిన్.

బేర మడుగు నేను గోరినవస్తువు
లంతె; యందు నొక్కటైనఁ గొనఁడు
కోరనట్టి వేవొ కొనుచుండె నా యాస
లుడుగుచుండె మూతిముడుఁగుచుండె.

చిల్లర మార్చిన డబ్బుల్
కొల్లగ నా చేతి కిచ్చెఁ గొండెక్కితిఁ, బైఁ
జెల్లించుచుండె నాచేఁ
జల్లఁగఁ దా విలుచువస్తుజాతము విలువల్.

చేతఁ బట్టి కాల్వ భీతి దీపావళి
బాణసంచు నాకు బాల్యమందు
కాల్చువారిచేయి దాల్చి ప్రమోదింతు
నట్టిముదము నాఁడు పుట్టదయ్యె.

చేటభారతములు పాటలపుస్తకా
లాంధ్రనామసంగ్రహములు పెద్ద
యక్షరముల బాలశిక్షలు నిం కేవొ
కలవు గొప్పపుస్తకములగములు.

వాని బేరమాడె మానాన్న పెదపెద్ద
పుస్తకమ్ము లేవొ పుచ్చుకొనియె
"ఆంధ్రనామసంగ్రహము బాలశిక్ష నీ"
కనియె వాని బేర మాడి కొనియె.

పీఁచుకాఁగితములు పిడుకలఁ బోలిన
యట్టి లున్నవాని ముట్టనైతి
ప్రక్కఁ గంటి నొక్క బుక్కులషాపు నేఁ
గానికానిపుస్తకములగముల.

చక్కనైనయచ్చు చిక్కనికాగితాల్
ముచ్చటైనసైజు ముద్దుబైండు
నాకు వేడ్క గొల్పె లూకాసువార్త నేఁ
గోరుకొంటిఁ గాని కొనకపోయె.

* * *

లడ్డు లుల్లిపాయలపకోడులు జిలేబి
జీడిపాకగు దూదుఫేడ బర్ఫి
ఇట్టి వింక నేవో తిట్టులఁ గలవు నో
రూరి వానిఁ గొనఁగఁ గోరుకొనఁగ.

జాతరకు వండినట్టివి గోఁతకూటి
మిఠాయిలు కొనఁగ నే నిష్టపడను
అలనేతితో నీకు మాయమ్మ యింట
వండి పెట్టు నిం కివి కోరకుండు మనియె.

కజిబొగ్గువంటిబాణలి
ముఱికిచము రోసి భక్ష్యములు వండుట నీ
వెఱుఁగ వని చూపె నను డ
గ్గఱఁ జేరిచి పిండివంటకంపుంగంపుల్.

మొఱ వెళ్ళఁబోసికొంటిం
గొఱకొఱతోఁ గంట నీళ్ళు గ్రుక్కితి నైనన్
సరకుగొనఁడాయెఁ దా నా
సరకు గొనండాయె నాకు సంకటమాయెన్.

* * *

దుస్తులఁ గొనెఁ బటములఁ గొనె
పుస్తకములఁగొనియె మంచిబొమ్మలఁగొనెనా
కస్తివిడ దైన నేను బ్ర
శస్తముగాఁ దలఁచు వస్తుజాతముఁ గొనమిన్.

నాకు నేన డబ్బుఁ జేకొని నా కిష్ట
వస్తువులను నిచ్చవచ్చినట్లు
కొనుకొనంగవలయు ననుకొందుఁ గాని యేఁ
నాని నాడుచేతఁ గానరాదు.

లాటరీలు అంకురాటమ్ము లిఁక నేను
గోరుకొన్న వేమి గూర్చకుండ
నిల్లు చేర్చి మెల్లమెల్లఁగ నమ్మన
మతిమందు నన్ను మందలించె.

అమ్మ యుమ్మలించి యనియెను మాతండ్రి
కోరఁబోకు కానికోరికలను
ఏది నీకు హితమొ యెఱిఁగి మానాన్నగార
తెచ్చినారు వానిఁ బుచ్చుకొనుము.

పుస్తకాలు కొనిరి దుస్తులఁ గొని రాట
వస్తువులను గొనిరి పండ్లు గొనిరి
ఇంట నేను బిండివంటలు వండితి
నెందు కింక నీకుఁ గుందు తండ్రి!

* * *

పెత్తనంబు చేత విత్తంబు గల్గిన
వానికే సుఖంబు గాన్ని, హాయి
కూడు నెట్లు చేతిలో డబ్బు లేకుండు
తల్లిదండ్రుచాటుపిల్లలకును.

ఎప్పుడు నాకుఁ జేత లభి
యించునో విత్తము; నాయభీష్టపుం
జొప్పున భోజ్యవస్తువులు
చొక్కపు వేడుకవస్తువుల్ కొనం
జొప్పడు నెప్పుడో ధనము
శూన్యము;నాయన కాని యేని యీఁ
డెప్పు, డొసంగనేని యిది
యొదుకొ ముందు కనుంగొనుంగదా!

* * *

అమ్మమీఁదఁ గోప మయ్యపయింగోప
మింటిలోని పిండివంటమీఁదఁ
గోప మపుడు నేను గోప స్వరూపుఁడ
రాత్రి నాకు నిద్ర రాకపోయె. (సశేషము)

(౫౦-వ సంపుటము ౪-౫ సంచిక తరువాయి)

3.

పై ప్రకరణమునందు పల్లవవంశవృక్షమును రచించితిమి. ఆవంశజాలచరిత్ర మింకను వర్ణింపవలసి యున్నది. పల్లవులకు నాగకన్యమూలమున రాజ్యలాభము గలుగుట వింశకపూర్వమే వచించియున్నాము. అటుపిమ్మటివృత్తాంత మింకను చెప్పవలసియున్నది. దీని కాధారములు పల్లవరాజుల ప్రాకృతసంస్కృతశాసనములే. ఇవిగాక ఆకాలములో పరరాష్ట్రములరాజుల శాసనములందును, కొన్ని పురాతనగ్రంథములయందును పల్లవరాజులవిషయము చెప్పబడియున్నది. అందు ముఖ్యమైనవి.—

౧. సముద్రగుప్తుని యలహాబాదు శిలాస్తంభశాసనము: ఇందు సముద్రగుప్తుడు దక్షిణమున జయించిన రాజ్యములను, తదధిపుల నామములను వర్ణింపబడియున్నవి.

౨. కదంబకకుత్స్థవర్మ్మ తాళగుండశాసనము: (ఎ. ఇం. సం. ౮) కదంబరాజ్యస్థాపనను వర్ణించుచున్నది.

3. ,, మృగేశవర్మ్మ రవివర్మ్మలశాసనములు. (ఇం. ఆం. సం ౬, పుట ౨౪, ౨౯.)

౪. కృష్ణవర్మ్మ(౧) నాటి అణజిశాసనము: (ఎ. కర్నా. సం. ౧, దా. గీ. వె. ౧౬౧.) కృష్ణవర్మ్మ సైన్యము నెట్లు పల్లవులు హతముచేసినదియు వర్ణించుచున్నది.

౫. పెనుగొండశాసనము: (ఎ. ఇం. సం. ౧౫) గంగపల్లవరాజులమైత్రిని దెల్పును.

౬. లోకవిభాగము: జైనభూగోళ విషయిక గ్రంథము. మొదటి సింహవర్మ్మ కాలమును దెలియ జేయుచున్నది.

వీరకూర్చ మహారాజు

ప్రాచీనపల్లవరాజులలో ప్రథముడు వీరకూర్చ రాజు. నాగరాజకొమార్తను పెండ్లాడుటచే రాజ్యలాభము గలిగెనని వేలూర్పాళెయపు శాసనము పల్కుచున్నది.

“యః ఫణీన్ద్రసుతయా సహాగ్రహీ
ద్రాజచిహ్న మఖిలం యశోధనః”.

దర్శిశాసన మీతడు “స్వబాహుబలార్జితోర్జితక్షాత్రు” డని చెప్పుచున్నది. ఇంతకుమించి యీతనివిషయమేమియు మనకు దెలియదు. ఇతనికుమారుడగు మొదటిస్కందవర్మ్మ యీతని ‘బప్పమహా’ రాజని పేర్కొని, “అప్రతిహతశాసను” డనియు, “అనేక హిరణ్యకోటి గోహలశత సహస్రప్రదాతృ” యనియు చెప్పుచున్నాడు. హలశత సహస్రప్రదానమును గూర్చి డాక్టరు కృష్ణస్వామిఅయ్యంగారి ట్లనుచున్నారు:—

“దీనికి (గోహలశతసహస్ర యనుదానికి) నేమైన నర్థ మున్నచో, నరణ్యమును నరికించి భూమిని వ్యవసాయార్హముగా మార్చ నీరాజు ప్రయత్నము చేసెనని నిస్సంశయముగ సూచించుచున్నది. ఈసందర్భమున నొకవిషయమును గమనింపవలయును. తమిళుల కీదేశము (శాతవాహ నాహారము: దత్తమండలము) దండారణ్యమను పేర నెరుకపడియుండినది. ఇదియే సంస్కృతపు దండకారణ్యము. ఇచ్చట పశుపాలనము ముఖ్యోద్యోగము; పశుహరణము ముఖ్యక్రీడ. ఈబప్పదేవుడే యరణ్యమును వ్యవసాయార్హముగ జేయ (—ప్రయత్న మెంతవఱకు ఫలించెనో చెప్పజాలము—) ప్రయత్నము చేసెను. కావున నీరాజు జనులకు మహోపకార మొనర్చెను.

ఇక్ష్వాకు ప్రభువులను దత్తమండలములో నిజను లిండను స్వతంత్రం చేయుచున్నారని స్థానికచరిత్రలవల్ల దెలియుచున్నది."

ఈతనిరాజ్యకాలమున పల్లవరాజ్యవిస్తీర్ణ మెంతో ఈతనికుమారుడగు శివస్కన్దవర్మ శాసనములవల్ల నీవిషయమును దెలుసుకొనవచ్చును. సాతవాహన రాష్ట్రము (అనగా బళ్లారిదత్తమండలములో గొంతభాగమును, మైసూరుసీమలోని గొంత భాగమును), కఞ్చీపురము (అనగా తొండమండలము), ఆంధ్రపథము (అనగా కృష్ణమండలగల యాంధ్రరాజ్యము) పల్లవులకు స్వాధీనముగ నుండెను.

మఱియు నీతని రాష్ట్రమున కుంతలదేశముగూడ జేరియుండెను. పశ్చిమసముద్రమె పల్లవరాష్ట్రమునకు పడమటిసరిహద్దుగ నుండెను. ఈవిషయమున బండితులు భిన్నాభిప్రాయమును గనుపఱచియున్నారు. వారిలో ప్రముఖుడు ప్రొఫెసరు రాప్సన్ అనువాడు. ప్రస్తుతము మైసూరుసీమలోని షికారిపురతాలూకాయందు మలవళ్లి యను గ్రామము గలదు. ఆయూర పురాతనప్రాకృతశాసనములు రెండు 'చెక్కబడ్డశిలా స్తంభ' మొకటి కలదు. అందొకటి, "హారీతిపుత విణ్హుకడ్డచుటిసాతకంణి" యనువానిది. ఇతఁడు నాగవంశజుడగు నాంధ్రభృత్యరాజు. రెండవది, పేరులేని కదంబరాజుది. ఈ రెండుశాసనములను విమర్శించుచు రాప్సన్ ఇట్లు వ్రాయుచున్నాడు:—

"ఈశాసనము (మొదటిది) ఆగ్రామమందలిదానమును దెల్పుచున్నది. ఇది రాజునకు 'వైజయన్తీపుర రాజు' యనుబిరుదు నిచ్చుచున్నది. ఇదే స్తంభముపై నీశాసనమునకు క్రింద వేరొకశాసనము గలదు. అక్షరములనుబట్టి చూడ నిది పైశాసనముకంటె విశేషము పిమ్మటిది గాదు. ఇందువల్ల బనవాసిరాజ్యము (కున్తలము) చుటువంశమువారికడనుండి కదంబులహస్తగతమైనట్లు దెల్లమగుచున్నది." ప్రొఫెసరు రాప్సనన్నట్లు కున్తలరాజ్యలక్ష్మి చుటుకులమును విడి తత్క్షణమే కదంబవంశము నాశ్రయించలేదు. మొదటికారణ మేమన, చుటువంశ మంతరించినకాలమున కదంబరాజవంశ ముత్పత్తి గాలేదు. మఱియు కదంబులకు కున్తలరాజ్యప్రాప్తి పల్లవసరపాలుర యనుగ్రహమువలన గలిగినది. ఈవిషయము కదంబరాజవంశమునకు మూలపురుషుడగు మయూరవర్మ మునిమనుమడగు కకుత్స్థవర్మయొక్క తాళగుండశిలాశాసనమువల్ల దెలియుచున్నది. మయూరవర్మకు రాజ్యప్రాప్తిగల్గినవిధమునుగూర్చి యిట్లు చెప్పబడియున్నది:—

సంశ్రిత స్తదా మహీపాలా
నారాధ్య యుద్ధేషు విక్రమైః;
ప్రాపపట్టబంధసంపూజాం
కరపల్లవైః పల్లవైర్భృతాం.
భంగురోర్మిర్మవల్లి శైన్యర్ణాత్య
దపరార్ణవాంభః కృతావధిం;
ప్రేహారాన్త మనన్యసఞ్చరణ
సమయస్థితాం భూమి మేవచ.

పైశ్లోకములవల్ల మయూరవర్మ పల్లవరాజుల నాశ్రయించి అనేకయుద్ధములయందు విక్రమము బ్రకటించుటచే వారిప్రసాదమునకు బాత్రుడాయెననియు, దత్కారణమున ప్రేహారము మొదలు పశ్చిమసముద్రము వఱకు గలరాష్ట్రమున కధిపతిని జేసి స్వకరపల్లవములచే నాతనికి పట్టబంధము జేసిరనియు దెలియుచున్నది.

కావున కున్తలము కదంబులకు బూర్వము బల్లవులస్వాధీనమం దుండెననుట స్పష్టము. ఆంధ్రభృత్యులయనంతరము పల్లవులును, పిమ్మట కదంబులును కున్తలముపై రాజ్యముచేసిరి. వీరకూర్చనికాలమున కున్తలము పల్లవుల యేలుబడికి లోనై యుండెననుట నిస్సంశయము. ఒకకున్తలమే కాదు; కొంగుదేశమునపైత మాతనియధికారము చెల్లియుండవలయును. కావున నాతఁడు భార్యమూలమున లబ్ధమైన ఆంధ్రసామ్రాజ్యపు దక్షిణార్ధమున కధిపతియై యుండెను. రాజధాని కంచి.

(శివ)స్కన్దవర్మ

(క్రీ. శ. ౩౧౦–౩౩౫)

శివస్కన్దవర్మ వీరకూర్చనిపుత్రుడని యింతకు పూర్వమే చెప్పియున్నాము. ఇతనివి రెండు శాసన

ములు దొరకినవి. అందు మొదటిది మైదవోలుశాసనము. ఇది శివస్కందవర్మ యువరాజుగ నున్నకాలమున నిచ్చినది.

"యువమహారాజో భారదాయనగోత్తో
పలవానాం శివఖ[ం]దవమ్మో."

ఇది బప్ప లేక వీరకూర్చ మహారాజు ౧౦ వ రాజ్యవర్షమున నొసగబడెను అని మైదవోలు శాసనమున నున్నది.

రెండవది, హీరహడగళ్లి శాసనము. ఇదిరాజైన పిమ్మట ౮ వ రాజ్యవర్షమున నిచ్చినది. రాజు తన్ను గురించి యిట్లు చెప్పుకొనియున్నాడు:—

"అగ్గిథోమ వాజపేయాస్సమేధయాజీ ధమ్మ
మహారాజాధిరాజో భారద్దాయోపల్లవా
ణ సివఖందవమో."

ఈరెండు శాసనములు గాక యీతనిరాజ్యకాలమున నివ్వబడిన శాసన మొకటి కలదు. దీనిని చారుదేవి యొక్క గుంటూరుమండలశాసన మందురు. ఈమె (విజయ)స్కంధవర్మయొక్క పుత్రుడును, యువమహారాజును నగు విజయబుద్ధవర్మయొక్క భార్య. ఈదంపతులకు "కుర" శబ్దాంతనామధేయు డను పుత్రుడొక డుండెను. వాని పేరు బుద్ధ్యాన్కురయని హూల్షుగారనిరి. శాసనదాత్రి యువమహారాజ్ఞి యగుటచే నప్పటికి యువమహారాజు బ్రదికియుండెనా యను సంశయము గలుగుచున్నది. ఇది నిజమైనను కాకపోయినను బుద్ధవర్మ శివస్కందవర్మ ప్రథమపుత్రు డనుట నిజము. దీని కితడు యౌవరాజ్యపట్టాభిషిక్తు డగుటయే సాక్ష్యము. ప్రాచీన పల్లవరాజులు దమ ప్రథమపుత్రులనిగాని, సోదరుని గాని యౌవరాజ్యమున కభిషిక్తునిగ జేయుచుండినట్లు తోచుచున్నది. శివస్కందవర్మ తన తండ్రికాలమున యువరాజుగ నుండెను, అట్లే బుద్ధవర్మయును. సింహవర్మ రాజ్యకాలమున నాతని సోదరుడు విష్ణుగోపుడు రాజుగ నుండెను. ఇంతేకాక మహారాజు రాజధానియగు కాంచీపురినుండి పల్లవరాజ్యములోని దక్షిణభాగము నేలుచుండెను. ఉత్తరార్థము యువమహారాజు నేలుబడియందుండె ననుట స్పష్టము. శివస్కందవర్మ యువరాజుగ నున్నప్పుడు ఆంధ్రపథమునందలి వీరిపరగ్రామమును దానము చేయుచు ధాన్యకటకములోని తనవ్యాపృతుని కదియాజ్ఞాపించెను. యువరాజగు బుద్ధవర్మభార్యయగు చారుదేవి దాలూరునందలి విష్ణుదేవాలయమునకు భూదానమును జేసి తద్వర్తమానమును "కడక", అనగా ధాన్యకటమునందలి యధికారి కాజ్ఞాపించెను. తరువాతి కాలమున సింహవర్మ యనుజుడగు విష్ణుగోపవర్మయు, తద్వంశజులును ప్రస్తుతపు నెల్లూరు గుంటూరు మండల సంగమప్రాంతములలోని దశనపుర, పలక్కడ, తాంబ్రాప యను స్థలములనుండి పల్లవరాజ్యపు టుత్తరార్థముపై ప్రభుత్వము సేయుచుండిరి. ఈయుదాహరణములవల్ల పల్లవ యువరాజులు పల్లవసామ్రాజ్యములోని యుత్తరవిషయముల కధిపతులై యుండిరని తేలుచున్నది.

శివస్కందవర్మ కాలమున బల్లవరాజ్యవిస్తీర్ణమునుగూర్చి యిదివఱకే చెప్పియున్నాము. ఈతనిశాసనములు ఈతడు అగ్నిష్టోమ, వాజపేయ, అశ్వమేధయాగములను జేసెనని చెప్పుచున్నవి. కడపటియాగమును దిగ్విజేతలును, సామ్రాజ్యపట్టభద్రులును నగు రాజులే చేయదగినది, తదితరుల కసాధ్యము. కావున నీతడు మహాశూరుడై రాజ్యములను గెల్చినట్లు తోచుచున్నది. ఈతడు జయించినరాజ్యము లెవ్వియో, రాజు లెవ్వరో తెలియదు. అయినను వేలూర్పాళెయపు శాసనమున స్కందశిష్యుడు, అనగా స్కందవర్మ సత్యసేను డనురాజును జయించి, బ్రాహ్మణఘటికను దీసికొన్నట్లు చెప్పబడియున్నది:

"అస్వవాయవభశ్చద్ది
స్కాన్దశిష్యస్తతో భవ;
ద్విజానాం ఘటికాం రాజ్ఞ
స్సత్యసేనాజ్జహార యః.—"

ఈసత్యసేను డెవ్వడో తెలియరాదు. డాక్టరు కృష్ణస్వామి అయ్యంగారు కీతడు శాత్రవుడగు స్వామి

సత్యసింహుం(సేను)డే యనుచున్నారు. కాని యది నిజము గాదు.

అప్పటి రాజ్యపరిపాలనవిధానము శివస్కన్దవర్మశాసనములవల్ల కొంత దెలియుచున్నది. సర్వాధికారమును రాజునందే యుండెను. రాజ్యపాలనమున రాజునకు యువరాజు తోడ్పడుచుండెను. రాజు నిరంకుశుడు గాడు. రాజధానియందు మంత్రాంగసభ యొక్కటి యుండెను. ఈసభవారి యిష్టానుసారము వర్తించినను లేకున్నను వారియభిప్రాయములను ముఖ్యవిషయములయందడుగుట రాజున కాచారమని తోచెడిని. ఈమంత్రాంగసభలో సభ్యత్వమున కెవ్వరర్హులో చెప్పుటకు వీలులేదు. హీరహడగల్లి శాసనముప్రకారము కొలివాల గ్రామభోజకుడు భట్టిసమ్మ యీసభకు జేరిన సభ్యుడు.

"కొలభోజకస రహసాధికత భట్టిసమ్మస"

యని శాసనము. ఇంతమాత్రమున నే భోజకు (అనగా యినాందారు)లకు మంత్రాంగసభలో సభ్యత్వము తమభోజకత్వమువల్ల లభించెడిదని తలపరాదు. భట్టిశమ్మ బ్రాహ్మణుడు. ఈతని బ్రాహ్మణత్వమువలననే యీతడు రహస్యాధికృతు డయ్యెనని గ్రహింపవలయును. పూర్వపుక్షత్రియులసభలయందువలె పల్లవరాజులసభలయందు మంత్రిరాజకుమారుల తోపాటు బ్రాహ్మణులు గూడ మంత్రము చెప్పుచుండుట యాచారము.

పాలనసౌకర్యార్థమై పల్లవరాజ్యము రాష్ట్రములుగ విభజింపబడియుండెను: సాతవాహనరాష్ట్రము, ఆంధ్రపథము, ముండెకరాష్ట్రము, కర్మరాష్ట్రము ఇత్యాదులు. ఈరాష్ట్రములపై నధిపతులను రా జేర్పఱచుచుండెను. ఇందు కొందఱు రాజకుటుంబమునకు సంబంధించినవారు; తక్కినవారు సామాన్యులు. ప్రతిరాష్ట్రమును మాడంబము లనుపేరుగల భాగములుగ మరల విభజింపబడి యుండెను. మాడంబమున కధిపతి మాడంబికుడు, లేక మాడబికుడను పేరుగల యధికారి. వీరుగాక స్థానికాధికారులును, గ్రామాధికారులును గూడ నుండిరి. హీరహడగల్లి శాసనమున నింకననేకులు రాజభృత్యులు పేర్కొనబడియున్నారు: పల్లవులు, గోవల్లవులు, అమాత్యులు, ఆరక్షకాధికృతులు, తిథ్యాకులు, నైయోగికులు మొదలగువారు. ఈయుద్యోగస్థులనామములను, పరిపాలనావిధానమును జర్చించునపుడు కౌటిలీయార్థశాస్త్రమునందును, నశోకుని శిలాశాసనములలోను వర్ణింపబడిన మౌర్యసామ్రాజ్యపు కట్టుదిట్టములు జ్ఞప్తికివచ్చును. పినాకినిపర్యంతము వ్యాపించియుండు దక్షిణదేశము అశోకచక్రవర్తికాలమున మౌర్యులయేలుబడికి లోనై యుండుట సుప్రసిద్ధమైనవిషయమే. తదనంతర మాంధ్రరాజులకాలమున పరిపాలన పద్ధతులు మారక పల్లవులకాలమువఱకల్లే యుండినట్లు తోచెడిని.

శివస్కందవర్మకాలమున జను లెంతసుఖమనుభవించిరో తెలియదు. అయినను వారిపై విధింపబడిన పన్నులను జూడ వారు విశేషసుఖ మనుభవించిరని తలంచుట కవకాశము లేదు. పన్నులను రాజున కిచ్చుటయేకాక రాజభృత్యులగు నధికారులకు పాలు మజ్జిగలను సరఫరా చేయవలసి యుండెను. ఉప్పు పంచదారలమీదిపన్నును సర్కారునకు చెల్లింపవలసి యుండెను. అంజిపను లధికారుల యిష్టప్రకారము చేయవలసి యుండెను. అధికారులు గ్రామస్థులకడనుండి పచ్చిక, కలప, పశువులు, పండ్లు, పుష్పములును గొనుట యాచారమైయుండెను. ఇట్లు జనులు సర్కారువారి కియ్యవలసిన పన్నులకుగాని, చేయవలసిన చాకిరులకుగాని "బాధ" లని పేరు. ఇటువంటిబాధలు పదునెనిమిది. వీనియందొక్కటి ప్రజల నుపద్రవించుచున్నట్లు తోచెడి. సంచరింతల (సిపాయీల) వల్ల బాధ విశేషముగ నుండెడిది. వీ రిచ్చవచ్చినట్లు రాజ్యమునం దంతటను సంచరించుచు జనులను బాధించెడివారు. సంచరింతలవలె గూఢపురుషులు రాజ్యమంతటను సంచరించెడివారు. గూఢపురుషుల స్వభావ మెఱింగిన మనతరమువారికి వారివల్లగల్గు నుపద్రవ మిట్టిదని వర్ణింప నవసరము లేదుగదా.

కాంచీపురము : ప్రాచీనపల్లవరాజధాని

బప్పదేవుడు లేక వీరకూర్చవర్మ యొక్క రాజ్యకాలమునుండియు పల్లవులకు రాజధాని కాంచీపురము. మైదవోలుశాసనము కాంచీపురమున నివ్వబడినది.

"కాంచీపురాతో యువమహారాజో భార
ద్వాయసగోత్తో పలవానం సివఖందవ
మ్మో ధంఞకడే వాత్తం ఆణపయతి"

యని శాసనము. ఇందువల్ల శివస్కందవర్మ యువరాజుగ నున్నప్పుడు కంచి పల్లవుల రాజధాని యగుట స్పష్టము. అట్లే హిరహడగల్లి శాసనమునను

"కాంచీపురా అగ్గిత్థోమ వాజపేయాస్స
మేధయాజీ ధమ్మ మహారాజాధి రాజో
భారద్దాయో పల్లవాణ శివఖందవమ్మో"

యని చెప్పబడియున్నది. కావున శివస్కంద వర్మ రాజధానియు కాంచీపురమేయని స్పష్టము. పల్లవరాజ్య ముత్పన్నమైనది మొదలు వారికి కాంచీపురమే రాజధాని.

విష్ణుగోపుడు (335-360)

శివస్కందవర్మ యనంతరము పల్లవరాజ్యాధిపత్య మెవ్వరు వహించినదియు నిశ్చయించి చెప్పుటకు వీలుగాదు శాసనములును అనేకసందేహముల కాస్పదములగుచున్నవి. ఇంతకుపూర్వము నాచే నిర్ణయింపబడిన కాలనిర్ణయపట్టికను బట్టి శివస్కందవర్మ గుప్తచక్రవర్తియగు మొదటిచంద్రగుప్తుడు (310-330) రాజ్యము చేయుచుండగ సమకాలీనుడగుచున్నాడు మొదటిచంద్రగుప్తునియనంతర మాతనిపుత్రుడు సముద్రగుప్తుడు చక్రవర్తి యాయెను. ఇతడు దిగ్విజేత. దక్షిణదిక్కునకు దండు వెడలి తూర్పుసముద్రతీరమున ప్రభుత్వము సేయుచున్న రాజుల నదిమి కప్పముగొని, యుత్తరాపథనృపాలుర నిర్మూలముగావించి, యశ్వమేధయాగము నొనర్చి మహారాజాధిరాజపదమును బడసెనని హరిసేనకృతమగు నలహాబాదు శిలాస్తంభశాసనము వల్కుచున్నది. హరిసేనుడు పైప్రశస్తియందు సముద్రగుప్తునిచే బరిభవింపబడిన రాజులను, వారిరాజ్యములను పేర్కొనియున్నాడు. వారెవ్వరన్న:

౧.	కోసలరాజు	మహేంద్రుడు.
౨.	మహాకాంతారాధిపుడు	వ్యాఘ్రరాజు.
3.	కౌరాళకనృపాలుడు	మంటరాజు.
౪.	పిష్టపురీశ్వరుడు	మహేంద్రుడు.
౫.	కొట్టూరునరపతి	స్వామిదత్తుడు.
౬.	ఏరాండపల్లి రాజు	దమనుడు.
౭.	కంచిరాజు	విష్ణుగోపుడు.
౮.	అవముక్తాధిపుడు	నీలరాజు.
౯.	వేంగీశ్వరుడు	హస్తివర్మ.
౧౦.	పాలకరాజు	ఉగ్రసేనుడు.
౧౧.	దైవరాష్ట్రాధిపుడు	కుబేరుడు.
౧౨.	కుస్థలపురరాజు	ధనంజయుడు.

ఈరాజులను సముద్రగుప్తుడు బధ్ధులనుగ జేసి పిమ్మట విడిచెను. ఈరాజ్యము లుండినస్థలములు తెలియకపోవుటచే సముద్రగుప్తుడు కేరళపర్యంతముగల దక్షిణదేశమును జయించెనన్న భ్రమయొక్కటి కలిగెను. కాని యిటీవల దుబ్రాయలుగారి పరిశ్రమలవల్ల సముద్రగుప్తుని దండయాత్ర తూర్పుసముద్రతీర దేశములపై గృష్ణావది యుత్తరపుటొడ్డువఱకు వ్యాపించెనని తేలుచున్నది. గుప్తపల్లవసైన్యములు కృష్ణ కావలియొడ్డునసే తారసిల్లెననియు, సముద్రగుప్తునకే పరాజయము గలుగుటచే యచ్చటినుండియే వెనుకకు దరలెననియు దుబ్రాయలనుచున్నాడు. దీనికి శాసనస్థమగు నాధార మెద్దియు లేదు. అట్టియాధారమును గల్పింప సమకట్టి ఆర్. సుబ్బారావుగారు సాలంకాయనరాజగు మొదటి నందివర్మ పెదవేగి శాసనములోని

"విజయవేంగీపురానైక సమరవాప్తవిజయి
నో హస్తివర్మ మహారాజస్య"

యన్న వాక్యము నాధారపఱచుకొని, హస్తివర్మయే సముద్రగుప్తుని గెల్చెనన్న భావమును సూచించిరి. (ఇచ్చట విజయశబ్దము శుభసూచకము.) దీని కంతకంటె విశేషార్థమున్నట్లగపడదు. విజయకాంచీపుర, విజయదళనపుర, విజయపలక్కడలలోని 'విజయ' శబ్దమున కేయర్థముగలదో ఆయర్థమే 'విజయవేంగీపురము'లోని 'విజయ' శబ్దమునకును కలదని నాభావము. అట్లుగాక 'విజయ' శబ్దము జయమును దెల్పునదేయని వాదమునకై యొప్పుకొన్నను,

హాస్తివర్మ సముద్రగుప్త నోడించెననుట కది యెట్లాధారము కాగలదు?

వాస్తవము విచారించిన సముద్రగుప్తుడు కృష్ణను దాటినట్లే తోచుచున్నది. కంచిరాజగు విష్ణుగోపుని మాత్రమేకాక పాలకరాజగు నుగ్రసేనునిగూడ జయించినట్లున్నది. పాలక (పాలక్కడ) యనునది కృష్ణకు దక్షిణదేశమున నున్న పల్లవముఖ్యపట్టణములలో నొకటి. కావున పాలకరాజు పల్లవుల సామంతుడనుట నిజము. కంచివిష్ణుగోపుని జెప్పి పాలకయుగ్రసేనుని జెప్పుటచే సముద్రగుప్తుడు వారితో వేరువేరుగ యుద్ధము జేసియుండును. పాలకరాజును పాలకపురముననే జయించెనని తోచుచున్నది. భావిపరిశోధనవల్లగాని నిజము తేలదు.

పైవాదములోని నిజానిజము లెట్లున్నను ఒకవిషయమునుగూర్చి మనము సందేహపడవలసిన యవసరము లేదు. అది యెద్దియన, సముద్రగుప్తుని సమకాలికుడగు పల్లవరాజు పేరు విష్ణుగోపుడనుటయే. అందువల్ల క్రీ. శ. ౪ వ శతాబ్దారంభమున కంచియందు రాజ్యముసేయుచున్న శివస్కన్దవర్మకును, వీరివికిని నేదేసంబంధ ముండవలెననుట నిశ్చయము. ఈబంధుత్వమును నిర్ధారణసేయుటకే శాసనమును దోడ్పడదు. కావున దుబ్రాయలీతనికొఱకై ౫౧ వర్షము లెడము సంపాదించవలసివచ్చెను. ఒంగోడు (౧) శాసనములోని (మొదటి) కుమారవిష్ణువును చారుదేవి కుమారుడగు బుద్ధ్యంకురునికి మునిమనుమనిగ జేసి ప్రాకృతసంస్కృతశాసనములమధ్య విష్ణుగోప స్కందవర్మల నిరికించెను. వాయలూరు వెలూర్పాళెయము దర్శి శాసనములు వీరకూర్చ డనురాజుండెనని చాటుచున్నను దుబ్రాయలారతని నామమును స్మరించలేదు. స్మరించియున్న యాతని వాదము డొంక తప్పియుండెడిది. వాయలూరు శాసనమున వీరకూర్చనామధేయులిద్దరు (౫, ౧౧) గన్పించుచున్నారు. విష్ణుగోపుడు ౭ వ వాడు; అనగా, వాని పేరు పై యిద్దరు వీరకూర్చులమధ్య నున్నది. వెలూర్పాళెయపు శాసనమున పల్లవరాజులలో ప్రథముడు వీరకూర్చుడనియు, తత్పుత్రుడు స్కందశిష్యుడనియు, వాని కొడుకు కుమారవిష్ణువనియు చెప్పబడియున్నది. కావున వీరకూర్చుడు పల్లవరాజులలో గడుప్రాచీనుడని తేలుచున్నది. ఈవిషయమును కృష్ణశాస్త్రిగా రొప్పుకొన్నారు. పైశాసనములనుబట్టి యీతడు ప్రాకృతశాసనములకాలమువాడని యొప్పుకొనవలసియున్నది. ఇతని మునిమనుమ డిచ్చినదే దర్శిశాసనము. దీనిభాష సంస్కృతము. వీరకూర్చునికొడుకు శివస్కందవర్మ కాలమున శాసనములభాష ప్రాకృతము. అతనిమునుమనికాలమున సంస్కృతము. ఇట్లు శాసనములభాష రెండుతరములలో మారిపోయెను. అయితే దర్శిశాసన మెప్పటిది? ఈప్రశ్నకు సమాధానము చెప్పుట సులభముగాదు. అయినను ప్రయత్నము చేయుదము. పల్లవశాసనములలో బహుపురాతనమైనది హిరహడగల్లి శాసనము. దాని యక్షరములు చక్కగ తీరియుండక యుండుటగాక నానాఘాటు శిలాశాసనాక్షరములను బోలియున్నవి. యువమహారాజు విష్ణుగోపవర్మ యురువపల్లి శాసనము క్రీ. శ. ౪౪౬నం దివ్వబడినది, దీనియక్షరములు చక్కగ తీరియుండుటయేకాక దుబ్రాయలుగారన్నట్లు "నిజమైన పెట్టెతలలు గల్గియున్నవి. ఒంగోడు (౧) శాసనములోని లిపి యురువపల్లి లిపికంటె పురాతనమైనదని కృష్ణశాస్త్రిగారు వచించియున్నారు. దర్శిశాసనపు టక్షరములను పైశాసనాక్షరములతో బోల్చిచూచిన నొక్కవిషయ మందరికిని తప్పక బోధపడగలదు. దర్శిశాసనపుటక్షరములు హిరహడగల్లి శాసనాక్షరములకంటె నవీనముగను, ఒంగోడుకన్న ప్రాచీనముగను, ఉరువపల్లికన్న ప్రాచీనతరముగను గాన్పించుచున్నవి. కావున దర్శిశాసనము హిరహడగల్లి ఒంగోడు (౧) శాసనముల మధ్యకాలముదని తెలియుచున్నది. హిరహడగల్లి శాసనదాత వీరకూర్చుని కుమారుడగు శివస్కందవర్మ. దర్శిశాసనము నిచ్చినవాడీతని మనుమడు. ఉరువపల్లి శాసనదాతయగు యు. మ. విష్ణుగోపవర్మయొక్క తాతయగు వీరవర్మయో, యాతనిసమకాలికుడగు నింకొక పల్లవరాజో దర్శిశాసనము నిచ్చియుండవలయును. యు. మ. విష్ణుగోపవర్మయొక్కయు, దత్పుత్రపౌత్రులయొక్కయు శాసనములన్నియు దశనపుర పలక్కడ

తామ్రశాసనమునుండి యిచ్చబడియుండుటచేతను, దర్శిశాసనమున 'విజయదశేపురాధిష్ఠాన' యని యుండుటచేతను శాసనమును యు. మ. విష్ణుగోపవర్మయొక్క తాత యగువీరవర్మయే యిచ్చెనని వ్రాతలవు. ఇది నిజమేని దర్శిశాసనకాలము నొకతెఱగున గనిపెట్టవచ్చును. యు. మ. విష్ణుగోపునియన్న యగు సింహవర్మ ౪౩౬ మొదలు ౪౬౦ వఱకు రాజ్యముచేసెను. అతనితండ్రి స్కందవర్మ ౪౧౦ మొ॥ ౪౩౬ వఱకును, తాతయగు వీరవర్మ ౩౭౫ మొదలు ౪౧౦ వఱకును రాజ్యముచేసి యుండవలయును. కాబట్టి దర్శిశాసనము ౩౭౫-౪౧౦ మధ్యకాలమున వ్రాయబడియుండవలయును. ఈకాలనిర్ణయము సరియైనచో వీరకూర్చుడు క్రీ. శ. ౨౭౫ మొదలు ౩౧౦ వఱకును, శివస్కందవర్మ ౩౧౧ మొ. ౩౫౩ వఱకును రాజ్యపాలనము జేసియుండవలయును. సముద్రగుప్తుని దండయాత్ర దుబ్రాయిల్ గారు చెప్పినట్లు ౩౪౫-౫౦ ల మధ్య నడచినను శివస్కందవర్మకు దరువాతికాలమునసే నడచియుండవలయును. కావున నేను రచించిన పల్లవవంశావళియందు ప్రయాగశాసనములోని విష్ణుగోపుడు శివస్కందవర్మపుత్రుడై యుండునని శంకించితిని. అయినను చారుదేవిశాసనము శివస్కందవర్మకు బుద్ధవర్మ యనుకుమారుడు యువరాజుండెననియు, నాతనిపుత్రుడు బుద్ధ్యాంకురుడనియు తెల్పుచున్నదిగదా! యువమహారాజగుటచే బుద్ధవర్మ శివస్కన్దవర్మయొక్క జ్యేష్ఠపుత్రుడనుట నిజము. అయినను వాయలూరు శాసనమునందుగాని, వేలూర్పాళెపు శాసనమునగాని స్కన్దవర్మయనంతరము బుద్ధవర్మగాని, బుద్ధ్యాంకురుడుగాని రాజ్యమునకు వచ్చినట్లు చెప్పలేదు. ఒకవేళ ఏకారణముచేతనైనను బుద్ధవర్మ తండ్రికిపూర్వము మృతినందగా నతనికుమారుడు బుద్ధ్యాంకురుడే శివస్కన్దవర్మకు పిమ్మట రాజ్యాభిషిక్తుడై యుండవచ్చును. బుద్ధ్యాంకుర యనునది బిరుదని యుంద రొప్పుకొన్న విషయమే. ఇతనిపేరు వాస్తవముగ విష్ణుగోపుడై యుండవచ్చును. యుద్ధముననో, మరియొక విధముననో విష్ణుగోపబుద్ధ్యాంకురుడు మరణమునంద, నాతనిపినతండ్రి మొదటికుమారవిష్ణువు కంచిరాజ్యమున కధిపతియై యుండవచ్చును. శాసనములలోని రాజులు తమ పితృ పితామహ ప్రపితామహులనే పేర్కొను నాచారమును పాటించుచుండుటచే ఈవిష్ణుగోపుని స్మరింపరైరి.

డాక్టరు కృష్ణస్వామి అయ్యంగారు ఉరువపల్లి శాసనదాతయగు యు. మ. విష్ణుగోపుడే సముద్రగుప్తునితో పోరాడిన విష్ణుగోపుడనుచున్నాడు. ఇది సాధ్యము గాదు. కారణ మేమన 'లోకవిభాగ'మను జైనభూగోళగ్రంథము వలన కంచిరాజగు సింహవర్మ (యు. మ. విష్ణుగోపునియన్న) శ. ౩౫౮, అనగా క్రీ. శ. ౪౩౬న రాజ్యాధిపత్యమును వహించినట్లు తెలియవచ్చుచున్నది కావున యు. మ. విష్ణుగోపున కొకశతాబ్దమునకు పూర్వమే సముద్రగుప్తుని దండయాత్ర నడచెను. అందువల్ల యు. మ. విష్ణుగోపుడు సముద్రగుప్తుని సమకాలీనుడనువాదము నిలువజాలదు. మన ప్రస్తుత చరిత్రజ్ఞానమును బట్టి చూడ యు. మ. విష్ణుగోపునకు పూర్వ మింకొక విష్ణుగోపుడు రాజ్యము జేసిన ట్లగపడుచున్నది. నిజము త్రావిపరిశోధనవల్ల గాని బయల్పడదు.

శివస్కందవర్మకు దరువాతికాలమున బల్లవరాజ్యమున గొంత యల్లకల్లోల ముండినట్లు గాన్పించుచున్నది. శివస్కందవర్మకాలమున కాంచీపురము పల్లవరాజధాని యనుట నిరూపింపబడెనుగదా! వేలూర్పాళెయపు శాసనము నిజముపల్కుచుండు పక్షమున కుమారవిష్ణువు రాజ్యాభిషిక్తుడైనప్పుడు కంచి పల్లవుల స్వాధీనమందు లేదనుట నిజము. వేలూర్పాళెయపుశాసనమం దిట్లున్నది:—

"గృహీతకాఞ్చీనగర స్తతోఽభూ
త్కుమారవిష్ణు స్సమరేషు జిష్ణుః."

కావున కుమారవిష్ణునికి పూర్వము కంచి పరహస్తగత మైనదనుట నిజము. అయితే కంచిని పల్లవుల కడనుండి యొడిచికొన్న శత్రువు లెవ్వరు? ఈసంశయమును పైశాసనమే నివారించుచున్నది:

"భర్తా భువోఽభూ దథ బుద్ధవర్మా
య శ్చోళసైన్యార్ణవ బాడబాగ్నిః."


అనుటచే సింహాసనములయందు బల్లవులతో బోరాడుచుండిన శత్రువులం జోరులనుట చెల్లదు. శాసనకర్తకు విష్ణుగోపునకు పూర్వము కంచిని గెల్చినవారు చోళులుగానై యుండవలయును. ఇరువుర్ల శివస్కందవర్మయనెడి తరము పల్లవరాజ్యమున నల్లకల్లోలము గల్గినదనుట నిజము.

సముద్రగుప్తుని దండయాత్రవల్ల పల్లవరాజుల బలమును, యశమును కొంతవఱకును క్షీణించియుండవలయును. ఈకాలముననే కదంబవంశస్థాపకుడగు మయూరశర్మయు పల్లవరాజుల నెదుర్కొని యుండవలయును. ఈతని విషయము తాళగుండశాసనమున చక్కగ వర్ణింపబడియున్నది.

హారీతిపుత్రులును, మానవ్యసగోత్రజులును, వేదాధ్యయనసంపన్నులును, సద్గుణోపేతులును నగు బ్రాహ్మణులకుటుంబ మొకటి యుండెను. "వివిధయజ్ఞ పృథక్ పుణ్యజలములయందు పలుమారు తడిసిన సిగలు గలవారును; ప్రవచనావగాహననిష్ణాతులును; విధిప్రకారము సమిధల నగ్నియందు హోమము చేసినవారును; సోమపానము చేసినవారును; ప్రణవపూర్వకముగ నారవిధముల వేదమును పఠించు వారి కంఠస్వరములచే మారుమ్రోగు గృహాంతరాళము గలవారును; చాతుర్మాస్యము, హోమము, ఇష్టి, పశుబంధము, దార్శపౌర్ణమాస్యశ్రాద్ధపాక్షిక క్రియలను చేయువారును; అతిథులచే నిరత మాశ్రయింపబడినదియు, పవనత్రయములు సేయని దినము లేనిదియు నగు వసతిగలవారును-నగు నీ బ్రాహ్మణుల గృహసమీపప్రదేశమున వికసించినపుష్పములచే నిండినకదంబపాదప మొక్కటి యుండెను. ఆ వృక్షమును పెంచుటచేత వారి కాచెట్టుతోడి 'సామాన్య' 'సాధర్మ్యము'లు గలిగి యప్పటివారిచే కదంబులని పిలువబడిరి.

ఇట్టికదంబులవంశమున శ్రీమంతుడును, శ్రుతశీల శౌచాద్యలంకృతుడును, మయూరశర్మాభిధుడును నగు ద్విజోత్తము డొక్కడు పుట్టెను. అతడు ప్రవచనమును సర్వమును జదువగోరి తనయుపాధ్యాయుడగు వీరశర్మతోగూడ పల్లవేంద్రునిపురికిపోయి తత్పరుడై ఘటికను ప్రవేశించెను. అచ్చట పల్లవాశ్వసంస్థయందు జరిగిన తీవ్రమగు కలహముచే రోషితుడై, 'అక్కటా! ఈ కలియుగమునందు క్షత్రియులకంటె బ్రాహ్మణు లెంతసత్వహీనులై యున్నారు! గురుకులమును జక్కగ నారాధించుచు, స్వశాఖను ప్రయత్నముతో జదివిన వానికిసైతము బ్రహ్మసిద్ధియగుట నృపాధీనమైన నంతకు మించినదుఃఖ మేమి కలదు!' అని చింతించి, భూమిని జయింపగోరి, కుశసమిద్ద్రుమస్రుగాజ్య చరుగ్రహణమునకు దగినహస్తముచేత మండుచున్న ఖడ్గము నొరనుండి పెరికెను. పల్లవేంద్రుని యంతపాలురను సత్వరముగ నోడించి శ్రీపర్వతద్వారమువఱకు వ్యాపించియుండు నరణ్యదేశమును స్వాధీనపఱచుకొనెను. బృహద్బాణప్రముఖబహురాజమండలముల నదిమి కప్పము గొనుటచే పల్లవేంద్రుని కనుబొమలముడికి గారణభూతుడై ముగింపబడిన స్వప్రతిజ్ఞావ్రతమును, సులభముగ ప్రాప్తమైన కృతార్థత్వమును సముత్పాదిత యుద్ధయాత్రతోడ భూషణములై చెలగ నాతడు విరాజిల్లెను. శత్రువులగు కంచిరాజులు బలముతో యుద్ధము సేయుటకు పలుమా రాతనిపైకి రాగా, వారిసేనాసాగరముపై రాత్రులయందు విషమదేశములయందు బయనము సల్పునప్పుడుగాని, విశ్రమించినప్పుడుగాని, అవస్కన్ద భూములయందుగాని, డేగవలె మహోగ్రముగ దాకి, ప్రహరించుచు, వచ్చినకష్టములను చేతనున్నశక్తిచే తోడుగ గొని యోర్చుకొనుచుండెను. పల్లవేంద్రు లాతనికీర్తిప్రతాపములను, వంశమును గనుగొని యట్టివానికి హానిసేయుట శ్రేయము గాదని తలచి సత్వరముగా నాతని మిత్రునిగ జేకొనిరి. అంతట నారాజులకొలువునందు జేరి, యనేక యుద్ధములయందు స్వపరాక్రమమును బ్రకటించి వారిని సంతోషపఱచి, పల్లవులకరపల్లవములచే సంపూజితమైన పట్టబంధమును బొందెను. దానితోగూడ వర్ణితకీర్తి నృత్యము సేయు వంకర యలలుగల పశ్చిమసముద్రతీరము నుండి ప్రేహారము వఱకు గల దేశమును బడసెను."

తాళగుండశాసనములో వర్ణింపబడిన కదంబవంశోత్పత్తిక్రమము విశ్వాసార్హమైనదని యందరు నొప్పు



౫. జలౌఖానా లేక హుసేనాబాద్ ద్వారము-లక్నో



త్యాగరాజమహోత్సవము (12-2-28), సింగరేణి కాలియర్సు

పంపినవారు: శ్రీ వేముగంటి వెంకటకృష్ణారావుగారు, ఖమ్మంమెట్టు, నైజాం.

కొన్ని విషయములే. అయినను ఆశాసనములోని కొన్ని విషయముల నీసందర్భమున చర్చింపవలసియున్నది.

౧. మయూరశర్మ పర్వతప్రాంతభూములను జేరి, బృహద్బాణాది పల్లవసామంతరాజులకడనుండి కప్పము గైకొనెనని శాసనము చెప్పుచున్నది. ఇందువల్ల మయూరశర్మకు లోబడి బృహద్బాణాదిరాజులాతనికి క్రిందనై నిలిచిరనుట తెల్లము. మయూరశర్మచే సముత్థాపనమైన తిరుగుబాటు బలీయమైనదనుట నిస్సంశయము. కావుననే పల్లవేంద్రు డీతిరుగుబాటు నణగద్రొక్కుటకు పలుమారులు దండెత్తి రావలసివచ్చెను. ఇది

"అభియుయుక్షయా గతేషు
భృశం కాంచీనరేంద్రే ష్వరాతిషు"

అన్న శాసనవాక్యమువల్ల నిర్ధారితము. అట్లు వచ్చిన సైన్యములను నిర్జించుచు పల్లవరాష్ట్రముపై దండెత్తిపోవుచుండెనని

"విషమదేశప్రయాణసంవేశ రజనీష్వవస్కందభూమిషు ప్రాప్యసేనాసాగరం తేషాం ప్రాహార్బలీ శ్యేనవత్తదా"

యన్న వాక్యములవల్లను,

"బలవద్భ్రాతా సముత్థాపనేనచ"

యన్న మాటలవల్లను విదితమగుచున్నది. ఈవిషయముల నన్నిటిని చక్కగా నాలోచించి చూడ, పల్లవరాజులు మయూరశర్మను లోబరచుకొనుటకై యనేకప్రయత్నములు చాలకాలమువఱకు జేయుచుండిరని తోచుచున్నది.

౨. ఇట్లు పోరాడుచున్న మయూరశర్మను జయలక్ష్మి నిరంతరము వరించియుండెనని చెప్పుట కవకాశము లేదు. అతడు నిరంతరము జేతయగుటయే వాస్తవమేని పల్లవులతో సంధి జేల కొడంబడవలయును.? ఆసంధిసమయము లెట్టివి! మయూరశర్మ పల్లవులకు లొంగిన, వారతనికి సేనాధిపత్యము నిచ్చుట కంగీకరించిరి. మయూరుడు దండుల కొప్పుకొని పల్లవసేనాధిపత్యము వహించెను. కావున నాతడు పల్లవులచే పరాజితుడై జయముపై నాశ విడిచెను. పల్లవరాజుల కట్టి శూరుని కింక నుపద్రవము గలుగజేసిన దనకు ముప్పు వాటిల్లునను సంశయము గలుగుటచేత నాతనితో సంధి చేసుకొనిరి.

౩. అనేకులు చరిత్రకారులు తాళగుండశాసనమందలి కదంబోత్పత్తికథనము నాశ్రయించుకొని, మయూరశర్మ పల్లవులను సంపూర్ణముగ జయించి స్వతంత్రరాజ్యమును స్థాపించినట్లు వ్రాసియున్నారు. కాని యిట్టివ్రాతల కేయాధారమును గానరాదు, శాసనమున నిట్లున్నది:—

"సంశ్రిత స్తదా మహీపాలా
నారాధ్య యుద్ధేషు విక్రమైః ;
ప్రాప పట్టబంధసంపూజాం
కరపల్లవైః పల్లవైర్ధృతాం."

పల్లవులను సంపూర్ణముగ జయించియే యుండిన యెడల వారి నాశ్రయించుట యేల? వారికొలువున జేరి యుద్ధమున స్వవిక్రమప్రకటనముచే వారి నారాధించుట యేల? ఇట్లు పల్లవుల నారాధించుట వల్లగదా పట్టబంధప్రాప్తియును, నపరార్ణవప్రేహారమధ్యదేశలాభమును గల్గినది? బంటుచేసిన యూడిగమునకు మెచ్చుకొన్న రాజు బంటును సామంతుని జేయుట సహజముగాని స్వతంత్రునిగ జేసి తనరాజ్యమును పంచియిచ్చుట నెచ్చటను వినియుండలేదు.

మఱియు నైశాసనమున కకుత్స్థవర్మ తాను 'కదంబసేనానీ బృహద్బాన్వయవ్యోమచంద్రము' డనని చెప్పుకొనియున్నాడు. కావున, మయూరశర్మయు, నతని తరువాతి కదంబరాజులును పల్లవసేనానులేగాని స్వతంత్రరాజులు గారు. ఇందువల్లనే తరువాతికాలమున పల్లవరాజులు కదంబరాజ్య విషయములందు పలుమారు జోక్యము గలిగించుకొనియుండిరి.

కకుత్స్థుని పుత్రుడగు ప్రథమకృష్ణవర్మ పల్లవులచే యుద్ధమున బరాజితు డాయెను. ఈతనికుమారుడు విష్ణువర్మ తన హెబ్బటశాసనమున దాను "శాంతివ

సర్వ మహారాజ పల్లవేంద్రాభిషిక్తుడని చెప్పుకొన్నాడు. విష్ణువర్మయొక్క జ్యేష్ఠపితృపుత్రుడు దాను

తుఙ్గగఙ్గకులోత్సాన్నీ పల్లవప్రలయానలః

అని ప్రగల్భములు పల్కియున్నాడు. ఈతని యనుజుడగు రవిపై విష్ణువర్మను నిర్జించి యాతనికి దోడుపడిన చండదండుడను కాంచీశ్వరుని బరిభవించెను.

ఈవిషయముల నన్నిటిని దరచిచూడ గదంబులు పల్లవుల నాశ్రయించియుండిన సామంతరాజులే కాని స్వతంత్రులుగారను విషయము స్థిరపడుచున్నది.

సరస్వతీ శాపఘట్టము

కోమాండూరు కృష్ణమాచార్యులు గారు

(ఆంధ్రహర్షచరిత్రమునుండి యుద్ధరింపఁబడినది)

శ్రీనారాయణ నాభిపద్మమధుపశ్రేష్ఠుండు ముల్లోకముల్
వాసం జాలినవేల్పుఁ బెద్ద నిగమాభ్యాసైక నిష్ఠుండు గీ
ర్వాణాధీశ వినూత్నరత్నమకుట ప్రాంచత్పదాబ్జుండు ని
త్యానందామృతవార్ధి బ్రహ్మ యొకనాఁ డాత్మీయలోకంబునన్.

భారద్వాజ వసిష్ఠ కాశ్యపముఖ బ్రహ్మర్షి దేవర్షి సం
వారంబుల్ గొలువన్ విశుద్ధధవళాబ్జాతోరుపీఠంబునం
దారోహించి ప్రజాపతుల్ మునులు బ్రహ్మాఖ్యానముల్ సల్ప లో
కారాధ్యుండు తదేకసంశ్రవణ దీక్షాసక్తుఁడై యుండఁగన్.

కొందఱు ఋక్కులన్ మునులు కొందఱు సామములన్ యజుస్సులన్
గొందఱు కల్పసూత్రములఁ గొందఱు యజ్ఞవిధానవిద్యలన్
గొంద ఱశేషనైగమిక గూఢ మహార్థములన్ వచింప వా
రందఱిలోన నత్రిసుతుఁ డాగ్రహచిత్తుఁడు మందపాలుతోన్.

కలహముఁ బెంచి రోషరయ గద్గదకంఠ కఠోరనాద మా
ప్రలయ మహోగ్రభైరవ రవప్రతిమంబుగ సామగానమున్

నలుప సప్తస్వరంబు మునిసత్తము లెల్ల వినంగఁ దోఁచినన్
బలుకక యూరకుండిరి సభాసదు లందఱు శాపభీతులై.

అపుడు కుమారివాణి కమలాసనుఁ జామర మెత్తి వీచుచున్
జపలకటాక్షమాలికలు చారుసభాంతర సీమ నిండ స
త్తపసిని జూచి పాటల రదచ్ఛద మించుక విప్పి దిక్తట
ద్వీప కమనీయ దంతఘనదీధితి వెల్వొలఁ బార నవ్వినన్.

భాషాదేవి శుచిస్మితంబుఁ గని దుర్వాసుండు దుర్వార వి
ద్వేష ప్రస్ఫురదోష్ఠపల్లవుఁడు సందీప్తోగ్ర నేత్రుండు నై
యోషారత్నము పైని శాపజలముల్ ప్రోక్షింప నిల్వంగఁ ద
ద్రోషార్చుల్ ముఖనాసికాపుటములన్ రూఢంబులై వెల్వడెన్.

విప్రు సంరంభమును జూచి వేదమాత, దేవిసావిత్రి దుర్వాసుఁ దేరి చూచి
చెడుగ! సామంబుఁ జెఱిచియు సిగ్గు లేక, వాణి శపియింతురా యని పల్కుచుండ.

అత్రిముని, పుత్ర! యేల నీయతుల తపము, కోపమున నాశ మొనరింతు కుమతి వగుచు
సకలలోకైక జనని భాషావధూటి, తండ్రి! తిట్టకు మనుచు నదల్చుచుండ.

అకట! వాగ్దేవి శాపార్హ యగునటయ్య, తప్పుఁ గావు మటంచు బృందారకులును
కోప ముపసంహరింపుఁడు గురువు లనుచు, వటువులనుగూడి వేఁడ నబ్బడుగుతపసి

ఆ సరసీజయోని మగఁ డన్న మదంబున నిందుకొల్వులో
భూసురు లెల్లఁ జూడ ననుఁ బూరికిఁ గైకొన కిట్లు నవ్వి తీ
వోసి దురాత్మురాల, మనుజోర్వి వసింపుము పొమ్మటంచుఁ దా
నీసునఁ దిట్టె లోక జనయిత్రిని బద్మభవుండు బెగ్గిలన్.

వేదజనయిత్రి సావిత్రి విప్రునకును, మరలఁ బ్రతిశాప మీయఁ గమండలంబు
పాణిపుటమున ధరియింపఁ బరమసాధ్వి, పద్మజునిరాణి వారించి పలికె నిట్లు.

చెలియరో! తాపసోత్తములు చిత్తమునం దొక తెంపు సేసి తా
మలిగిన నల్గ నిమ్ము సకలాగమ తత్వరహస్య మాత నీ

వలిగిన లోకముల్ నిలుచు నమ్మ, ద్విజన్ములు జాతి మాత్ర మా
న్యులుగద శాంతిఁ బొందుము మహోదధి వేల నతిక్రమించునే.

ఇట్లు సముచిత భాషణంబుల భాషామోహకు హితయగు సావిత్రి ననునయించు చున్న సమయంబున.

శాపావసాన సంజాత సభాక్షోభ మబ్జాసనుండు హస్తాంచలమున
వారించి మధురగంభీర స్వరంబునఁ బ్రావృడంభోధరధ్వానగరిమ
నాత్రేయుతోఁ బల్కె నరుణాధరము విప్పి దంతకాంతుల దిశల్ ధవళములుగ
వినవృత్తమునకును విప్ర నీకు సమంబు పటుజటావల్కల భార మంత
శాంతి లేనితపం బేల శాస్త్ర మేల, స్థలజలాంతర భూతవిదాహమునకు
వత్స, పుట్టితి విప్ర గర్భమున నీవు, కలశవారాశి జనియించె హాలహలంబు.

కోపమును నిగ్రహింపని కుత్సితాత్ముఁ, డైహికాముష్మిక సుఖంబు లందఁ గలఁడె
అక్షియుగళంబుఁ గల్గిన యంధుఁ డతఁడె, సాధుగర్హిత వర్తన సంయమీంద్ర.

క్రోధ ధర్మంబులకు సమానాధి కరణ, మగ్నికిని పాఁకును బోలె నవనిఁ గలదె
కోపమును నిగ్రహింపకు ఋషి కుమార, బాల వాగ్దేవి శపియింపఁ బాడి యగునె.

అని భాషామోహం జూచి కమలాసనుండు.

బాల కలంతఁ జెందకుము బ్రాహ్మణశాప మవశ్యభోగ్య మా
గాలనియోగ మెవ్వరును గాదనఁ జాలరు ధీర వీవు నీ
లాలక మద్వియోగ విరహార్తిఁ గృశింపకు మర్త్యలోకమం
దీలలితాంగి వేద జననయిత్రి భవత్సఖితోడ నీ కగున్.

మనుజభువి సుతుని ముఖమును, గనుటయె శాపాంత మట్లు గావున మరలన్
ననుఁ గొల్వ నేఁగుదెంతువు, చనుమా సావిత్రిఁ గూడి సారసనేత్రా.

అని భారతి నూరడించి విసర్జిత సురాసురముని మనుజమండలుండును ససంభ్రమోపగత నారదస్కంధ విన్యస్తహస్తుండును నై చతుర్ముఖుండు సముచితాహ్నిక కరణార్థం బరిగె నంతఁ గమలజురాణి శప్తయయి.

మోముదమ్మిని గన్నీరు ముమ్మరముగఁ, దనకుఁ బ్రాపిన్క్కలమ్మ కైదండ యొసఁగ
వేఁడియూరుపు సెగలఁ గెంబెదవి గంద, పలుకు తొయ్యలి యిలు సేరె వగలఁ బొగిలి.

జనని సరస్వతి సతి రసాతల మేఁగెడు వార్త సర్వభూ
జనులకుఁ దెల్ప వచ్చె ననఁ జండమయూఖుఁడు దోఁచెఁ దూర్పునన్
మునిఁగె నపార పశ్చిమ సముద్రమునందు సుధాంశుఁ డుగ్ర భా
నుని కరకాండ ఘట్టనఁ దనుద్యుతి సర్వము మాసిపోవఁగన్.

అంతట నంశుమంతుఁ డుదయాచలకూటము లాక్రమించి దు
ర్దాంత మయూఖజాల సముదగ్ర మహాగ్ని శిఖాకలాప మా
శాంతర సీమ నిండ గగనాంగణమధ్యము నాక్రమించి యం
తంతఁ గ్రమంబునం బరిణతారుణ కాంతుల నొప్పె శాంతుఁడై.

సమదైరావణ దంతకుంత దళిత స్వర్వాహినీ కూల ము
త్తమ సప్తర్షి సమర్పితార్ఘ్య జల సంత్రస్తోగ్ర మందేహ మ
స్తమితా దిత్యమయూఖ తాపము గిరీశ ప్రస్ఫురత్తాండవ
స్తిమితం బయ్యెఁ బ్రదోష మంబరచరత్సీమంతినీతోష మై.

అంతటఁ బండువెన్నెల లజాండ కటాహము నిండ యామినీ
కాంత మొగంబునం బొలుచు కప్పురపుం దెలిచుక్క నా నిశా
కాంతుఁడు వచ్చెఁ గల్వలవికాసము హెచ్చె మొగిడ్చెఁ బద్మినీ
కాంత మొగంబుఁ జంద్ర శిల కాయము నిండఁ జెమర్చె నత్తఱిన్.

వ. అట్టి రమణీయయామినీ ప్రథమ యామంబున విరించి విరహాదోదూయమానమానస యు శూన్యహృదయయు నయి కన్నుఁగవఁ దొరఁగు బాష్పకణంబులు నఖాంకురంబుల మీటుచు బయలుసూచుచున్న నమ్మహాదేవిం జూచి సావిత్రి యిట్లనియె.

పచ్చియెరువువలన వరిచేలను బలపరచుట

గోటేటి జోగిరాజుగారు

ఇటీవల కోయంబత్తూరు వ్యవసాయకళాశాలయొక్క షష్టిపూర్తి మహోత్సవ సందర్భమున జరిగిన సభలో గవర్నమెంటు వ్యవసాయ రసాయనిక శాస్త్రజ్ఞులగు బి. విశ్వనాథగారిచే "వరిచేలను బలపరచుటలో గమనింపవలసిన సూత్రములు"ను గురించి చదువబడిన వ్యాసమున, వరిపైరున కాయాకల్పితపు ఎరువులను ప్రత్యేకముగ వేయుటకంటె, పచ్చియెరువు (green manure) ప్రత్యేకముగగాని, కల్పితపు ఎరువులతో చేర్చిగాని, వేయుట ప్రశస్తమని స్పష్టపరచిరి. వారిలెక్క ప్రకారము, ఏయెరువును వేయకయే నాటిన పైరువలన 100 కుంచముల ధాన్యము లభించు ప్రదేశమునుండి, యీక్రింది యెరువులను, వానిమిశ్రణములను వేయుటవలన నదేప్రదేశమునుండి లభించుధాన్యమును కుంచములుగా చూపబడెను.

వేసినయెరువు	పంటయొక్క తారతమ్య పరిమితి కుంచములు[1]
1. ఏమియు ఎరువు లేకయే	100
2. కల్పితపు ఎరువులరూపమున స్ఫురితములు మాత్రమే వేయగా	152
3. ,, ,, నత్రజనిని మాత్రమే వేయగా	212
4. ,, ,, నత్రజనియు, స్ఫురితములను చేర్చి వేయగా	272
5. పచ్చియెరువును మాత్రమే వేయగా ...	308
6. పచ్చియెరువుల చేర్చి కల్పితపు ఎరువు రూపమున స్ఫురితములు మాత్రము వేయగా	364
7. ,, ,, నత్రజనిని మాత్రమే వేయగా	403
8. ,, ,, నత్రజనియు స్ఫురితములను చేర్చివేయగా	485

కల్పితపు ఎరువులు, సంపాదించుటకును, పొలమునకు గొనిపోయి వేయుటకును ఎంత యనుకూలముగనున్నను, అవి మొత్తముమీద పచ్చియెరువుతోగాని, స్థూలములగు నితర సేంద్రియపు ఎరువులతోగాని (organic manures) సాటిరావనియు, సేంద్రియపు ఎరువులు పోషమంతటికిని చాలక కల్పితపు ఎరువులను నుపయోగింపవలసి వచ్చినప్పుడు వానిని సేంద్రియపు ఎరువులతో కలిపి వాడుట మంచిదనియు శాస్త్రజ్ఞులు దృఢముగా చెప్పుచున్నారు.[2] కావున రైతులు తమ పశువులయెరువును పదిలపరచుటయందును, పచ్చియెరువులను సంపాదించుటయందును హెచ్చుకృషి జరుపవలసియున్నది. ఈవ్యాసమున పచ్చియెరువును సంపాదించి ఉపయోగించు మార్గమునే చర్చించెదను.

వరిచేలకు పచ్చియెరువులను సంపాదించుటకు ఆనేలయందే జనుము, జీలుగు, తీగపెసర మొదలగు సస్యములను పెంచి, దమ్ముచేయుటయే ముఖ్యసాధనము. ఉత్తరసర్కారులలో రైతుల యనుభవమునుబట్టి ఆయా సస్యములను జల్లుతరుణములును, విధానములును ఈక్రింద వివరింపబడినవి—

1. విశాఖపట్టణపు జిల్లాలోవలె వరిసాగు ఆలస్యముగ జరుగు అన్నిండు గరుపభూములలో తొలకరించినారుపోయు తరుణముననే మరికొన్నిమళ్లలో జనుముగాని, జీలుగుగాని చల్లినచో, నాటుదునప్పటికివియు 3, 4 అడుగు లెదిగి ఎరువుగా దమ్ముచేయుట కనుకూలించును. ఎకరమునకు $2\frac{1}{2}$—3 కుంచములవి విత్తనములను చల్లవలెను.

2. గోదావరి జిల్లాలోవలె దాళువాపంట సాగుచేయు నేలలలో నాపంటను కోయుటకుముందు జనుముగాని, జీలుగుగాని చల్లినయెడల అది చూపదనపు

1. కుంచముధాన్యము 7 పౌనులు తూగును.
2. చెన్నపురి వ్యవసాయశాఖవారిచే ప్రచురింపబడిన 90 వ బులెటిన్‌ను చూడుడు.
3. కుంచమనగా సుమారు 9 పౌనులు (పెసలు, మినుములు, జనుములు మొదలగునవి.)

మొలచి, ఖరల తడిపెట్ట వక్కర లేకయే మరునటి పారు వాపంట పెట్టుకాలమునకు 3—4 అంగుళముల పైగా పెరిగి, ఎరువుగా దమ్ముచేయుట కనుకూలముగా నుండును. కాని, ఇటీవల చాలచోట్ల దాళువాపంట ఫలించుకాల ఆలస్యమైనది. ఒక ఎకరమున పెరిగిన రొట్ట సామాన్యముగా చేలకు 6 ఎకరములకును, దీని చేలకు 3 ఎకరములకును సరిపోవును. క్రిందిపటము తీలుగు చేను కోయుచున్నప్పుడు తీయబడిన ఛాయాచిత్రము.



మునకు నీరు చాలక చేల యెండిపోవుచుండుటచే నిట్లు పచ్చియెరువు పస్యములను జల్ల నవకాశము లేకపోవుచున్నది. అరుదు దాళువాపంటయే ఎండి బొంబడిపోవుటమాడ గలదు.

తీలుగుచేను. చిత్రము — దమ్ముచేయుటకుముందు కోయబడుచున్నది.

3. పైని చెప్పినట్లు దాళువాపంటకు తగినంతనీ రందనిచోట్ల నాప్పైరును పెట్టుటయే మాని శిమకటిసారు వాప్పైరు కోసినప్పటినుండియు, మళ్లలో నీరు కట్టి నిల్వయుంచి, మార్చినెలలో తీలుగుచల్లి నీరు తీసివేసినయెడల ఖరల తడిపెట్టనవసరము లేకయే యాప్పైరు మరునటి పారువాపంట పెట్టుకాలమునకు బాగుగా పెరిగి ఎరువుగా దమ్ముచేయుట కనుకూలించును. ఈసంవత్సరము చామర్లకోట వ్యవసాయస్థానమున ఏ. 2.88 ట్లలో నిట్లు తీలుగు చల్లగా ఏ. 1 కి 12,269 పౌనుల రొట్టచొప్పున

పైని చెప్పినట్లు మళ్లలో నీరు కట్టినప్పుడు ఒక్కొక్కప్పుడు గడ్డి విస్తారముగా పెరుగును. అట్టిస్థితిలో తీలుగును జల్లుటకు ఒకవారము ముందుగా ఒకటిరెండు పారులు మళ్లను దమ్ముచేసి, పట్టె తోలి, నీరు కట్టియుంచుట మంచిది. కాని గడ్డి అంతగా పట్టనిచేలలో దమ్ము చేయ న వ స ర ము యుండదు. గడ్డి ఒకమోస్తరుగ పట్టిన రెండుమళ్లలో, ఒకదానిలో దమ్ముచేసియు, రెండవదానిలో దమ్ముచేయకయు తీలుగు చల్లగా, దమ్ముచేసినమడిలో ఎకరమునకు 10,686 పౌనుల రొట్ట చొప్పున కాగా, దమ్ముచేయనిచేలలో ఎకరమునకు 11,974 పౌనుల చొప్పున అయ్యెను.

4. చెఱకుతోట పెంచి ఆగివేసిన నేలలో మొదళ్లను త్రవ్వి కాల్వలను కప్పగనే అప్పటికి నేలయందుండు పదునుతోనేకాని, ఒకతడిపెట్టికాని, జీలుగు, జనుము, తీగపెసర వీనిలో దేనినైనను గాని, మూడవ దానితో మొదటి రెంటిలో నొకదానిని కలిపికాని చల్లినయెడల నవి తరువాత సారువాపంట కెరువుగా దున్నుటకు సిద్ధమగును. చామర్లకోట వ్యవసాయ క్షేత్రమున సామాన్యముగ ప్రతిసంవత్సరము నీపద్ధతి యవలంబింపబడుచున్నది. తరుచు ఎకరమునకు 20,000 పౌనుల వరకు (అనగా సుమారు 5, 6 ఎకరముల బీడనేలకు సరిపోవు) రొట్ట అగుచున్నది. ఎకరమునకు సుమారు పంచెడు జనుములుగాని, జీలుగులుగాని రెండు పంచముల పెసలతో కలిపి చల్లవలయును.

5. పయర నావుచేలకు పంటతడి పెట్టుటకు ముందు పైని చెప్పబడిన పస్యములనే చల్లినయెడల తరువాత సారువాపంటకు తగినంతరొట్ట లభించును.

6. పయర నావుచేలను చల్లునప్పుడే నీలివిత్తులనుగాని, వెంపలి విత్తులనుగాని కలిపి చల్లునెడల, నావు చేను కోసికొనినవెనుక, నానీలియు, వెంపలియు నెమ్మదిగ నెదిగి, తరువాతి సారువాపైరునకు ఎరువుగా దమ్ము చేయ వీలగును. ఎకరమునకు 4–6 సేర్ల విత్తులు చాలును.

7. నేల అంతగా బీటదీయక పదును నిలుచు చోట్లగాని, పయరచేలకు తడిపెట్టు ఆచారముగల చోట్లగాని, సారువావరిచేను కోయుకాలమున, నీలిగాని, వెంపలిగాని, పయరదినుసులతో (పెసర, మినుము) కలిపి చల్లవచ్చును.

8. సారువాపంటకోతకు ముందు, సామాన్యముగ మేతకు జల్లివల్లె జనుము జల్లి, దాళువాపంటకు ఆపస్యమును ఎరువుగా దున్నివేయవచ్చును.

9. పైని చెప్పినట్లు జీలుగువిత్తులను జల్లినయెడల నీపైరు జనుమెదిగినట్లు బాగుగ నెదుగదు. కాని ఈకాలమున జల్లిన జీలుగుమొక్కలు మెల్లగ నెదిగి బాగుగ కాయును. విత్తులకొరకు కాపస్యమును మార్చి, ఏప్రిల్ నెలలో కోసుకొన్నయెడల, కొన్ని పదును నిలుచు నేలలలో నా మొక్కలమొదళ్లు మరల చిగిర్చి, తరువాత సారువాపైరునకు తగినంతరొట్ట నిచ్చును. ఈసంవత్సరము చామర్లకోట వ్యవసాయక్షేత్రమున నిట్లు య. 2-61 సెంట్లభూమిలో చల్లగా నెకరమునకు 419 పౌనుల విత్తులను (సుమారు 52 రూపాయల విలువగలవి), తరువాత మొదళ్లు చిగుర్చుటవలన నెకరమునకు సుమారు 2,000 పౌనుల రొట్టయు లభించెను. విత్తులకుగాను చేనిని కోసిన వెనుక పెద్దైన వర్షము కురిసినయెడలగాని, ఒకతడి పెట్టుటవలనగాని రొట్ట బాగుగా వచ్చును. ఈసంవత్సరము నేసవివర్షము లంతగా లేక ఎండలు మిక్కుటముగా గాసినను చామర్లకోట వ్యవసాయక్షేత్రమున పైని చెప్పినట్లు కోసినమోళ్ళనుండి ఎకరమునకు 2000 పౌనుల రొట్టయగుట, జీలుగుమొక్కయొక్క మోటుదనమును సూచించుచున్నది.

పైని చెప్పినట్లు జీలుగను ప్రత్యేకముగాగాక పెసర, మినుము మొదలగు పయరదినుసులతో కలిపి కూడ చల్లవచ్చును, చల్లుపెసలలోగాని, మినుములలోగాని మూడవవంతు తగ్గించి జీలుగువిత్తులను వానికిబదులు చేర్చవలయును.

పైనిచెప్పిన తొమ్మిది విధానములలో దేనినైనను అవలంబించి వ్యవసాయదారుడు తననేలకు గావలసిన రొట్టను సంపాదింపవలయును. మరియు వీలగుచోట్ల నిద్రగన్నేరు, కానుగు, వేప మొదలగుచెట్ల రొట్టనుగాని, బంజరు నేలలందును, కాల్వగట్లను, బాటలప్రక్కలను స్వాభావికముగ పెరుగు, కసింద, తంటెప, జిల్లేడు, సీమనేపాళము మొదలగు జాతుల రొట్టనుగాని, తెచ్చి యుపయోగింపవచ్చును. ఈవిషయమై మరియొకవ్యాసమున వ్రాయబడును.

పచ్చియెరువు వేసినప్పుడెల్ల, సామాన్యముగ దానితో నెముకలపొడినికూడ వేయుట చాలచోట్ల లాభకారిగనుండును. ఎకరమునకు మొదటి సంవత్సరమున 4 గుండ్ల యెత్తును (221 పౌనులు), తరువాత నవసరమగునెడల ప్రతిసంవత్సరమున 2 గుండ్లయెత్తుగాని, రెండుసంవత్సరముల కొకసారి మూడుగుండ్ల యెత్తుగాని వేయవలెను. ఇప్పు డెముకలపొడి 4 గుండ్లు ఎత్తుగల బస్తా 9-10 రూపాయలకు దొరకును.

'వాపిని'

పేటెంటు అభివృద్ధి చేయబడిన ఆవిరి కుక్కరు



కుక్కరులన్నిటిలోను 'వాపిని' అనునదియే కడపటిది. దీనికై మీరందరును వేచియున్నారు. దీనిని చూచినంత మాత్రముననే ఒకటి మీవద్ద యుండవలెనని మీరు తప్పక కోరెదరు.

బాయిలరు వలె గట్టిగానుండి, ఆభరణమువలె ప్రకాశించుచు, అన్నియు పూర్తిగా గల వంటసామానులు. పై భాగమంతయు ఇత్తడితో తయారు చేయబడినది. లోపలగలపాత్రలు అలుమూనియముతో తయారుకాబడి యున్నవి. మూయుట సులభము, పరిశుద్ధముచేయుట సులభము.

నీరు ఎంతవరకుండునది కనబడుచునే యుండును. ఇతర కుక్కరులయందుండు లోపములేవియు 'వాపిని' యందు లేదు. ఇది చక్కగా పనికి ఉపయోగించుటకే తయారు చేయబడినది కాని ఆటవస్తువుమాత్రము కాదు. ఏరకము వంటవస్తువులు అనగా బొగ్గు లేక స్పిరిట్ లేక గ్యాసు లేక కిరసన్ పాయిల్ మొదలగువాటిలో దేనినైనను ఉపయోగించవచ్చును.

ధర రు॥ **12-8-0** నుండి రు॥ **25** ల వరకు గలదు.

పూర్తివివరములకు వ్రాయుడు.

బెంగాల్ కెమికల్ అండు ఫర్మాటికల్ వర్క్సు,

లిమిటెడ్; కలకత్తా.

పునర్విమర్శనము

పరామర్శ విమర్శము

వినోదవిమర్శమను పేరితో నేను ప్రభవఫాల్గున భారతిలోఁ బ్రకటించిన భారతపద్య పాఠార్థ విమర్శమును బ్ర. శ్రీ శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారు విభవ వైశాఖ భారతిలోఁ బరామర్శించినారు. వినోదవిమర్శమున నేను "ఇంతకంటె సరసమయిన యర్థ మెవ్వరికైన గోచరించినచో వెల్లడింప వేఁడుచున్నాఁడ"నని విద్వాంసులను వేఁడితిని. శాస్త్రులుగారు తమ పరామర్శోపక్రమమున "ఆ పద్యమున కర్థము నాకు మఱొకవిధముగా గోచరించినది. అది సరసమయినదగునో కాదో ప్రభాకరశాస్త్రిగారును, పాఠకులును నిర్ణయింపవలయును గాని నేను నిర్ణయింపఁ జాలను. నాకుఁ దోఁచిన యర్థమును వారి యనుజ్ఞ ప్రకారము వెల్లడించుచున్నాఁడను." అని వ్రాసిరి. ఉపక్రమ వినయోక్తిగా మాత్ర మట్లు వ్రాసిరే కాని వారు తమ పరామర్శ నిర్వాహమున నేను చెప్పిన యర్థమున దోషములను, స్వయము చెప్పిన యర్థమున గుణములను ఉపన్యసించినారు. నేను చెప్పిన యర్థము దోషదుష్టమనియు, స్వయము చెప్పిన యర్థము సరసమయినదనియు నభిమానము వారికున్నది. లేకేని వారి పరామర్శారంభమే వ్యర్థమగును. నేను గోరినది నేను చెప్పిన యర్థముకంటె సరసమయిన యర్థము నే కదా! కాని శాస్త్రులుగారు నా వినోదవిమర్శమునందుఁ జూపిన దోషములు గాని, స్వయముగ చెప్పిన యర్థమునందుఁ జూపుకొన్న గుణములు గాని యుక్తియుక్తములు గావని నేఁ దలఁతును. వానిఁ బ్రల నిక్కడ తెలుపుకొనుచున్నాను: తత్త్వనిర్ణయమునకు సహృదయులు ప్రమాణము.

నేను పఠించిన పాఠమును, అర్థమును, ఇట్లు:—

చ. పగ యడఁగించు టెంతయు శు
భం బది లెస్స యడంగునే పగం
బగ వగఁ గొన్న మార్కొనక
పల్కక యుండఁగ వచ్చునే కడుం
దెగ మొదలెత్తి పోవఁ బగ
దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు నే
మిగతిఁ దలంచినం బగకు
మేలిమి లేమి ధ్రువంబు కేశవా!

పగ యడఁగించు టెంతయు శుభంబు—అది లెస్స యడంగునే పగన్— పగ పగఁగొన్న మార్కొనక పల్కక యుండఁగవచ్చునే—కడుం దెగ మొదలెత్తిపోవ, పగ దీర్పఁగ వచ్చిన, క్రౌర్య మొందు —ఏమిగతిఁ దలంచినన్ పగకు మేలిమి లేమి ధ్రువంబు—కేశవా! ఇది నేఁ జెప్పిన యర్థమున వాక్యవిభాగము. ఉభయపక్షములు పగ వీడి శాంతి పొందఁగియుండుట మిక్కిలి శ్రేయము. పగ యనునది రెండుపక్షములలో నెక్కడనేని కలదా, శాంతి చేకూరదు. అది యెట్లనఁగా: స్వయము పగ పాటించుచున్నచో, ఎదిరివానియందు పగప్రాప్తిగా నడఁగిపోవుట యసంభవము. ఎదిరివాఁడు (పగవాఁడు) పగ పాటించుచున్నచో స్వయమును చేతనో, వాతనో, ప్రతిపల్కక యుండ శక్యము గాదు. స్వయము ఎదిరివాని మీఁదికిని, ఎదిరివాఁడు తనమీఁదికిని పరస్పరము పగ దీర్చుకొనుటకు దండెత్తివచ్చినచో ఉభయపక్షములో, ఒకపక్షమో నశించి పగయడంగిపోయినఁ బోవచ్చునుగాని యందు హింసారూపమగు క్రౌర్యము కలదు. కావున పగయుండిన సకల తెఱఁగులలో మేలిమి లేదు. ఉభయపక్షములలోను పగ లేని తెఱఁగే శ్రేయము. ఇది పద్యమునకు నేఁ జెప్పిన తాత్పర్యార్థము:—శాంతికాముఁ డయిన ధర్మరాజు రాయబారము నడుపుచున్న శ్రీకృష్ణులవారితోఁ జెప్పుచున్న యిది:— కేశవా! ఎట్లయినను ఉభయపక్షములందును పగ చల్లార్చి శాంతి చేకూర్పుము— అని కోరుటలో ఎదుట వైరము గ్రక్కుచున్న భీమార్జునాదుల స్మరించి ముందు స్వపక్షము పగ వీడినఁగాని శాంతి చేకూర దన్నాడు. కాని, అట్లు స్వపక్షము నెట్లో నిర్బంధించి పగ వీడునట్లు

చేసినను, విరోధులగు దుర్యోధనాదులు పగచే సాధించుచున్నప్పుడు ఆశాంతి నిలువదనెను. ఇఁక, భీమార్జునాదులు, దుర్యోధనాదులు ఉత్సాహపడుచున్నట్లు పరస్పరము దండెత్తి యుద్ధము సాగించినచో పగ తీరినఁ దీరునేమోకాని, అందు జీవహింసాదోషము ప్రాప్తమగు ననెను. ఇట్లు పగగల తెఱఁగులమూఁటిని మేలిమి లేనిదని నిరూపించెను. ఉభయపక్షములందును బగ లేని నాల్గవ తెఱఁగయిన శాంతిని ప్రశంసించెను. ఇట్టిపద్యమున సాధితమయిన విషయమునే తర్వాతిపద్యమున 'కావున శాంతిఁ బొందుటయె కర్జము' అని ధర్మరాజు పేర్కొనెను. వినోదవిమర్శమున నేను రెండుపక్షములందును (పగ లేమి-పగ లేమి, పగ-పగ లేమి, పగ లేమి-పగ, పగ-పగ) పగకలిమి పగ లేములచే నేర్పడిన నాల్గు తెఱఁగులకును దృష్టాంతముగా- రెండును గురువులు, లఘువు గురువు, గురువు లఘువు, లఘువు లఘువు అని యత్యుక్తాచ్ఛందః ప్రస్తారమున నేర్పడిన రెండక్షరముల గణముల నాల్గింటిని జూపితిని.

దానిని శాస్త్రులవారు క్రిందివిధమున నవహేళనము చేసిరి—

"......స్వపక్ష పరపక్షములందున్న పగకలిమి పగ లేములయందు గురులఘుభావము నారోపించి ఛందస్సులోనికి దింపి తుది కత్యుక్తాపద్యము సంపాదించిరి."

ఇది యప్రౌఢమయిన యవహేళనము. గురులఘుభావము తెలుఁగ నేరనివారు, ఛందః ప్రస్తారమున నవగాహింపఁజాలనివారుగారు శాస్త్రులుగారు. అత్యుక్తా ఛందస్సులో నాపద్యము చెప్పుట దప్పు గాదు. నేఁ జెప్పిన యర్థమున నీయాపద్యము పొందక యత్యుక్తిదోషమునకుఁ బాల్పడె నేని దాని వారు నిరూపింపవలెను గాని యిట్లు చెనకుట యనుచితము. వర్తులమై, ఆహ్లాదజనకమై యామెముఖము చంద్రునిపోల్కి నున్నది అని యొకఁ డనఁగా, అందరాక పొందరాక ఆకాశమున నున్న చంద్రునితోఁ బోల్కి చెప్పఁబడెనని ముఖవర్తులత్వాహ్లాదకత్వముల నింకొకరాక్షేపించుట యెట్టిదో, శాస్త్రులవారి యీయాక్షేప మట్టిది. శాస్త్రులవారికిది యిష్టముగాదేని ఇంకొకపోల్కి నిదిగో చెప్పుచున్నాఁడను:—

"ఒకరియింట మూల నెక్కడో దాఁచియుంచిన చిలుఁదాళములలో నొక్కదాని నొక బాలుఁడు గైకొని 'అయి! ఇదిగో నాకు తాళం! నీకు లేదు!' అని రెండవ పిల్లవానిని కవ్వించుచు వానిమీఁదికి దాని బొంగరమువలెఁ ద్రిప్పి విసరివైచుచు నాడుచుండెను. రెండవ బాలుఁడు నా కట్టిదిగావలెనని యేడ్వఁజొచ్చెను. తండ్రి పెద్దపిల్లవాని చేతనుండి దానిలాగికొని రెండవపిల్లవానికిచ్చెను. వాఁడు దానితో నాడుచుఁ బెద్దపిల్లవానిని గెల్లింపఁజొచ్చెను. మరలఁ జీకాకు గదిరెను. రెండవతాళమును తండ్రి పెద్దపిల్లవాని కిచ్చెను. ఇరువురును రెండుతాళములఁ గలపి మ్రోఁగింపఁజొచ్చిరి. పిల్లలవస తీరెనుగాని యిల్లెల్ల గగ్గోలయ్యెను. ఇరువురచేతులనుండియుఁ దండ్రి తాళముల లాఁగికొనెను. శాంతి యేర్పడెను."

ఈ కథ నిక్కడ పోల్చికోవచ్చును. ఇందు గురులఘుభావములు లేవు. ఛందస్సులోనికి దిగుట లేదు. అత్యుక్తాపద్యము లేదు.

శాస్త్రులుగారు నావినోదవిమర్శముపైఁ జూపిన దోషములు మఱియు నివి:—

"వీరియర్థమున 'లెస్స' దేనితో నన్వయించునో, అర్థమేమియో చెప్ప లేదు. అది వాక్యాలంకారము గాన ప్రభాకరశాస్త్రిగారు వ్యాఖ్యలో నియ్యులే దనుకొనెనమన్న నది తిక్కనసోమయాజి ఫక్కి కాదు. అడఁగునే యనుదానితో నన్వయించినచో సరసార్థము రాదు. మఱియు, స్వపక్షము దండెత్తిపోవఁగా పరపక్షము దండెత్తి రాఁగా అని యన్వయించుటకుఁ బదసామగ్రి లేదు. అది సంస్కృతభారత భావానుసారము గాదు. ప్రభాకరశాస్త్రిగా రస్వరసమని తలంచిన లక్ష్మీపతి సోమయాజిగారిటీకలో ఇదేయర్థమున్నది. అది తిక్కనసోమయాజిగారి భావమయియుండదని నాయభిప్రాయము."

'లెస్స' యన్వయింప దనుటకు:—

నా వినోదవిమర్శము ముద్రణముననో, వ్రాఁతనో 'లెస్స'యును, దానియర్థమును జారిపోయినవి. అట్టి ప్రమాదములు సర్వసాధారణములు. శాస్త్రులవారి పరామర్శమునఁగూడ 'అది వేఱు చేసినచో అగును' అని కొంత లోపముతో వాక్యముండెను. అట్టివానిని సరిచూచు

కొనవలసినదే కాని, చర్చ తగదు. అందు 'లెస్స' అన్వయము శాస్త్రిలవారికిఁ గుదురకపోవుట వింత. అది వాక్యాలంకారమున తలఁపున నే విడువలేదు. అది యక్కడ వాక్యాలంకార మెట్లగును? అడంగునే యనుదానితోనే యది యన్వయించును. అందు పరసార్థము రాదని శాస్త్రిలవారు వ్రాయుట యచ్చెరువు గొల్పుచున్నది. "అది లెస్స యడంగునే పగన్" స్వపక్షముగ సాగించు చున్నప్పుడు పరపక్షము పగయడఁగి యున్నను, ఆయడంగుట లెస్స యడంగుట కాదు. ఏలనఁగా, స్వపక్షము సాగించుపగను పగయడఁగియున్న పరపక్షము ఒకతూరి యోర్చును, రెండుతూర్లోర్చును. కాని అదేపనిగా స్వపక్షముగ పగ సాగించుచునే యున్నప్పుడు పరపక్షము లెస్సగాఁ బగయడఁగియుండ సాధ్యము గాదు—అని యర్థముగదా! ఇక్కడ 'లెస్స'కు పరసార్థము రాదనుట పరసార్థమా? నేఁ జెప్పిన యీయర్థము పరపమయినను, 'లెస్స' పదమును 'అడంగునే' యను క్రియతో నన్వయించి నప్పుడీయర్థనివృత్తి యాపలుకు బడినండి సరసముగా సంఘటిల్లదనిరేమో శాస్త్రిలవారియాక్షేపము! అట్లేని ఇట్టి పలుకుబళ్లు ప్రాచీన ప్రబంధములందు లెవ్వి లేండములు. 'అది లెస్సగా నడంగునే' యనుటకంటె 'అది లెస్స యడంగునే' అనుటే ప్రాచీనకవులకుఁ బ్రియము.

'వీరలు పెద్దదన్వ కొకవెంట నోడంబడి తేరి శాంతులై.'

—ఉద్యోగపర్వము ౧ ఆశ్వా.

క. తాను దయఁ బెద్ద మనిచిన
మానిసి పతిఁ దగినయొషల మన్నింపమి య
జ్ఞానము తనమనఃపు గజ
స్నానమువలె నంద్రు గీర్తి నారాయణుఁడా!

—బద్దెననీతి.

పాలసెల్లునవోలెఁ బైటచేలము లెస్స
ముకుఁగుఁ బెట్టిన దయా ముద్దుగుమ్మ!

—శ్రీనాథుని చాటువు.

లెస్స యుండుసె గృహభర్తలేని బ్రదుకు.

—మనుచరిత్ర.

ఈప్రయోగములు చాలవా?

'పదసామగ్రిలే' దనుటకు:—

కడుఁ—తెగఁ—మొదలు—ఎత్తిపోవఁ—పగ—తీర్పఁగఁ—వచ్చినఁ—ఈపదములు పద్యమున నున్నవి. వీనికి నేఁ జెప్పిన యర్థమిట్లు:—కడుఁ=మిక్కిలి, పూర్తిగా (పగ=విరోధము) మొదలు, తెగఁ=మూలనాశమగునట్లు, ఎత్తిపోవఁ=దండెత్తిపోయినను, (పగ=విరోధమును,) తీర్పఁగఁ—వచ్చినఁ = (మొదలంట) నశింపఁజేయుటకు (దండెత్తి) వచ్చినను, — క్రార్యమెందుఁ=క్రార్యము ప్రాప్తమగును.

ఇందు "తెగ మొదలెత్తిపోవఁ—తీర్పఁగ వచ్చినఁ" అను వసమాపకవాక్యములకు రెంటికి నడుమ 'పగ'యను పద ముండి దేహళీదీపన్యాయమున రెండువాక్యావయము లందును నన్వయించుచున్నది. ఒక మహావాక్యములోని వసు నసమాపక వాక్యావయవములు రెంటిలో వేఱువేఱుగా 'పగ' పదమును రెండుసార్లు చెప్పుటయే యసుందరము. రెండువాక్యావయవములకును నడుమ 'పగ' పదము నుంచి రెండింట నన్వితముసేయుటే సుందరము. 'దేహళీదీపన్యాయ' మిట్టివానికే యొప్పును. మొదటి యసమాపక వాక్యమున దం'డెత్తిపోవుట' కలదుగాన రెండవ యసమాపకవాక్యమున 'వచ్చుట' యనుటచేతనే 'దండెత్తివచ్చుట' యనునర్థముపరశముగాలభించును. స్వపక్షము, పరపక్షము అనునవి 'పగ పగగొన్న మార్కొనక పల్కక యుండఁగవచ్చునే' అన్నవాక్యమునఁ గల తొలి 'పగ' పదము శత్రుపక్షవాచకము. మార్కొనక పల్కక యుండఁగవచ్చునే' యనుచో స్వపక్షముఅనునర్థము సిద్ధించుచున్నది. అవిధమువనే తిక్కన వాక్యములందును సిద్ధించుచున్నది. ఇక్కడ పదసామగ్రి చాలదని శాస్త్రిలవారనిరి. ఇది తిక్కన సోమయాజులవారి రచనమగుటను స్మరింప వేఁడుచున్నాఁడను. సోమయాజులవారి రచనలోఁ బ్రాయికముగాఁ బదములకూర్పింత గట్టి ధట్టింపుతో నుండుట సర్వవిద్వద్విదితము.

అది సంస్కృత భారతభావానుసారము కాదనుటకు:—ఈప్రకరణమున సంస్కృతమునఁగల శ్లోకము

నీక్రిందిదానిని స్థలాంతరమున నుదాహరించిరయు శాస్త్రిలుగా రిట్లు వ్రాయుట వింత—

‘అథవా మూలఘాతేన ద్విషతాం మధుసూదన,
ఫల నిర్వృత్తి రిద్ధా స్యా త్తన్మూలం సతరం భవేత్.’

అను శ్లోకము నేను “కడుస్ రెగ పెండలె త్తిపోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు” నను వాక్యమునకుఁ జెప్పిన యర్థము నొప్పఁగుటలేదా ? ఒకరు దండె త్తిపోవుట, రెండవవారు దండె త్తివచ్చుట యన్న పలుకులు సంస్కృతశ్లోకమున లేవనియు నాక్షేప ముండఁదగునా ? రెండవపక్షము మువ్వముఁజేగిరయుండఁగా యుద్ధ మెట్లు సాగునుకీ వీరు వారికి విరోధు లయినప్పుడు వారు వీరికి విరోధులగు అట్లు పరస్పరము విరోధులయినప్పుడే, పరస్పరము దండె త్తి వచ్చినప్పుడే యుద్ధము సాగును. లక్ష్మీపతి సోమయాజిగారి టీకలోని వాక్యమున కీ యర్థ ముండుట యుక్తమే. వారి టీక యస్వరసమని నేను వ్రాయుటకుఁ గారణ మీవాక్యమున కీయర్థము వ్రాయుట కాదు.

వినోద విమర్శమున నేను “ పగ యడఁగించు టెంతయు శుభంబు; అది లెస్స. అని వేఱుచేయుట పాడినపాట యగును. అది సోమయాజులభక్కి కాదు” అని వ్రాసితిని. దానిమీఁద శాస్త్రిలుగా రిట్లు వ్రాసిరి:- “ ‘అదిలెస్స’ అని చెప్పుట పాడినపాట గాదు. ధర్మరాజునకు శాంతియందుగల యత్యాదరమును, పగయడఁగించుటయందలి కష్టమును సూచించుచున్నది. అదిగాక శుభము అన్న పదముకంటె లెస్స యన్నపదమున విశేషార్థ మున్నదిగదా ! ఈవిదర్థభేదముతోఁ జెప్పినది మరలఁ జెప్పుట సందర్భానుసారముగా గుణమే— ఇట్టిది తిక్కనసోమయాజి కవిత్వమున లేకపోలేదు. క. ఒడఁబఱచి......పొందు పొసఁగియుండెనట్టి తెలుఁగు సేయుట|కడు మేలది గౌరవము సుఖంబును జేయున్. అట్టి తెలుఁగు సేయుట కడు మేలు. అది=అట్టి తెలుఁగు సేయుట, గౌరవమును సుఖమును జేయును. ఈరెండువాక్యముల నెంత భావభేద మున్నదో! ఇట్టి వింకను గలవు.”

చెప్పినదానినే మరలఁ జెప్పుట ఉక్తార్థదార్ఢ్యమున కుపచరించుననుట యుక్తమే కాని, యట్టివానికి స్థానములు వేఱు. అందును ఉక్తపదమునకే యావృత్తి హృద్యము. అదియెంతయు శుభంబు; ‘అదిలెస్స’ యనుట చవిసారములేక చప్పగా నుండును. ముందు సామాన్యమును, తర్వాత విశేషమును జెప్పుట యుండెనేని హృద్యమే యగునుగాని యిక్కడ మొదల ‘శుభము’, పిదప ‘లెస్స’ ఉన్నవి. ఈరెండిటిలో ‘లెస్స’ సామాన్యమని,‘శుభము’ విశేషమని తలఁపఁదగును. అవి వెనుకముందులుగా నుండుటచే నిక్కడ నిట్టికూర్పు నీరసమనియే చెప్పవలెను. దీనికి పోలికిగా శాస్త్రిలుగారు తిక్కన సోమయాజుల వారి ప్రయోగాంతరమును జూపినారు. కాని సరసతరమయిన దానికిని, నీరసతరమయిన దీనికిని బోలిక యెక్కడ!

కడుమే లది గౌరవము సుఖంబును జేయున్— అనుటలో తొలుత “ఆవిధముగా మీరు నడచుకొనుట మిక్కిలి మేలు” అని సామాన్యము నుపన్యసించినాఁడు. గౌరవప్రదమును మేలయినదే, సుఖప్రదమును మేలయినదే. సాధారణముగా గౌరవప్రదము సుఖప్రదముగా నుండదు; సుఖప్రదము గౌరవప్రదముగా నుండదు. కావున నిక్కడ నుపన్యస్త మయిన మేలు గౌరవప్రదత్వరూపమా, సుఖప్రదత్వరూపమా యని సందేహము తోఁచును; దానికి వారకముగా “గౌరవము సుఖంబును (రెండిటిని) జేయున్” అని విశేషము నుపన్యసించినాఁడు. దీనికిని, “ఎంతయు శుభంబు; అది లెస్స” అనుటకును సాజాత్యము చెప్పుటలో సారస్యము లేదు.

మఱియు—నేఁజూచిన తాళపత్రప్రతులలో నెల్ల ‘పగ దీర్పఁగ వచ్చిన’ అన్నపాఠమే కలదనియు, ‘పగ దీర్పఁదలంచిన’ పాఠము నా కెక్కడను గానరా లేదనియు; అది తిక్కనగారి తెలుఁగు గాదనియు, ఏలనఁగా ‘తీర్పఁదలంచినఁ గ్రౌర్యమొందు నే మిగతిఁ దలంచినన్’ అని మరల నదేపదము వచ్చుచున్నదనియు, రెండుమారు లొక టే పదము దగ్గఱదగ్గఱగా నీతీరునఁ బ్రయోగించుట సరసరచన గాదనియు నేను వ్రాసితిని. దానిపై శాస్త్రిగా రిట్లు వ్రాసిరి:— “ఆంధ్రసాహిత్యపరిషత్కా-

స్థానమునుండి నేను తెప్పించిన పాఠములలో 'తలంచిన' అను పాఠ మొక తాళపత్రగ్రంథమున నున్నట్లున్నది."

ఇది వింతగా నున్నది! ఆపాఠములుగల కాగితము పొఱపైచి, యందలివిషయము నటకోలగా పఠించిరో, వారు వ్రాసిన కాగితమున 'తలంచిన' అన్నలిపి యస్పష్టమగుటచే ననుమానించిరో, వ్రాసి పంపినవారి నవిశ్వసించిరో, శాస్త్రులుగా 'రున్నట్లున్నది' అని వ్రాసిరి!

ప్రాచ్యలిఖితపుస్తకశాలలో పదులకొలఁది భారతపు వ్రాఁతప్రతు లున్నవి. ఇటీవల పీఠికాపురాధీశ్వరులు పదులకొలఁది భారతప్రతుల మరలఁ బంపిరి. అన్నింటిని బరిశీలించితిని. అన్నింటను 'తీర్పఁగ వచ్చిన' పాఠమే కలదు. ఎకాడమీ పుస్తకభాండాగారమునఁ గూడఁ బదులకొలఁది భారత ప్రతు లుండియుండును. శాస్త్రుల వారి "తలంచిన" పాఠ మిన్నింటను లేక యొక ప్రతిలో మాత్ర 'మున్నట్లున్న'దట. ఏది ప్రామాణికమో, గ్రాహ్యమో సహృదయులే యెఱుఁగఁగలరు.

మఱియు శాస్త్రులుగారు "రెండుమార్లొకటే పదము దగ్గఱదగ్గఱగా వచ్చుట విరసమే యైనచో నట్టి దోషము మనము గ్రహించినపాఠమున 'వచ్చిన' అను చోటఁగూడఁ బట్టునేమో" అని వ్రాసిరి!

"పల్కకయుండఁగ వచ్చునే కడుం, దెగ వెండ్రెత్తిపోఁ బగఁదీర్పఁగ వచ్చునే క్రౌర్య మొందు" అనుటలో 'వచ్చు' ధాతువు సావృత్తికిని, "తీర్పఁ దలంచినఁ గ్రౌర్య మొందు నే, మిగతిఁ దలంచినన్" అనుటలో 'తలంచు' ధాతువు సావృత్తికిని మిక్కిలి భేదము గలదు. మొదటి దెంతో దూరముగా నున్నది. మఱియు నందు మొదటి 'వచ్చునే=శక్యమా?' అని యర్థము గలది. రెండవ 'వచ్చిన=సముదెంచిన' అని యర్థము గలది. దూరస్థితి, అర్థభేదము నుండుటచే తోలి దాని రసవావైరస్యము లేదు. శాస్త్రులుగారు దానిని దీనిని బోల్చుట సరిగాదు.

శాస్త్రులుగారు నేను జెప్పిన యర్థము మీఁదఁ జూపిన దోషములు నిజముగా దోషములుగావని నిరూపించితిని. ఇఁక వారుచెప్పిన యర్థమునుగూర్చియు, వారు వ్రాసిన మఱికొన్ని విషయముల గూర్చియు, సంస్కృత భారతమును గూర్చియు, దాని తెలిఁగింపును గూర్చియు వ్రాయవలసినది హెచ్చుగా నున్నది. విస్తరభీతిచేతను, నా యర్థసమర్థనమున కవి యనావశ్యకము లగుటచేతను నిక్కడ విడుచుచున్నాను.

వే. ప్రభాకరశాస్త్రి.

అహదనకెర శాసనము

నేను శ్రావణమాససంచికలో అహదనకర శాసనమును గురించి వ్రాసినవిషయము సన్మిత్రులును, నాకు పూజ్యులు నైన బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి మనస్సునకు కష్టము కలిగించె నన్నవిషయము వారు 'పునర్విమర్శనము' అను శీర్షికక్రింద ఈశాసనమును గురించి భాద్రపదమాస సంచికలో వ్రాసిన వ్యాసమును బట్టి— ఇతరులకు అగునో కాదో కాని, నాకుమాత్రము—స్పష్టమగుచున్నది. నావ్యాసమున వాడిన 'కటిపి' రన్నమాట వారిమనస్సు చాల నొవ్వఁజేసిన దనికూడ వా రుపయోగించిన 'మంచియోగ్యత గలమాట' వలన నేను గ్రహింప గలిగితిని. మావైపుల 'కరుపుట' విపరీతార్థద్యోతకము కాని, అపార్థస్ఫురణముకాని కాదు. ఇంతవరకు నాకు దానిలోనుండు విపరీతార్థముకాని, విశేషార్థముకాని తోఁపలేదు. దీనిమాట యటుండనిండు.

నావ్యాసమున నే జరిగినంతవరకు కేవలము విషయమునే ప్రధానము చేసికొని వ్రాసితినికాని శ్రీశాస్త్రిగారిపై ఎట్టి ఆరోపణలను, నిందలను, అపహాస్యములను చేసియుండలేదని నానమ్మకము. నా కట్టిఅవసరము కూడ లేదు. ఇంతవరకు మేము మిత్రులమే కాని విరోధులము కాము. అభిప్రాయభేదము కలిగినంత మాత్రమున అసలు విషయములను వదలి వ్యక్తులనుగురించి

వ్రాయుట చాల తప్పని నే నెరుగుదును. దీని కింతవివరణ మేల? పాఠకులే ప్రమాణము.

శ్రీశాస్త్రిగారి వ్యాసధోరణి మాత్రము ధ్వని ప్రధానమై నాస్వభావమును గురించి పాఠకులకు దురభిప్రాయము కలుగజేయునదిగ నున్నది. శ్రీశాస్త్రిగారి చర్చ 'సరసముగానే సాగునని నే విశ్వసించితి' నని వ్రాసియున్నారు. నేను నట్లే తలచితిని కాని యది యిట్లు పెడత్రోవ త్రొక్కునని నే ననుకోలేదు. అట్లు వ్రాయుట వారికి 'మంచియోగ్యత' అని తోచినది.

వారివ్యాసమున ముఖ్యముగ నిట్టిదురభిప్రాయము నాకలుగజేయునవి రెండుపట్టులు కలవు: (౧) ప్రతింబవి ప్రకరణము; (౨) చర్చాప్రకరణము. మూడవపట్టు ఇంకొకటి కలదు: అది నేను చెప్పినసంగతిని సరియైనరీతిని అన్వయింపక పోవుటనుగూర్చి. వారి కడచిన వ్యాసము కేవలము పాఠభేదములను గురించియే కాని అసలు వాదమునుగురించి కాదు గనుక, నే నీసై మూడుపట్టులను గురించియే—అవి నామీద పాఠకులకు దురభిప్రాయము కలిగించునవిగ నుండుటచేత—యిట కొంచెము వ్రాయుచున్నాను.


నేను చెప్పవలసిన నాలుగుమాటలు తేటమాటలతో చెప్పెదను. ప్రతిబింబ ప్రకరణమును గురించి: 'నేను ప్రకటించిన పాఠములను స్పష్టముగా పరిశీలించుట కీవిషయమెల్లను తేర్చుకొనవలసినను వ్యాజమున శ్రీశాస్త్రిగారు ఒకటిరెండుపుటలు వ్రాయుటలోని పరమార్థము ఆశాసన ప్రతిబింబములు వారికిచ్చుట నా కిష్టము లేదని పాఠకులకు బోధచేయుటయే యని నాకు తోచుచున్నది. లండను బ్రిటీషు మ్యూజియమునుంచి శ్రీలక్ష్మణరావుగారు తెప్పించిన అహదనకర శాసనపు ఫోటోలును, ప్రతిబింబములును అసలు నాయొద్దనే యుండినవి. కాని ఒకటిరెండు, రెండుసంవత్సరములకు పూర్వము నేను జ్వరములో నుండగా శ్రీనాగేశ్వరరావు పంతులుగారు వాటి నెందుకో ఒకమారు తెప్పమనిరని శ్రీగన్నవరపు సుబ్బరామయ్యగారు మాయింటికి వచ్చి వాటిని భారతీకార్యస్థానమునకు తీసికొనిపోయిరి. ఆటుతరువాత వాటిసంగతియే మరచితిని. వాటిని శ్రీగన్నవరపు సుబ్బరామయ్యగారు తీసికొనివెళ్లిరన్న విషయమును మరచితిని. ఆటుపిమ్మట నెన్నిమారులో వాటినిగురించి మాయింట వెదకికొన్నాను కాని కానరాలేదు: ఎక్కడ పోయినవో అని చింతించి చింతించి చేయునది లేక యూరకొంటిని. శ్రీశాస్త్రిగారి అహదనకరశాసన వ్యాసము ముద్రణదశలో నుండగా, ఒకమారు సాయంకాలము భారతీకార్యస్థానమునకు వెళ్లినప్పుడు శ్రీసుబ్బరామయ్యగారు ఈప్రతిబింబములను అంతకుపూర్వమే అక్కడికి వచ్చియుండిన శ్రీశాస్త్రిగారికి చూపించుచుండగా వాటిని జూచి అపరిమితానందమును పొంది, 'ఇవి ఎక్కడ నున్నవి! మాయిల్లంతయూ పీటికొలది కెన్నిమారులో వెదకితి' నని అంటిని. 'ఇక్కడ వ్రాయరులో నున్నవి. వెనుక మీరు జ్వరపీడితులై యున్నప్పుడు మీయింటికి వచ్చి శ్రీనాగేశ్వరరావుపంతులుగారికొఱకై తెచ్చితిని. ఈవిషయము మీరును మఱచితిరి, నేనును మఱచితి'నని శ్రీసుబ్బరామయ్యగారు బదులు చెప్పిరి. ప్రతిబింబోదంత మిది. శ్రీశాస్త్రిగారి 'అహదనకరవ్యాసము' ముద్రణ మగువరకు మాయిరువురికి కించిత్తయిన కోరపులు కాని, వైమనస్యములు కాని లేవన్న విషయముకూడ పాఠకు లెఱుంగదగును. శ్రీశాస్త్రిగారికి ప్రతిబింబములనుగూర్చిన ఈవిషయముల నన్నిటిని ప్రతిబింబములు బయల్పడినపిదప శ్రీసుబ్బరామయ్యగారు తెలిపిరి. శ్రీశాస్త్రిగారు 'నిజముగా నే నీప్రతిబింబములు బయల్పడినపిదప వానిగూర్చి మరల శర్మగారితో నేమియు ముచ్చటింపను లేదు, వారు వానిని నా కొసగను లేదు.' అని వ్రాసివారు. మే ముభయులము అక్కడ ఉండగా బ్లాకులు చేయుటకై యుపయోగింపబడనున్న ప్రతిబింబములను నేను మరల వారికి ప్రత్యేకముగ నియ్యకపోవుట పొరపాటే కావచ్చును. ఇట్టిస్థితిలో శ్రీశాస్త్రిగారు ప్రతిబింబములవిషయమునుగురించి లేశమును విడువకుండ ఒకటిరెండుపుటలు వ్రాయుటలోగల పరమార్థము ఏదో సహృదయులైన గ్రాహకుల నిర్వికారాంతఃకరణమునకే గోచరింపవలెను. మఱుపునకుగూడ దురుద్దేశము లారోపితములైనవో నది విధివిలసితమే.

ఇక రెండవది చర్చావిషయము. శ్రీశాస్త్రిగారి వ్యాసమునందలి వాక్యము లివి 'ఈయక్షరమునుగూర్చి చర్చ పత్రికలలో బడకపూర్వము నేను శ్రీశర్మగారితో నీవాదపు సాధకబాధకముల జర్చింపగోరితిని. నాయుద్దేశములన్నియు జెప్పికొంటిని. నాశాసనవిమర్శము ముద్రితము గాకపూర్వమును, ముద్రితమగుచున్నప్పుడును దానిని జూచి మంచిచెడ్డల జెప్పగోరితిని. నాకోరిక నెఱవేఱ లేదు.' నేను నానెల్లూరుమండలయాత్ర ముగించి వచ్చిన పిదప శ్రీశాస్త్రిగారు తాము అహదనకర శాసనమునకు పద పదార్థ వివరణములను గొంతవరకు కావింపగలిగితి మని మ్యూజియము కాఫీహోటలులో కలిసికొని చెప్పినప్పుడు నేను అపరిమితానందమును పొందితిని. ఈవిషయము వారికిని దెలియు ననుకొందును. తరువాత నేను 'కాన్నిమరా' లైబ్రరీకి వెళ్లినప్పుడు వారిని తరుచు కలిసికొనుచు వచ్చినపుడెల్ల ఈయక్షరప్రశంస వచ్చుచునే యుండెడిది. వారు నన్ను రెండుమారు లడిగిరి—అప్పటి కింకను వారి వ్యాసము ప్రకటితము కాలేదు—"మీ రీ యక్షరమును బండి 'ఱ' యందురా? 'డ' యందురా?" అని. "మీరు ఇప్పుడు తలపెట్టుచున్న మీవంటి కాని నే నీవిషయమునుగురించి యోజించియుండలే దింతవరకు. అయినను అది 'డ'కాకూడదా అన్నదృష్టితో పరిశోధన చేసిన మీవంటి కాని నే నేమియు చెప్పలేను. ఆవిషయమై ఇక పరిశోధింతును." అని శ్రీ శాస్త్రిగారికి విన్నవించుకొంటిని. ఇంకను వారి వ్యాసము ముద్రణదశలో నున్నప్పుడే మరియొకమారు వారిని మ్యూజియములో కలిసికొనుట సంభవించినప్పుడు వారు నాతో 'మీరు నెల్లూరు మండలమునకు వెళ్లి ప్రాత తెలుగుశాసనములకు ప్రతిబింబములను దీసికొనివచ్చితిరి కదా, వాటినిబట్టి ఈ యక్షర మిదియని నిర్ధారణచేయుట కవకాశ ముండునా?' అనిరి. "భైరవునికోన శాసనములలో 'ఆచాళ్లు' అనుపదములో కడపటి సంయుక్తాక్షరములోని ఎగువవర్ణము మీ సందేహమున కెడమిచ్చు నక్షరసంకేతముననే యున్నది. ఇంకొకశాసనమున 'ఈళ్లు' అనుపదము వచ్చును. ఇందు కూడ కడపటి సంయుక్తాక్షరములోని ఎగువ వర్ణము ఈ సంకేతముననే కలదు. ఆపదములను 'ఆచాళ్లు', 'ఈళ్లు' గనే చదువవలసియుండు ననుకొందును. అట్లైనచో ఈ ఆ యక్షరసంకేతమును 'డ'గ చదువుటకు ప్రతిబంధకములే యగునేమో. అందువలన ఆసంకేతము బండి 'ఱ' కాదగు"నని నేను జవాబిచ్చితిని. ప్రాచీనశాసనములలో 'ఊడ్లు', 'ఆడ్లు' మొదలైనపదము లున్నవుడు ఆ పదమును 'ఆచాడ్లు' ఎందుకు కాకూడదని శ్రీశాస్త్రిగా రనిరి. "నిజమే; 'ఊడ్లు', 'ఆడ్లు' మొదలైన వున్నవి: కాని 'ఆచాళ్లు' అన్నది 'ఆచాడ్లు'గ చదువుట అంత సమంజసము కాదేమో. అయినను దీనినిగురించి నా కంత తెలియదు. ఇంకను పరిశోధింపవలసియున్న"దని జవాబిచ్చితిని. ఈవిధమున నీయక్షరమునుగూర్చి మ్యూజియము ఆవరణమున కలిసికొన్నపుడు కొంత కొంత చర్చ జరుగుచునే యుండెను. ఇదియంతయు వారివ్యాసము ప్రకటింపబడక పూర్వమే: ముద్రణదశయందున్నప్పుడే. అంతవరకు శ్రీశాస్త్రిగా రాసంకేతము 'డ' యనియే వాదించుచుండిరి. "మీరంత గట్టిపట్టుదలతో ఆయక్షరము 'డ' అని వాదించుటకు గల కారణము లేవో తెలిపినచో, అవి నాకు నచ్చినయెడల నేను అది 'ఱ' అనుటను మానుదు"నని కూడ రెండు మూడు పర్యాయము లడిగితిని; కాని వారు 'పడిహారి' పదములోని ద్వితీయాక్షర మిట్లే యున్న దది యేమి కావలెనని నన్నడిగిరి. అట్టియుదాహరణ లెక్కడ నున్నవో కొంచెము చూపినచో ఆ సంకేతమునుగూర్చిన నా యభిప్రాయము తప్పైన మార్చుకొందు నంటిని. కాని మరల వారు నా కాయుదాహరణములను జూపను లేదు; తమ కారణములను తెలుపను లేదు. అటుతరువాత ఇంకను వారి వ్యాసము ముద్రణదశయందున్నప్పుడే మరియొకమారు మ్యూజియమునుండి ఇండ్లకు వెళ్లిపోవుచున్నప్పుడు మేము మ్యూజియములో శాసనశిలలు భద్రపరచియుంచిన 'షెడ్డు' ముందర కలిసికొంటిమి. శ్రీ హెచ్. కృష్ణశాస్త్రిగారు 'ఎపిగ్రాఫియా ఇండికా'లో ప్రకటించిరని శ్రీ శాస్త్రిగారు నుడివిన 'సత్యాదిత్య చోళమహారాజు శాసన' మున్నశిల ఆషెడ్డులో గలదు. అందు 'గుళ్లు' అనుపదము వచ్చును. ఈ పదమునందలి సంయుక్తాక్షరములోని ఎగువ యక్ష

రము ఈవింత సంకేతమునవే కలదు. శ్రీ శాస్త్రిగారు అప్పు డాపదమును నాకు జూపి దీనిని మీ రెట్లు చదివెద రని నన్నడిగిరి. ఇక్కడ మరల మా ఉభయులకు గొంతి చర్చ జరిగినది. మీరు దానిని 'డ' గనే చదివితీరవలె ననుటకు దగిన కారణములను జూపుమనుటకు, ఆపద మిప్పుడె ట్లుచ్చరింపబడుచున్నను, ఆ యక్షరసంకేతమును 'ఱ' గనే భావించి, దానిని 'గుఱ్ఱ' గనే చదువుదునని జవా బిచ్చితిని. అందుమీదట వారు కొంచె మవహేళనము చేసిరేమో కూడను. చర్చ తీవ్రరూపముగూడ దాల్చుతరి ఇరువురము దానికి స్వస్తిచెప్పితిమి. వారివ్యాసము ముద్రణము కాకపూర్వమును, ముద్రణావేళలో నున్నప్పుడునుకూడ మాయుభయులకు నింతటి గ్రంథము జరిగినప్పుడు శ్రీశాస్త్రిగారు కడచిన తమవ్యాసమున నట్లు వ్రాసినందుకు "నే నేమి యనగలను? ప్రాజ్ఞు లున్నారని యూరకుందును."


శ్రీశాస్త్రిగారు తాము ఉదాహరించిన శాసనాదులకు స్పష్టముగా ఆకరముల దెలుపుకొంటినని వ్రాసినారు. నావ్యాసమున నేను ఆకరములను దెలుపనిమాట వాస్తవమే; కాని శ్రీశాస్త్రిగారు తమవ్యాసమున 'శర్మగారు తమ ప్రతివిమర్శనమున దాముదాహరించిన శాసనములలో దేనికిగాని ఆకరము దెలుపకైరి' అని వారు నాపై నొకనింద మోపిరి. "ప్రాచీనకర్ణాటక శాసనములం దుగూడ నీవింతలిపి గలదు. అవి 6, 7 శతాబ్దముల నాటి శాసనములు. వానిలో ఫ్లీటుదొరగారు రాలిపులను బండి ఱ గనే పఠించిరి. అట్లు పఠించుటలో ననేకా సందర్భము లుప్పతిల్లెను. వాని నెల్ల వారు సంస్కారము నాదించియు, పదము వివరింపకయు, అర్థమే వ్రాయకయు బహువిధముల దాటిరి. అట్టివానిలో నేను బరిశోధించినవి కొన్ని 'డ' గ జదువుటచే సమన్వితములయినవి" అని వ్రాసి, వాటికి ఆకరములను దెలుపక వదలివేసినారు. ఇవి ఆకరములను దెలుపవలసిన సందర్భములు కావా? శ్రీ శాస్త్రిగా రుదాహరించిన పైశాసనములను నేను చూడగలిగితినే యుండినయెడల ఇంతచర్చకు అవకాశ ముండెడిది కాదేమో!

ఇక మూడవ విషయము: 'శర్మగారు తమవిమర్శనమున లిపిరీతియే తమకు ప్రధానము కాని యర్థసమన్వయముతో దమకు పనిలేదని వ్రాసిరి. నేను తెలుగువ్రాత గల కాగితములను జదువుటలో గూడ లిపి సంకేతములతోపాటు పద పదార్థసంగతి కూడ భాషపరిజ్ఞానమును ముఖ్యమనుట సర్వవిదితము. ఇంచుమించుగా శాసనలిపియు నిట్టిదే. అర్థసంగతియు నారయకున్నచో సర్వత్ర స్పష్టముగా భాషనిర్ణయము లిపిమాత్ర జ్ఞానముచే సాధ్యముకాదు' అని శ్రీశాస్త్రిగారు వ్రాసియున్నారు. ఇదివరకు నేను ప్రకటించిన తెలుగుశాసనములలో శాసనమున దప్పులు గనబడినప్పుడెల్ల వాటిని 'ఫుట్టునోట్ల'లో సంస్కరించుచునే వచ్చినాను. ఈవిషయమును శ్రీశాస్త్రిగారును ఎఱుగుదురనుకొందును. అయితే మనకు సుబోధములైనట్టియు, వాడుకలో నింకను ఉన్నట్టియు, వాడుకలో గాకపోయినను గ్రంథములనుబట్టి మనకు దెలియవచ్చునట్టియు పదము[లు] ప్రాచీన శాసనములలో తప్పులుగా వ్రాయబడిన యెడల అట్టివాటినే సంస్కరించితిని. అట్టివే సంస్కారార్హము లని నాయభిప్రాయము, అంతియకాని అసలుపద మేదో, పదస్వరూప మెట్టిదో, అర్థ మేదో తెలియరానిపదములు ప్రాచీన శాసనములలో నున్నచో, వానిస్వరూపమును నిర్ణయించుటకు లిపియే పరమాధారమని ఇప్పటికి నావ నమ్మకము. ఇటువంటి వాటి సందర్భమునందే లిపిరీతి నాకు ప్రధానమంటిని కాని తదితరముల విషయమున గాదు. పాండురంగని అద్దంకి, ధర్మవరము శాసనములను, తదితరశాసనములను ప్రకటించినపుడు శాసనమూలపాఠమునందు ప్రామాదికములుగను, తప్పులుగను తోచిన పదములను సంస్కరించుచువచ్చిన నేను అట్లెట్లు చెప్పగలను? నేనితర ప్రాచీన శాసనములను ప్రచురించుటలో చేసిన పదసంస్కరణముల నెఱింగియు శ్రీప్రభాకర శాస్త్రిగారు కడు దురవబోధముగ నున్న అహదనకరశాసనము ([illegible]ంగుభాగము) విషయమున మాత్రమే వ్రాసిన 'లిపిరీతియే ప్రధాన' మన్న సంగతిని ఇతరశాసనములకుగూడ ననువర్తింప జేసినారు.



౧. అబ్రహాముకాలమున అబ్రహాము నగరము

(౪౦౦౦ ఏండ్లకు పూర్వము)



౨. చెదపురుగుల గుట్టు

శ్రీశాస్త్రిగారీప్రకరణమున ప్రాచీన శాసనములను ప్రకటించుటలో నేను చేసిన తప్పులను కొన్నిటిని యేర్చికొని సవరించిరి. పాతిలూరి తామ్రశాసనమును మరల కొంతకాలముక్రిందట చూచుట తటస్థించినపుడు దానిలో తప్పు లున్నవని తెలిసికొంటిని; కాని వాటిని సవరించి ప్రకటించుటకు నా కవకాశము కలుగలేదు. ఈ విధమునైనను శ్రీశాస్త్రిగారు తప్పులు సవరించిపెట్టినందుకు వారి కెంతయు కృతజ్ఞుడను. కాని యంతకుపూర్వము నా కంతో 'ఆప్తమిత్రులు' అయిన శ్రీశాస్త్రిగారు ఒక్కపరియైన వాటిని తాముకూడ గుర్తించినట్లు నాకు తెలిపి యుండకపోవుటకే చింతించెదను. ఇక చాళుక్యభీమరాజు సీసపద్య శిలాశాసనమున 'పెన్నాజిలో జూపె' అన్నది 'పెన్నాజిలో జూచె' అని యుండవలెననియు, శాసన శిలను పరీక్షింపగా ఆకడపటి యక్షరము 'పె' గ గాక 'చె' యని స్పష్టముగా గనబడుచున్నదనియు వ్రాసియున్నారు. శాసనశిలను, ప్రతిబింబములను నేనును పరిశీలించితి కాని నాకాయక్షరము వారు చెప్పునంతటి స్పష్టముగా లేదని తోచినది. ఎట్లయినను వారు చేసిన సంస్కారణమును, దిద్దుబాటును నాకు సమ్మతమే; నా తప్పు ఒప్పుకొందును. కాని శ్రీశాస్త్రిగారు ఈ 'అహదనకర శాసనవిమర్శన' సందర్భమున నా వెనుకటి వ్యాసములలోని పొరపాటుల నుద్ఘాటించుటలోని సారస్యమును పాఠకులు గ్రహింపక పోరనుకొందును. ఇక మరికొన్ని విషయములు: 'శర్మగారు నాయర్థ వివరణాదులు కొన్నియు [illegible]ర్చి, చేర్చి, తీసివేసి చేసిన మరుటచే జాలసందేహింపవలసి యున్నవనిరి. అయినను కొన్నిపట్టుల భాషావేత్తలు ఆదరముతో ఆలోచించుట కర్హమైన శబ్దనిష్పత్తులు గల వన్నారు గాన యిక ధన్యుడ' నని వ్రాసిరి. దీనిని బట్టి ఆ వ్రాతను శ్రీశాస్త్రిగారు అవహేళనమని తలచినట్లు నాకు స్ఫురించుచున్నది; కాని అహదనకరశాసనమునుగూర్చిన వారి ప్రథమవ్యాసమును తిలకించినచో నేను వ్రాసినది అవహేళనమో, సత్యమో పాఠకులే గుర్తింపగలరు.

శ్రీశాస్త్రిగారు వారివ్యాసమున వేరొకచో నేను "ప్రభాకరశాస్త్రిగారికి ప్రాచీనచాళుక్యలిపి చదువుటే చేత కాదన్న సిద్ధాంతము పుట్టదగినన్ని యాక్షేపములను ప్రోదిచేసితి"నని వ్రాసియున్నారు. శ్రీ శాస్త్రిగారిని గూర్చి నా కట్టి దురభిప్రాయమే యుండినచో వారి శాసనవ్యాసమును విమర్శించియే యుండను. వారి విమర్శనము అమూల్యమైనదని తలచియే దానివిషయమున నాకు గల యభిప్రాయభేదములను దెలుపుకొంటిని. నా వ్యాసమున కట్లు శ్రీ శాస్త్రిగారు విపరీతార్థము చేసికొనుట నాకు చాల వింతగ నున్నది.

ఇంక అహదనకరశాసనమునందలి పాఠభేదములను గురించి: ఇంకను వాదము – శ్రీ శాస్త్రిగారి వ్యాసము ప్రకారము చూచిన – ముగియలేదు గనుక, అది ముగిసిన పిదప పాఠభేదములకు అవసరమైనచో బదులు చెప్పుకొందును: ఒప్పులని ఇంకను నాకు నమ్మకమే యున్నచో అవి యొప్పులే యని వాదింతును. తప్పులని నమ్మకము కుదిరినచో అవి తప్పులని ఒప్పుకొని వాటిని సవరించుకొందును.

వ్యక్తివిషయకముగ నింత వ్రాసికొనవలసి వచ్చినందుకు సిగ్గుపడుచున్నాను; శ్రీ శాస్త్రిగారి వ్రాతలో ప్రత్యేక మీపైవిషయములకు జవాబీయకపోయినచో పాఠకలోకమునకు నన్ను గురించిన దురభిప్రాయము పోదని యింతగ వ్రాసికొనవలసివచ్చినది. కావున అనవసరచర్చతో ఇంత వ్రాసినందుకు పాఠకులు మన్నింతురు గాక! ఇంక ఈవిషయమున వ్యక్తిగతముగ నెంత చర్చ వచ్చినను అది మరియు మితిమీరిననే తప్ప — నే నేమియు వ్రాయదలపెట్టువాడను కానని విన్నవించుకొనుచున్నాడను.

మల్లంపల్లి సోమశేఖరశర్మ.



మాగడ్డ తళుకులు

'కాళిదాసః కవిశ్రేష్ఠః'

ఇతః ప్రత్యాదేశాత్స్వజన మనుగంతుం వ్యవసితా
ముహు స్తిష్ఠే త్యుచ్చై ర్వదతి గురుశిష్యే గురుసమే;
పునర్దృష్టిం బాష్పప్రసరకలుషా మర్పితవతీ
మయి క్రూరే యత్త త్సవిషమివ శల్యం దహతి మామ్.

ఈశ్లోకమున మహాకవిగారి భావపోషణానైపుణి కన్పట్టెడిని. దుష్యంతునియందు శకుంతలావియోగజన్యమైన శోకమును సాధించుచున్నాఁడు. ఏది స్మృతికి వచ్చుటచేత ఈశ్లోకము అపారమగునో అట్టిదానిని దుష్యంతుని స్మృతిపథమునఁ బెట్టవలెను. తాను త్యజించి వెళ్ళఁగొట్టినప్పుడు శకుంతల కణ్వశిష్యులతోడను, గౌతమితోడను పోఁబోయినది. కణ్వుని తర్వాత కణ్వునంతవాఁ డాశిష్యుఁడు, "నిలు" అని యదల్చినాఁడు. అప్పు డామె మరలఁ గన్నీరు గార్చుచుఁ దన్నుఁ జూచినదట. ఈపరిస్థితిలో శకుంతల యీచేష్ట విషముతోఁ గూడిన బాణాగ్రమువలె బాధించుటయం దబ్బురము కన్పట్టక పోఁగా, దుష్యంతుని దుఃఖము పరిమితి లేనిదని మనమనస్సులకుఁ దోఁచుచున్నది. ఇట్లు శోకపోషకమైన చేష్ట కవికిఁ దోఁచుటయే మహాకవి లక్షణము.

పాతుం న ప్రథమం వ్యవస్యతి జలం
యుష్మా స్వపీతేషు యా
నాదత్తే ప్రియమండనాపి భవతాం
స్నేహేన యా పల్లవమ్;
ఆద్యే వః కుసుమప్రసూతిసమయే
యస్యా భవ త్యుత్సవః
సేయం యాతి శకుంతలా పతిగృహం
సర్వై రనుజ్ఞాయతామ్.

ఈశ్లోకములోఁ గణ్వునియందు శోకమును శకుంతలావియోగముచే సాధించుచున్నాఁడు. శకుంతలమీఁది వాత్సల్య మీశోకమునకు హేతువు. ఆవాత్సల్య మెక్కువగుటకు శకుంతల ప్రేమించెడి వస్తువులును, ఆమె ప్రేమాతిశయము సూచించు చెయ్వులును కణ్వుని స్మృతికి రావలెను. అంతట్టి చేఁతలు ఆఁడుపిల్లలకు సహజములై, సౌశీల్యసూచకములై, తలిదండ్రులకుఁ గూఁతుల వర్తనా రింటికిఁ బంపునప్పుడు స్మృతికి వచ్చి శోకమును బెంచునో, ఎవ్వి యాశ్రమవాసుల కుచితములో, అవి కాళిదాసమహాకవిగారికిఁ దోఁచుటయే రసభావపోషణచాతుర్యమును దెల్పుచున్నది.

ఔత్సుక్యమాత్ర మవసాయయతి ప్రతిష్ఠా
క్లిశ్నాతి లబ్ధపరిపాలనవృత్తి రేవమ్;
నాతిశ్రమాపనయనాయ యథా శ్రమాయ
రాజ్యం స్వహస్త ధృతదండమి వాతపత్రమ్.

ఇట్టి శ్లోకములలో మానవప్రకృతి పరిశోధనమై శ్రేష్యము కవియందుఁ గన్పట్టుచున్నది. గొప్పగొప్ప పదవులను నరులు గోరుదురు. అవి లభించిన పిమ్మట వారికి పనిలేనివారి కుండెడి నిశ్చింత యుండదు. అయినను మానవుఁ డాపదవిని వదలలేఁడు. అప్పు డావరుఁ డెద్దానిఁ జూచికొని యానందపడుచున్నాఁడుకొప్పను. ఆపదవియందున్నఁ దన్ను గౌరవించుజను లందురు. వారి మెప్పే యీతని పురుషార్థము. అట్టి లోకులలోఁ జేరు ప్రతిష్ఠలు గలిగియుంట యంతే అతని హృదయము రమించుచుండును. ఇట్టి స్వభావమును "ఔత్సుక్యమాత్ర మవసాయయతి ప్రతిష్ఠా" అనుమాటచే మన కద్దమునఁ జూపినట్లు మహాకవి చూపుచున్నాఁడు.

శుశ్రూషస్వ గురూన్ కురు ప్రియసఖీ
వృత్తిం సపత్నీజనే
భర్తు ర్విప్రకృతాఽపి రోషణతయా
మాస్మ ప్రతీపం గమః;
భూయిష్ఠం భవ దక్షిణా పరిజనే
భాగ్యే ష్వనుత్సేకినీ

యాన్త్యేవం గృహిణీపదం యువతయో
వామాః కులస్యాధయః.

ఇచ్చట భరతఖండములోని చిరకాలసంప్రదాయాగతమైన పాతివ్రత్యముల శీలము చిత్రించినాఁడు. లోకాతీతమైన సౌశీల్యమే వనితల కెక్కుడని యుపదేశింపఁబడినది. "భర్తుర్విప్రకృతాఽపి రోషణతయా మాస్మ ప్రతీపం గమః" అను కణ్వోపదేశమును కోపము వచ్చినప్పుడు శకుంతలయే పాటింపలేకపోయినది. "అనార్య! ఆత్మనో హృదయానుమానేన పశ్యసి క ఇదానీ మన్యో ధర్మకంచుక ప్రవేశిన స్తృణచ్ఛన్నకూపోపమ స్యానుకృతిం ప్రతిపత్స్యతే" అని భర్తను నిరాకరించి మాటాడుచున్నది. ఎల్లప్పుడు పెల్ల వనితలు ఆచరింపలేకపోయినను లక్ష్యభూతమై యున్నతధర్మస్వరూపము నిరూపింపఁబడి యుండుట ముఖ్యమని కవి యాశయము. చివరకు హేమకూటగిరియందు దుష్యంతుఁ గాంచి పశ్చాత్తాపమందు భర్తతో శకుంతల "నూనం మమ సుచరితప్రతిబంధకం పురాకృతం తేషు దివసేషు పరిణామాభిముఖ మాసీత్. యేన సానుక్రోశోఽప్యార్యపుత్రో మయి విరస స్సంవృత్తః." అనినది.

అస్మాన్ సాధు విచింత్య సంయమధనా
నుచ్చైః కులం చాత్మనః
త్వయ్యస్యాః కథ మప్యబాంధవకృతాం
స్నేహప్రవృత్తిం చ తామ్;
సామాన్యప్రతిపత్తిపూర్వక మియం
దారేషు దృశ్యా త్వయా
భాగ్యాయత్త మతఃపరం నఖలు త
ద్వాచ్యం వధూబంధుభిః.

ఈశ్లోకమున వస్తుధ్వనుల వెదఁజల్లుచు మహాకవిత్వమును గాళిదాసుఁడు చూపించుచున్నాఁడు. 'సంయమధనులమైన మమ్ముల నాలోచించి' అనువదము నెన్ని ధ్వన్యర్థములు రావచ్చును.

౧. మేము దబ్బులేనివారము కాన నీవు చేసినట్లు దగ చేయలేము.

౨. మావంటి ఋషులయాజ్ఞ శిరసావహించుట మీకు సదాచారము.

౩. మేము తాపాయుక్తులము కాన మామనవు త్రోప్పించుట నీకు శ్రేయము కాదు.

౪. మేము సంయమధనులము. కావుననే సొమ్ము పారవేసిపోయిన దొంగవానినిబిలిచి దొంగిలించినసొమ్మును సమర్పించినట్లు కోపింపక శకుంతలను నీకడ కంపితిమి.

౫. తాపాయుక్తులమైన మాయాశ్రమమునందలి కన్యను మాయాజ్ఞ లేక వరించితివి. ఇప్పుడు పిల్లను పంపుచున్నాము. మాసౌశీల్యమును నీ వెట్లు గ్రహింపఁగలవో!

ఇట్లే "అబాంధవకృతాం" అనుపదమును అర్థశక్తిమూలధ్వనులైన యనేకార్థములను, పెక్కుభావము లను దోఁచెడిని. "సామాన్యప్రతిపత్తి" అనుపదము శబ్దశక్తిమూలధ్వని మర్యాదతో సభంగశ్లేషరూపమై రచన యర్థగతిని వ్యక్తపఱచెడిని.

సరసిజ మనువిద్ధం శైవలేనాపి రమ్యం
మలినమపి హిమాంశో ర్లక్ష్మ లక్ష్మీం తనోతి;
ఇయ మధికమనోజ్ఞా వల్కలేనాపి తన్వీ
కిమివహి మధురాణాం మండనం నాకృతీనామ్.

అనాఘ్రాతం పుష్పం కిసలయ మలూనం కరరుహై
రనావిద్ధం రత్నం మధు నవ మనాస్వాదిత రసమ్;
అఖండం పుణ్యానాం ఫలమివ హి తద్రూప మనఘం
నజానే భోక్తారం కమిహ సముపస్థాస్యతి విధిః.

ఇదం కిలావ్యాజమనోహరం వపు
స్తపఃక్షమం సాధయితుం య ఇచ్ఛతి;
ధ్రువం స నీలోత్పలపత్రధారయా
శమిలతాం ఛేత్తు మృషి ర్వ్యవస్యతి.

ఇట్టిచోఁ గాళిదాసుని యుపమా కల్పనాచాతుర్యము వెల్లడియగు.

అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి.

వృత్రుఁడెవఁడు

ఈ విషయమునుగూర్చి ఋగ్వేద మేమి చెప్పుచున్నదో చూత్తము. ఋగ్వేద ప్రథమమండల ప్రథమాష్టక ద్వితీయాధ్యాయ సప్తమానువాకములోని కెంపిన

సూక్తమంతయు కొంచెమించుమించుగా ఇంద్రవృత్ర వ్యాపారమునే వర్ణించుచున్నది. అందు కొన్ని ఋక్కుల భావ మిట్లున్నది.

౧. ఇంద్రుఁడు అహిని (అనఁగా మేఘుని) బద్దలు చేసెను. వానిలోనుండి వచ్చిన జలమును భూమి మీఁద పడునట్లు కొట్టెను. కొండలమీఁద పడి ప్రవహించు స్వభావముగల యానీటిని పర్వతప్రదేశములు భేదించుకొని నదులుగా ప్రవహించునట్లు చేసెను.

౨. ఇంద్రుఁడు త్వష్ట యిచ్చిన వజ్రముతో పర్వతము నాశ్రయించియున్న యహిని (మేఘుని) భేదించెను.

౩. గాఢాంధకారము కలిగించిన వృత్రుని (మేఘుని) ఇంద్రుఁడు వజ్రముతో కొట్టఁగానే, వాఁడు మొదలు నఱికిన చెట్టువలె నేలపైఁ గూలెను.

౪. వర్షము లేకపోవుటచే భిన్నములైన జనముల మనస్సులు సంతోషించునట్లుగా, జలములు ప్రవాహవేగమున గట్లు తెగిన సింధునదము నతిక్రమించి పోవునట్లుగా భూమిమీఁదపడిన వృత్రుని (మేఘుని) దాఁటిపోవుచున్నవి. ఏవృత్రుఁడు జీవనదశయందు ఏజలములను నిరోధించెనో, ఆ మేఘరూపుఁడైన వృత్రుఁడు ఆజలముల కాళ్ల క్రిందఁ బడినవాఁ డయ్యెను.

౫. ఉదకముల ప్రవాహద్వారమును మూసివేసిన వృత్రునిఁ జంపి యింద్రుఁ డాద్వారము తెఱచెను.

ఇట్లు, అహి వృత్ర శబ్దములు రెండును మేఘపరములుగా నుపయుక్తములైనవి. అహిని కొట్టినపుడు జలములు పర్వతములమీఁదను, భూమిమీఁదను పడినవని వర్ణించినట్లే, వృత్రునిఁ గొట్టినపు డావృత్రుఁడు నేలపైఁ గూలెననియు, వానిపతనముచే నదీకూలపాషాణములు భిన్నములైనవనియు వర్ణించుట చూడఁగా, జలప్రవాహవేగము స్ఫురించుచున్నది. మఱియు వృత్రుని మాయచేతను, మేఘావరణముచేతను అంధకారము కలుగుచున్నదని సమానముగా వర్ణింపఁబడినది. ఇదియునుగాక, ఆఙ్పూర్వకమైన హనధాతువునుండి పుట్టిన అహిశబ్దమునకు అంతటవ్యాపించునది యనేయర్థమున్నట్లే, వృఞ్ధాతువునుండి పుట్టినవృత్రశబ్దమునకును ఆవరించునది యనే యర్థమున్నది. కావున, అర్థసామ్యము, వ్యాపారసామ్యము, ఫలసామ్యము నొందుచున్న అహివృత్ర శబ్దములు రెండును ఏకార్థకములై, మేఘపరము లగుచున్నవని తెలియుచున్నది. ఈయభిప్రాయము మనస్సున నుంచుకొనియే సాయణాచార్యులవారు_అహిః=వృత్రః, మేఘః_అని వ్యాఖ్యానము వ్రాసినట్లు కనఁబడుచున్నది. వారు వృత్రశబ్దమునకు మేఘమనే యర్థము స్పష్టముగా వ్రాయలేదుగాని, ప్రకరణార్థమునుబట్టి అది యవగత మగుచున్నది. ఇంక నో, వృత్రుఁ డనఁగా మేఘుఁడేయని యెంచదగుననియు, మేఘత్వమును ప్రచ్ఛన్నము గావించి వృత్రునిఁ కసురత్వము గల్పించుట చమత్కారకారిణులైన ప్రాచీనమహాకవుల శైలియనియు గ్రహింపఁదగియున్నది. ఈవిషయమున యాస్కుఁ డుపదేశించిన రీతి యిది—

"తత్కో వృత్రః? మేఘ ఇతి నైరుక్తాః; త్వాష్ట్రోఽసుర ఇత్యైతిహాసికాః. అపాం చ జ్యోతిషశ్చ మిశ్రీభావకర్మణో వర్షకర్మ జాయతే. తత్ర ఉపమార్థేన యుద్ధవర్ణా భవంతి."

"అయితే, వృత్రుఁ డెవఁడు? మేఘుఁడని నైరుక్తు లందురు. త్వష్టకొడుకైన యసురుఁడని యైతిహాసికు లందురు. నీళ్లను, జ్యోతిస్సును కలియుటచే వర్షము పుట్టుచున్నది. వాటికి రూపకల్పనచేయుటచే యుద్ధవర్ణనలు సంభవించినవి."

అనఁగా జలమయుఁడైన మేఘునకు వృత్రాసుర రూపమును, జ్యోతిస్సునకు ఇంద్రరూపమును కల్పించుటచే వారిద్దఱికి యుద్ధము జరిగినట్లు వర్ణింపఁబడుచున్నది. దీనినిబట్టి ఋజ్వర్థవ్యాఖ్యలో— "మారుతోత్తేజితమైన యింద్రాఖ్యమైన వైద్యుత జ్యోతిస్సుచే వృత్రాఖ్యుఁడైన మేఘుని యందుగతములైన జలములు తాడ్యమానములై వర్షభావమును పొందుచున్నవి. ఇక్కడ నిజమైనయుద్ధ మనునది లేదు" అని భగవద్దుర్గాచార్యులు వ్రాసిరి. మఱియు యాస్కుఁడు వృత్రశబ్దము నిట్లు నిర్వచించెను: వృ, వృత్, వృధ్, ధాతువులనుండి వృత్రశబ్దము నిష్పన్నమగుచున్నది. దానికి క్రమముగా ఆకాశము నావరించునది, అందు పెరుగునది, జలమును ప్రవర్తింపఁజేయునది అని యర్థము. (వృత్రః=మేఘః.) కావున మేఘుఁడే వృత్రుఁడనియు, దానికి రూపకల్పన చేసి ఐతిహాసికులు వృత్రాసురుఁడని పురాణముల వర్ణించిరనియు, జ్యోతీరూపుఁడైన యింద్రుని సంఘర్షణచే వాన కలుగుచున్నదనియు తెలియుచున్నది. అందుచే మేఘుఁడే వృత్రుఁడు.

మల్లాది సూర్యనారాయణశాస్త్రి.



పియరీఇమాన్సగారు-లక్క-ప్రతిమలు

పశ్చిమ ఖండవాసులు మనయెడల నసహ్య భావమును గలిగియున్న వారలయినను వారు మన కనేకవిధముల నాదర్శకు లగు చున్నారని యొప్పుకొనక తప్పదు.

భరతఖండమున శిలారాతితోను, లోహముతోను పాశ్చాత్యవిధానము లందు చక్కని విగ్రహములను నిర్మింప జాలు శిల్పులు కలరు. కాని లక్క, మైనమువంటి పదార్థములతో విగ్రహ ములను నిర్మించువారు మనలో నరుదు; లేరనియే చెప్పవచ్చును.

లక్క విగ్రహములను చేయుట యందు సుప్రసిద్ధులగు పియరీ ఇమాన్స గారీ వ్యాపారమునకు నూతనమగు ప్రాముఖ్యమును దెచ్చిరి. దీనినిగూర్చి సెప్టెంబరు మాసపు స్ట్రాండు మాగజీను నందు చక్కని సచిత్రవ్యాసము కలదు.



పియరీ ఇమాన్స

వీరు లక్కపనులయందలి యన్నివిధానములను నేర్చుకొనిరి. తరువాత కళాకోవిదులను సమకూర్చి రమపనిని ప్రారంభించిరి..........తరువాత రంగులను పూయుటను గూర్చి వీ రనేక ప్రయత్నములను జేసి చూచిరి, సంపూర్ణముగ తృప్తికరముగ లేని యొక విగ్రహము నైనను వీరు అమ్మడు పోనివ్వలేరు. నేడు



1. మిలీసుజేన్ లెంగ్లెన్, 2. మిస్ హెలెన్‌విల్సు, 3. మేయల్ ప్యారిసు సంగీతమందిర గాయకులు.



మరికొన్ని ప్రతిమలు

పియరీ ఇమాన్సుగారు మూడువందల మంది కార్మికులను నియమించి లక్కతో మనుష్యవిగ్రహములను చేయించి ప్రపంచమున నన్ని భాగములకును బంపుచున్న కర్మాగారమున కాధిపత్యమును వహించియున్నారు.


వీరు చేయువిధానమును బరిశీలించిన ప్రతికార్మికునకు, చిత్రకారునకు ఉండవలసిన దీక్ష జాగరూకత గోచరమగును.

ముఖభాగ మేలోవిధముగ తయారైన పిమ్మట నునుపుచేయుట, దిద్దుట ప్రారంభమగును. పోతపోయుగా నేర్పడిన చిహ్నముల నన్నిటిని తీసివేసెదరు. ... ... తరువాత తలపై నొక కన్నమును జేసి దీనిని మరియొక భాగమున కంపెదరు. ఇచ్చట కనురెప్పల క్రిందను, పెదవుల క్రిందను గలలక్కనుపలుచపరిచి కండ్లను పండ్లను పెట్టెదరు. కొంచెము భేదమున్న రూపు నకు వికారకరముకాన కండ్లను పెట్టుట సులభ మైన పని కాదు.

ఇంజక్షనులను ఇచ్చేపిచికారీ కుండు సూదివంటి సూదిని వేడిచేసి దానితో కన్నములను జేసి, తలవెండ్రుకలను, రెప్పవెండ్రుకలను తగిల్చెదరు. మానవుని వెండ్రుకలనే యుపయోగించుట వలన ప్రతిమలకు వింతయగు సొగసు కలుగును.

తరువాత ఇట్టి విగ్రహము కళాకోవిదుడగు వర్ణకారుని వద్దకు బంపబడును. ఈతని ప్రాబీణ్యమువలన నది స్వాభావికమైన రంగులతో నరా జిల్లును.

ఈరంగులు లక్కలోని కింకుటకు ఏదో రహస్యమైన పద్ధతి కలదట. తరువాత నిజమగు దుస్తులను దొడుగుటచే నీవిగ్రహములు మనుష్యులవలెనే యుండునట. ముతంకకుంచెతో తాకుటవలన మానవ చర్మమునందువలె వీటిపైని ముడుతలు మొదలగునవి యేర్పడునుకాన నెంత



లిండ్ బర్గు

సూక్ష్మముగ బరిశీలించినను నిర్జీవమగు ఈవిగ్రహము జీవపూరితమైయున్నటులుగానవచ్చును.

ఇట్లు పాశ్చాత్యులు తమ వాణిజ్యమున లలితకళలను విరివిగ నుపయోగపరచి ధనము నార్జించుచున్నారు.

ఈవిగ్రహములందనేకములు సుప్రసిద్ధ పురుషులరూపములు. లిండ్

బర్గు (ఈతఁడు ప్రసిద్ధిపొందిన ఫ్రెంచి వైమానికుఁడు) యొక్క ప్రతిమ లెక్కనగ నమ్మకు పోవుచున్నవి. ఇట్టి ప్రొమ్నాడు వేలకొలఁది కిటికీలనుండి దారిపోవు వారివైపు జూచి నవ్వునటు లుండును. ఈతని లే ప్రాయపు తలపై నుంచిన కొరటోపీలు వేగముగ నమ్ముడుపోవును. ఫ్రాన్సురిపబ్లిక్కునకధ్యక్షులగు మాన్సియర్ గేస్టను దూమెర్గుగారి ప్రతిమ మధ్యతరకపు మాలకాయులకు గావలసిన దుస్తులను ప్రదర్శించుటకు ఉపయోగపడును. ఘుజేనీ లెంగ్లన్, హెలెన్ విల్స్ (వీరు టెన్నిసు ఆటయందు పేరుపొందిన యువతీమణులు) గార్ల యొక్క విగ్రహములు నవీనము లగు స్త్రీల టెన్నిసు దుస్తులను ప్రదర్శించును.



గేస్టన్ దూమెర్గు

... ...

సినీమాకు పోవుటిచేలకొలఁది ప్రజలను కడుపు ఉబ్బునటులు చేయుటయం దద్వితీయుల



చార్లీచాప్లిన్ జాకీకూగన్



ఇమాన్సుగారి కార్యాలయము

గు 'చార్లీ చాప్లిన్', 'జాకీకూగను'గార్ల ప్రతిమ లెంతస్వాభావికముగ నున్నవో కాంచనగును.

మరణదండనము జరుగుచుండ ఛాయాచిత్రమును దీయుట

వార్తాపత్రిక లోకదానినొకటి మించి యుండుటకును, చందాదారులసంఖ్య వృద్ధియగుటకును పత్రికాధిపతు లనేకప్రయత్నములను జేయుచుందురు. ఏదైన వింతవిషయము జరుగనున్నదని విన్నప్పుడు, అనుభవశాలులగు వార్తాగ్రాహకులను (Reporters) బంపి, యా వింత విషయముయొక్క సంపూర్ణమగు వర్ణనను సేకరించి యందరికంటె ముందుగా ప్రచురింప యత్నించెదరు. పత్రికాధిపతులు వ్యయమునకు వెనుదీయరు. వార్తాగ్రాహకులు ప్రయాసమునకు వెరవరు. చిత్రప్రచురణము ప్రాముఖ్యము వహించుచున్న యీకాలమున ఛాయాచిత్రగ్రాహకులును అనేక విధముల ప్రయత్నములనుజేసి చక్కని చిత్రములను, సేకరించుచున్నారు. విమానములపైనెక్కియు,

క్రూరమృగములమధ్యకు బోయియు ఛాయా చిత్రములను దీయునప్పుడు సంభవించు ఆప త్తులకును వెఱచువారు కారు.

విద్యుచ్ఛక్తిచే మరణశిక్షను బొందుచు న్నవారి ఛాయాచిత్రములను తీయకూడదని యొక నిబంధన కలదు. అతిజాగరూకతతో కనిపెట్టుచున్న పోలీసు భటులను గూడ మోసపుచ్చి యిట్టిచిత్తరు వొకటి యెట్లు తీయబడెనో సిడ్నీ నదర్లేండుగారు సెప్టెంబరు మాసపు స్ట్రాండుపత్రికయందు వర్ణించిరి. ఈ వ్యాసకర్త ఛాయాచిత్రకారునకు ఛాయాచిత్రగ్రహణమునందు సహాయము జేసినారు.



రూత్ స్నైడరు

భర్తనుజంపిన 'రూత్ స్నైడరు'నకును, ఆమెకు సహాయముజేసిన 'జడ్ గ్రేకును' మరణశిక్ష విధింపబడినా రని విని న్యూయార్కునందు ప్రచురింపబడుచున్న 'డెయిలీన్యూసు' అను వార్తాపత్రికయొక్క అధిపతి ఆదండితుల మరణముయొక్క ఛాయాచిత్రమును తీయుటకు వలపెట్టెను. ఇట్టికోర్కె యనేకులకు పుట్టియుండ వచ్చును కాని వారికి సాహసము సాధారణముగ నుండుట దుర్లభము. మూడేండ్లక్రితముకొన్న రెండు అంగుళములు వెడల్పు, మూడంగుళములు ఎత్తు, మూడంగుళములు పొడవుకల చిన్న కేమెరా పిరికిపడ నుండెను. ఇక సాహసించి చిత్తరువును గ్రహించువారు కుండినవలెను. ఉన్నత పదవిని స్వీకరించుటకు పోవుచున్న 'థామస్ హోవర్డు' అను ఛాయాచిత్రగ్రాహకు డీపత్రికాధిపతిని జూచు టకు అకస్మాత్తుగ వచ్చెను. "విద్యుచ్ఛక్తిపూరితమైనకుర్చీపై గూర్చొనియున్న 'రూత్ స్నైడర్' యొక్క ఛాయాచిత్రమును గ్రహింపగలవా?" యని యాపత్రికాధిపతి 'హోవర్డును' ప్రశ్నించెను. థామస్ హోవర్డు "ప్రయత్నించెదను." అని హోవర్డు ప్రత్యుత్తర మొసగెను.



కేమెరాను రహస్యముగ నుంచుటకు అనేకము లగు ప్రయత్నములు గావింపబడినవి. వెయిస్టుకోటుక్రిం దదాచిన మాపిరి తీయుటయందు కేమెరాకదలును. మరి యొకచోట పెట్టుటకు వీలులేకపోయెను. తుదకు దర్శించి దర్శించి, చిత్తరువును జూపినటులు గాలికి కదులుట కేర్పాటు జేసిరి. కాలి మరాయిలోనుండి కోటుచేతిలోనికి వచ్చున ట్లుంచుకొన్న గొట్టముచివరనున్న మరను చేతితో నొక్కి చిత్రమును దీయునట్లు నిశ్చయించుకొనిరి.

మరణము విధించునప్పుడు కొందఱుసాక్షు లుండ వలెను. అందులో హోవర్డుగారి నొకసాక్షిగ చేర్పరచిరి. చెఱసాలయొక్క ముఖ్యాధికారి లోపల జరుగనున్న దాని ఛాయాచిత్రమును తీయరాదని సాక్షులందరికి తెలియజే సెను. లోపలికిపోయి యందరును కూర్చొనిరి. కేమెరా కదలకయుండుటకు కట్టుగట్టిగ కట్టుటవలన కాలికి నొప్పి కలిగినను హోవర్డుగారు బాధకోర్చి ధైర్యముతో సమ యముకొరకు గనిపెట్టుకొని యుండిరి. నదర్లాండుగారు చాటుగ గూర్చొని వారిబాధను గొంత దీర్చుచుండిరి. కుర్చీకి విద్యుచ్ఛక్తిని విడిచిపెట్టిన యుత్తరక్షణమునందే హోవర్డుగారు కేబులోని గొట్టమునకున్న మరను నొక్కిరి. కేమెరా ముఖము నిక గప్పవలెను. వంగినయెడల అనుమానింతురు కాన యీవిషయమును జూచి సామ్యపిల్లిన వానివలె ముంగునకొరగి తన కార్యము నాతడు నెరవేర్చె యందరితోను



కాలికికట్టియుంచిన కెమెరా తెలుపలికి వచ్చెను.

మోటారు సిద్ధముగ నుండెను. దానిపై నాతడు రివ్వున ప్రయాణమై మార్గమున మరియొక మోటారు నెక్కి తన యాఫీసును జేరుకొనెను. ఛాయాచిత్రము బాగుగ రాని యెడల నింత ప్రయత్నమును వ్యర్థమగును. కాని యిది వరకు కొన్ని సమయములందు మోసపుచ్చిన యాకేమెరా నాడత్యద్భుతమగు చిత్తరువును ప్రపంచమునకీయగల్గెను.

ఎంతయో యాతురతతో వేచియుండిన యాకార్యాలయోద్యోగు లీవిజయమున కానందించి తమతమ కార్యములను త్వరగా జేయుటవలన కొలదికాలమునకే డెయిలీ న్యూసునందు ఆ చిత్తరువు ప్రచురమై ప్రపంచమున కంతటికిని లభించెను.

హోవర్డుగారి ధైర్యసాహసము లితర వార్తాగ్రాహకుల కున్న యెడల మన వార్తాపత్రిక లిప్పటికంటె ఎక్కువగ మానవసేవను చేయగలిగి యుండెడివి.

ప్రాచీనభారతీయ విజ్ఞానముయొక్క విలువ

[కరాచీలో జరిగిన యువకమహాసభాధ్యక్షోపన్యాసమున శ్రీ. టి. యల్. వాస్వాని గారు భారతీయ విజ్ఞానమును మన యువకు లెల్లరు పఠించు టత్యావశ్యకమని యిట్లు ఒకచిన్న ఉదాహరణముతో నొక్కి చెప్పినారు.]

కొందఱు భారతీయవిజ్ఞానము సర్వాంగసంపూర్ణమయిన దందురు. నేను దాని నంగీకరింపను. ఏవిజ్ఞానమును సంపూర్ణము కాజాలదని నావిశ్వాసము. భారతీయ విజ్ఞానము సంపూర్ణమయినది కాకున్నను, ఈనాటి విశ్వప్రపంచమున కుత్కృష్ట సందేశము నొసగగలదని మాత్రము విన్నవించుకొనుచున్నాను. భారతీయవిజ్ఞానము ఉత్కృష్టమగు నాదర్శముయొక్క శక్తితో నిండియున్నది. ఆయుత్కృష్టాదర్శశక్తియే భారతదేశముయొక్కయు, అధునాతన ప్రపంచముయొక్కయు జీవనప్రవాహము లోనికి ప్రవహింపవలెనని నేను కోరుచున్నాను.

పెక్కేండ్లక్రిందట నొక గొప్ప భారతీయగూఢమతవాది (Mystic) ఇంగ్లాండులో చెప్పినసంగతి నాకు జ్ఞాపకమునకు వచ్చినది. ప్రతాపచంద్రమజుందారను గొప్ప బ్రహ్మమతప్రచారకు డగు భారతీయుని పేరునేని మీరందఱు వినియుండరని నేను తలతును. అతడు చిరకాలముక్రింద మరణించెను. గొప్పవిజ్ఞానవిశారదుడగు టిండలుగారు తీవ్రవిమర్శనమునకు గురి అయియుండినకాలమున నాత డింగ్లాండున నుండెను. టిండలుగారు బెల్ ఫాస్టు (Belfast) లో కావించిన ప్రసంగమున విజ్ఞానమునందు ద్రవ్యములయందు ఆత్మయొక్క ఉనికిని, శక్తినిగాంచగల కాలమువచ్చుచుండెనని చెప్పిరి. ఈయభిప్రాయము పెక్కురకు విరుద్ధముగ తోచి తీవ్రవిమర్శనములతో పత్రికలను నింపివైచిరి. ఒకమారపుడు మజుందారుగారు టిండలుగారిని సందర్శించి మాటాడుచు బెల్ ఫాస్టు ఉపన్యాసముల విషయమునుగూర్చి ముచ్చటించెను. మజుందారుగారు టిండలుగారియెడ సామజాభూతిని జూపుచు ద్రవ్యమునకు, ఆత్మకు గలసంబంధమునుగూర్చి ప్రాచీనోపనిషత్తులు పేర్కొనిన సిద్ధాంతముల నెత్తి చూపిరి. 'మీవాక్యములు నాకు మిగుల మనశ్శాంతిని గూర్చినవి. జ్ఞానజ్యోతిస్సు ఒకప్పుడు ప్రాగ్దిక్కునుండియే ప్రసరించినది, మరల నది యటనుండియే ప్రసరింపనున్నది' అని టిండలుగారు నుడివిరి. మన భారతదేశము విశ్వప్రపంచమున కొసగవలసిన దింక నొక్కవిషయము గలదని నేను సవినయముగ విన్నవించుకొనుచున్నాను.

ఆధిభౌతిక విజ్ఞానములయందు పాశ్చాత్యప్రపంచము ఉత్కృష్టమయినది. ఆవిజ్ఞానముల తత్త్వమును పరిశీలించి కనుగొనుటకు మనము పాశ్చాత్యప్రపంచమునకు పాదసేవ కావింపదగును. కాని భారతదేశము విశ్వప్రపంచమున కంతటికిని సందేశము నొసగవలసినవిషయ మింతకంటె వేరయినదని నావిశ్వాసము. మనము భారతదేశపు యథార్థహృదయమును గుర్తించుటకు ప్రాచీనభారతీయ విజ్ఞానమును శ్రద్ధతో పఠింపవలెను.

(జాన్ వేదిక్ మేగజీనునుండి.)

స్త్రీల వారసత్వపు హక్కులు

హిందూ ధర్మశాస్త్రప్రకారము స్త్రీలకు గల వారసత్వపు హక్కులు బహు స్వల్పము. సోదరిగాని,

కుమార్తెగాని వారసులుగ నంగీకరింప బడరు. జ్ఞాతులు లేనప్పుడే సోదరి, కుమారుడు బంధువుగ నంగీకరింప బడును. ఈలోపములను దీర్చు నిమిత్తము సర్ శంకరన్ నాయరుగారు స్టేటు కౌన్సిలులో నొక బిల్లును ప్రవేశ పెట్టిరి. దీని ప్రకారము కుమారుని కుమార్తెయు, కూతురు కూతురును, సోదరియు, సోదరి కుమారుడును, క్రమముగ తండ్రి తండ్రి తరువాత గాని, తండ్రి సోదరుని తరువాత గాని బంధువులుగను, వారసులుగను అంగీకరింప బడవలసియుండురు. స్త్రీల స్వాతంత్ర్యమును గూర్చి ప్రపంచమందంతటను అభిప్రాయములు మారుచున్నవి. సాంఘిక వ్యవస్థలయందే కాక రాజ్యాంగమునందు కూడ స్త్రీలు పురుషులతో సరిసమానముగ భావింపబడి, తదనుగుణ్యములైన సంస్కారములు గావింపబడుచున్నవి. టర్కీ, పర్షియా మొదలగు మహమ్మదీయ రాజ్యములలో గూడ స్త్రీలకు సర్వవిధములైన స్వాతంత్ర్యపు హక్కు లంగీకరింప బడుచుండ, హిందూదేశమునందు మాత్రము స్త్రీలు పూర్వమువలె దాస్యమున బంధింపబడి యుండజాలరు. దేశమునందంతటను స్త్రీ సమాజములు వెలయుచున్నవి. స్త్రీలు తాలూకు బోర్డులలోనికి, జిల్లా బోర్డుల లోనికి, మున్సిపాలిటీల లోనికి, శాసన సభలలోనికి ఎక్కుచున్నారు. బాల్య వివాహములను నిషేధించుటకు ఆందోళనము సాగుచున్నది. వారసత్వపు హక్కులుకూడ తక్కిన సంస్కారములతో పాటు అంగీకరింపక తప్పదు. 1928లో టి. వి. శేషగిరి అయ్యరుగారు ప్రతిపాదించిన బిల్లు లెజిస్లేటివు అసెంబ్లీలో నామోదింపబడి యుండెను. సెలెక్టుకమిటీ వారు కూడ స్త్రీలకు వోటింగు హక్కుల నొసగుట కంగీకరించిరి. వారసత్వపు హక్కులు లేని స్వాతంత్ర్యము నిజమైన స్వాతంత్ర్యము కాదు. శంకరన్ నాయరుగారి బిల్లు స్టేటుకౌన్సిలు వారి యామోదమును గూడ బడయును గాక.

(కృష్ణాపత్రిక, ౨౨-౯-౧౯౨౮.)

క్షయ-నివారణము

శ్రీయుత 'ముకుట్'గారు త్యాగభూమి భాద్రపదసంచికయందు పై శీర్షిక క్రింద నొక వ్యాసము వ్రాసిరి. అందు క్షయ యొక్క కొన్ని స్వరూపములను, ప్రాథమిక లక్షణములను వివరించి, అది అసాధ్య వ్యాధి కాదనియు, నివారణ గావించుకొన వచ్చుననియు, వంశపరంపరాగతముకూడ కాదనియు, కాని మిగుల భయంకరమైనదనియు సంతతపరిశోధనము వ్యక్తపఱచెనని తెలిపి, శిశువులకు క్షయగ్రస్తులనీడకూడ తగులకుండ కాపాడదగువిధము వక్కాణించి, ఆవ్యాధి భయంకరత యించుక నిరూపించి, యిట్లు నుడివి యున్నారు:

నేడు మన భారతవర్షమున క్షయరోగులసంఖ్య కనీసము ౮౧ లక్షలని యంచన: అనగా, మొత్తము జనసంఖ్యలో ప్రతి శతమునకు ౨ రు ఈమహామారి పిడికిట జిక్కియున్నారు. మృతసంఖ్యయు తక్కువ కాదు— ౧౨౫ లక్షలజనులు ప్రతిసంవత్సరము దీనికి కానుకపోవుచున్నారు. పోనీ, కాలము గడచినకొలది తగ్గుచున్నదా యనిన, అదియు లేదు: నానాటికి వృద్ధియగుచున్నది. సర్కారులెక్కలను అనుసరించి, కడచిన ౨౧ సంవత్సరములలోను ౩౧% పెరిగినది. చికిత్సకును తగినయేర్పాటు లేదు. రోగము వ్యాప్తియా అట్లున్నది; ఇక సర్కారులెక్కల ప్రకారము, ౮౦ లక్షలక్షయరోగులలోను ౮౧౦ మందికి మాత్రమే చికిత్సాలయములలో నేర్పాటు గలదు. ఇన్ని ఆసుపత్రులు, డిస్పెన్సరీలు కలిసి సాలుమొత్తమున చికిత్సచేసెడిది లక్షనర రోగులకు! ఇంకను తక్కువ మందికే మోకూడ! ఎక్కడ ౮౦ లక్షలు, ఎక్కడ ౧½ లక్ష! ఏమూలకు? కాని ఎవరితో చెప్పుకొనుట? మనకంటెను మన కక్కువ హితులాయేమి సర్కారువారు!!

కాని యిటు కొలదినాళ్ళనుండి కొందరు మహానుభావుల దృష్టి యీ పెడకు మరలినది. క్షయచికిత్సాలయములు, స్వాస్థ్యగృహములు, క్షయచికిత్సాశిక్షణాలయములు-వీనివిషయమై యాలోచన సల్పుటకు ప్రభుత్వమునకు సంబంధించినట్టియు, సంబంధింపనట్టియు సకలభారత ప్రతినిధులతో నొకసంఘ మేర్పరుపవలెనను తీర్మానమొకటి రాజ్యసభయందు కావింపబడెను. సర్ ఇబ్రహీమ్ హారూన్ జాఫరుగారు లెక్కలద్వారా తగురీతిని దీనిని సమర్థించిరి. వారి అభిప్రాయముప్రకారము 'భిన్నభిన్నరాష్ట్రముల ప్రభుత్వప్రతినిధులతో నొక మధ్యస్థసంఘము నేర్పఱిచి, దానిసాయమున పని నడిపిననే ఈ పెద్ద సమస్యకు తగిన పరిష్కారము జరుగును.' క్షయచికిత్సాశాలలను, స్వాస్థ్యగృహములను వృద్ధిపొందింపవలెనని వారి ప్రోత్సాహము. ఖర్చు పెరుగుగాక; రోగనివారణకై ఖర్చు పెట్టవలెను. దాతలును తమ దాతృత్వమున పాల్గొనవలెనని వారి ఆశయము. ఇంతేకాదు: ఈ చికిత్సకై కార్యకర్తలకు శిక్షణ గఱపవలెననియు వారి ప్రోత్సాహము; ఇందు నిమిత్తమై శిక్షితసంస్థల సంస్థాపింపవలెనని వారు బోధించియున్నారు. ఇక స్వనామధన్యులు డాక్టరు ముత్తుగారు తమ జీవనమునే యిందుల కర్పించినవారు. అనేకవత్సరములనుండి వారు ఇంగ్లండునందును, భరతదేశమందును దీని మూలకారణములయొక్కయు, నివారణోపాయముల యొక్కయు నన్వేషణమున నిమగ్నులైయున్నారు. వారు చాలవఱకు సాఫల్యముగూడ బడసి యశస్వులైనారు. వారు చెప్పురీతిని, పర్దాయు, బాల్యవివాహమును భారతీయసంఘమున ఈ మహావ్యాధి వ్యాపించుటకు ముఖ్యకారణములు. అన్నపానములయందు మద్యమాంసాదులగు ఉత్తేజక పదార్థము లిందులకు ముఖ్యకారణములే కాని, వారియభిప్రాయము ననుసరించి, బియ్యమును, పల్చనిపప్పును మిక్కుటముగ సేవించుటయు కొంతవఱకు దీనికి తోడ్పడును. ఉత్తరమునకన్న దక్షిణమున క్షయ యెక్కువగ నుండుట కిదియే కారణమట.

పిదప వ్యాసకర్త రా. బ. కప్తాను మహారాజకృష్ణ కపూర్ ఎం.డి, డి.పి.హెచ్. గారు (డి. ఏ. వి. కాలేజీ యూనియన్ మేగజీనునందు) విద్యార్థిదశయం దీరోగ మంకురించుటకుగల కారణములని తెలిపినవి కొన్ని పేర్కొనిరి. ఇంటికడ నప్పటివఱకు నెంతయో స్వేచ్ఛతో సంచరించుచుండిన బాలుడు పాఠశాలయందు ప్రవేశింప, హఠాత్ప్రతిబంధము వలన మనోవృత్తియిరుకుపడి, స్వాస్థ్యము చెడునట. అదికాక, బడియందు భయయుక్తమైన వాతావరణ ముండుటయు, భవనముల నిర్మాణము సరిగా లేకుండుటయు, ఒక్కొకగదికి పెక్కుమంది బాలుర కూర్చుండబెట్టుటయు స్వేచ్ఛానిరోధమునకు తోడై, యీదుష్టరోగము విద్యార్థులయం దవతరింపజేయుననియు, కావున నీవిషయముల తగిన సంస్కారముల గావించి, భయమయముకాక ప్రేమమయమగు వాతావరణము నిల్పి, బాలురస్వచ్ఛందత హఠాత్తుగ భంగపఱుపక మెల్ల మెల్లగ వానిని దారికి తీసికొనివచ్చుచు మెలకువతో వర్తింపవలెననియు వారి ఆశయమని తెలిపి, వ్యాసకర్త చికాగో (అమెరికా) మ్యునిసిపల్ సానిటోరియమ్ వారు ఈవిషయమున గావించిన సూచనలు మిక్కిలి యుపయోగకరములని చెప్పుచు నవి యీదిగువరీతిని పొందుపఱిచిరి:

౧. పేటెంటుమందుల సేవింపకుడు.

౨. ప్రకటన ఔషధాలవెఱ్ఱిలో పడకుడు.

3. క్షయను తప్పక కుదుర్చుమందు నేటివఱకును దొరకలే దనువిషయము మఱవకుడు.

౪. చికిత్స పరిచితవైద్యునిచేగాని, గృహవైద్యునిచేగాని చేయించుకొనుడు.

౫. ఆకలికి మించి తినకుడు. సులభముగా నెంత పాటి జీర్ణమగునో అంతే భుజింపుడు.

౬. నియమితసమయమునను, కడుపు చూచుకొనియు భోజనము సేయుడు.

౭. జఠరము నారోగ్యముగా నుంచుకొనుడు.

౮. నమలి నమలి తినుడు.

౯. తక్కిన అవయవములవలెనే జఠరమునకును నడుమ నడుమ విశ్రాంతి యిండు; అనగా ఉపవాసము చేయుచుండుడు.

౧౦. మాటిమాటికి తినకుడు; దీనివలన జఠరము దుర్బలమగును.

౧౧. రుచింపని, అనగా ఏది తినుటవలన మాకు ప్రసన్నత కలుగదో అట్టి, తిండి తినకుడు.

౧౨. గ్రుడ్లు తినుచున్నచో, రోజునకు ఒకటి రెండుకంటె నెక్కువ తినవలదు.

౧౩. భోజనముతో కొంచెము పాలుకూడ త్రాగుచుండుడు.

౧౪. ఎట్టిక్రొవ్వును భుజింపవలదు.

౧౫. వెన్న తినుడు, అది చాల లాభకారి.

౧౬. ఉమ్మియందు క్షయ కీటకము లుండును గాన ఇంటిసమీపమునగాని, నేలపైగాని, గోడలమీద గాని ఉమియక, కాగితముమీదనో, రుమాలుమీదనో, వస్త్రముమీదనో ఉమియుడు; పిదప వానిని తగుల బెట్టుడు.

౧౭. పీకిదానులో నుమియవలసినచో దానిలో కార్బోలిక్ ఆసిడును, నీరును (౧: ౨౧ భాగములుగా) వేసియుంచి, దినమునకు రెండుసార్లు వేడినీటితో దానిని కడుగుచుండుడు.

౧౮. దగ్గునపుడును, తుమ్మునపుడును క్షయాణువు లిటునటు చెదరి వ్యాపింపకుండ నోటిముందర రుమాలు పట్టి, దానిని మరుగునీటితో నుడుకవలెను.

౧౯. ఎవ్వరిని ముద్దుపెట్టుకొనవలదు. అందువలన క్షయకీటకములు వారియందు ప్రవేశించును.

౨౦. చాల విశ్రాంతి తీసికొనుడు.

౨౧. సాధ్యమగునంతవఱకు, ఇంటివెలుపల ఆరబయటగాని, వరండాలోగాని మాత్రమే యుండుడు, తిరుగుటకంటెను, కూరుచుండుటకంటెను, పండుకొనుటకాని, నిదురించుటకాని మంచిది. జ్వరము వచ్చినపుడు పూర్తిగా విశ్రమింపుడు.

౨౨. అనుదినము స్నానము చేయుడు; జ్వరము వచ్చినచో వేడినీటియందు వస్త్రము తడిపియైనను సరే, కాని నాగామాత్రము కారాదు.

౨౩. గాలివెలుతురులు లేనియింట నుండక, ఎండయు, గాలియు బాగుగ తగులుచోట నివసింపుడు.

౨౪. ఇతరుల కీవ్యాధి అంటకుండుటకుగాను, ఇటునటు ఇల్లంతట తిరుగుటకంటె మీగదియందే యుండుట మంచిది.

౨౫. మీరు భోజనాదిక మొనరించు పాత్రలు పొరబాటుననైన ఇంటియందలి యితరపాత్రలతో కలయనీకుడు. మీయెంగిలి నెవ్వరిని తిననీయకుడు

౨౬. ఈపై జెప్పిన నియమముల పాటించుట వలనను, పిల్లల తమ సహవాసమునుండి వేరుగ నుంచుట వలనను దీనికి ప్రతిబంధము కలుగునదియు, దీని లక్షణములు తోచినతోడనే చికిత్స చేయించుట, శాంతి, విశ్రాంతి, ఉత్తమభోజనము, పరిశుద్ధవాయువు నేర్పాటు చేయుట-వీనివలననే యీరోగము తొలగిపోవునదియు జ్ఞప్తియందుంచుకొనుడు.

అమెరికను గ్రంథాలయములు

గ్రంథాలయ ప్రచారము అమెరికాలో ప్రాముఖ్యము పొందినటుల మరి యేయితర దేశమునందును పొందియుండలేదు. ప్రతిఅమెరికను పట్టణమునందలి ముఖ్య

భవనములలో గ్రంథాలయ భవనము తప్పక ఒకటియై యుండును. గ్రంథాలయ నిర్మాణములలో వివిధ మండలములవారు పోటీపడి, ఒకరికంటె నొకరెక్కువ ధనమును వెచ్చించుచుందురు. ప్రతి చిన్నపాఠశాలకు నంటి ఒకచిన్న గ్రంథాలయము నెలకొల్పబడి యుండును. సామాన్యముగ లోకలుబోర్డువారు వీనిని పోషించుచుందురు. లోఆంజిలో యను గ్రామమున పెద్దగ్రంథాలయము నంటి పిల్లలకుగాను వేరు చిన్నగ్రంథాగారము గలదు. బాలబాలికల నీచోటునకు రప్పించి వారియందు విద్యాభిలాష పురికొల్పబడును. బఫేలో యను పట్టణమున నొక కేంద్రగ్రంథాలయము గలదు. ఈగ్రంథాలయాధికారులు ఆపట్టణములోని ఎలిమెంటరీస్కూళ్ల విద్యార్థులనిమిత్తము 1300 లైబ్రరీక్లాసుల నేర్పాటు చేసిరని వినినప్పుడు గ్రంథాలయపద్ధతి అమెరికాలో నెంత ప్రాచుర్యము నొందుచున్నదో తెలియగలదు. సంవత్సరమున కీఎలిమెంటరీ స్కూళ్ల మధ్య సుమారు 7 లక్షల గ్రంథములు తిరుగుచుండునని వినినప్పు డాశ్చర్యము కలుగక మానదు. సెంటు లూయి యనుపట్టణమున గ్రంథాలయాధికారులు ఎలిమెంటరీస్కూళ్ళకు పోయి, గ్రంథాలయముల యుపయోగములను ప్రత్యక్షముగ ప్రదర్శించి, బాలురలో గ్రంథాలయములకు పోవు అభ్యాసమును పురికొల్పుచుందురు. బోస్టను, చికాగో మొదలగు పెద్దపట్టణములందలి పబ్లిక్కు గ్రంథాలయములవారు స్వయముగ కాలేజీలయందు శాఖలను నెలకొల్పి కాలేజీ లైబ్రరీల కంతయు తోడ్పడుచుందురు. 500 మంది విద్యార్థులుగల ప్రతి స్కూలుకును లైబ్రేరియను అను ఒక యధికారి నియమింపబడును. ఈతడు స్కూలు గ్రంథాలయమును పాలించుటయే కాక విద్యార్థులకు గ్రంథాలయ పాలనావిధానమును బోధించుచుండును. విద్యాశాఖవారు ప్రత్యేకముగ నీగ్రంథాలయములను తనిఖీచేయుటకు సుశిక్షితులైన లైబ్రేరియనులను నియమించుచున్నారు. అమెరికాలో సుమారు 175000 రూరలుస్కూల్లు కలవు. వీనికన్నిటికి గ్రంథాలయశాఖ లేర్పాటు చేయబడుచున్నవి. గ్రంథాలయములేని స్కూలు స్కూలు కాదని అమెరికను విద్యాధికారుల మతము. ఇంగ్లాండులో గూడ నిట్టి యేర్పాట్లు లేవు. సంచారగ్రంథాలయములకుగాను ప్రత్యేకముగ బస్సులు కలవు. ఇవి గ్రామగ్రామములకు గ్రంథములను గొనిపోయి గ్రామములలోని మెంబర్లకు పుస్తకములను బంచిపెట్టి వచ్చుచుండును. పెద్దపెద్ద సిటీలైబ్రరీలలో గ్రంథాలయాధికారుల బసనిమిత్తము గదు లేర్పాటు చేయబడినవి. ఈవిధముగ గ్రంథాలయోద్యమము అమెరికాలో నొక ప్రత్యేకవిద్యావ్యాపనముగ బయల్వెడలుచున్నది. మన దేశములో గ్రంథాలయములే కొద్ది. అవియైనను తగుపోషణము లేక సన్నగిలుచున్నవి. వీనికి స్వల్పముగ గ్రాంటు నిచ్చుటకే గవర్నమెంటువారు వెనుకాడెదరు. ఏమ్యునిసిపాలిటీ వారైనను గ్రాంటు నొసగుటకు సాహసించినయెడల, గవర్నమెంటువారు దానిని సర్చార్జిక్రింద చేర్చుటకు శంకింపరు. ఈవిధముగ బ్రిటిషు గవర్నమెంటువారు హిందూదేశీయులను స్వపరిపాలనా విధానమునందు శిక్షణము గరపి స్వరాజ్యార్హులనుగ జేయుచున్నారు.

ప్రాంబనన్‌లో రామాయణశిల్పము

డాక్టరు సునీతికుమార చటర్జిగారు జావాలో హిందువులు చూపిన చిత్రకళాకౌశలమును గూర్చి యించుకంత యొక్క సచిత్రవ్యాసమున నుడివినారు. ప్రాంబనన్‌లోని రామాయణశిల్పచిత్రములనుగూర్చి యిందిట్లు వ్రాసిరి:-

జావాద్వీపమున ప్రాంబనన్ అనుచోట నున్న దేవాలయము లొక శిలామయమయిన మహాకావ్యము. సర్గస్థితిలయకారులగు బ్రహ్మవిష్ణుమహేశ్వరులు నెలకొనియున్న యీ యాలయములు ప్రాచీన భారతీయ కళావృక్షమున పండిన ఉత్తమఫలము. జావాలో నాటిన భారతీయ చిత్రకళావృక్షము ప్రసవించిన కవలపూవులు బోరోబుదురు, ప్రాంబననులు; జాతి ఆత్మస్వరూపమును, కళాప్రబోధమును గాంచిన కాలముననే పుట్టి

నకవ లిపి, కవ లగుటచే వానిలో నొండొంటికి పోలిక గలదు. కాని స్వీయ ప్రత్యేకవ్యక్తిత్వ మాకళకు గలదు. ఇదియే మనమనస్సును తనవంక కాకర్షించుచున్న వాని వ్యత్యాసము పుట్టుట కవకాశము గలిగించినది.

ప్రాంబనన్‌లోని రామాయణశిల్పచిత్రములు కేవలము సుందరముగ నుండుటయే కాదు : అవి భారతీయ వాఙ్మయము యొక్కయు, ఇతిహాసము యొక్కయు నమూన్యము లయిన ప్రమాణపత్రములు. ఆచిత్రములు శిల్పచిత్రకారులు ఇతర కవికృత రామాయణములకంటె వాల్మీకికృతము నెక్కువగా ననుసరించినవారు కా రను టను చాటుచున్నవి.

'అబ్రహాము'కాలమున 'అబ్రహాము'నగరము

[మెసొపొటేమియా దేశమున బాబిలోనియనుల 'ఉర్' అను సమేరియను నగరరాజమున (ఇది ఆజాతి కాదిపురుషుడగు అబ్రహాముగారి జన్మస్థలమని బైబిల్యాము) సార్వజనిక మందిరముల నడుమగల యొకనివాసగృహము నంతర్భాగమును సమంజసముగ వివరించు నొక చిత్ర మిది.]

(నాల్గువేలయేండ్లకు పూర్వము జనుల నివాసపద్ధతి)

కొలది మాసములక్రిందట బయల్పడిన క్రొత్తవిశేషములలో ముఖ్యములై మొన్న బ్రిటిషు మ్యూజియమున నిలిపిన ప్రదర్శిత వస్తువుల కాకరమైన రాజసమూహములుకాక, అందు 'ఉర్' నగరమున అబ్రహాముగారికి సమకాలీనమగు పట్టణప్రదేశ మొకటి యుండెను. ఇది అసలుగుడి యావరణమునకు వాయువ్యదిశనుగల 'ఎమినాన్' గోడకు వెలుపట నొకదిబ్బపై నున్నది. (Society of Antiquarians) పురాచరిత్ర విచారకసంఘము సాయమున రచించిన యీ బొమ్మయందు 'ఎమినాన్' మీదుగా నవ్వల పూర్తిగ బాగు పఱుపబడిన గృహములలో నొకటి యగపడుచున్నది. అవి పరిక్రొత్తయుపలబ్ధుల ననుసరించి, క్రీ. పూ. 1400 న 'కురిగాల్జా' కాలమున నెట్లుండెడివో అట్లు ప్రదర్శితములైనవి. క్రొత్తగా త్రవ్వితీసిన శిథిలగృహములు భావించినకంటె గొప్పగ నిర్మితములై యుండెను. అవి మంచి యిటుకలతో కట్టబడి, నేటి బాగ్దాదు నగరమందలి గొప్ప గృహస్థుల యిండ్లకు పరివచ్చుచుండెను. అవి నగరనితంబములపై వేరువేరున్నతప్రదేశముల విహారయోగ్యములగునట్లు క్రీ. పూ. 2100 ప్రాంతమున నిర్మితము లయ్యెను. క్రీ. పూ. 1900 సం.న తిరిగి 'ఉర్' నగరము బాబిలోనియనులచే జిక్కి పరశురాము క్రీతియాగునలకు నవి యట్లే అసలముగ నిల్చియుండెను. ఆదమానముజాడ లిప్పటికిని గలవు. ఈమధ్యకాలమున మేటవేసిన చెత్తచెదారమునలన నచ్చటి యిరుకువీథులు దాదాపు 8 అ. ఎత్తయ్యెను. అసలైన వాసగృహములందు సేలగదులు సార్వజనికములు, పైగదులు స్వకీయములును. యజమానుడు కొంతకాలము గృహము విడిచి యుండవలసినయెడల నతడు సింహద్వారమున నిటుకలు పేర్చెడివాడు. సాధారణముగా వెలుపలిగోడ కది యొక్కటే ద్వార ముండెడిది. ధనికుల గృహములయందు (ఒకముఖ్యలక్షణముగా నుండెడు) దేవాలయతనములక్రిందను, అవి లేని బీదగృహములయందేదో యొకచోటను గోరీలు కన్పడెను.

విలంనింపు గోరీలయందు, తొలుత పాతిన శవముల పరిశిష్టములను గర్హ్యమగు తమ సహజనిర్దయతతో నొకప్రక్కకు త్రోసిపుచ్చి, వేఱుశవముల మఱిమఱి యుంచే పూడ్చుట సమీరియనుల కాచారమై యుండెడిది. ఒక్కొకగోరీని పదిశవములకు తక్కువకాకుండ నుపయోగించెడివారు. వేఱురకముల సమాధులు ఎడమప్రక్క క్రిందిమూల ప్రక్షిప్తముగా చూపబడినవి.

1. ఇ-డబ్లల-మహ్, న్యాయమండపము. 2. ఇ-నన్-మహ్, దేవాలయము. 8. ఎమినాన్‌గోడ. 4. పైగోడలు - పచ్చి యిటుకల మూర్పుపై చాపలోపటము.

5. వెలుపటిగోడలు-ద్వారములందక్క శూన్యముగ నుండును. 6. వాకిలినడవ. 7. క్రిందిగోడలు—కాల్చిన యిటుక. 8. గడప-వీధిపయినే (గుమ్మములు లేవు.) 9. తోర్లించిన మట్టిపాత్రగోరీ. 10. బల్లచసార. 11. కట్టె దూలములపై కట్టిన కాల్చిన యిటుకల మెట్లు. 12. పూలకుండ్లు పెట్టుకొను తిన్నెలు. 13. పందువా. 14. మణుగుదొడ్డి. 15. ఇరుకు వీథులు ఎండవేడిమిని,దుమ్మును అంతగా రానీయవు. 16. ఖరువువేయు అరుగు. 17. శిశువులసమాధులు. 18. గాలివెలుతురులకై పెరడు. 19. స్వాగతగృహము. 20. దేవతాపీఠము. 21. వేదిక. 22. వంటిల్లు. 23. దేవాయతనము క్రింది విలువంపుగోరీ. 24. కాళ్లు కడుగుకొంటకు కడవయు, పందువాయు. 25. పొరుగిండ్లకు పోవు దారులు. 26. ఇంటివసారాలు—జంతువులసంపులును, రోతలను బోవ పనువగు దారులు.

(స్ఫియర్)

చెదపురుగుల గుట్టు

[చెదపురుగులు తరుగులేని పాటుచే తమ కుక్కగొడుగుతోటల సాగుచేసుకొను వద్భుతవిధానముల కిది సరియైన శాస్త్రసమ్మతమగు చిత్రము. ఈపురుగుల క్రమయుక్తమైన పరిశ్రమ వరుస మూడేండ్ల యనావృష్టినిసైతము వృథా పటిచివేయును.]

ఒక్క గడ్డిపోచయైన బ్రతుకజాలనంతగ భూమి నార్చివేయు వరుస మూడేండ్ల యనావృష్టి సంభవించినను, చెదపురుగులు తమ పుట్టల కెప్పటివలె నీటి సరఫరా జరుగుచుండునట్లు చేసికొను నద్భుతచర్య చివరకు దైవికముగా విస్మృతమయ్యెను. (ఇది 'లివింగ్ స్టను' వాడు మొదలు శాస్త్రజ్ఞులనెల్లర కలతపెట్టిన సమస్య. 'లివింగ్ స్టను' గారు తుదకీపురుగులు వాయుగతమైన ఉదజని ప్రాణవాయువుల కూడికచేసి నీరు తయారుచేయు నని సిద్ధాంతము చేసికొనిరి.)

ఒకపాలమున (ప్లేట్ ఫాస్ట్రీక్, నెం. 1368) ప్రిటోరియా దేశీయుండు ఉత్సాహముగల ప్రకృతిశాస్త్రవేత్త యూజీన్ ఎస్. మేరే అనునాయన, 65 అడుగుల లోతునకు జలపరీక్షకయంత్రము చొన్పినను లేమ తగులని రొంకతావున నింకను లోతుగ నొకబావియందు చెదపురుగులకు నీరు సరఫరాచేయు బోదె నొకదానిని కనిపట్టెను. చెదపురుగులు భూమ్యాకర్షణశక్తిరేఖలకు (Lines of Terrestrial Magnetism) అనుభవపాత్రములగుట(susceptible)సువిదితమే: ఇది వీని యద్భుతచరిత్రమున నింకొక యద్భుతము. ఇందువలన, తూర్పు పడమరలకు తరుచుగ పాయలు జటిలముగ చీలిపోవుచున్నను, ఉత్తరదక్షిణప్రస్తారము విడకపోవుటచే బోదె త్రవ్విన బిలము పొడుగునను వెలసెను: అదియే ఎడమ ప్రక్క బొమ్మలో సరియగు సంబంధసామ్యముతో చిత్రితమైనది. అది దిగువ నింకను తెలియనంత లోతునకు బోయెను. వెలుతురు కిట్టని ఆచెదపురుగులు తమబాటను పరీక్షార్థమై విడగొట్టబడినతావుల నెల్ల కప్పుకొనుటకై రాత్రి అఖండముగ పాటుపడెను. కుడిప్రక్క విపుల చిత్రముల గావబడురీతిని, తమ ముఖ్యాహారము (కుక్కగొడుగులు) అవి తమపుట్టలలో ఆనుపూర్వికగా పెంచుకొనును. ఎడతెగని నీటిగొట్టముల దొంతరలు దానిని రాత్రిందివములు తడుపుచునే యుండును.

1. పుట్ట.
2. చెదపురుగుల నీటిబోదె - వంకరలు తూర్పు పడమరలకేకాని యొన్నడును ఉత్తరదక్షిణముల కుండవు.
3. నూతి ఉత్తరపుగోడ.
4. తడిమన్ను తగులకయే తొలచుట నిలిపివేసిన తావు.
5. బోదె క్రిందికి నీటికడకు విస్తరించును.
6. జలకోశము-తెలియనిలోతు.
7. చెదపురుగు గుంపులు తోటలకు నీరుపెట్టుట, దిగువ మళ్లకై విత్తుల దీసికొనిపోవుట.
8. లెక్కలేనన్ని పీచుతో నిర్మించిన చిన్నగదులు.
9. తోటమళ్ల పెంచుటకై అతిసూక్ష్మములగు గ్రుడ్లతోను, నీటితోను ఎక్కుచున్న చెదపురుగులు.

10. బోద—8 అంగుళముల వెడల్పు.

11. పాటుపడు చెదపురుగు.

12. విత్తనములు వృద్ధిచేయుటకై పెట్టుకొన్న స్పంజులవంటి పీచు తెట్టు.

13. నీటికై దిగుచున్న చెదపురుగులు.

14. రెక్కలచెదపురుగు— దండులకుమాత్రమే వినియోగపడును.

X. X. కుక్కగొడుగుల తోటలు.

Y. Y. తిరిగి తోట పెరుగుటకై నీటిదరి కుక్కగొడుగు విత్తనముల మళ్లు.

Z. రాణికై దుగది—నీటియావిరితో నింపియుండును. (స్మియర్)

కీ. శే. చింతామణిఘోషు



ఈతడు పదుమూడవయేట అలహాబాదునకు వచ్చి 'పయొనీరు' ఆఫీసులో పదిరూపాయలు జీతముపై నొక గుమస్తాగా ప్రవేశించెను. కొంతకాల మందుండి తర్వాత రైల్వేమెయిలు సర్వీసులో ప్రవేశించెను. దానిని వదలి పదపడి అలహాబాదున ప్రభుత్వావాశాపర్ణగ్రహణకార్యాలయమున ౬౧ రూపాయలజీతమున ప్రవేశించెను. అందు నూరురూపాయలు వేతనము పుచ్చుకొనుచున్నకాలమున విశ్రాంతివేతనమును పుచ్చుకొనెను. అప్పటి కతడట్టె వయసుమీరినవాడు కాడు. అంతట నతడు ముద్రాపకుడుగను, ప్రకాశకుడుగను వ్యాపారమును ప్రారంభించెను. అతడు పుస్తకముల ముద్రణమునందు అందమునే ఎక్కువగ చూచుకొనుచుండెను; సొమ్ము వ్యయమగునని తలచువాడు కాడు. పెక్కురకముల అచ్చుముక్కలను లెక్కకు మిక్కిలిగ తెచ్చించి తెప్పించి యుపయోగించువాడు. హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు, బెంగాలి పుస్తకముల నీతడు చాల సుందరముగ ముద్రించువాడు. ఈతని ముద్రణాలయమునకు 'ఇండియన్ ప్రెస్' అని పేరు. ఇందు ముద్రితమగు న గ్రంథములవలె ఇతరముద్రాలయములు ముద్రింప నెంతయు విఱ్ఱవీగుచుండెడివి. చింతామణిగారికి పుస్తకముల నమ్మి డబ్బు గడింపవలెనన్న కోరిక లేదు. కావున నాతడు గొప్ప గ్రంథకర్తలు రచించిన గ్రంథములను, ఇతర విద్యాశాలాపాఠ్యగ్రంథములను మాత్రమే ముద్రించువాడు. ఈతడు హిందీవాఙ్మయాభివృద్ధిపట్ల కావించిన సేవ అపారమయినది. సచిత్రముగ తులసీరామాయణమును, మహాభారతమునకు హిందీ అనువాదమును, ఇంకను పెక్కు ఇతరహిందీగ్రంథములను ఇతడు ప్రకటించినాడు. ఉత్తమమగు 'సరస్వతి' యనుమాసపత్రిక నొకదానిని ప్రారంభించి ప్రకటించుచున్నారు. ఇటీవల హిందీశబ్దార్థకోశము మొదలయిన నాగరీప్రచారిణీసభ ప్రచురణములను అందముగా ప్రచురించిరి. ఉర్దూవాఙ్మయాభివృద్ధికొఱకును ఇంత పాటుపడిరి. వీరు బాబు జ్ఞానేంద్ర మోహనదాసుగారి అనుత్తమమయిన బెంగాలీనిఘంటువును ముద్రించి ప్రకటించినందుకు బెంగాలీవారు వీరియెడ కృతజ్ఞులై యుండవలెను. ఇపుడు అంతరించిన 'ఇండియన్ యూనియను', 'ఇండియన్ పీపిల్' అను రెండుపత్రికలను ఇతడే ప్రకటించుచుండెను. వీరి ముద్రాలయమునకు కాశీ, ఆగ్రా, పాట్నా, కలకత్తా, నాగపూరులయందు శాఖలు కలవు.

మాడరన్‌రివ్యూపత్రికా సంపాదకులదియే యగు 'ప్రవాసి' అను బెంగాలీమాసపత్రిక తొలుత ఈయన ముద్రాలయమునందే ముద్రింపబడుచుండెడిది. అచ్చు చాల సుందరముగా నుండెడిది. మాడరన్ రివ్యూపత్రికనుకూడ చింతామణిగారే ప్రతిమాసమునను పంచికాగితములమీద అందముగా నియమితకాలమున ముద్రించి యిచ్చుచుండెడివాడు. దానికయి రమారమి ఒకసంవత్సరకాలము వరకు సొమ్ము నిమ్మని యడిగినవాడు కాడు. మొదటి సొమ్ములేని మాడరన్‌రివ్యూపత్రిక యీయనదారుని ఇట్టి సహాయమే లేకపోయినయెడల వెలువడకయే యుండెడిది. కాక వెలువడినను చిన్నతనాడే చితికిపోయి యుండెడిది.

ఈవ్యాపారమున నీతడు పెక్కులక్షలు సొమ్మును గడించెను. ఈసొమ్ము నీతడు దీనుల మొఱ్ఱను పెడచెవిని బెట్టి మూటకట్టలేదు. ఈతడు దరిద్రులకు వికలాంగులకొరకు వైద్యశాలను స్థాపించెను. దాని ననుసరించియే యొక ప్రత్యేకభవనమున శస్త్రచికిత్సకు తగిన సదుపాయములను గలిగించెను. పెక్కు విద్యాలయములకు, బీద విద్యార్థులకు పుష్కలముగా సొమ్మునిచ్చి సహాయము చేయుచుండెడివాడు. "భారతీయ వితంతుస్త్రీల దుర్గతికొఱకయి ఎంతయు కుందె దానిని తొలగించుటకయి కొల్లలుగా ధనమును వ్యయించె"నని ఈతనినుగూర్చి 'పయొనీరు'పత్రిక వ్రాసినది. ఈపౌరశ్రేష్ఠుడు ఇటీవలనే తన డెబ్బదివాల్గవయేట కీర్తిశేషు డగుటచే అలహాబాదునకు గొప్పలోటు కలిగినది. స్వప్రయత్నముచే నభివృద్ధిగాంచినవా డన్న మాట యీతనికే వాచ్యముగా సరిపోయినది.

ఈ ఘోషుగారి యీచరిత్రలేశ మాంధ్రుల వికాసాభివృద్ధుల కుపకరించు నను నాశ గలదు.

[మాడరన్ రివ్యూ-సెప్టెంబరు]

రావుసాహెబు సుబ్బయ్యనాయడుగారు



"శ్రీనాయడుగారిపుడు బ్రిటిషు మలయాద్వీపములకు భారతప్రభుత్వప్రతినిధిగా నున్నారు. ఆరాష్ట్రములయందు రబ్బరుతోటలలో పనిచేయు కూలివాండ్రకు కూలి ఒకేనియమముచొప్పున నిచ్చునట్లు చేయుటకు చాలా పాటుపడుచున్నారు. నిక్కముగా భారతీయు లారాష్ట్రములవారి అభివృద్ధికి,సంపదకు ఎంతయో కష్టించినవారు. తమ కష్టమునకు తగినకూలిని పొందుటకు వారికిగల హక్కులను రబ్బరుతోటల యజమానులు కాదని త్రోసిపుచ్చుట కేవల మన్యాయ్యము. నాయడుగారు తమ ఉద్యోగమును స్వీకరించినపిదప కూలీలవిషయమున తోటలయజమానులతో చాల పోరాడిరి. త్వరలో వీరి పరిశ్రమకు ఫలము కార్యరూపమును దాల్చనున్నది. ఇంతేకాక, వీరు కూలీలలో పరపతిసంఘములను స్థాపించినారు. అవి చదరముగా నడుచుచున్నవి. మఱియు మలయాను కూలీలచట్టమున(Malayan Labour Code) ముఖ్యములయిన మార్పులను గావించిరన్న గౌరవమునకు వీరు పాత్రులయినారు.

సుబ్బయ్యనాయడుగారు చెన్నపురి విశ్వవిద్యాలయమున పట్టభద్రులయి, చెన్నపురరాష్ట్రీయ ప్రభుత్వమున చిరకాలమున నుద్యోగమున నుండిరి. పదపడి

మదరాసు సెక్రెటేరియటునందు స్థానిక స్వపరిపాలన శాఖయందు సహాయకార్యదర్శిగ నుండి పిదప మలయ రాష్ట్రముల ప్రతినిధిగా నియమింపబడిరి."

ఇట్లని ఒక యెన్నికగల విలేఖకుడు తెలిపెనని మాడరన్ రివ్యూపత్రిక వ్రాసినది. విదేశములయందు యిడుమల గుడుచుచున్న సోదర భారతీయులకు సౌకర్యములను గలిగించుటకై భారతీయ ప్రముఖులలో నింకను పలువురు పలు తెరగుల ప్రవర్తింపవలసియున్నారు.

'భారతమాత వాస్తవస్థితి'

[అమెరికా సంయుక్తరాష్ట్రములందు ప్రొఫెసర్ ఎర్నెస్ట్ వుడ్ గారి ఉపన్యాసములు.]

భారతదేశమునుగూర్చి సంయుక్తరాష్ట్రములందుపన్యసించిన ఆంగ్లేయులలో నిక్కల్ల నెక్కువ భారతదేశసానుభూతియు, భారతదేశ పరిజ్ఞానమును గల ప్రొ. ఎర్నెస్ట్‌వుడ్ గారీవడుమ నచట సుమారు రెండువందల యుపన్యాసము లొసగిరి. మిస్ మేయో గ్రంథము మిగుల వ్యాప్తి నొందియుండుటచే దానివలన జనులకు గల్గు దురభిప్రాయముల తొలగించి భారతదేశము వాస్తవస్థితి నెఱుగ జెప్పుటకుగాను వారు వత్సరములకొలది ఈదేశమున తమకుగల నివాసపర్యటనాధ్యయనాదుల వలని యథార్థపరిజ్ఞానముతోడను, అనుభవముతోడను, ఎంతటివారైన వంతమందికడ తమ భావముల దెలిబుచ్చుట తమవిధి యని భావించిరి. వారి యుపన్యాసములు భారతజీవనమును మతసంఘపరిశ్రమాది సమస్తవైఖరులను వివరించెను. నిష్కపటముగను, మిక్కిలి బుద్ధిశాలితతోను భారతరాజకీయస్థితినిగూర్చి వారు కావించిన నిరూపణమువలన శ్రోతృజనసహస్రములు భారతదేశమన్నను, ఇచటి ప్రజలన్నను ఎక్కువ సానుభూతితోడను, విశాలహృదయముతోడను భావింపదొడగిరి. ఇక్కడి జనుల పద్ధతులను, కార్యములను చూపు వినోదమైన 'స్లైడు' చిత్రములతోడుగ, వీరి యుపన్యాసములు సాంగోపాంగముగ భారతదేశ నిజస్థితిని ప్రకటించుట యందు జయావహము లైనవి.

ఈయుపన్యాసముల యనంతరము కొందరు భారతీయులును, అమెరికనులును వింద్రొసగినపుడు ప్రొఫెసరుగారు భారతదేశమును గూర్చియు, ఇచటివర్తమాన సమస్యలగూర్చియు, భూతభవిష్యములగూర్చియు జాలిగొలుపునట్లు మాటాడిరి. ఇతిహాసము నెఱుగుటను సమకాలికముగ ఏదేశముతోగాని, ఏనాగరికతతోగాని పోల్చిచూచినను, భారతదేశము గొప్పదిగ నుండినవిధము వారు నిరూపించిరి. మానసికనైతిక శాస్త్రముల యందును, ఆత్మికౌన్నత్యమునను మానవపరిజ్ఞానమువిషయమునవెల్ల నీగొప్పతన మిందుకన్పడునని వారునుడివిరి.



ప్రొ. ఎర్నెస్ట్‌వుడ్   ఎర్నెస్ట్‌వుడ్ పతి

పురాతనగ్రామములందలి కులనియమములయు, దేశీయపరిశ్రమలయు వినాశమును, ఋణదాతలకు భూములు తనఖాపెట్టుటయు భారతదేశపు నేటి ఆర్థికపతనమునకు ముఖ్యకారణములుగ వారు పేర్కొనిరి. వారిట్లు చెప్పిరి—

"వెనుకటికాలమున తనకు ఆత్మికజయమును, అభ్యున్నతియు సర్వము చేకూర్చిన మనోవిన్యాస మింకను భారతదేశమున గలదు. ఆర్థికపరిస్థితు లనుకూలపడుటతోడనే యిది నవోన్మేషముతో విజృంభింప సిద్ధముగ నున్నదనుట ధ్రువము."

"కవడా, ఆస్ట్రేలియా మున్నగు బ్రిటిషుసామ్రాజ్యమునందలి ఇతరభాగము లవలంబించిన మార్గమునే భారతదేశముగూడ ఆధునిక పద్ధతుల నభివృద్ధి గాంచవలెను. ముందో వెనుకనో, ఇంగ్లాండు భారతదేశమునకు ఆంతరిక స్వపరిపాలనము నిచ్చి, దాని నితరస్వపరిపాలక రాష్ట్రములతో సమానమగు స్థానమున నిలుపక తప్పదు. ముప్పువచ్చు వేచియుండుటకంటె నిప్పుడే ఆపని చేయుట మేలు: ఉన్నది ఉన్నపాళమున నుంచినచో ఆముప్పు రాక తప్పదు. పరిస్థితులు విషమముగ నున్నవి. భారతీయులు జాతిబంధముచే ఐరోపీయుల కభిన్నులయ్యు, తమ సమీపపు దేశముల వారి ఆయుధముల దెబ్బ బలాత్కృతు లగుచున్నారు. మనము లక్ష్యపెట్టనిచో యొకోహామా మొదలు కాన్స్టాంటినోపిల్ వఱకును ఒకయిరోపుఱముగూడ గావచ్చును. విశ్వఆసియా సమవాయము నెదుర్కొనవలసినవార మగుదుము. క్రొత్తటర్కీ ఈజిప్టునకు ప్రశంసాభాజనమగు వస్తువగుటకు సందియము లేదు. జపాను బ్రిటనుతో మైత్రిమాత్రములు తెంపుకొన్నది. సింగపూరు నౌకాశ్రయ నిర్మాణసందర్భమున బ్రిటను కొంత ఆందోళనకరములగు ప్రవర్తనలు సాగించెను. చైనాజాతీయవాదులు పెకినుకడనున్నారు. స్వరాజ్యము నాలసించిన కొలది భారతదేశమున నావేశము హెచ్చుచున్నది. ఐర్లాండునందు పెంపొందిన భావావేశమువంటి భావావేశము పెరుగవచ్చును. భారతదేశము తన తూర్పుపడమరల యిరుగువారితో గలసి తుదకు ఇతిహాసమున నెల్ల మహత్తమమగు సమవాయమునకు మస్తిష్కముగ నేర్పడవచ్చును. అప్పుడిక ఐరోపీయుడు ఆసియాఖండమునుండి ప్రయాణము కట్టవలసిన దినము దాపురించును. మనము భారతదేశము నింతదూరము పోనీవలదు."

ప్రొ. వుడ్డుగారి కల్లవిధముల తోడ్పడు వారి సతీమణి భారతీయనారీమణులగూర్చి ముచ్చటగు విషయము లనేకములు ముచ్చటించియుండెను. కొంద అమెరికాస్త్రీల కుపన్యసించుచు నామె యిట్లు చెప్పెను—

"భారతీయస్త్రీలనుండి నేనొక సందేశము తే నిచ్ఛగించితిని. వారివిషయమున నెన్నియో దురభిప్రాయములు ప్రబలియున్నవి; అసత్యవచనము లనేకములు వారినిగూర్చి వ్యాపించినవి. వారు తెరలో నున్నారనియు, వారివ్యాపకములన్నియు గృహసంబంధమైనవే యనియు వాడుక. తక్కినచోట్లవలెనే భారతదేశమందును స్త్రీలు బహిఃప్రపంచ కార్యరంగములోని కధికాధికముగ వచ్చుచున్నారు. ఈనడుమ పూనాయందొక అఖిలభారతమహిళా మహాసభ జరిగినది. అందు దేశమంతటనుండియు స్త్రీ లనేకులు వచ్చి, స్త్రీవిద్యాశిశు వివాహములగూర్చి అతిముఖ్యములగు తీర్మానము లనేకములు గావించియున్నారు.

"భారతీయ స్త్రీపురుషుల ప్రతినిధి సంఘములు ౧౯౨౬, ౧౯౨౭, ౧౯౨౮ సం. లలో మూడుసారులు వివాహవయస్సును హెచ్చింపవలెనని కోరిరి; ప్రతిపర్యాయమును ప్రభుత్వమువా రా దరఖాస్తును త్రోసిపుచ్చిరి.

"భారతస్త్రీ కంఠస్వర మెల్లెడల గల్బులయందును, సమాజములయందును వినవచ్చెను; అనేక సభలలో నామె అసంఖ్యాకముగ సంచరించెను; ఇంట భారతమాత పుత్రులయు, పుత్రికలయు శీలమును పోతపోయుటయం దామె సిద్ధహస్త. తన పిల్లల కామె చెప్పెడు కథల ప్రోవ్వులనునే చాలవఱకు భారతదేశపు నైతిక ధార్మికాశయము ఉజ్జీవితమయియున్నది. ప్రాచ్యభూమి కప్పుడును కథలన్న నిష్టమేకదా! ఈకథలలో గొన్నిటి నైరోపా ప్రాతవేడుకలు తప్పకుండ నవలంబించుకొనెను.

"దేవుడైనను తన అర్థాంగి—'శక్తి'—లేక శక్తిహీనుడని పరిగణించు పూర్వకాలమునవలెనే, స్త్రీలు తమ పురుషుల యంత నిలుచుచున్నారు."

ఆవిందుసభ కధ్యక్షత వహించిన డాక్టరు సండర్లాండుగారు వుడ్డు దంపతులను పొగడుచు, ప్రొ. వుడ్డుగారివంటివా రింకను చాలమంది ఆంగ్లేయు లున్నచో భారతదేశపు రాజకీయభవిష్యము రంజితమై వెలయుట తథ్యమని నుడివిరి.

వాఙ్మయముల పరిచయముతో కల్లవ్రాతల వ్రాసిన పేరుమోకన్య గ్రంథమునకు తగిన ప్రత్యుత్తరములును, ఖండనములును, పదుమూడు సంవత్సరముల నివాసాధ్యయనముల పరిపక్వపరిచయముగల ప్రో. వృద్ధుగారి రాబోవు గ్రంథమున వెలయగలవు. అది యిప్పుడచ్చగుచున్నది. అచ్చట వసించు రామలాల్ బి. బాజపేయి గారు మున్నగు భారతీయులు తమ ప్రశంసలను ప్రొఫెసరుగారి కంపించిరి.

— —

రాజకీయ లోకమున ఒక వనితామణి



లింకన్ ఫాన్ష హామిల్టనుకన్య – ఇంగ్లాండు తరఫున పార్లమెంటు కన్సర్వేటివ్ సభ్యురాలు; సర్ జార్జి హామిల్టనుగారి పౌత్రురు.

పండిత మోతీలాలు నెహ్రూగారు



రాబోవు అఖిలభారత మహాజనసభకు అధ్యక్షులుగా ఎన్నుకొనబడిరి.

దురదృష్టము (అనువాదము)

కర్లపాలెం కుటుంబశాస్త్రి గారు

చెట్టుగా నేల నే నిల పుట్టనైతి
ఎవ్వరికినైన నే నీడ నిచ్చియుందు
అర్పణము చేసియుందు తీయనిఫలాలు
తాను తనపిల్లలును తల దాచుకొనగ
ఏదియో పిట్ట నన్నాశ్రయించియుండు
దాని కాపాడ ననుకూలతయును నాకు
కలిగియుండెడి దట్టి భాగ్యంబె యున్న
సార్థకత కెందెడిది నాదుజన్మ యపుడు.

భారతీయ మహిళామండలి



బాలకృష్ణమీనను సతి

కొచిను సంస్థానమున గౌరవ న్యాయాధికారిణి (Honorary Magistrate) గా నియమింపబడిన మొదటి స్త్రీ ఈమెయే.



కావ్యతీర్థ

శ్రీమతి రత్నకుమారి దేవి

జబ్బల్ పూరు వాస్తవ్యులగు గౌ. సేఠ్ గోవిందదాసుగారి కొమార్తె. కలకత్తా సంస్కృత పరిషత్తు నడిపు సంస్కృత వాఙ్మయపరీక్షలలో నుత్తమ బిరుదపరీక్షయం దుత్తీర్ణ రాలైనది. ఈ 'కావ్యతీర్థ' బిరుదపరీక్షయందు ఉత్తీర్ణ యగుటకు ఈమెయే మొదటి వార్యావర్త కన్య. ఈమె వయస్సు పదునైదు సంవత్సరములు మాత్రమే.



శారదాబాయి నాయుడు కన్య

పూనా సేవాసదనసంఘమున శిక్షణ పూర్తిచేసికొని, లండను బెడ్ ఫర్డు కళాశాలలో సార్వజనిక స్వాస్థ్యము (Public Health), ధాత్రీ విద్యను (Nursing) వీనియందున్నతవిద్య గడించుటకై ఈమె ఇంగ్లాండుదేశ మేగినది.



వి. కమలాబాయి కన్య

దక్షిణ ఇండియాలో సంక్షిప్తలేఖన ము (Short-hand) నం దారితేరిన ప్రథమ భారతీయ కుమారీమణి. కాశ్మీరు సంస్థానమునం దీమెకు ఉద్యోగ మొసంగబడెను.



ఇ. రామారావుకన్య, బి. ఎ. (ఆనర్సు)

సుప్రసిద్ధ భారతీయ సినిమాప్రదర్శకురాలు. 'మీరాబాయి' అను ఫిల్ము నందు 'ఎంతో' ముఖ్యపాత్రను ధరించినది. కృష్ణాజిల్లా జడ్జీగా నుండిన బి. రామారావుగారి కుమార్తె. ఈమె మదరాసు విశ్వవిద్యాలయమునందు బి.ఎ (ఆనర్సు)నం దుత్తీర్ణురాలయ్యెను.



శారదాబాయికన్య, బి. ఎ.

మహారాష్ట్రీసంఘమున ఈ వత్సరము బి. ఎ. పట్టము పొందిన స్త్రీ యీమె యొకర్తయే.



గ్రంథములు

అభినవ భారతచరిత్ర

ఈ పుస్తకము హిందీభాషలోని "భారతీయ విద్రోహ" అను గ్రంథము ననుసరించి వ్రాయబడినది. గుంటూరునందలి వాఙ్మయమండలి పక్షమున నిది వెలువడినది. వాఙ్మయమండలి సంపాదకులగు తూములూరి శివరామయ్యగారే యాంధ్రానువాదకులు. ఇది క్రౌను సైజున 160 పుటలు గలిగియున్నది. వెల చందాదారులకు రు 0-12-0; ఇతరులకు రు 1-0-0.

ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు దీనికి పీఠిక వ్రాసినారు.

1885-న సంవత్సరమున భారతజాతీయ మహాసభ స్థాపింపబడిన నాటినుండియు గొప్ప రాజకీయసంచలనము జనించి పలుదారుల ద్రొక్కి దేశము నలుగడల గ్రమ్మివైచినది. ఒకవిధమగు నసంతృప్తి నాటుకొని పోయినది. ఈసంచలనము, ఈయసంతృప్తి నానాటికి మరింతమరింత తీవ్రముగ విజృంభించుచున్నవే కాని, యణగిపోవుట లేదు. తుదకు నేటికి ఒకవిధముగ నీరాజకీయ మహోద్యమము మిగిలిన యుద్యమముల నన్నిటిని—సంఘసంస్కరణము, విద్యాభివృద్ధి మున్నగు సమస్యలకు సంబంధించిన యుద్యమములను—గబళించివైచి తన యస్తిత్వము మాత్రమే నిలుపుకొనుచున్నది. ఇట్లేల కావలయుననునది గొప్ప సమస్య. మన రాజకీయాందోళనమున కీ సర్వతోముఖప్రాముఖ్యము లభింపజేసిన తోసివేయరాని ప్రబలకారణము లనేకములు.

అందుచే భారతీయులకెల్లరకు—నందు ముఖ్యముగ రాజకీయోద్యమమున బనిచేయువారలకు—ఈమహాప్రవాహ మేయేకాలముల నేయేదారుల బట్టుచున్నది, ఎట్టి యాఘాతముల నెదుర్కొనుచున్నది, అనువంకలను దెలిసికొని తమ కార్యవిధానము జక్కబరచుకొనుచుండ వలసిన యావశ్యకత కలదు.

ఇట్టి యీ పెద్దచెట్టునకు ఈ 'విప్లవోద్యమము' ఒక పెద్దకొమ్మ. హింసామూలకములగు ప్రయత్నములచే నీతెల్లదొరతనము గూలద్రోయవలయునను వాంఛయె యాధారముగా గల యుద్యమమే యీ విప్లవోద్యమము. పీఠికలో పంతులుగారన్నట్లు "ఈ భరతఖండమున నీయుద్యమము శాశ్వతముగ స్థిరపడినది." మరియు "ప్రభుత్వమువారి దౌర్జన్యపద్ధతులే దీనికి మూలకారణము."

మనదేశమున గల యీ విప్లవోద్యమమును సంక్షిప్తముగ బాఠకుల కెఱుకపఱచు చరిత్రగ్రంథ మీ "అభినవ భారతచరిత్ర". మొదటినుండి తుదివఱకు నిందు విషయోద్ఘాటనమే కానవచ్చును. మూలలేఖకులయొక్క కాని, అనువాదకులయొక్క కాని స్వీయాభిప్రాయములు, పాక్షిక విమర్శనములు నిందును గనపట్టవు. "ఈ గ్రంథమును బ్రకటించుటలో విప్లవోద్యమమును తిట్టుట కాని, దీవించుట కాని మాయుద్దేశము కాదు. జరిగిన చరిత్రను జరిగినటుల పాఠకుల సముఖమున నుం

చితిమి." అని యనువాదకు లుపోద్ఘాతమున వ్రాసినారు. ఈపద్ధతి గ్రంథముయొక్క యుపయోగమును పెరపజచినది. అనువాదకు లవలంబించిన సులభశైలి గ్రంథప్రయోజనమును రెట్టించినది. (ప్ర. రం.)

వివిధకుసుమావళి (ప్రథమ గుచ్ఛము)

క్రౌనుసైజున 106 పుటలు గలిగియున్న దీపుస్తకము. రచయిత కవికొండల వెంకటరావు గారు, బి. ఏ., బి. యల్. దీనివెల విద్యార్థులకు రు 0-8-0; ఇతరులకు రు 0-12-0. కావలసినవారు ప్రకాశకులైన గాడిచర్ల రామమూర్తిగారి షేర, రాజమహేంద్రవరమునకు వ్రాయవలయును.

ఇందు గ్రంథకర్తగారు ఇరువదియైదు శీర్షికల క్రింద తమ మనసు నాకర్షించిన యాయా విషయములను గూర్చిన తమ యభిప్రాయములను పద్యములలో వెలువరిచినారు.

ఆదినుండి తుదివరకు నేకధారగ బ్రవహించుచున్న వీరిశైలి చదువరుల మనసు నాకర్షింపజాలదు. పద్యరచన పెక్కుచోటుల చిరపరిచితములై శిథిలములైయున్న ప్రాతదారులనే పట్టినది. పదములకూర్పులోను, భావచిత్రణమునను, పాఠకుల నానందోత్సాహముల బంధించు మధురత,గభీరత యింతంతగ గానరావు.(ప్ర. రం.)

Jasmines (ఆంగ్ల పద్యములు)

గ్రంథకర్త: పోమిన వెంకయ్యగారు, కాకినాడ, (For Private Circulation.) ఇందు అచ్చటచ్చట మెఱపు మెఱసినటుల లోకోత్తరభావము విలసిల్లినను, కవితాధోరణి ఉన్నతముగ లేదు. భావమందును లాలిత్య గాంభీర్యములుగాని, నుడికారముగాని తప్పును. ఇంకను అవయవసౌష్ఠవ మేర్పడుమఱకు వీరి కవితాకన్య యింట పోషణ గాంచిన, ముందుముందాకర్షక సౌందర్యము బడయవచ్చును. కవి తనయుత్సాహమును తగిన రీతి శిక్షితముగ నడపుకొన యత్నించుగాక.

కలికాలపు కథలు (మొదటిభాగము)

గ్రంథకర్త: కలగ సత్యనారాయణ గారు, వీరభద్రపురము, రాజమండ్రి. క్రౌనుసైజు ౧౫౭ పుటలు, వెల ౧౨ అణాలు.

శ్రీ కన్యకాపరమేశ్వరీ శతకము

గ్రంథకర్త: దోమా వేంకటస్వామి గుప్తగారు, పండితుడు, క్రిస్టియన్ కాలేజి, మద్రాసు. వలయువారు గ్రంథకర్తకు అణాచీటి పంపవలెను.

శ్రీ సత్యాసత్య పురుషత్వము

శ్రీ వివేకానందస్వామి 'ది రియల్ అండ్ అప్పెరెంట్ మ్యాన్' అను ఉపన్యాసమునకు జ. వేంకటేశ్వరరావుగారి ఆంధ్రానువాదము. శ్రీ వేంకటేశ్వర గ్రంథమాల 3-వ కుసుమము — గార్ల, నైజాం. వెల తెలియదు.

౧. శ్రీ వేణుగోపాల కళామాలికా
౨. శ్రీ రామలింగేశ్వర రుద్రస్తుతిః

ఈ రెండు సంస్కృత గ్రంథములకును కర్త: గో. కృష్ణమాచార్యులు గారు, బెజవాడ, వాణీముద్రాక్షరశాలయందు ముద్రితము.

వేశ్యాచర్యాదర్శన నక్షత్రమాలిక

కీ. శే. పరవస్తు జియ్యరు సూరిప్రణీతము. బెంగుళూరు, విచారదర్పణ ముద్రాక్షరశాలయందు ముద్రితము. వెల ౦-౧-౬.

శ్రీ విద్యారత్న సూత్రాణి

'శ్రీ శంకరారణ్య శ్రీ వాసుదేవ పరబ్రహ్మపండితాభ్యాం విరచిత వ్యాఖ్యాద్వయ సంయుతాని' (సంస్కృతము). ప్రకాశకులు: క. మార్కండేయశర్మ గారు, స్వధర్మప్రకాశినీ సంపాదకులు, పూనమల్లి హైరోడ్, కీల్పాకుపోస్టు, మదరాసు.



ఆంధ్రపత్రికా కార్యాలయమునందలి

శ్రీ గణాధిపతి

సూర్యోదయము

కలిదిండి నరసింహరాజుగారు

ఉదయ భూధరముపైన
నదయుఁడై భానుమూర్తి
అడుగో ఆసీనుఁడైనాఁడు.

కడుదట్టమైన యంధ
కారము పరియ లగుచు,
వడివడి పడమటికి నదె
పరువెత్తుచున్నది!

నిదుర విదళించి, సుబల
నిర్నిద్రమానసముతో
లేచి, మాభరతమాత
చూచుచున్నది దెసలు.

అమ్మా నా దేశజననీ
కొమ్మా నవకార్తికవిరా
జమ్మైన పూర్వమకుటము
వమ్మై అరిబలము తూలఁగ.

గౌతమాశోక ఋషుల
కాలమునందువలె నీవు
డఖిలభూ మండలికి నీ
వవసర మైతి వమ్మా.

చాటింపు మమ్మా నీవు
సర్వాధిపత్యమునకు
మరల నవయౌవనముతో
అరుదెంచినట్టివార్త.

జననీ నీగాఢనిద్రా
సమయమునందు మేము
ఆకొని వెక్కి వెక్కి
అడలుచుంటిమి తల్లి.

హృదయధీ దేహబలసం
ప్రదమై కడుతియ్యనైన
పాలిచ్చి జోలపాడి
లాలింపవమ్మ మమ్ము.

సాభిప్రాయ విశేషములు

నెహ్రూనివేదిక స్వార్థపరాయణులకు భయభ్రాంతులను గలుగజేసినది. భరతవర్షమునందును, గ్రేటుబ్రిటనునందును స్వార్థపరులు నిప్పులుత్రొక్కిన కోతులవలె తందనా లాడుటకు మొదలుపెట్టిరి. ఆంగ్లపత్రికల ప్రలాపములు, స్వదేశసంస్థానాధీశుల పటాటోపములు వారి సహజస్వభావమును విశదము చేసినవి. కోపావేశమునం దొకపత్రిక నొకపత్రిక మించినది. బ్రిటీషు సామ్రాజ్యతత్త్వాభిమానమునకు కంకణమును గట్టుకొనిన లండను టైమ్సుపత్రిక నెహ్రూనివేదికను నిరసించుటయందు విచిత్రము లేదు. నెహ్రూనివేదిక సకలపక్షముల యభిప్రాయములను తెలుపుట లేదట! ముఖ్యముగను మహమ్మదీయాభిప్రాయమునకు ప్రతికూలమట! సిక్కుల కిది సమ్మతము గాదట! నివేదిక హిందూ జాతీయవాదుల లక్ష్యమును మాత్రమె తెలుపుచున్నదట! స్వదేశసంస్థానములమాట తలపెట్టనే లేదట! బ్రిటానియాయను క్రొత్తపత్రిక మఱియొక వాదమును దెలుపుచున్నది. హైందవులను నిరంకుశాధికారులైన సంస్థానాధీశులవశము చేయవలయునట! దేశానర్థదాయకులైన విద్యావంతులు మాయ మగుదురట! ఆంగ్లేయ సైన్యములు కేంద్రస్థానములందు కులుకుచు గూర్చుండునట! మార్నింగుపోస్టు, డేయిలిటెలిగ్రాఫు, మాన్చెస్టరు గార్డియను చేయుచున్న యక్రమప్రచారము పరమాసహ్యముగ నున్నది. నెహ్రూనివేదికను పంజాబు వంగదేశముల మహమ్మదీయులు నిరసించిరట! సకలపక్షసమావేశములు ప్రాతవడిన విద్యావంతుల సమావేశము లట! నెహ్రూనివేదిక ప్రజాభిప్రాయమును దెలుపదట! సామ్రాజ్యశాసనసభయందు ప్రజాప్రతినిధులకు పలుకుబడి పోయినదట! సకలపక్షసమావేశము బ్రిటీషుశత్రువుల సమావేశమట! ఇట్టి అసంబద్ధములైన భావములతో బ్రిటీషుపత్రికలన్నియును చిలుకపలుకులవలెను నింపబడి ద్వేషమును వ్యాపింపజేయుచున్నవి. ఈ యున్మత్తప్రలాపములకు ప్రత్యుత్తరము నిరర్థకము.

నెహ్రూనివేదిక సకలపక్షముల సమాదరణమును పొందుచున్న విధమును దేశసమావేశములు విశదము చేయుచున్నవి. లయాల్పూరునందుగూడిన పంజాబు రాష్ట్రీయసంఘసమావేశము సకలపక్ష సమావేశము చేసిన తీర్మానముల నామోదించినది. పంజాబు ఖిలాఫతు సంఘాధ్యక్షులు అబ్దులుఖాదరుగారు సకలపక్షసమావేశము చేసిన తీర్మానమును ప్రతిపాదించిరి. సభ ఏకగ్రీవముగ తీర్మానము నామోదించినది. వంగరాష్ట్రమునందలి మహమ్మదీయులును సకలపక్ష సమావేశము చేసిన తీర్మానముల నామోదించిరి. కొందరు

మహమ్మదీయులు ప్రతిఘటించుటయందు విచిత్రము లేదు. ప్రపంచమునం దందరి యామోదమును బడయగల విషయ మేదియును నుండదు. ఏస్వార్థపరులో ప్రతిఘటించుట సహజము. మహమ్మదీయులందు చాలమంది నెహ్రూనివేదికను, సకలపక్షసమావేశ మామోదించిన తీర్మానములను హర్షించుచున్నవిధమును దేశ వ్యవహారములు విశదము చేయుచున్నవి. డాక్టరు అన్సారి, అబులు కలామ్ ఆజాదు, సర్ ఆలి ఇమాము, మొహమ్మదాబాదు మహారాజు గారులు మొదలగు మహమ్మదీయుల యభిప్రాయము మహమ్మదీయాభిప్రాయములను చెప్పక చెప్పుచున్నవి. సిక్కుల మహాసభ సకలపక్షసమావేశము చేసిన తీర్మానముల నేకగ్రీవముగను నంగీకరించినది. భారత ప్రజాభిప్రాయములను భారతీయనాయకులు తెలుపగలరు గాని 6,000 మైళ్ల దూరమునందున్న బ్రిటీషు పత్రికలు తెలుపజాలవుగదా! భిన్నపక్షములవారును, భిన్నమతములవారును కలిసి చేసిన తీర్మానములను హిందువుల తీర్మానములని యాక్షేపించుట దుర్జనత్వమునకు లక్షణముగాని వివేకమునకు లక్షణము గాదు. మహమ్మదీయులను రెచ్చగొట్టుటకై ఆంగ్లేయ పత్రికలు పన్నెడి దుస్తంత్రములు మహమ్మదీయుల నెల్లకాలమును మోసగింపజాలవు. ప్రపంచమునందు మాయోపాయములకును మితిమేరలు గలవు. భారతీయ మహమ్మదీయులును భరతవర్షమే వారికి శరణ్యమనియును, హిందువుల సహకారమే ప్రయోజనకరమనియును చిరకాలానుభవమువలన గ్రహింపగలిగిరి. మిత్రభేదతంత్ర మెల్లకాలమును ప్రయోజనకరము గాదు. ఈ సమయము నందు మహమ్మదాబాదు మహారాజు మహమ్మదీయ సోదరులకు జేసిన హితోపదేశమును వారు సావధానచిత్తులై గమనింప వలయును. సకల పక్ష సమావేశము మహమ్మదీయాశయముల కనుకూలముగాని ప్రతికూలముగాదు. సంయుక్తనియోజకవర్గమె సాంఘిక విభేదములకు పరమహంస క్రియ.

నెహ్రూ నివేదికయును, సకలపక్షసమావేశమును అధినివేశపరిపాలనమును (Dominion Status) అంగీకరించుటయందు విచిత్రము లేదు. ఇది సకలపక్షాభిప్రాయము గాని ఏకపక్షాభిప్రాయము గాదు. ప్రాతవడిన విద్యావంతులు గావుననే అధినివేశపరిపాలనమును నంగీకరించిరి. యువజనులు సంపూర్ణస్వాతంత్ర్యమును గోరుచున్న విధమును జవహారిలాలు నెహ్రూగారి యొక్కయు, వారి సహచరులయొక్కయు భావములు విశదము చేయుచున్నవి. జాతీయమహాసభ సంపూర్ణ స్వాతంత్ర్యమునే ప్రతిపాదించినది. చెన్నరాష్ట్రము నందు సంపూర్ణస్వాతంత్ర్యసమితి స్థాపింపబడినది. చీనా, పారసీకము, ఆఫ్గనిస్థానము మొదలగు రాజ్యములు సంపూర్ణస్వాతంత్ర్యము ననుభవించుచున్నవి. ప్రాతవడిన విద్యావంతుల కింకను బ్రిటీషు ప్రతిజ్ఞలమీాదను, బ్రిటీషు సంయోగముమీాదను విశ్వాసము నిలిచియున్నది. గౌరవనీయులైన శ్రీనివాసశాస్త్రిగారు బ్రిటీషు సం

బంధావసరమును ఆఫ్రికానుండి ప్రకటించుచున్నారు. పాపము, బ్రిటీషు పత్రికలకు వీరిమీదనైనను కనికరము లేకపోయినది. సకలపక్ష సమావేశము సాధ్యమైన సహకారరాజ్యాంగ విధానమును నిర్ణయించుట కేర్పడినది గాని సహకారనిరాకరణమును నిర్ణయించుట కేర్పడలేదుగదా! అధినివేశపరిపాలన నామోదించిన సకలపక్షసమావేశము బ్రిటీషుమిత్రుల సమావేశ మగునుగాని బ్రిటీషుశత్రువులసమావేశము గాజాలదు. బ్రిటీషుఇండియాను స్వదేశ సంస్థానాధీశుల వశము చేయుటకై భారతీయులెవరును అభ్యంతరపెట్టరు. ఇది భరతవర్షమునకు క్షేమకరముగ నుండగలదు. ఇటులు చేసిన బ్రిటీషు సామ్రాజ్యమున కెట్టి దుస్థితిపట్టునో బ్రిటానియాపత్రిక యూహించుకొని యుండదు. భరతవర్షములేని బ్రిటీషు సామ్రాజ్య మెంత బాగుగనుండునో తెలుపనవసరము లేదు. స్వార్థపరాయణు లెన్ని యారోపణల నైనను మతిచెడిచేయుట సహజము. నెహ్రూ ఏవేదికను విమర్శించి లోపములను తెలుపుట వివేకము. ఆక్షేపించుట, నిందించుట ప్రయోజనకరము గాదు. కాని వాని యసత్యమును వెల్లడిచేసి యథార్థస్థితిని తెలుపుట భారతీయుల ధర్మమైయున్నది.

*   *   *   *

సంస్థానాధీశుల ప్రగల్భములు

స్వదేశ సంస్థానాధీశుల స్వార్థపరత్వము బ్రిటీషు నిరంకుశాధికారుల స్వార్థపరత్వమును మించి పోయినది. భారతమాతకును వారికిని గల సంబంధమునే వారు మఱచిపోవుచున్నారు. వీరి సంబంధమంతయును బ్రిటీషు రాజ్యాధికారముతో గలదట గాని భారతప్రభుత్వముతో లేదట. భారతీయసంపదలననుభవించుచు బలియుచున్న సంస్థానాధీశులకు బ్రిటీషురాజ్యాధికారులతో మాత్రమె సంబంధ ముండుట చోద్యముగ నుండగలదు. సంస్థానాధీశులు వారి ద్రవ్యమునువలెను వారి దేశమునుగూడ నింగ్లాండు పాలుచేయుటకు వీలుండిన బాగుండియుండును. అప్పుడు సంస్థానాధీశులకోర్కెలు సఫలములై యుండును. సంస్థానములును బ్రిటీషు ఇండియాతోపాటు భారతవర్షమునందే మనవలసియున్నవి. రెండువంతుల బ్రిటీషుభాగమున కేమిగతి పట్టనున్నదో శేషించిన సంస్థానముల భాగములకును నాగతి పట్టనున్నది. సంస్థానములకును, బ్రిటీషు ఇండియాకును రాజ్యాంగబంధము దేశమునందున్న భారతప్రభుత్వముగాని దూరమునందున్న బ్రిటీషుప్రభుత్వము గాదు. ఇది ఇప్పుడు మామూలుగా నున్న మార్గము గాని క్రొత్తమార్గము గాదు. సమాన బాధ్యతలు, ప్రయోజనములు, ధర్మములు గల భరతమాతను విడిచి బ్రిటీషు రాజ్యాధికారముమీద నాధారపడుట నేల వదలి సాము చేసినటు లుండును.

సంస్థానాధీశులు వారి హక్కులను బట్లరుకమిషను సమక్షమునను స్థిరపరచుటకు విశ్వప్రయత్నములను జేయుచున్నారు. మహారాజులు, నవాబులు లండనునందు సెప్టెంబరు

30-వ తేదిని సభను జేసి వారి హక్కులను ప్రతిపాదించిరి. సర్ లీలి విల్సనుకు లక్షలరూప్యముల నిచ్చి న్యాయవాదిగ నియమించిరి. రూష్బ్రూకు విలియమ్సుగారు మొదలగు ప్రతినిధుల సంఖ్యకు లెక్కయే లేదు. నూటికి తొంబదివంతున సంస్థానాధీశుల వాదములు సరిగా నున్నటులు న్యాయవాదులు తెలుపుచున్నారట. కాశ్మీరు, బికానీరు, పాటియాలా మహారాజులు, భోపాలునవాబుగారు మొదలగు సంస్థానాధీశులు వెలిపుచ్చిన భావములు వారి సంకుచిత హృదయమును విశదము చేయుచున్నవి. పండితులును, ఆలీలును, లాలాలును, సింగులును స్వదేశసంస్థానము లందు రాజ్యముచేయవలయునని కోరుటలేదు. స్వదేశ సంస్థానములును, బ్రిటీషు ఇండియాయును భారతసౌభాగ్యమునకును, లోకకల్యాణమునకును సమానప్రతిపత్తితో కలిసి పనిచేయవలయుననియే కోరుచున్నారు. బ్రిటీషు ఇండియాకు సంస్థానములమీద బాధ్యత లేనపుడు సంస్థానములకును బ్రిటీషు ఇండియా మీద బాధ్యత యుండజాలదు. భరతవర్షమునందలి సకలభాగములును భారతప్రభుత్వముమీదనాధారపడి యుండగలవు గాని కొంతభాగమైనను విదేశప్రభుత్వముమీద నాధారపడి యుండజాలవు. పరాధీనత్వము సంస్థానములకే కళంకమును గలుగజేయుచున్నది. భారత ప్రభుత్వాధికారము సరిపడని సంస్థానాధీశులకు బ్రిటీషు రాజ్యాధికారము రుచించుట రాజ్యాధికారమునందుగల మహిమగాని, దేశాభిమానము గాని స్వాతంత్ర్యప్రియత్వముగాని కాజాలదు. ప్రజాస్వామ్య యుగమునందు రాజాధికారాభిమానము నిలువజాలదను విషయమును సంస్థానాధీశులు గ్రహించుట ధర్మము.

చీనారుష్యాసామ్రాజ్యముల యుదంత మీ విషయమును విశదము చేయుచున్నది. సంస్థానాధీశులుచేసినధర్మములు వారిదుర్వ్యయములలో సహస్రాంశమైనను నుండవు. ఒకవేళ సంస్థానాధీశులు గొప్ప ధర్మములను చేసినను సంస్థానముల నిరంకుశత్వమున కీ ధర్మములు నైవేద్యము గాజాలవు. భరతవర్ష రాజ్యాంగనిర్మాణము సాంఘాతిక నిర్మాణముగా నుండవలయునని రాజ్యాంగ పరిజ్ఞాత లంగీకరించుచున్నారు. ఆనిర్మాణ మేరీతి నుండవలయునో బ్రిటీషు భాగములును, సంస్థానములును నిర్ణయించుట వివేకముగాని నెహ్రూనివేదికను నిందించుట వివేకము గాదు. సంస్థానములు వాని స్థితిగతులకు దగినటులు సాంఘాతిక నిర్మాణమునందు స్వాతంత్ర్యము ననుభవించుట కభ్యంతరము లెవరికిని నుండజాలవు. బ్రిటీషు ఇండియా రాష్ట్రములకు గల స్వాతంత్ర్య బాధ్యతలే సంస్థానములకును నుండగలవు. కాని సంస్థానముల సంపూర్ణస్వాతంత్ర్యస్థితి యసంభవము. భరతమాత స్థానిక స్వాతంత్ర్యప్రాబల్యము వలన మహాదుఃఖవేదన ననుభవించినది. బలవత్తరమైన కేంద్రాధికారము విశాలమైన దేశమునందు శాంతిరక్షణమున కవసరమై యున్నది. ఆయధికారము బ్రిటీషుఇండియాకును, సంస్థానములకును సమానముగను వర్తింపగలదు.

నెహ్రూ నివేదిక స్థానికస్వాతంత్ర్యమును, ప్రబలమైన కేంద్రాధికారమును నిర్ణయించుచున్నది. భారత సౌభాగ్యమున కీమార్గమె శరణ్యమని చిరకాలానుభవము వ్యక్తముచేసినది. సంస్థానాధీశులు స్వార్థపరత్వమును, అధికారాభిమానమును విడిచి కృశించుచున్న మాతృదేశము నుద్ధరించుటకు భగవదనుగ్రహమును బడయుదురుగాత !

* * * *

సైమను కమిషను

సైమను కమిషను గలుగజేయుచున్న వాద ప్రతివాదములకును, భేదాభిప్రాయములకును, విచిత్ర భావనలకును నాద్యంతములు గనుపడవు. సర్ జాన్ సైమను ప్రజ్ఞావంతుడు, సుప్రసిద్ధన్యాయవాది. అయినను వారి ప్రజ్ఞ, న్యాయవాదిత్వము బ్రిటీషుప్రయోజనములను సమకూర్చుటకు వినియోగపడుచున్నటులు స్వధర్మనిర్వహణమును జేయుటకు వినియోగపడుటలేదు. లండనునగరమునందు వారు చేసిన ప్రసంగములందు భరతవర్షముపట్లను స్వధర్మనిర్వహణమును జేయునటులు వెల్లడిచేసిరి. నెహ్రూనివేదికను వారు తెప్పించినటులును, బాగున్నటులును తెలియజేసిరి. రాష్ట్రీయశాసనసభలు సహకారోపపాదనల నంగీకరించినందులకును, 500విజ్ఞాపనపత్రములు వారికి చేరినందులకును సైమనుగారానందభరితులైరి. రీడింగు ప్రభువు సైమనుగారి నభినందించుచు భారతీయులు సైమనుకమీషనుపట్లను సహకారభావమును జూపుచున్నారని యానందించిరి. కార్మికనాయకులు రామ్సే మాగ్డోనాల్డు, లేన్సుబరిగారులు సైమనుకమిషనుతో సహకారమును బోధించిరి. రామ్సేమాగ్డోనాల్డుగారు కార్మికపక్షము భారతీయులకు స్వరాజ్యమునకు స్వర్ణమార్గమును నిర్మించునని హెచ్చరించి యానందించిరి. సైమనుకమిషను నిర్మాణమును పునర్విమర్శనమును జేయవలయునని ఫెన్నెరు బ్రాక్వేగారు ప్రతిపాదించిన తీర్మానము నెగ్గకపోయినది. ఈ తీర్మానమునకు 15,000 అనుకూలాభిప్రాయములును,30,00,000 ప్రతికూలాభిప్రాయములును వచ్చినవి. బ్రిటీషుప్రజాభిప్రాయ మేపక్షమునకు జెందియున్నను బ్రిటీషు ప్రయోజనములకు వినియోగపడుచున్నదనియును, భారతీయ ప్రయోజనములకు వినియోగపడుట లేదనియును విశదమగుచున్నది.

బ్రిటీషు ప్రజాభిప్రాయము భారతీయ రాజ్యాంగములందు ప్రమేయమును గల్పించుకొనుట లేదను విషయము సర్వత్ర వెలిసియున్నది. రీడింగులు, మాగ్డోనాల్డులు, సైమనులు, వింటరుటన్నులు చెప్పిన మాటలే హిందూదేశ విషయమై బ్రిటీషు ప్రజలకు వేదవాక్యములు. బ్రిటీషు నాయకులు తాము యథార్థమును గ్రహించక, ప్రజలకు యథార్థస్థితిని తెలుపకుండుట శోచనీయము. సైమనుకమిషను విషయమై నడచుచున్న కపటనాటకము బ్రిటీషుప్రజాహృదయమును, నిరంకుశవర్గహృదయమును విశదము చేయుచున్నది.

* * * *

సైమను సహకార బహిష్కారములు

సైమనుకమిషను ఈ నెల 12 వ తేదిని బొంబయియందు దిగుచున్నది. అధికారులు మహాస్వాగతము నొసంగుటకు ప్రయత్నములను జేయుచున్నారు. ప్రజలయందును స్వార్థపరాయణులు కొందరు స్వాగతంబు నొసంగుటకు ప్రయత్నములను జేయుచున్నారు. రాష్ట్రీయ శాసనసభలు చాలవరకు సహకారనిరాకరణమును విసర్జించి సహకారము నవలంబించినవి. స్టేటుకౌన్సిలు సహకారము నామోదించి ప్రతినిధుల నెన్నుకొన్నది. రాజప్రతినిధి భారతసామ్రాజ్యశాసనసభనుండి సభ్యులను నియమించిరి. ఈ రెండుశాసనసభల యుపసంఘమునకును పార్లమెంటరి కమిటీయని నామకరణము చేసి, సర్ శంకరనునాయరుగారి నధ్యక్షులనుగ నియమించిరి. సర్ జాన్ సైమనుగారును, నిరంకుశవర్గమును, బ్రిటీషు ప్రజలును నీవ్యవహారము నంతయును సహకారమని నమ్మి చాటుచున్నారు. దేశాభిప్రాయము నెరిగినవా రెవరును నీకపటనాటకమును సహకారమని నమ్మజాలరు. స్వార్థపరులు సకలదేశములందును పరమాధర్మములకు పాలుపడుచుందురు. వారిలక్ష్యము స్వప్రయోజనము లందువలెను దేశప్రయోజనములందు లగ్నము గాదు. ముఖ్యముగా నిది భారతమాతకు పట్టిన దౌర్భాగ్యము.

రాష్ట్రీయశాసనసభలయందును, సామ్రాజ్యశాసనసభలయందును అధికార సభ్యులును, వారియనుచరులును సహకారమును బలవంతముగ నెగ్గింప గలిగినవిధమును దేశవ్యవహారములు తెలుపుచున్నవి. నిరంకుశప్రభుత్వములం దిట్టివిజయములు సహజములు. రాజాశ్రయమాత్మగౌరవమును, దేశకల్యాణమును నాశనము చేయగల విధమును ప్రపంచేతిహాసములు వేయినోళ్లను చాటుచున్నవి. కార్డినలు వుల్సి ముఖమునను షేక్స్పియరు మహాకవి లోకమునకు జేసిన హితోపదేశమును సహకారపరాయణులు మననము చేయవలసియుందురు. "నేను నాప్రభువునకు జూపినభక్తియందు సగమునైనా నా దేవునకు జూపిన నాకిట్టిదురవస్థ సంభవించి యుండదు." అని వుల్సి చేసిన విలాపము సకల జనులకును స్వధర్మనిర్వాహణమును సంస్మరింప జేయుటకు దగియున్నది. వర్తమాన సందిగ్ధ సమయమునందు భారతీయులకు వుల్సిగారి యనుభవము జ్ఞానోపదేశమును జేయుటకు దగియున్నది. స్వార్థపరత్వము, నిరంకుశాధికారావలంబనము భారతీయులను స్వధర్మ పరాఙ్ముఖులను జేసినవి. భారతీయుల లక్ష్య మాత్మావలంబనమునందు లగ్నమగుట శ్రేయస్కరముగాని పరావలంబనమునందు లగ్నమగుట శ్రేయస్కరము గాదు. భారత ప్రముఖు లీలక్ష్యమును గ్రహించియె సైమను కమిషను బహిష్కరణమును నిర్ణయించిరి. దురహంకార పరాయణులైన బ్రిటీషురాజ్యనీతిజ్ఞులకు బ్రిటీషు ప్రయోజనము లందుగల లక్ష్యము భారతప్రయోజనము లందును, ప్రపంచ ప్రయోజనములందును గలుగకున్నది.

భారతీయులును బ్రిటీషు అధికారుల మాయోపాయములందు బడుట సంతాపకరము. ప్రముఖులు మాత్రము బ్రిటీషు మాయోపాయములందు జిక్కుకొనకుండుట ఆశాజనకముగనున్నది. సామ్రాజ్యశాసనసభ గత సమావేశమునందు జూపిన సాహస ధైర్యములు సైమనుకమీషనుపట్ల ప్రజలకుగల దృఢసంకల్పమును విశదము చేయుచున్నవి.

* * * *

సామ్రాజ్యశాసనసభ

సామ్రాజ్యశాసనసభయొక్క గతసమావేశము నిరంకుశాధికారవర్గమునకు కొంతవరకు గర్వభంగమును గలుగజేయుటకు దగియున్నది. అధికారవర్గము సహజ విశ్వాసముతో ప్రజాక్షేమరక్షకశాసనమును ప్రవేశపెట్టినది. శాసనప్రవేశమున కవసరమైన పరినితకాలము లేకపోయినను శాసనము ప్రవేశమును గాంచినది శాసనము విషయమై తీవ్రమైన వాద ప్రతివాదములు బయల్వెడలినవి. నిర్ణీతోపసంఘము శాసనమును సవరించినను శాసనావసరము ప్రజాప్రతినిధులకు దుర్గ్రాహ్యముగనుండెను. శాసనము విదేశీయులమీద ప్రయోగించుట కేర్పడినను మానవ స్వాతంత్ర్యమునకు ప్రతిబంధకమని స్పష్టమగుచున్నది. నిరంకుశ కార్యనిర్వాహకాధికారుల ఆయుధాగారమునందు తీక్ష్ణమైన నవీనాస్త్రమును నిర్మించుట కధికారులు సంకల్పించిరి. భారతదేశమున కీశాసన నిర్మాణ మనవసరము. అవసరమైనను అపఖ్యాతిని గలుగజేయుట సహజము. విప్లవకారులను నిర్బంధించుటకు హైందవ శాసనాగారమునందు పాశుపతాస్త్రములు చాల నున్నవి. వేరొక శాసన మేల కావలయును? ఈశాసనము ప్రభుత్వబలమును నిర్ణయించుట కేర్పడి యుండును. పండిత మోతీలాలు నెహ్రూగా రారంభమునుండియును శాసనమును ప్రతిఘటించి స్వాతంత్ర్యప్రియుల కృతజ్ఞతకు పాత్రులైరి. భారత ప్రముఖుల సంయోగము వలనను, గౌ. పటేలుగారి నిశ్చితాభిప్రాయమునను నిరంకుశ ప్రభుత్వమునకు తలవని తలంపుగ పరాజయము గలిగినది. ఈరంగముతోనే నిరంకుశవర్గ మాడదలచిన కపటనాటకమును ముగించినది. సైమను సహకారోపసంఘమును నిర్మించుటకుగాని, ఇతర నిరంకుశ శాసనముల నిర్మాణములకుగాని భారత ప్రభుత్వము పూనుకొనక శాసనసభను యథేచ్ఛగను నిలుపుదల చేసినది. సామ్రాజ్య శాసనసభయందు సైమను సహకారరంగమున కవకాశము లేనపుడు ఇర్విను ప్రభువు సహకారోప సంఘము నేర్పాటు చేసి 'పార్లమెంటరికమిటి' యని నామకరణము చేయుట భారత రాజ్యాంగముయొక్క దౌర్బల్యస్థితిని విశదము చేయుచున్నది. పార్లమెంటు నియమించని కమిటి పార్లమెంటరి కమిటి యెటు లగును? శ్వేత మందిరము నుండి వెలువడిన యాజ్ఞలను శిరసా వహించుటయె భారత ప్రభుత్వమున కనుల్లంఘనీయమైన ధర్మమై యున్నది.

ప్రజాసంకల్పమును ప్రతిఘటించుచున్న సైమను కమిటీని బహిష్కరించుట భారతీయులకు పరమ ధర్మమని నిరంకుశప్రభుత్వమవలంబించుచున్న వ్యవహార విధానమే విశదము చేయుచున్నది. నిరంకుశ ప్రభుత్వమును, వారి యాశ్రయులును సహాకార మార్గము నవలంబించినను భారతీయాత్మ గౌరవము నవమానపరచిన సైమను కమిషనును బహిష్కరించుట ప్రజాధర్మమై యున్నది. ఆ ధర్మమును నిర్వహించుటకు దేశమునం దన్ని ప్రాంతములందును ప్రయత్నములు జరుగుచున్న విధమును దేశవ్యవహారములు తెలుపుచున్నవి. బొంబయియందు కాంగ్రెసు సభ్యులందు భేదాభిప్రాయములు బయలుదేరినను యువజనసమితి బహిష్కారమును జేయుటకుత్సాహము చూపుట భావిభాగ్యోదయమునకు శుభసూచకము. దేశమునం దంతటను ఒక నిర్ణయమైన దినమునందు బహిష్కార చిహ్నముగను హరతాళమును జేయుట సమంజసముగ నుండును.

*   *   *   *

ప్రజల కర్తవ్యము

ఘనకార్యములు లోకమునందు తగిన శక్తియును, సాధనసంపత్తియును లేక సిద్ధింపజాలవు. స్వరాజ్యసంపాదనము భారతీయులు చైతన్యమునుగలిగియుండుటకే అవసరమైయున్నది. భాగ్యభోగ్యములమాట యెటులున్నను జీవించుటకు సకల మానవులకును స్వతస్సిద్ధమైన హక్కుగలదు. భారతీయచైతన్యము క్షీణించుచున్నపుడ ప్రళయమునం దందరును క్షీణించుట సహజము. ప్రళయమునందు సంఘాభిమానములను నిరంకుశాభిమానములను, రాజ్యాభిమానములను సంరక్షించుకొనజాలరు. స్వధర్మనిర్వహణము విజయమునకుసాధనముగాని స్వార్థారాధనము విజయమునకు సాధనము గాదు. భారతమాతను చైతన్యవతిగ చేయుటకు భారతీయులందరును యథాశక్తిని నైవేద్యమును సమర్పించుట ధర్మము. వర్తమానసమయమునందు భారతీయు లందరును భేదాభిప్రాయము లేక చేయగల కార్య మొకటి గలదు.

లక్నో నగరమునందు సర్వపక్షసమావేశ మామోదించినతీర్మానములను దేశమంతయును నేకగ్రీవముగ నామోదించి భారతాభిప్రాయమును వ్యక్తము చేయుట యవసరము. చెన్నపురియం దఖిలపక్ష సమావేశము గోకలే మందిరమునందు శ్రీమతి డాక్టరు బెజంటమ్మగారి యధ్యక్షతక్రిందను గూడి సకలపక్ష సమావేశమును సమర్థించినది. ఆ సమావేశమునందు చెన్నపురి రాష్ట్రమునందు జరుగవలసిన కార్యవిధానము నిర్ణయింపబడును. ఆనిర్ణయానుసారముగ ప్రజలందరును వారిధర్మమును నిర్వహించుటకు బూనుకొనియెదరుగాత! బెజంటమ్మగారు 9-వ తేదిని బెజవాడ యందు సకలపక్ష సమావేశమున కధ్యక్షతను వహింప నున్నారు. ఆంధ్రమహాజను లీసమావేశములను సఫలము చేయుదురని నమ్ముచున్నాను.

కాంగ్రెసు పక్షాభిమానులు కాంగ్రెసు సమావేశములకును, సకలపక్ష సమావేశముల

కును గల భేదములను గమనించుచు, రెండు సమావేశము లందును పాల్గొనుట కవకాశము లు గలవు దేశమనవసరమైన కలవరమునందు మునుగకుండునట్లు నాయకులు ప్రవర్తించుట ధర్మము. గతవారమునందు జరిపిన వర్ధంత్యుత్సవములు మన కీవిషయమున మనధర్మమును బోధించు చున్నవి.

* * * *

జయంతివర్ధంత్యుత్సవములు

గతవారమునందు దేశమునం దంతటను భారత నవజీవనమునకు జనకుడైన శ్రీ రాజా రామ మోహన రాయల జయంత్యుత్సవములు పరమోత్సాహముతో జరుపబడినవి. భారతీయుల నావరించిన మూఢ విశ్వాసములను మూలచ్ఛేదము చేయుటకు పాటుపడిన మహానుభావుడు రామమోహన రాయలు. ఆయన శాశ్వతకీర్తికి సహగమన నిర్మూల మొకటి చాలియున్నది. రామమోహనునిలక్ష్యము మహర్షుల లక్ష్యమువలెను మూలతత్వాన్వేషణమునందు లగ్నమైనది. పవిత్రమైన ఆర్యావర్తమునందు పెరిగిన కంటకావరణములను నిర్మూలము చేసి భారతబృందావనమును లోకానందకరము చేయుటకు రామమోహనరాయలు పడిన పాట్లు వర్తమానకాలమునందుగల జ్ఞానవ్యవస్థలకు సాధనంబులైనవి. భారతీయ విద్యావంతుల లక్ష్యమును క్రైస్తవమతమునుండి మరల్చి ఏకేశ్వరోపాసనయందు లగ్నముచేసి బ్రహ్మసమాజమును స్థాపించిన రామమోహన రాయలు భారతజాతీయోద్ధారకుడు; లోకో ద్ధారకుడు. ఆమహనీయుని యారాధనోత్సవము వర్తమానకాలమునందు మననియత ధర్మానుష్ఠానమునకు సాధనముగ నుండగలదు.

శ్రీమతి డాక్టరు బెజంటమ్మగారికి 82-వ జన్మదినోత్సవమును లోకమునం దంతటను బ్రహ్మజ్ఞానసామాజికు లత్యుత్సాహముతో జరిపి వారికృతజ్ఞతను వెల్లడిచేసిరి. వసంతమ్మగారు నిజముగా 82-వ ఏటను చూపుచున్న వసంతచైతన్యము పరమాశ్చర్యమును గలుగజేయుచున్నది. ఆమె యుత్సాహము, పట్టుదల, కార్యపరత్వము నిరుత్సాహులకును నుత్సాహమును గలిగింపగలదు. మానవజీవితరంగమునందు సకలాంగములును కలిసి పని జేయవలసిన విధమును బెజంటుగారి జీవితము విశదము చేయుచున్నది. బ్రహ్మజ్ఞాన సమాజమునం దాచార్యపీఠము నధిష్ఠించుచున్నను స్వరాజ్యసంపాదనమునకై బెజంటుగారు చేయుచున్న కృషి భారతీయుల కాదర్శప్రాయముగ నుండగలదు. సామాన్యయువతిగను జన్మించిన బెజంటమ్మగారు గడించిన కీర్తి, విజ్ఞానము, ప్రాముఖ్యము మానవులకు సాధ్యములు గాని పనులు లేవని విశదము చేయుచున్నవి. స్థిరసంకల్పము, సంకల్పమున కనురూపమైన ప్రయత్నములు కార్యసిద్ధికి సాధనములు. భారతదేశప్రతిష్ఠను ప్రపంచమునం దంతటను వ్యాపింపజేసిన బెజంటమ్మగారు భారతసేవను, మానవసేవను జేయుటకు చిరకాలము వర్ధిల్లుగాత!

గాంధిమహాత్మునకు 60-వ ఏడు ప్రారంభ మైనది. గాంధిగారికి వారి జీవితమునందు యథార్థముగను మహాత్ముని పదవి లభించిన విధమును వారి పరిచయము గలవారికిని, వారి ఆత్మకథను చదివినవారికిని విశదమగుచున్నది. 'నా చిన్ని పొట్టకు శ్రీరామరక్ష' యనెడు అల్పజ్ఞులును, అల్పాత్ములును లోకమునం దంతటను గలరు. భోగము, డంబము, గర్వము సకల జీవములకును సత్యారాధనమునకు ప్రతిబంధకముగ నున్నవి. ఈషణత్రయమును జయించిన మహానుభావు లవతారపురుషులు. గాంధిమహాత్ము డీషణత్రయమును, అరిషడ్వర్గమును జయించిన మహానుభావుడని వారి పరిచయమును, ఆత్మకథయును విశదము చేయుచున్నవి. అహింస, సత్యము, త్యాగమును ధరించి భారతోద్ధరణమును, లోకోద్ధరణమును, మానవోద్ధరణమును జేయుటకు జీవితార్పణమును జేయుచున్న గాంధిమహాత్మునకు భగవంతు డనేక వర్ధంతులను ప్రసాదించుగాత! విశ్వేశ్వరుని విశ్వవిలాసములను, భారతవిజ్ఞానమును సార్థకము చేయుచున్న ఈ మహానుభావుల పవిత్రజీవితములు భారతీయు లాత్మోపలబ్ధిని బడయుటకు వినియోగపడుటకు పరమేశ్వరు డనుగ్రహించుగాత!

Printed and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No.7, Thumbu Chetty Street, G.T, Madras


విషయానుక్రమణిక

చిత్రములు

త్రివర్ణచిత్రములు:—బాల్యచాపల్యము; జీవేశ్వరైక్యానుసంధానము; దీపావళి

ఏకవర్ణములు:—కృష్ణరాజసాగరచిత్రములు ౬; మైసూరు రాజావారి ఊరేగింపు; తెలుగునాటి విపరీతపు వరదలు ౪; ఉమా పరితాపము; శివుడు; డాక్టరు అవనీంద్రనాథ ఠాకూరుగారు; కీ. శే. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు; కీ. శే. యస్. ఆర్. దాసుగారు; పటేలుగారి కుటుంబము; ఆకస్మికఛాయాచిత్రములు ౫; దసరాచిత్రములు ౪; ఇతరచిత్రములును.

బాల్య చాపల్యము



సమం దేవి, స్కందద్విపవదనపీతం స్తనయుగం, తవేదం నః ఖేదం హరతు సతతం ప్రస్నుతముఖమ్;
యదాలోక్యాశంకాకులితహృదయో హాసజనకః, స్వకుంభౌ హేరంబః పరిమృశతి హస్తేన ఝడితి.

—సౌందర్యలహరి.

చిత్రకారుడు: కంచి శివరామమూర్తిగారు, చెన్నపురి.